


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 254

మంగళవారం 28-5-2024

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



దేవుడు పంపించాడని చెప్తారేమో

అవినీతిపై మోదీని ఈడీ ప్రశ్నిస్తే దేవుడు పంపించాడని చెప్తారేమో: రాహుల్ -6లో



వాళ్లకు ఉద్యోగాలు రావు

ఉగ్రవాదుల కుటుంబాలకు, రాళ్లు రువ్వే వాళ్లకు ఉద్యోగాలు రావన్న షా -6లో

న్యూస్‌రీల్

కేఆర్‌ఎంబీ చైర్మన్‌గా అశోక్ గోయల్



కృష్ణా నదీ యాజమాన్య బోర్డు చైర్మన్‌గా అశోక్ ఎస్.గోయల్‌ను కేంద్ర జల్ శక్తి శాఖ నియమించింది. జూన్ 1న ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు.

వివరాలు 2లో ▸

చిన్నారులపై అత్యాచారం కేసుల్లో నిందితులకు జైలు



సొంత మనవరాలిపై అత్యాచారానికి పాల్పడిన వృద్ధుడికి విశాఖలోని పోక్సో కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 లక్షల జరిమానా విధించగా.. 12 ఏళ్ల బాలికపై లైంగిక దాడి యత్నం చేసిన మేనమామకు విజయవాడ పోక్సో కోర్టు ఐదేళ్ల శిక్ష విధించింది.

వివరాలు 5లో ▸


రెండు ప్రమాదాల్లో ఎనిమిది మంది దుర్మరణం



తిరుపతి జిల్లా చంద్రగిరి సమీపంలో కారు డివైడర్‌ను ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో నలుగురు చనిపోయారు. కృష్ణా జిల్లాలో మరో కారు డివైడర్ మీదుగా దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించారు.

వివరాలు 5లో ▸

ఇంటర్‌లో ఇక ఆన్‌లైన్ మూల్యాంకనం



ఇంటర్ పరీక్షల జవాబు పత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనం ప్రక్రియకు ఇంటర్మీడియట్ బోర్డు శ్రీకారం చుట్టింది. ప్రస్తుత సప్లిమెంటరీ పరీక్షల్లోనే ఈ విధానాన్ని అమలు చేయాలని బోర్డు నిర్ణయించింది.

వివరాలు 5లో ▸

బాబు సేవలో

బదిలీ బలగాలు!

హైకోర్టు సాక్షిగా దొరికిపోయిన డీజీపీ, పచ్చ పోలీసులు

పిన్నెల్లిపై కేసుల విషయంలో రికార్డులు తారుమారు

- ఆయనను ఎప్పుడు నిందితుడిగా చేర్చారని ప్రశ్నించిన హైకోర్టు
- ముందస్తు బెయిల్ ఇచ్చాకే నిందితుడిగా చేర్చినట్లు అంగీకారం
- ఈమేరకు స్థానిక కోర్టులో మెమో దాఖలు చేసిన పోలీసులు
- సంబంధిత డాక్యుమెంట్లను కోర్టు ముందుంచిన పిన్నెల్లి న్యాయవాదులు
- పిన్నెల్లి మధ్యంతర ముందస్తు బెయిల్‌పై ముగిసిన వాదనలు.. నేడు హైకోర్టు నిర్ణయం
- కౌంటింగ్‌లో పాల్గొనే హక్కు ప్రతీ అభ్యర్థికి ఉందన్న సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి



సాక్షి, అమరావతి: రాజకీయ ఒత్తిళ్లతో తాను నియమించుకున్న కొందరు పోలీసుల ద్వారా చంద్రబాబు పన్నిన కుట్రలు న్యాయస్థానం సాక్షిగా బట్టబయలయ్యాయి! ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలు పంచుకుంటూ పోటీ చేసిన ఓ అభ్యర్థిని కౌంటింగ్ రోజు బయటకు రానివ్వకుండా చేసేందుకు బరి తెగించి ఆడుతున్న నాటకానికి తెర పడింది. ఈసీపై రాజకీయ ఒత్తిడి తెచ్చి నియమించుకున్న కొద్ది మంది పోలీసులు బాబుకు ఏజెంట్ల మాదిరిగా పని చేస్తున్నట్లు తేటతెల్లమైంది. న్యాయస్థానానికి సైతం వారు తప్పుడు సమాచారం ఇవ్వడంపై తీవ్ర విస్మయం వ్యక్తమవుతోంది. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై అక్రమ కేసులు బనాయించడంలో

మిగతా 2వ పేజీలో ▶

తుపాను ప్రభావం వల్ల ఉప్పాడలో ఎగసిపడుతున్న అలల ధాటికి కోతకు గురవుతున్న తీరం



'నైరుతి' వచ్చేస్తోంది

31కల్లా కేరళకు రుతుపవనాలు

2, 3 తేదీల్లో ఏపీలోకి ప్రవేశం

ఈ సీజన్‌లో సాధారణం కంటే అధిక వర్షాలు

జూన్‌లో సాధారణానికి మించి వర్షాలు

నెలాఖరు వరకు రాష్ట్రంలో వడగాడ్పులు.. కొన్నిచోట్ల 49 డిగ్రీలు నమోదయ్యే అవకాశం

10లో

ఉప్పాడలో 'అల'జడి..

ఎగసి పడుతున్న అలలు

కోతకు గురవుతున్న తీరం

- వివరాలు 10లో

ఆన్‌లైన్‌లో పాఠ్య పుస్తకాలు

పీడీఎఫ్ రూపంలో సీఎస్ఈ ఏపీ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి

1 నుంచి 10 తరగతులకు తెలుగు-ఇంగ్లిష్ మీడియం పుస్తకాలు

గత ఏడాది 18 లక్షల పుస్తకాలు డౌన్‌లోడ్ చేసుకున్న విద్యార్థులు

ఈ ఏడాది ఇప్పటికే 1,72,482 పుస్తకాలు డౌన్‌లోడ్


విద్యార్థుల విశ్లేషణ సామర్థ్యం పెంపునకు ప్రతి పాఠానికి 'క్యూఆర్' కోడ్

కోడ్ స్కాన్ చేస్తే 'దీక్ష' పోర్టల్‌లో పాఠాల వీడియోలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులను గ్లోబల్ సిటిజన్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలను అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆంగ్ల భాషలో బోధనను వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ) వంటి అధునాతన పద్ధతుల్లో విద్యాబోధన చేస్తోంది. రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థులకు బడి తెరిచిన మొదటి రోజే వారికి అవసరమైన పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బూట్లు వంటివి అన్ని వస్తువులతో కూడిన

మిగతా 10వ పేజీలో ▶





పట్టణ యువతలో 61% మందికి కంప్యూటర్ నైపుణ్యం

- గ్రామీణ యువతలో అది 34 శాతమే
- 36.38 శాతం మందికి జోడించిన ఫైల్‌తో ఈ-మెయిల్ పంపగల సామర్థ్యం
- 45.56 శాతం మందికి ఫైల్ లేదా ఫోల్డర్‌ను కాపీ చేయగల లేదా తరలించగల సామర్థ్యం
- ఇండియా ఎంప్లాయిమెంట్ రిపోర్ట్-2024 వెల్లడి

10లో

ఓట్ల లెక్కింపును

పారదర్శకంగా నిర్వహించాలి

- ఒక ఈవీఎం లెక్కింపు పూర్తయిన తర్వాతే మరో ఈవీఎం తీసుకోవాలి
- వీలైనంత త్వరగా కచ్చితమైన ఫలితాలను ప్రకటించేందుకు ఏర్పాట్లు చేయండి
- పాస్‌లు లేని వారిని కౌంటింగ్ సెంటర్ల వద్దకు రానివ్వద్దు
- ఇందుకోసం పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేయండి
- రాష్ట్రాల సీఈవోలకు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఆదేశం



సాక్షి, అమరావతి: ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని.. ఇందుకు అవసరమైన పటిష్ట ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్రాల సీఈవోలు, ఎన్నికల అధికారులకు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ ఆదేశించారు. ఐదు దశల్లో ఎన్నికలు జరిగిన రాష్ట్రాల సీఈవోలు, ఆయా నియోజకవర్గాల ఆర్వోలు, జిల్లాల ఎన్నికల అధికారులతో సోమవారం ఆయన ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, డాక్టర్ సుఖ్బీర్ సింగ్ సందుతో కలసి రాజీవ్‌కుమార్ ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అందరి సమిష్టి కృషితో దేశవ్యాప్తంగా ఎన్నికలు విజయవంతంగా జరుగుతున్నాయని అభినందించారు. అదే స్ఫూర్తితో వచ్చే నెల 4న జరిగే ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు రోజున ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద క్రౌడ్ మేనేజ్‌మెంట్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని

మిగతా 2వ పేజీలో ▶

ఇదండీ సంగతి



కాస్త మీరు బరువైన డైలాగులు మాట్లాడటం ఆపండి సార్!

బెజవాడలో 'లెజెండ్'

ఎయిర్‌పోర్టు చరిత్రలోనే తొలిసారిగా అతిపెద్ద విమానం ల్యాండింగ్

324 మంది ప్రయాణికుల సామర్థ్యం

ఏకధాటిగా 14,400 కిలోమీటర్ల ప్రయాణం

322 మంది హజ్ యాత్రికులతో సౌదీ అరేబియాకు పయనం

5లో



ఎయిర్‌బస్ ఎ340 విమానానికి వాటర్ కానన్ స్వాగతం పలుకుతున్న అగ్నిమాపక దళం

పవిత్ర హజ్‌యాత్ర ప్రారంభం

విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరిన తొలి విమానం

5లో



విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి హజ్‌యాత్రకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న యాత్రికులు

క్లుప్తంగా...

కేఆర్ఎంబీ చైర్మన్‌గా అశోక్ గోయల్

సాక్షి, అమరావతి: కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) చైర్మన్‌గా అశోక్ ఎస్.గోయల్‌ను కేంద్ర జల్ శక్తి శాఖ నియమించింది. పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ(పీపీఏ) సీఈవోగా పనిచేస్తున్న శివ్‌నందన్‌కుమార్ రెండేళ్లుగా కృష్ణా బోర్డు చైర్మన్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో కేఆర్ఎంబీ చైర్మన్‌గా అశోక్‌ను కేంద్రం నియమించింది. జూన్ 1న ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. పీపీఏ సీఈవోగా మరొకరిని నియమిస్తారా లేదా అశోక్‌కే అదనపు బాధ్యతలు అప్పగిస్తారా అనేది తేలాల్సి ఉంది.

రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు

- 2,602 వాహనాలు స్వాధీనం.. 23 మంది అరెస్టు
- డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా వెల్లడి

సాక్షి, అమరావతి: శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 24 నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు 502 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ వివరాలను డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో మీడియాకు వెల్లడించింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్రమ మద్యం, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలు, రికార్డులు లేని వాహనాలు, వస్తువులపై ప్రధానంగా దృష్టి సారించినట్లు చెప్పారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు వెల్లడించారు. ఈ తనిఖీల సందర్భంగా సరైన పత్రాలు లేని 2,602 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 23 మందిని అరెస్టు చేసి విచారిస్తున్నామని.. ఏడుగురికి నోటీసులు జారీ చేశామని చెప్పారు. అలాగే 307 లీటర్ల మద్యం, 46 లీటర్ల ఎన్‌డీపీఎల్ లిక్కర్, ఒక నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నామని.. 93,600 లీటర్ల పులియబెట్టిన బెల్లం ఊటను ధ్వంసం చేశామని తెలిపారు.

స్టాక్ మార్కెట్ పేరుతో రూ 1.77 కోట్లు హాంఫట్!

నెల్లూరు(క్రైమ్): స్టాక్ మార్కెట్‌లో నగదు ఇన్వెస్ట్ చేస్తే అధిక ఆదాయం వస్తుందని నమ్మించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి రూ. 1.77కోట్లు దోచేసిన ఘటనపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. నెల్లూరులోని జ్యోతినగర్‌కు చెందిన కార్తీక్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఈ ఏడాది ఫిబ్రవరిలో అతని నంబర్‌ను వాట్సాప్ గ్రూప్‌లో గుర్తుతెలియని వ్యక్తులు యాడ్ చేశారు. గ్రూప్‌లోని రాహుల్ శివ స్టాక్ మార్కెట్లో షేర్స్‌ను ఏ విధంగా ఇన్వెస్ట్ చేయాలి? ఎంత పెరుగుతుంది? ఎన్ని రోజులు ఉంచాలి? ఇలా అనేక అంశాలపై పోస్టులు పెడుతుండేవాడు. ఈ క్రమంలో వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌లో ఒకరైనా నితిన్‌గుప్తా స్టాక్ మార్కెట్‌లో నగదు పెడితే అధిక ఆదాయం వస్తుందని కార్తీక్‌కు చెప్పారు. రాహుల్ శివ చెప్పినట్టుగా షేర్స్‌లో ఇన్వెస్ట్ చేసిన గ్రూప్ సభ్యులు ఆదాయం పొందినట్లుగా గ్రూప్ సభ్యుల స్క్రీన్ షాట్స్‌ను వాట్సాప్ గ్రూప్‌లో పెట్టారు. నితిన్‌గుప్తా మాటలు నమ్మిన కార్తీక్.. ఫిబ్రవరి 26 నుంచి ఈ నెల 10వ తేదీ వరకు వారు సూచించిన పలు అకౌంట్లలో రూ.1,77,73,766 జమ చేశారు. అయితే ఆ నగదును విత్ డ్రా చేసుకునేందుకు కార్తీక్ ప్రయత్నించినా వీలు కాలేదు. దీంతో మోస పోయానని గ్రహించిన కార్తీక్ సోమవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చేప ప్రసాదంకోసం కొల్లేరు నుంచి చేప పిల్లలు

ఖమ్మం వ్యవసాయం: మృగశిర కార్తె రోజున హైదరాబాద్‌లో బత్తిని సోదరులు ఉబ్బసం నివారణ కోసం చేప ప్రసాదం పంపిణీ చేయనుండగా.. ఇందుకోసం 5 లక్షల నుంచి 7 లక్షల వరకు కొర్రమీను చేప పిల్లలను వినియోగిస్తారు. సేవాదృక్పథంతో ఈ ప్రసాదం పంపిణీ చేస్తున్న బత్తిని సోదరులకు కొన్నేళ్లుగా ప్రభుత్వమే చేపపిల్లలను సమకూరుస్తోంది. తెలంగాణలో సరిపడా చేపపిల్లల లభ్యత లేకపోవడంతో టెండర్లు ఆహ్వానించగా ఏపీలోని ఏలూరు జిల్లా కొల్లేరు సరస్సు పరివాహక సంఘాలు ముందుకొచ్చాయి. ఈ మేరకు ఖమ్మం జిల్లా మత్స్యశాఖ అధికారి డి.ఆంజనేయస్వామి నేతృత్వంలో ఓ బృందం ఏలూరు జిల్లాకు వెళ్లి పరిస్థితులను పరిశీలించి మత్స్యశాఖకు నివేదిక సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా చేపపిల్లల పంపిణీకి టెండర్లు ఖరారు చేయనున్నారు.

రేవ్ పార్టీ కేసు.. విచారణకు నటి హేమ గైర్హాజరు

బనశంకరి: ఇటీవల బెంగళూరులోని ఓ ఫాంహౌస్‌లో జరిగిన రేవ్ పార్టీ కేసులో సోమవారం పోలీసుల విచారణకు హాజరు కావాల్సిన తెలుగు నటి హేమ గైర్హాజరయ్యారు. నగర సెంట్రల్ క్రైం బ్రాంచ్ పోలీసుల ముందు హాజరు కావడానికి వారం గడువు ఇవ్వాలని ఆమె కోరారు. ఈ నెల 18న జరిగిన రేవ్ పార్టీలో సుమారు 150 మంది పాల్గొనగా, అందులో 86 మంది డ్రగ్స్ సేవించినట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారణ కావడంతో సీసీబీ పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. తొలుత నటి హేమతో పాటు 8 మందికి నోటీసులు జారీచేసి సోమవారం విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. అనారోగ్యం, ఇతర కారణాలతో ఒకవారం పాటు గడువు కావాలని హేమ విజ్ఞప్తి చేశారు.

బాబు సేవలో బదిలీ బలగాలు!

▶ మొదటి పేజీ తరువాయి

డీజీపీ, టీడీపీకి కొమ్ము కాస్తున్న కొందరు పోలీసుల కుట్ర హైకోర్టు సాక్షిగా రుజువైంది. పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసమైన రోజు ఉదయం నుంచి ఏం జరిగిందో వాస్తవాలను వెల్లడించకుండా ఎడిటెడ్ వీడియో ఆధారంగా పిన్నెల్లి అరెస్టుకు ఎన్నికల కమిషన్ ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ కేసులో మధ్యంతర ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించిన ఎమ్మెల్యే పిన్నెల్లి ఈనెల 23న సానుకూల ఉత్తర్వులు పొందడం విదితమే. పిన్నెల్లికి మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు కానున్నట్లు అదే రోజు సాయంత్రం కల్లా సంకేతాలు అందడంతో టీడీపీకి అనుకూలంగా వ్యవహరించే కొందరు పోలీసు అధికారులు అడ్డగోలు వ్యవహారాలకు తెర తీశారు. అదే రోజు రాత్రి పిన్నెల్లిపై పాత ఘటనలకు సంబంధించి మూడు వేర్వేరు కేసులు హడావుడిగా నమోదు చేశారు. ఆ ఘటనలు ఎప్పుడో జరిగితే పది రోజుల తరువాత తాపీగా పిన్నెల్లిపై హత్యాయత్నం సహా మూడు కేసులు బనాయించారు. మధ్యంతర ముందస్తు బెయిల్ ఉత్తర్వులను అమలు చేయకుండా ఎన్నికల సంఘం, పోలీసులు ఈ తప్పుడు కేసులు పెట్టారని, వాస్తవానికి పిన్నెల్లిని 23వ తేదీ రాత్రి నిందితుడిగా చేర్చారని ఆయన తరపు సీనియర్ న్యాయవాది కోర్టుకు నివేదించారు. అయితే పోలీసులు తాము 22వ తేదీనే పిన్నెల్లిని నిందితునిగా చేర్చామని పేర్కొనడంతో న్యాయస్థానం ఈ విషయంలో వారిని స్పష్టత కోరింది. లిఖితపూర్వకంగా ఆ వివరాలను తమ ముందుంచాలని ఆదేశించింది. సంబంధిత డాక్యుమెంట్లను పిన్నెల్లి తరపు న్యాయవాదులు స్థానిక కోర్టు నుంచి అధికారికంగా పొందారు. వాటిని సోమవారం కోర్టుకు సమర్పించారు. దీంతో పచ్చ ముఠాలకు వత్తాసు పలుకుతున్న పోలీసులు నిజాన్ని ఒప్పుకోక తప్పలేదు. పిన్నెల్లిని నిందితుడిగా చేర్చి 23వతేదీ రాత్రి స్థానిక కోర్టులో మెమో దాఖలు చేసిన విషయాన్ని కోర్టుకు వెల్లడించాల్సి వచ్చింది. దీంతో 23న మధ్యంతర ముందస్తు బెయిల్ పొందిన తరువాత పిన్నెల్లిపై ఉద్దేశపూర్వకంగా హత్యాయత్నం కేసులు నమోదు చేసినట్లు రుజువైంది. పిన్నెల్లిపై కేసుల నమోదు విషయంలో రికార్డులు తారుమారు చేసినట్లు నిర్ధారణ కావడంతో కుట్ర కోణం బహిర్గతమైంది. డీజీపీ, పల్నాడులో కొందరు పోలీసులు దిగజారిపోతున్న తీరుకు ఇది అద్దం పడుతోంది.

తీర్పు నేటికి వాయిదా

తనపై పోలీసులు నమోదు చేసిన మూడు కేసుల్లో మధ్యంతర ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లపై హైకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. మంగళవారం తన నిర్ణయం వెలువరిస్తామని ప్రకటించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఈవీఎంల కేసులో హైకోర్టు మధ్యంతర ముందస్తు బెయిలు మంజూరు చేయగానే పిన్నెల్లిపై పోలీసులు అప్పటికప్పుడు మరో మూడు అక్రమ కేసులు నమోదు చేశారు. ఇందులో రెండు హత్యాయత్నం కేసులున్నాయి. ఈ నేపథ్యంలో పిన్నెల్లి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. కౌంటింగ్ ప్రక్రియలో పాలు పంచుకునేందుకు వీలుగా ఈ కేసుల్లో తనకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ హైకోర్టులో అనుబంధ పిటిషన్లు వేశారు.

అనుబంధ వ్యాజ్యాలు..

పిన్నెల్లి దాఖలు చేసిన ఈ వ్యాజ్యాల్లో బాధితులు నంబూరి శేషగిరి రావు, నాగ శిరోమణి ఇంప్లీడ్ అవుతున్నారని, ఆ మేరకు అనుబంధ వ్యాజ్యాలు దాఖలు చేశామని విచారణ సందర్భంగా టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు కోర్టు దృష్టికి తెచ్చారు. వారి తరఫున తాను వాదనలు వినిపిస్తానని తెలిపారు. అయితే మౌఖిక వాదనలకే పరిమితం కావాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. ఈవీఎం ధ్వంసం చేయడాన్ని అడ్డుకున్నందుకు టీడీపీ ఏజెంట్ నంబూరి శేషగిరిరావును పిన్నెల్లి బెదిరించారని పోసాని



పేర్కొన్నారు. నాగ శిరోమణి అనే మహిళను కూడా బెదిరించారన్నారు. కౌంటింగ్ రోజు పిన్నెల్లి అల్లర్లు సృష్టించే అవకాశం ఉందన్నారు.

23 రాత్రి 8 గంటలకు స్థానిక కోర్టులో మెమో

పోలీసుల తరఫున రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) యర్రంరెడ్డి నాగిరెడ్డి వాదనలు వినిపిస్తూ పిన్నెల్లికి మధ్యంతర ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని అభ్యర్థించారు. ఇప్పటికే పిన్నెల్లిపై 9 కేసులున్నాయన్నారు. పిన్నెల్లిపై నిఘా ఉంచాలని ఇదే కోర్టు ఈ నెల 23న ఉత్తర్వులిచ్చినా ఇప్పటి వరకు అందుబాటులోకి రాలేదన్నారు. ఈ సమయంలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. క్రైం నెం 59లో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఎప్పుడు నిందితునిగా చేర్చారు? దీనికి సూటిగా సమాధానం చెప్పాలని పీపీని ఆదేశించారు. సీఐ నారాయణస్వామిపై దాడి కేసులో పిన్నెల్లిని నిందితుడిగా చేరుస్తూ 23వతేదీ రాత్రి 8 గంటల సమయంలో స్థానిక కోర్టులో మెమో దాఖలు చేశామని పీపీ వెల్లడించారు. దీంతో పిన్నెల్లిని 22వ తేదీనే నిందితుడిగా చేర్చామంటూ పోలీసులు చెప్పడం పచ్చి అబద్ధమని తేలిపోయింది.

బాబు కుట్రలో భాగస్వాములు..

చంద్రబాబు కుట్రలో భాగం కావడం వల్లే ఎన్నికల సంఘం, డీజీపీ, కొందరు పోలీసు అధికారులు ఆయన చెప్పినట్లు ఆడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కీలకమైన ఓట్ల లెక్కింపు రోజు పోటీలో ఉన్న అభ్యర్థి, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పోలింగ్ కేంద్రం వద్దకు రాకుండా అడ్డుకునేందుకు టీడీపీకి వంతపాడే పోలీసులు అడ్డదారులు తొక్కడం మొత్తం ఎన్నికల ప్రక్రియనే అపహాస్యం చేసినట్లుగా భావించాలని ప్రజాస్వామ్యవాదులు పేర్కొంటున్నారు. చంద్రబాబు, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు పురందేశ్వరి చెప్పినట్లుగా ఎన్నికల సంఘం నిర్ణయాలు తీసుకుంటూ వస్తున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులపై అవగాహన ఉన్న పోలీసు అధికారులను ఆకస్మికంగా బదిలీ చేసి పురందేశ్వరి సూచించిన జాబితాలోని వారిని నియమించడంతోనే అడ్డదారులు తొక్కే వ్యవహారం ప్రారంభమైందని స్పష్టం చేస్తున్నారు. ఫలితంగా పోలింగ్ రోజు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు స్వేచ్ఛగా ఓటును వినియోగించుకొనే అవకాశం లేకుండా చేయడంతోపాటు హింస చెలరేగేందుకు దోహదం చేసిందని పేర్కొంటున్నారు. హైకోర్టు సాక్షిగా తాజాగా బయటపడిన కుట్ర దీనికి స్పష్టమైన రుజువుగా నిలుస్తుందని స్పష్టం చేస్తున్నారు.

అస్మిత్, చింతమనేనికి ఇచ్చినట్లే..

పిన్నెల్లి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ఎన్నికల సంఘం తీరును తీవ్రంగా తప్పుపట్టారు. పిన్నెల్లి విషయంలో ఎన్నికల సంఘం తీరు వల్ల ఆ సంస్థ విశ్వసనీయత ప్రశ్నార్థకమవుతోందన్నారు. పిన్నెల్లిపై పలు కేసులున్నాయని పోసాని, పీపీ పేర్కొనటాన్ని ప్రస్తావిస్తూ.. టీడీపీ నేతలైన చింతమనేని ప్రభాకర్, అస్మిత్‌రెడ్డిపై కూడా పెద్ద సంఖ్యలో కేసులున్నాయని గుర్తు చేశారు. అస్మిత్‌రెడ్డిపై 30, చింతమనేనిపై 31 కేసులు నమోదయ్యాయన్నారు. కేసుల ఆధారంగా ముందస్తు బెయిల్ ఇవ్వకూడదంటే వీరిద్దరికీ కూడా ముందస్తు బెయిల్ రాకూడదన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో పాలు పంచుకునేందుకు వీరిద్దరికీ ఇదే హైకోర్టు ఈ నెల 23న మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసిందన్నారు. అదేవిధంగా పిన్నెల్లికి కూడా ఈ నెల 6వ తేదీ వరకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోర్టును అభ్యర్థించారు. పోలింగ్ కేంద్రం బయట ఒకే ఘటనకు సంబంధించి పోలీసులు పిన్నెల్లిపై రెండు కేసులు నమోదు చేశారని, ఒకే నేరానికి రెండు కేసులు చెల్లవని కోర్టుకు నివేదించారు.

కౌంటింగ్‌లో పాల్గొనే హక్కు ప్రతీ అభ్యర్థికి ఉంది

కౌంటింగ్ ప్రక్రియలో పాలుపంచుకునే హక్కు ఎన్నికల్లో పోటీ చేసే ప్రతీ అభ్యర్థికి ఉంటుందని టి.నిరంజన్‌రెడ్డి తెలిపారు. కౌంటింగ్ తేదీ సమీపిస్తున్నందువల్ల కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకోవాల్సిన బాధ్యత పిన్నెల్లిపై ఉందన్నారు. కౌంటింగ్ వద్ద అభ్యర్థి లేని పక్షంలో తీవ్రంగా నష్టపోతారన్నారు. చింతమనేని, అస్మిత్ రెడ్డికి మధ్యంతర ముందస్తు బెయిల్‌ను వ్యతిరేకించని పోలీసులు పిన్నెల్లి విషయంలో కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈవీఎంల కేసులో మధ్యంతర బెయిల్ వస్తుందని 23వ తేదీ సాయంత్రం కల్లా గ్రహించడంతో అదే రోజు రాత్రి పిన్నెల్లిపై హత్యాయత్నంతో సహా మూడు కేసులు నమోదు చేశారన్నారు. అయితే పోలీసులు 22నే ఆయన్ను నిందితుడిగా చేర్చామంటూ కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని నివేదించారు. ఈమేరకు పోలీసులు స్థానిక కోర్టులో దాఖలు చేసిన డాక్యుమెంట్ల సర్టిఫైడ్ కాపీలను పిన్నెల్లి తరపు మరో న్యాయవాది రామలక్ష్మణరెడ్డి కోర్టుకు సమర్పించారు. పోలీసులు దాఖలు చేసిన మెమోను పరిశీలించాలని నిరంజన్‌రెడ్డి కోరడంతో న్యాయమూర్తి దాన్ని పరిశీలించి పిన్నెల్లిని 23వ తేదీనే నిందితుడిగా చేర్చిన విషయాన్ని ధృవీకరించుకున్నారు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుని పిన్నెల్లికి ఈ నెల 6వ తేదీ వరకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని నిరంజన్‌రెడ్డి అభ్యర్థించారు.

విచారణకు అశ్వనీ కుమార్ గైర్హాజర్

క్రైం నెంబర్ 59 కేసులో సీఐ నారాయణ స్వామి తరఫున అసాధారణ రీతిలో హాజరై ఆదివారం వాదనలు వినిపించిన న్యాయవాది ఎస్.అశ్వనీ కుమార్ సోమవారం విచారణకు గైర్హాజరయ్యారు. ఆయన జూనియర్ కోర్టు ముందు హాజరై పిన్నెల్లి వ్యాజ్యాల్లో ఇంప్లీడ్ అవుతూ ఓ అనుబంధ పిటిషన్ దాఖలు చేసినట్లు చెప్పారు. హైకోర్టు చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో ఓ పోలీసు తరపున ప్రైవేటు న్యాయవాది హాజరు కావడం విస్మయం కలిగించింది. అశ్వనీ కుమార్ ఆ పోలీసు తరపున హాజరు కావడం వెనుక మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ ఉన్న విషయం బయటకు రావడం చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారాన్ని మరింత సాగదీస్తే ఇబ్బందులు తప్పవన్న నిర్ణయానికి రావడంతో అశ్వనీ కుమార్ సోమవారం విచారణకు గైర్హాజరైనట్లు న్యాయవర్గాలు చెబుతున్నాయి.

పారదర్శకంగా నిర్వహించాలి

▶ మొదటి పేజీ తరువాయి

ఆదేశించారు. పాస్‌లు లేకుండా ఎవరినీ అనుమతించవద్దని స్పష్టంచేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఫైర్ సేఫ్టీ పరికరాలను, అంబులెన్సులను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు.

ఫలితాల ప్రకటనలో ఆలస్యం చేయొద్దు..

ఈవీఎంలలో పోల్ అయిన ఓట్ల లెక్కింపు గురించి ఎన్నికల అధికారులు, సిబ్బందికి మెరుగైన శిక్షణ ఇవ్వాలని రాజీవ్‌కుమార్ ఆదేశించారు. సుశిక్షితులైన ఎన్నికల సిబ్బందితో పాటు కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లు వంటి పరికరాలను కౌంటింగ్ కేంద్రాల్లో సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎంలను ఎడాపెడా పడేయకుండా.. ఒక క్రమ పద్ధతిలో తీసుకురావాలని స్పష్టంచేశారు. ఒక ఈవీఎం లెక్కింపు పూర్తయిన తర్వాతే మరో ఈవీఎం తీసుకోవాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు పూర్తి అయిన తర్వాత.. 'లెక్కింపు పూర్తి అయినట్లుగా' ఆయా ఈవీఎంలపై మార్క్ చేయాలని ఆదేశించారు. ఆ వెంటనే సీల్ చేసి ఒక క్రమపద్ధతిలో సురక్షితంగా భద్రపరచాలని ఆదేశించారు. అనవసరంగా ఈవీఎంలను అటూ, ఇటూ కదిలించవద్దని సూచించారు. ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌ఫర్ పోస్టల్ బ్యాలెట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను చక్కగా నిర్వహించాలని, వాటి లెక్కింపు కోసం ప్రత్యేకంగా టేబుళ్లు, స్కానర్లు ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాల ప్రకటన విషయంలో ఏమాత్రం ఆలస్యం చేయొద్దని.. డిస్‌ప్లే బోర్డుల ద్వారా ఎప్పటికప్పుడు కచ్చితమైన ఫలితాలను ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా, అదనపు సీఈవోలు పి.కోటేశ్వర రావు, హరేంధిర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి 20 కంపెనీల బలగాలు

- కౌంటింగ్ రోజు అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రత చర్యలు
- పోలింగ్ అనంతర ఘర్షణలను దృష్టిలో పెట్టుకుని కట్టుదిట్టంగా ఏర్పాట్లు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా



ఏఎన్‌యూలో కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ముఖేష్ కుమార్ మీనా తదితరులు

పెదకాకాని: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తర్వాత అక్కడక్కడా జరిగిన ఘటనలను దృష్టిలో పెట్టుకుని కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టినట్టు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా చెప్పారు. కౌంటింగ్ నేపథ్యంలో రాష్ట్రానికి 20 కంపెనీల బలగాలను కేటాయించినట్టు తెలిపారు. సున్నితమైన ప్రాంతాలను గుర్తించడంతో పాటు ఘర్షణలకు పాల్పడే అనుమానితులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. కౌంటింగ్ రోజు డ్రై డేను ప్రకటిస్తున్నామని, 144 సెక్షన్ ఎంతవరకు అవసరమో అంతవరకు విధిస్తామన్నారు. జూన్ నాలుగో తేదీన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఏడు శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు. దానికి సంబంధించిన ఏర్పాట్లను సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ఎస్పీ తుషార్ డూడీలతో కలిసి మీనా పరిశీలించారు. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ హాల్, మీడియా సెంటర్‌ను పరిశీలించారు. ఏడు నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ నియోజకవర్గం ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను, డైక్‌మెన్ హాల్లో ఏర్పాటు చేసిన టీవీలను పరిశీలించి.. హాజరైన అభ్యర్థులతో మాట్లాడారు. అభ్యర్థులు, వారి తరపున ప్రతినిధులు కూడా ప్రత్యక్షంగా ఈవీఎంలు భద్రపర్చిన గదులను పరిశీలించుకోవచ్చని చెప్పారు. అభ్యర్థులుగానీ, వారి ప్రతినిధులు గాని రోజుకు రెండు సార్లు స్ట్రాంగ్ రూంలను ఫిజికల్‌గా పరిశీలించుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. వారి వెంట వివిధ స్థాయిల అధికారులు ఉన్నారు.

మాచర్లలో వీధి నాటకాలు!

- వ్యక్తిగత వివాదాలకు రాజకీయ రంగు
- ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని ఖండించిన బాధితురాలు

సాక్షి, నరసరావుపేట/మాచర్ల: వీధి గొడవలకు రాజకీయ రంగు పులిమి పిన్నెల్లి సోదరులపై అక్రమ కేసులు బనాయించడమే లక్ష్యంగా టీడీపీ నేతలు రోజుకో డ్రామాకు తెర తీస్తున్నారు. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో పోలీసుల ద్వారా తాపీగా తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. కారంపూడిలో ఘర్షణలు జరిగిన వారం తరువాత పిన్నెల్లి పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చడం తెలిసిందే. పాల్వాయి గేట్‌లో వైఎస్సార్ సీపీ ఏజెంట్లపై దాడి చేసిన టీడీపీ ఏజెంట్ నంబూరి శేషగిరిరావు ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదు చేయగా తనను చంపుతానని పిన్నెల్లి బెదిరించారంటూ ఓ మహిళ ఫిర్యాదు చేశారంటూ ఇంకో కేసు పెట్టారు. ఇవి చాలవన్నట్లు కండ్లకుంటకు చెందిన టీడీపీ ఏజెంట్‌తో పిన్నెల్లి సోదరులపై మంగళగిరి పోలీసుస్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు.

మద్యం మత్తులో దాడి..

మాచర్ల 22వ వార్డులో శనివారం రాత్రి మల్లె లీలావతి అనే మహిళపై అదే వీధికి చెందిన ఉప్పుతోళ్ల వెంకటేశ్ మద్యం మత్తులో దాడికి పాల్పడ్డాడు. ఒకే సామాజిక వర్గానికి చెందిన వీరి మధ్య కొన్నాళ్లుగా కుటుంబ కలహాలున్నాయి. ఎల్లో మీడియా దీనికి రాజకీయ రంగు పులిమింది. బాధిత మహిళ టీడీపీకి ఓటు వేయడమే ఈ ఘర్షణకు కారణమంటూ కథనాలు అల్లేసింది. పిన్నెల్లి సోదరుల ప్రోద్బలంతో దాడులు జరిగినట్లు తప్పుడు కథనాలు వెలువరించింది.

పార్టీలకు సంబంధం లేదు..



నాపై జరిగిన దాడితో రాజకీయ పార్టీలకు ఎలాంటి సంబంధం లేదు. నేను ఓ పార్టీకి ఓటు వేయడంతో దాడి చేశారంటూ వచ్చిన కథనాల్లో నిజం లేదు. నన్ను ఏ మీడియా వాళ్లు వివరణ అడగలేదు. ఇష్టానుసారంగా వార్తలు రాయడం బాగా లేదు. మమ్మల్ని పార్టీల గొడవల్లోకి లాగొద్దు. మద్యం సేవించి నాపై దాడి చేస్తే పార్టీలకు అంటగట్టడం సరికాదు. నాపై దాడికి పాల్పడిన వెంకటేష్‌పై పోలీసులు చర్య తీసుకోవాలి.

– లీలావతి, బాధిత మహిళ, మాచర్ల

సోమిరెడ్డిపై కేసు నమోదు

ప్రలోభాలపై రిటర్నింగ్ అధికారి చినఓబులేసు ఫిర్యాదు



పొదలకూరు: ఎన్నికల వేళ ప్రచారంలో సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మహిళలకు నగదు పంపిణీ చేసిన వ్యవహారంపై పోలీసులు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. ఈ విషయమై వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అప్పట్లోనే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయగా.. మానవతా దృక్పథంతో సాయం చేశారంటూ టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి తోసిపుచ్చారు. వీడియో విజువల్స్‌లో స్పష్టంగా సోమిరెడ్డి మహిళలకు నోట్లు ఇవ్వడం కనిపిస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. దీనిపై కాకాణి పలుమార్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. ఎలాంటి స్పందన రాకపోవడంతో మూడు రోజుల క్రితం కాకాణి మీడియా సమావేశం నిర్వహించి సోమిరెడ్డి ప్రలోభాల పర్వంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని ప్రకటించారు. దీంతో ఎట్టకేలకు జిల్లా ఎన్నికల అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై కేసు నమోదు చేయాల్సిందిగా సర్వేపల్లి రిటర్నింగ్ అధికారి చినఓబులేసు పొదలకూరు పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేయగా.. కేసు నమోదైంది. ఏప్రిల్ 12వ తేదీన శుక్రవారం సోమిరెడ్డి, ఆయన కుమారుడు రాజగోపాల్‌రెడ్డి పొదలకూరు మండలం చెర్లోపల్లి గిరిజన కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో సోమిరెడ్డి గిరిజన మహిళలకు నగదు పంపిణీ చేశారు. సోమిరెడ్డి అనుచరులు దీనిని వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. అప్పట్లో ఎన్నికల అధికారులు దీనిపై మండలస్థాయి అధికారులతో విచారణ జరిపించి.. మానవతా దృక్పథంతో సోమిరెడ్డి గిరిజన మహిళలకు నగదు అందజేసినట్టు నివేదిక సమర్పించి మమ అనిపించారు. ఎట్టకేలకు కాకాణి హెచ్చరికలతో ఎన్నికల అధికారుల ఫిర్యాదు మేరకు సోమిరెడ్డిపై ఐపీసీ 173–ఈ, ఆర్‌పీ యాక్ట్ 123 క్లాజ్–1 సెక్షన్ల కింద పోలీసులు సోమిరెడ్డిపై కేసు నమోదు చేశారు.

విశాఖ జైలులో ఈ-ములాఖత్‌లు ప్రారంభం



ఈ-ములాఖత్ ద్వారా జైలు నుంచి కుటుంబ సభ్యులతో ముచ్చటిస్తున్న ఖైదీ

ఆరిలోవ: విశాఖ జైలులో ఖైదీలు వారి కుటుంబ సభ్యులందరినీ ఒకేసారి చూసుకునే వెసులుబాటు లభించింది. ఇందుకోసం సోమవారం నుంచి ప్రత్యేకంగా ఈ–ములాఖత్‌ల విధానాన్ని జైలు అధికారులు అందుబాటులోకి తెచ్చారు. సాధారణంగా జైలులో ఉన్న ఖైదీలను వారి కుటుంబ సభ్యులు వారానికి రెండుసార్లు కలిసే అవకాశం ఉంది. కుటుంబ సభ్యుల్లో కొందరికే ఈ అవకాశం ఉండేది. ములాఖత్‌కు వెళ్లిన వారి ద్వారానే మిగిలిన కుటుంబ సభ్యుల క్షేమ సమాచారాన్ని తెలుసుకోవాల్సి వచ్చేది. ఇకపై స్వయంగా ములాఖత్‌లతో పాటు ఈ–ములాఖత్ విధానాన్ని కూడా అందుబాటులోకి తేవడంతో ఖైదీలు ఇంట్లో వారందరిని చూస్తూ వారితో మాట్లాడే అవకాశం కలుగుతుంది.

ప్రత్యేక వెబ్‌సైట్‌లో దరఖాస్తు

ఈ – ములాఖత్ కోసం అధికారులు ప్రత్యేకంగా వెబ్‌సైట్‌లో అప్లికేషన్‌ను రూపొందించారు. ఖైదీ కుటుంబ సభ్యులు ముందుగా ఆ వెబ్‌సైట్ ద్వారా ములాఖత్‌కు దరఖాస్తు చేసుకోవాలి. జైలు అధికారులు వాటిని పరిశీలించి వారికి నిర్దిష్టమైన తేదీ, సమయాన్ని కేటాయిస్తారు. ఆ వివరాలను ఖైదీకి కూడా తెలియజేస్తారు. ఆ సమయానికి ఖైదీ కంప్యూటర్‌లో కుటుంబ సభ్యులను చూస్తూ వారితో ముచ్చటించొచ్చు. ఇందుకోసం జైలులో కూడా ప్రత్యేకంగా కంప్యూటర్లు ఏర్పాటు చేశారు. భౌతికంగా ములాఖత్‌కు రాలేని వారు ఇకపై ఆన్‌లైన్ ద్వారా అయినా వారానికి రెండుసార్లు మాట్లాడుకునే వెసులుబాటు లభించింది. ఈ-ములాఖత్ ద్వారా సోమవారం పలువురు ఖైదీలు వారి కుటుంబ సభ్యులతో ముచ్చటించినట్లు విశాఖ జైలు సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్ తెలిపారు.

ఎన్నో విశేషాల 'బోర మెత్తళ్లు'

- వేసవిలో మాత్రమే లభ్యం.. వేటకు ప్రత్యేక సమయం
- వేటకు రూ.లక్ష విలువైన వల వినియోగం



వేటలో లభ్యమైన బోరమెత్తళ్లు



వేటాడిన బోరమెత్తళ్లను వల నుంచి వేరు చేస్తున్న మత్స్యకారులు

సింగరాయకొండ: బోర మెత్తళ్లు చేప..తైల వర్ణంలో ఉంటుంది. ఇది వేసవిలోనే లభిస్తుంది. వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు కాసుల వర్షాన్ని కురిపిస్తుంది. వేటాడాలంటే సన్న కన్నుల వలను వినియోగించాలి. దాని ఖరీదు రూ.లక్ష పైమాటే. ఈ చేప ప్రకాశం జిల్లా సింగరాయకొండ, బాపట్ల జిల్లా చిన్నగంజాం, నిజాంపట్నం తదితర తీర ప్రాంతాల్లో లభ్యమవుతుంది. ఇది తీరానికి అర కిలోమీటర్ దూరంలో దొరుకుతుంది. దీనిని వేటాడే సమయం కూడా భిన్నంగా ఉంటుంది. అర్ధరాత్రి ఒంటి గంటకు వెళ్లి ఎక్కడ ఉందో గుర్తిస్తారు. దాని గమనాన్ని బట్టి ఆ ప్రాంత మత్స్యకారులు వేటాడుతారు. వేకువజామున 4 గంటల నుంచి వేట మొదలుపెడతారు. ఉదయం 8 గంటలకు తీరానికి తీసుకువస్తారు. మామూలు చేపలైతే పడవల్లోనే వల నుంచి వేరు చేస్తారు. దీనిని అలా వేరుచేసేందుకు కుదరదు. తీరానికి తీసుకువచ్చి ఒడ్డుకు చేరిన తర్వాతే వల నుంచి వేరు చేస్తారు. ఒక్కసారి వేటకు వెళితే టన్ను వరకూ లభ్యమవుతుంది. వేసవి, వేట నిషేధ సమయంలో దొరికే ఈ చేపను కర్రతెప్పల్లో మాత్రమే వేటాడుతారు. ఇక్కడ దీని ధర కేజీ రూ.100. కేరళలో ఇది కేజీ రూ.300–500 మధ్యలో ధర పలుకుతుంది. మే, జూన్‌ల్లో ఎక్కువగా దొరుకుతుంది. ఈ చేపలను ప్రత్యేక వాహనాల్లో కేరళకు పంపుతారు.

చిత్తూరు జిల్లాలో 110 ఏనుగులు!

- ముగిసిన 3 రోజుల గజరాజుల గణన
- కేంద్ర అటవీశాఖకు నివేదిక
- డీఎఫ్‌వో చైతన్యకుమార్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు జిల్లాలో 90 నుంచి 110 వరకు ఏనుగులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని డీఎఫ్‌వో చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఏనుగుల గణన ప్రక్రియ శనివారంతో ముగిసింది. సర్వే వివరాలను డీఎఫ్‌వో సోమవారం మీడియాకు వెల్లడించారు. జిల్లాలోని 60కి పైగా బీట్ల నందు 150 మంది సిబ్బంది, సహాయకులు కలిసి సర్వే చేశారన్నారు. ప్రత్యక్షంగా 30కి పైగా ఏనుగులను గుర్తించారని, పరోక్షంగా 110 ఏనుగుల ఉన్నట్లు నమోదు చేశారని చెప్పారు. వీటిలో 15 వరకు చిన్న ఏనుగులు ఉన్నట్లు చెప్పారు. దక్షిణ భారతదేశంలో ప్రతి ఏటా మే నెలలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఒకే సమయంలో సర్వే చేస్తారన్నారు. రాష్ట్రంలో 200 వరకు ఏనుగులు ఉంటే.. ఒక్క చిత్తూరు జిల్లాలో 100కు పైగా ఉన్నాయన్నారు. ప్రాథమిక నివేదికను కేంద్ర అటవీశాఖకు పంపిస్తున్నట్లు తెలిపారు. ఎక్కువగా పలమనేరు, పుంగనూరు, కుప్పం ప్రాంతాల్లో ఏనుగులు సంచరిస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ షాక్, వాహనాలు ఢీకొని ప్రతి ఏటా 10 వరకు ఏనుగులు మృత్యువాత పడుతున్నట్లు తెలిపారు. ఏనుగుల దాడిలో ఏడాదికి రూ.కోటి వరకు పంటలకు, ప్రజల ప్రాణాలకు నష్టపరిహారంగా చెల్లిస్తున్నట్లు వివరించారు. గజరాజుల దాడుల నివారణకు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

జూన్ మొదటి వారంలో జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకులు

సాక్షి, హైదరాబాద్: దేశంలోని ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బీటెక్, బీఆర్క్‌లో ప్రవేశానికి సంబంధించి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ అడ్వాన్స్‌డ్) ర్యాంకులు జూన్ 4న వెలువడే అవకాశం ఉంది. పరీక్షలు ఈనెల 26న దేశవ్యాప్తంగా జరిగాయి. జేఈఈ మెయిన్స్‌లో అర్హత సాధించిన 2.5 లక్షల మందిని ఈ పరీక్షకు ఎంపిక చేశారు. వీరిలో 2 లక్షల మంది వరకు అడ్వాన్స్‌డ్ రాశారు. ఇందుకు సంబంధించిన రెస్పాన్స్ షీట్ ఈనెల 31 వరకు వెలువడుతుందని అధికార వర్గాలు వెల్లడించాయి. జూన్ 2న ప్రొవిజినల్ ఆన్సర్ 'కీ' విడుదల చేస్తారు. 3వ తేదీ సాయంత్రానికి అభ్యంతరాలు స్వీకరిస్తారు. 4వ తేదీ లేదా 5న ర్యాంకులు ప్రకటిస్తారు. అడ్వాన్స్‌డ్ ర్యాంకుల తర్వాత జోసా కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలవుతుంది.

మరో 10,542 టెన్త్ జవాబు పత్రాల రీ వెరిఫికేషన్

సాక్షి, అమరావతి: ఈ విద్యా సంవత్సరం పదో తరగతిలో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులకు సంబంధించి మరో 10,542 జవాబు పత్రాలను రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ పూర్తి చేసినట్లు పదో తరగతి పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి తెలిపారు. మొత్తం 55,996 మంది రీ వెరిఫికేషన్/ రీ కౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. మార్కుల పరిశీలన ప్రక్రియ పూర్తిచేసిన 43,714 మంది జవాబు పత్రాలను ఈ నెల 23న ఆయా స్కూళ్లకు ఆన్‌లైన్‌లో పంపించారు. మరో 10,542 మంది జవాబు పత్రాలను సోమవారం ఆయా స్కూళ్లకు పంపించగా, మిగిలిన 1,710 జవాబు పత్రాలను రీ వెరిఫికేషన్ చేసి త్వరలోనే పంపిస్తామని తెలిపారు.

'మేడ్ @ శ్రీసిటీ' 1,000వ గేర్ బాక్స్ యూనిట్ ఎగుమతి

మైలురాయిని అధిగమించిన శ్రీసిటీ–ఎస్‌జీసీ పరిశ్రమ



గేర్‌బాక్స్ యూనిట్‌ను ఎగుమతికి జెండా ఊపుతున్న సత్యనారాయణరావు, రత్న కుమార్

శ్రీసిటీ (సత్యవేడు): తిరుపతి జిల్లాలో ఉన్న శ్రీసిటీలోని చైనా దేశానికి చెందిన ఎస్‌జీసీ గ్రూప్ అనుబంధ సంస్థ ఎస్‌జీసీ ట్రాన్స్‌మిషన్ చెన్నై ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో ఉత్పత్తి చేసిన 1,000వ గేర్ బాక్స్ యూనిట్‌ను ఎగుమతి చేయడం ద్వారా ముఖ్యమైన మైలు రాయిని అధిగమించింది. దీనిని పురస్కరించుకుని సోమవారం పరిశ్రమ ఆవరణలో శ్రీసిటీ సెజ్ అసిస్టెంట్ డెవలప్‌మెంట్ కమిషనర్ డి.సత్యనారాయణ రావు జెండా ఊపి ఉత్పత్తులను ఎగుమతికి తరలించారు. కంపెనీ డైరెక్టర్ రత్నకుమార్ మాట్లాడుతూ..1,000 వ గేర్ బాక్స్‌ను తమ యూఎస్ కస్టమర్ జీఈ రెన్యూవబుల్ ఎనర్జీకి ఎగుమతి చేస్తుండటంపై సంతోషం వ్యక్తం చేశారు. ఇతర పవనశక్తి రంగానికి చెందిన తమ గ్లోబల్ కస్టమర్‌ల డిమాండ్‌ను సమర్థవంతంగా తీర్చడానికి శ్రీసిటీ ప్లాంట్‌ను విస్తరిస్తున్నామని చెప్పారు. ప్రిసిషన్ ఇంజినీరింగ్‌లో పేరుగాంచిన ఎస్‌జీసీ గ్రూపు వేగవంతమైన వృద్ధిపై శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. చైనా వెలుపల ఎస్‌జీసీ గ్రూప్‌కు చెందిన మొట్టమొదటిప్లాంట్ శ్రీసిటీలో ఏర్పాటు కాగా, ఈ ప్లాంట్ విస్తరణలో వారి మార్కెట్ వాటా మరింత పెరుగుతుందని విశ్వసిస్తున్నామన్నారు. చైనాలో 6 ఉత్పత్తి కేంద్రాలు ఎస్‌జీసీ గ్రూప్, చైనా వెలుపల తొలుత భారత్‌లోనూ , తరువాత అమెరికా, జర్మనీ సింగ్‌పూర్‌ల్లో తమ కేంద్రాలు స్థాపించిందని తెలిపారు.

కౌంటింగ్ పైనే.. అందరి చూపు

జూన్ 4న ఓట్ల లెక్కింపునకు చురుగ్గా ఏర్పాట్లు ● అందరిలోనూ ఉత్కంఠ

ఎక్కడ చూసిన ఎన్నికల ఫలితాలపైనే చర్చలు ● విజయంపై ధీమాలో వైఎస్సార్‌సీపీ కేడర్



సాక్షి, భీమవరం: సార్వత్రిక ఓట్ల లెక్కింపు గడువు సమీపిస్తున్న కొద్దీ అందరిలో ఉత్కంఠ పెరుగుతోంది. ఎక్కడ చూసినా కౌంటింగ్‌పైనే చర్చ.. ఏ ఇద్దరూ కలిసినా విజయం ఎవరిని వరిస్తుందనే అంశంపైనే విశ్లేషణలు. మరో పక్క జూన్ 4న భీమవరంలోని శ్రీవిష్ణు, ఎస్ఆర్‌కేఆర్ కళాశాలల్లో కౌంటింగ్‌కు శరవేగంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ 1న చివరి దశ ఎన్నికలు జరగనున్నాయి. జూన్ 4న ఓట్ల లెక్కింపు చేయనున్నారు. జిల్లాలోని నరసాపురం పార్లమెంట్, భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట, నరసాపురం, ఉండి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. 2019లో ఏప్రిల్ 11న ఎన్నికలు జరగ్గా ఫలితాల కోసం 41 రోజులు ఎదురుచూడాల్సి వచ్చింది. ఈ సారి 21 రోజులు వేచి ఉండాల్సిన పరిస్థితి.

ఆరు రోజులే గడువు

కౌంటింగ్‌కు నేటికి మరో ఆరు రోజులు మాత్రమే గడువుంది. వచ్చే మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. ఒక్కో రౌండుకు 20 నిముషాల నుంచి అరగంట సమయం పడుతుంది. ఈ మేరకు మధ్యాహ్నం 1.30 నుంచి రెండు గంటల సమయానికి నరసాపురం ఫలితం వెలువడుతుంది. రెండున్నర గంటలకు ఆచంట, పాలకొల్లు, మూడు గంటలకు తాడేపల్లిగూడెం, తర్వాత భీమవరం, తణుకు, ఉండి ఫలితాలు వస్తాయని అంచనా. పోలింగ్ సరళిని బట్టి ఇప్పటికే పోటీలో నిలిచిన అధికార, విపక్ష పార్టీల అభ్యర్థులు, వారి అనుచరులు గ్రామాలు, వార్డుల వారీగా తమకు వచ్చే ఓట్లపై అంచనాల్లో ఉన్నప్పటికి గడువు సమీపిస్తుండటంతో ఉత్కంఠ పెరిగిపోతోంది. కౌంటింగ్ రోజు కోసం ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోపక్క గ్రామాలు, పట్టణాల్లో ఏ ఇద్దరు కలిసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చించుకుంటున్నారు. నరసాపురం పార్లమెంట్, జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో పోటీలోని అభ్యర్థుల విజయావకాశాలు, విజయం సాధిస్తారనుకునే వారి మెజారిటీ ఎంత వరకు రావచ్చు? రాష్ట్రంలోని ముఖ్యనేతల విజయావకాశాలు? ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది? అదే విధంగా కేంద్రంలో ఏ పార్టీ సంపూర్ణ ఆధిక్యత సాధిస్తుంది? గత ఎన్నికల ఫలితాలను బేరీజు వేస్తూ పలు అంశాలపై ఎక్కడ చూసిన జోరుగా చర్చలు జరుగుతున్నాయి.

విజయంపై వైఎస్సార్‌సీపీ ధీమా

2019 ఎన్నికల్లో రాష్ట్రంలో 175 స్థానాలకు 151 స్థానాలతో వైఎస్సార్‌సీపీ చారిత్రాత్మక విజయం సాధించింది. జిల్లాలోని నరసాపురం పార్లమెంట్‌తో పాటు ఏడు స్థానాలకు ఐదింట విజయకేతనం ఎగురవేసింది. ఈ ఐదేళ్లలో కనివినీ ఎరుగని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాధించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, కూటమిలోని అంతర్గత కుమ్ములాటలతో ఈ ఎన్నికల్లో జిల్లాలో క్లీన్‌స్వీప్ ఖాయమన్న ధీమాలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఉన్నారు. పోలింగ్ శాతం పెరగడం, అర్ధరాత్రి వరకు వృద్ధులు, మహిళలు క్యూలో నిలబడి ఓటు వేయడం పాజిటివ్ ఓటుకు నిదర్శనమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

శరవేగంగా ఏర్పాట్లు

భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలకు పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ కళాశాల, తణుకు, ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాలకు శ్రీవిష్ణు కళాశాలలో ఓట్ల లెక్కింపు జరుగనుంది. అందుకోసం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ నేతృత్వంలో శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఒక్కో నియోజకవర్గానికి ఆర్ఓ, ఏఆర్ఓలతో పాటు కౌంటింగ్‌కు ఒక్కో టేబుల్ వద్ద ఒక మైక్రో అబ్జర్వర్, ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్, సపోర్టింగ్ స్టాఫ్ తదితరులు కలిపి 1500 మంది వరకు సిబ్బంది కౌంటింగ్ విధుల్లో పాల్గొననున్నారు. ఎక్కడ పొరపాట్లకు తావులేకుండా సమర్థవంతంగా కౌంటింగ్ జరిగేలా వివిధ స్థాయిల్లో ఉద్యోగులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రతిరోజు సమీక్షలు నిర్వహిస్తు అవసరమైన సూచనలు అందిస్తున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఎస్పీ డాక్టర్ అజిత పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు.

నిబంధనలపై పూర్తి అవగాహన తప్పనిసరి

ఓట్ల లెక్కింపులో ఏజెంట్లది కీలకపాత్ర నేపథ్యంలో లెక్కింపు సందర్భంగా పాటించాల్సిన నిబంధనలనపై పూర్తి అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే పార్టీలు ఏజెంట్లను నియమించుకునే పనిలో నిమగ్నమయ్యాయి. ఎన్నికల లెక్కింపు ప్రక్రియలో భాగంగా ఫాం–17 సీపై ప్రతి కౌంటింగ్ ఏజెంటు, అబ్జర్వర్, మైక్రో అబ్జర్వర్లకు అవగాహన అవసరం. కంట్రోల్ యూనిట్‌లో నమోదైన మొత్తం ఓట్లు, ఫారం–17బీలో నమోదైన మొత్తం ఓట్లు సరిచూసుకోవాల్సి ఉంటుంది. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ మెంబరు, పోలింగ్ కేంద్రం, ఇప్పుడు వినియోగించిన కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్ గుర్తింపు నెంబర్లను సైతం ఫారం–17 సీలోనే నమోదు చేస్తారు. ఆ పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటర్ల సంఖ్య, ఓటు వేయడానికి వచ్చిన వారి సంఖ్య నమోదై ఉంటుంది. ఇలా పోలింగ్ జరిగిన సమయంలో టెండర్ బ్యాలెట్, పేపరు సీళ్లు, వాడిన సంఖ్య ఇలా ప్రతి ఒక్కటీ ఏజెంట్లు క్షుణ్ణంగా గుర్తించాల్సి ఉంటుంది. ఫారం–17సీ లో ఏ మాత్రం తేడా వచ్చినా వెంటనే ఏజెంట్లు రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళాల్సి ఉంటుంది. కౌంటింగ్ సమయంలో కంట్రోల్ యూనిట్ (ఈవీఎం) టేబుల్‌పైకి రాగానే ఏజెంటు పరిశీలించిన అనంతరమే దాన్ని ఓపెన్ చేసి లెక్కింపు ప్రక్రియ చేస్తారు.

ఏజెంట్ల ఎంపికకు పార్టీల కసరత్తులు

ఏజెంట్ల నియమకానికి అధికారులు ఆదేశాల జారీ

నేరచరిత్ర లేనివారికే పాసులు

ఏలూరు (మెట్రో): సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు మరో వారం రోజులే గడువు ఉంది. ఈ మేరకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. కౌంటింగ్ కార్యక్రమంలో ఎన్నికల ఏజెంట్లు కీలక పాత్ర పోషించనున్నారు. ఏజెంట్ల నియామకానికి ఇప్పటికే అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో పాటుగా పార్టీలు సైతం ఏజెంట్లను నియమించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాయి.


ఫాం–18లో ఏజెంట్ల వివరాల సమర్పణ

ఇప్పటికే ఏజెంట్ల ఎంపిక ప్రక్రియలో నిమగ్నమైన పార్టీలు నేరచరిత్ర లేని అభ్యర్థులను నియమించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఏజెంట్ల వివరాలు ఇవ్వాలని, 31వ తేది నాటికి ఏజెంట్లను నియమించుకోవాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో పార్టీలు ఏజెంట్లను నియమించుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఏజెంట్ల వివరాలు ఫాం–18లో సమర్పించాల్సి ఉంటుంది. ఫాం–18లో సమర్పించి రెండు సెట్లను అధికారులు స్వీకరిస్తారు. ఒక సెట్‌ను పోలీసులు పరిశీలించి ఏజెంట్లకు నేరచరిత్ర, ఎలాంటి కేసులు లేనివారిని ధ్రువీకరిస్తారు. అనంతరం అధికారులు ఏజెంట్లకు పాసులు జారీ చేస్తారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ఏజెంట్లు కీలకపాత్ర పోషించనున్నారు.

పక్కాగా విద్యాహక్కు

పేద పిల్లలకు ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత విద్య

ఐదేళ్లు నిండిన వారికి 1వ తరగతిలో ప్రవేశాలు ● తొలి విడతలో 452 మందికి ప్రవేశం



కడప ఎడ్యుకేషన్: బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని విద్యాహక్కు చట్టం చెబుతోంది. అందుకు అనుగుణంగానే ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పేద పిల్లలకు సైతం కార్పొరేట్ విద్యనందించేందుకు జిల్లాలో పటిష్ట కార్యాచరణ అమలు చేస్తోంది. ఒకప్పుడు ఉన్నత వర్గాలకే పరిమితమైన ప్రైవేటు, కార్పొరేట్ విద్యను నేడు రాష్ట్ర ప్రభుత్వం పేద పిల్లలకు చేరువ చేసింది. రూపాయి ఖర్చు లేకుండా 1వ తరగతి నుంచి పదోతరగతి వరకు కార్పొరేట్ విద్య అందనుంది. ఇందులో భాగంగా ఉచిత నిర్బంధ విద్యాహక్కుచట్టం సెక్షన్12(1)(సి) ప్రకారం కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 1వ తరగతిలో 25 శాతం మందికి ఉచితంగా అడ్మిషన్లు ఇవ్వాలి. దీనికి అనుగుణంగా ప్రభుత్వం 2024–25 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లాలోని 36 మండలాలకు 30 మండలాల నుంచి 638 మందిని లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లలో భాగంగా జిల్లాలోని 30 మండలాల పరిధిలో 1114 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్నారు. ఇందులో 628 మందిని లాటరీ పద్ధతిలో మొదటి విడతలో ఎంపిక చేశారు. వీరిలో ఇప్పటివరకు 452 మంది వివిధ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందారు. మిగతా 176 మంది వివిధ కారణాలతో పాఠశాలల్లో చేరలేదు. ఇందులో అత్యధికంగా జిల్లా కేంద్రమైన కడపలో 236 మంది ఎంపికకాగా ఇప్పటివరకు 144 మంది, ప్రొద్దుటూరులో 130 మందిలో 94 మందికి వివిధ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించారు. వీరందరికీ ప్రభుత్వమే ఫీజులు చెల్లించనుంది. పేద, మధ్యతరగతి వర్గాలకు ఉన్నత చదువులు వరిస్తుండటంతో వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో రెండో విడతకు ఎంపికలు జరగనున్నాయి.

15 మండలాల్లో వందశాతం అడ్మిషన్లు

జిల్లాలోని 15 మండలాల్లో లాటరీ పద్ధతిలో రిజర్వేషన్ ప్రకారం ఎంపిక చేసిన విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. ఇందులో బి.మఠంలో 11 మందికి 11 మందిని , చక్రాయపేటలో 3, చాపాడులో 7, దువ్వూరులో 5, గోపవరంలో 20, జమ్మలమడుగులో 23, కలసపాడులో 4, కమలాపురంలో 16, ఖాజీపేటలో 16, కొండాపురంలో 9, లింగాలలో 3, ముద్దనూరులో 3, కాశినాయనలో 2, వీఎన్‌పల్లెలో 1 ఇలా ఎంపిక చేసిన అందరికీ ప్రవేశం కల్పించి వందశాతం అడ్మిషన్లను సాధించారు.

పారదర్శకంగా ఎంపిక...

జిల్లాలో మొదటి విడతలో 452 మంది విద్యార్థులను ఎంపిక చేశాం. వివిధ స్కూళ్ల విద్యార్థులకు లాటరీ పద్ధతి ద్వారా పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించాం. ఎంపికైన వారి నుంచి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యం ఎటువంటి ఫీజులను వసూలు చేయరాదు. వీరి పర్యవేక్షణను ఆయా మండలాల ఎంఈఓలు చూడాల్సి ఉంటుంది.

– మరెడ్డి అనురాధ, డీఈఓ, వైఎస్సార్‌జిల్లా

మిగతా మండలాల్లో..

జిల్లాలోని మైదుకురులో 11 మందికి 9 మందికి అడ్మిషన్లు కల్పించారు. ఎర్రగుంట్లలో 25 మందిలో 19 మంది, ప్రొద్దుటూరులో 130 మందికి 94, సీకేదిన్నెలో 16 మందికి 11 మంది, పులివెందులలో 9 మందికి ఆరుగురు, చెన్నూరులో 8 మందికి ఐదుగురు, పోరుమామిళ్లలో 29 మందికి 18 మంది, కడపలో 236 మందికి 139 మంది, బద్వేల్‌లో 8 మందికి నలుగురు, పెండ్లిమర్రిలో 6 మందికి ముగ్గురికి, సిద్దవటంలో 6 మందికి ముగ్గురికి వేములలో ఇద్దరికి ఒకరికి , వేంపల్లిలో 6 మందికి ఇద్దరికి అడ్మిషన్ కల్పించారు.

ఉచిత సీట్లు కేటాయించకపోతే చర్యలు

విద్యాశాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి పాఠశాలలో 25 శాతం ఉచిత సీట్ల కేటాయింపు కచ్చితంగా అమలు జరగాలి. లేకపోతే చర్యలు ఉంటాయి. తొలి విడతలో జిల్లాలోని పలు పాఠశాలల్లో 452 మందికి సీట్లు లభించాయి. త్వరలో రెండోవిడత ఎంపిక కూడా ఉంటుంది. అర్హులైన వారు ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

కిశోర బాలికల్లో శారీరకంగా, మానసికంగా అనేక మార్పులు సంభవిస్తాయి. ముఖ్యంగా రుతుక్రమం సమయంలో మానసికంగా ఆందోళనకు గురవుతుంటారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి వారికి తగిన సలహాలు అందడం లేదు. అలాంటి వారిలో చైతన్యం తీసుకురావాలని ఫోర్డు సంస్థ నడుంబిగించింది. మంగళవారం నెలసరి పరిశుభ్రత యాజమాన్య దినోత్సవం నేపథ్యంలో 'ప్రత్యేక కథనం.

శుభ్రతకూ ఓ 'పీరియడ్'

రుతుక్రమంపై కిశోర బాలికలకు అవగాహన

నేడు నెలసరి పరిశుభ్రత యాజమాన్య దినోత్సవం



మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలోని పీపుల్స్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఫోర్డు) సంస్థ బాలికల అభివృద్ధి కోసం పని చేస్తోంది. చైల్డ్ రైట్స్ యు (క్రై) సంస్థ సహకారం అందిస్తున్నారు. విద్యార్థినులు పీరియడ్స్ సమయంలో పడే ఇబ్బందులను గుర్తించారు. వారికి అవగాహన కోసం నడుంబిగించారు. ఫోర్డు సంస్థలో పని చేసే రిసోర్సుపర్సన్లు ప్రభుత్వ పాఠశాలలతో పాటు గురుకుల, కస్తూరిబా, ప్రభుత్వ వసతిగృహాల్లో కిశోర బాలికల్లో కలిగే మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరిస్తోంది. ఇప్పటి వరకు సుమారు 15 వేల మంది విద్యార్థినులకు అవగాహన కల్పించారు. రుతుక్రమ శుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థినులను గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి అర్థమయ్యేలా వివరిస్తున్నారు. అలాగే అమ్మాయిలకు నాపికిన్ ప్యాడ్స్ కూడా ఉచితంగా అందజేస్తున్నారు. అమ్మాయిల్లో పన్నేండళ్ల తరువాత వచ్చే మార్పులు గురించి క్షుణ్ణంగా తెలియజేస్తున్నారు. పీరియడ్స్ సమయంలో బాలికలు శుభ్రత కోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలలనే దానిపై ప్రత్యేకంగా ఓ క్లాసు ఉండాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

'బాల్య వివాహాలు అడ్డుకుంటూ....

కోవిడ్ సమయంలో మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో బాల్య వివాహాలు ఎక్కువగా చోటు చేసుకున్నాయి. వీటిని గుర్తించి చాలా వరకు సిబ్బంది సహకారంతో అడ్డుకున్నారు. దీంతో పాటు అన్నమయ్య జిల్లాలోని 25 మండలాల్లో మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించారు. బాలల హక్కుల సదస్సుకు ఫోర్డు డైరెక్టర్ లలితమ్మ ఇటీవల అమెరికాలో జరిగిన సదస్సుకు హాజరయ్యారు. సదస్సుల్లో బాలికల సమస్యల గురించి వివరించారు. ముఖ్యంగా రుతుక్రమ సమయంలో బాలికలు పడే ఇబ్బందులు, అవగాహన కార్యక్రమాలను వివరించారు.

'అందరికి ఆరోగ్యం కోసం



మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థినులకు రుతుక్రమ శుభ్రతపై అవగాహన లేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నారు. వారు రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్యాడ్స్ గురించి అవగాహన కల్పిస్తున్నాం.

–జిల్లా లలితమ్మ, ఫోర్డు డైరెక్టర్,మదనపల్లి.

విద్యుత్ మొండి బకాయిలపై రెడ్ నోటీసులు ఇవ్వాలి

విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్ ఎస్. రమణ

కడప కార్పొరేషన్: విద్యుత్ బకాయిలు ఎక్కువగా ఉన్న వారికి రెడ్ నోటీసులు ఇవ్వాలని ఉమ్మడి వైయస్సార్ జిల్లా విద్యుత్ శాఖ అధికారి సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్ రమణ అన్నారు. సోమవారం విద్యుత్ భవన్‌లోని తన ఛాంబర్‌లో విద్యుత్ బకాయిలపై అకౌంట్స్ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ బకాయిలు అధిక మొత్తంలో పెండింగ్ లో ఉన్నాయి. సంస్థ నెలరోజుల ముందు విద్యుత్ కొనుగోలు చేసి వినియోగదారులకు సరఫరా చేసి, మరొక నెల రోజులు గడువిచ్చి బిల్లు కట్టమంటుందన్నారు. అంటే మొత్తము రెండు నెలల గడువు వినియోగదారునికి ఇస్తుందని, విద్యుత్ బకాయిల వసూళ్లలో రాజీ వద్దని, దయ చూపించే స్థితిలో సంస్థ లేదని తెలిపారు. విద్యుత్ బకాయిలు వసూలు పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యుత్ బకాయిలు చెల్లించని వారి విద్యుత్ కనెక్షలను తొలగించాన్నారు. మొండి బకాయిలు ఉన్నవారికి రెడ్ నోటీసులు జారీచేసి నిబంధన ప్రకారము వారి మీటరు శాశ్వతంగా తొలగించి కోర్టులో దావా వేసి చట్టరీత్యా చర్యలు తీసుకుని విద్యుత్తు బకాయలు వసూలు చేయాలని సూచించారు. ఉమ్మడి వైయస్సార్ జిల్లాలో మొత్తము 54 కోట్ల 47 లక్షల రూపాయల బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి. వీటిని వసూలు చేస్తేనే మనుగడ ఉంటుందని తెలియజేశారు. నెలవారి లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. సమావేశంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మధు కుమార్, అకౌంట్ ఆఫీసర్ మల్లికార్జున, ఏ ఏ ఓ, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, ఎలక్ట్రిసిటీ డిప్యూటీ తాసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌కు అభినందన

వైవీయూ: ఆలిండియా అంతర్ విశ్వవిద్యాలయాల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చాంపియన్‌గా నిలిచిన వైవీయూ క్రీడాకారుడు మురళీకృష్ణను వైవీయూ అధికారులు అభినందించారు. సోమవారం విశ్వవిద్యాలయంలో వ్యాయామ విద్య, క్రీడాశాస్త్రశాఖ విభాగాధిపతి, వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విజేతగా నిలిచిన క్రీడాకారుడు, కోచ్, మేనేజర్‌లు వైస్ చాన్సలర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి క్రీడాకారున్ని, కోచ్, మేనేజర్‌లకు శాలువా కప్పి అభినందించారు. విశ్వవిద్యాలయం విద్యార్థి ఆలిండియా చాంపియన్‌గా నిలవడం మనందరికీ గర్వకారణమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈనెల 20 నుంచా 25వ తేదీ వరకు చెన్నైలోని తమిళనాడు స్పోర్ట్స్ యూనివర్సిటీలో నిర్వహించిన ఆలిండియా అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో వైవీయూ నుంచి ప్రాతినిధ్యం వహించిన మురళీకృష్ణ 59 కేజీల విభాగంలో చాంపియన్‌గా నిలిచాడన్నారు. స్క్వాడ్ విభాగంలో 250 కేజీలు, బెంచ్‌ప్రెస్ విభాగంలో 130 కేజీలు, డెడ్‌లిఫ్ట్ విభాగంలో 240 కేజీలు చొప్పున మొత్తం 620 కేజీల బరువు ఎత్తి స్ట్రాంగ్‌మ్యాన్ ఆఫ్ ఆలిండియా యూనివర్సిటీ టైటిల్ కై వసం చేసుకున్నాడన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నాగరాజు, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి, కోచ్ గణేష్, మేనేజర్ డొంకెన అనూష తదితరులు పాల్గొన్నారు.



రాక్షసులతో పోరాడేవాడు ఆ క్రమంలో రాక్షసుడిలా మారకుండా జాగ్రత్తపడాలి. అగాధంలోకి మనం చాలాసేపు చూస్తూ ఉంటే అగాధం మనలోకి చూస్తున్నట్లుగా అనిపిస్తుంది.

– ఫ్రెడెరిక్ నీషే

సాక్షి
మంగళవారం, 28 మే 2024

ఈసీ నోరుమెదపదేం?!

కోట్లాదిమంది పౌరులు నచ్చినవారిని, సమర్థులనుకున్నవారిని తమ ప్రతినిధులుగా ఎంపిక చేసుకునే అసాధారణ ప్రక్రియ ఎన్నికలు. ఆ ప్రక్రియను ఎంత పారదర్శకంగా...ఎంత వివాదరహితంగా...ఎంత తటస్థంగా నిర్వహిస్తే అంతగా ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. కానీ ఆంధ్రప్రదేశ్‌లో ఈసారి ఆదినుంచీ ఇందుకు విరుద్ధమైన పోకడలు చోటుచేసుకున్నాయి. ఎన్నికల షెడ్యూల్ వెలువడింది మొదలు చిత్ర విచిత్ర ధోరణులు కనబడ్డాయి. పోలింగ్ రోజైన ఈనెల 13న, ఆమర్నాడు రాష్ట్రంలో జరిగిన ఉదంతాలు వీటికి పరాకాష్ఠ. వివిధ జిల్లాల్లో చెదురుమదురుగా చోటుచేసుకున్న ఘటనలు ఒక ఎత్తయితే నర్సరావుపేట పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో జరిగిన ఉదంతాల పరంపర మరో ఎత్తు. టీడీపీ రౌడీ మూకలు పోలింగ్ కేంద్రాల్లోకి జొరబడి వైఎస్సార్ కాంగ్రెస్ ఏజెంట్లపై దౌర్జన్యం సాగించి వెళ్లగొట్టడం, వోటేయడానికి క్యూలో నించున్న బలహీనవర్గాలవారినీ, మహిళలనూ కొట్టి వెనక్కిపంపడం వంటి ఉదంతాలపై ఫిర్యాదు చేసినా అరణ్యరోదనే అయింది. అసాంఘిక శక్తులు చొరబడి పోలింగ్ ప్రక్రియను దెబ్బతీయకుండా చూడటానికీ, అవసరమైనప్పుడల్లా కిందిస్థాయి అధికారులకు తగిన ఆదేశాలివ్వడానికీ, సమస్యాత్మక ప్రాంతాలకు బలగాలు తరలించటానికీ వీలుంటుందని ఏర్పాటుచేసిన వెబ్‌కాస్టింగ్‌ను ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయారు. దాని నియంత్రణ టీడీపీ చేతుల్లోకి పోయింది. ఆ తర్వాత రెండురోజులూ పచ్చమూకలు తెగబడి రోడ్లపై స్వైరవిహారం చేశాయి. వైఎస్సార్ కాంగ్రెస్‌కు వోటేశారనుకున్నవారి ఇళ్లను లక్ష్యంగా చేసుకుని విధ్వంసం సృష్టించాయి. ఈ మూకలకు భయపడి వందలమంది ఇళ్లూ వాకిళ్లూ వదిలి వేరేచోట తలదాచుకోవాల్సివచ్చింది. ఇదంతా చానెళ్లలో ప్రసారం అవుతున్నా రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణకు బాధ్యతవహించాల్సిన అధికారులకుగానీ, శాంతిభద్రతలు పర్యవేక్షించాల్సిన పోలీసు అధికారులకుగానీ చీమకుట్టినట్టయినా లేదు. ఎన్నికలకు రెండురోజుల ముందు త్రికూటమి సౌజన్యంతో విధుల్లో చేరిన ఉన్నతాధికారులు ఈ విధ్వంసకాండ సాగుతున్న సమయంలో మౌనదీక్షలో మునిగిపోయారు. పరువు బజార్నపడిందనుకున్నదో ఏమో కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని నివేదిక తెప్పించుకుని ముగ్గురు ఎస్పీలనూ, ఒక కలెక్టర్‌నూ బదిలీచేసింది. మూడు జిల్లాల్లో 12 మంది పోలీస్ అధికారులను సస్పెండ్ చేసింది. సిట్ ఏర్పాటుచేసి దర్యాప్తు చేయించింది. ఇంత జరిగినా కారంపూడి సీఐగా ఉంటూ టీడీపీ విధ్వంసకాండకు కొమ్ముకాసిన నారాయణస్వామికి మాత్రం ఏం కాలేదు. ఐజీ త్రిపాఠి సరేసరి. వీరు కొత్త కొత్త కేసులు బనాయిస్తూ స్వామిభక్తిని చాటుకుంటున్నారు.

త్రికూటమి ఆడించినట్టల్లా ఆడటానికి ఎన్నికల సంఘం రెడీ అయిపోయిందని ఉన్నతాధికారుల ఏకపక్ష బదిలీలు మొదలైనప్పుడే అందరికీ అర్థమైపోయింది. ఎవరిని ఎక్కడ నియమించాలో ఆదేశిస్తూ కూటమి ఇచ్చిన ఆదేశాలకు 'జీ హుజూర్' అంటూ కొత్త అధికారులను దించింది. సమస్యాత్మక ప్రాంతాల్లో ఉద్దేశపూర్వకంగా కొందరు అధికారులను నియమించటంతో మొదలైన కుట్రపై లోతుగా దర్యాప్తు చేస్తే తప్ప ఎన్నికల రోజునా, ఆ తర్వాతా కొనసాగిన హింస, విధ్వంసకాండ వెనక ఏయే శక్తులున్నాయో వెల్లడి కాదు. మన దేశంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న పోలింగ్ ప్రక్రియను చూసి ముచ్చటపడి అనేక దేశాలు దాన్ని అనుసరించటం మొదలెట్టాయి. ఎప్పటికప్పుడు అభివృద్ధి అవుతున్న కొత్త సాంకేతికతలతో ఎన్నికల ప్రక్రియ మరింత మెరుగ్గా, సాఫీగా సాగేందుకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటున్నది. మరి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు ఏమైంది? ఈ ఉదంతాల సమయంలో ఎందుకాయన మౌనంగా ఉండిపోయారు? కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకునేవరకూ తన వంతుగా చేసిందేమిటి? ఎన్నికల రోజున మాచర్ల వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి 8 గ్రామాల్లో టీడీపీ రిగ్గింగ్ చేస్తున్న వైనం గురించి వరసగా రెండు లేఖలు రాసినా, అలాంటిచోట్ల రీపోలింగ్ నిర్వహించాలని డిమాండు చేసినా మీనా ఎందుకు జవాబీయలేదు? ఈవీఎం పగలగొట్టినట్టు టీడీపీ ఒక వీడియో విడుదల చేసేవరకూ ఆ ఉదంతం తెలియనట్టే ఎందుకున్నారు? 23 గంటల నిడివికిపైగా ఉన్న ఆ వీడియోలో ముందూ వెనకా ఏం జరిగిందో అసలు ఎన్నికల సంఘం చూసిందా? చూస్తే ఎందుకు మౌనం వహించింది? అన్నిటికన్నా చిత్రమేమంటే ఆరోపణలు ఎదుర్కొంటున్న పిన్నెల్లి అదే రోజు రీ పోలింగ్ కోసం డిమాండ్ చేయగా నాలుగైదు రోజుల తర్వాత ఆ వీడియో బయటపెట్టిన టీడీపీ ఇంతవరకూ రీపోలింగ్ కోరనేలేదు. వెబ్‌కాస్టింగ్ మొత్తం టీడీపీ ముఠా నియంత్రణలో ఉందన్న ఆరోపణలపై ఎన్నికల సంఘం నోరు మెదపటం లేదు.

ఇంత బరితెగింపుతో దేశంలో ఎక్కడా ఎప్పుడూ ఎన్నికలు జరగలేదు. తన బాధ్యతేమిటో, కర్తవ్యమేమిటో మరిచి తోకపట్టుకుని పోయే చందంగా నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్న ఎన్నికల సంఘం ఇప్పటికైనా మౌనం వీడాలి. నర్సరావుపేట పరిధిలోనే కాదు... ఇతర నియోజకవర్గాల్లోనూ ఈవీఎంలు ధ్వంసం చేసిన ఉదంతాలు వెల్లడయ్యాయి. మంత్రి అంబటి రాంబాబు కొన్నిచోట్ల రీపోలింగ్ కోరారు. వీటన్నిటికీ జవాబు రావాలి. సంజాయిషీ ఇవ్వాల్సిన స్థానంలోవున్నవారు మూగనోము పడితే అనుమానాలు మరింత బలపడతాయి. కౌంటింగ్ ప్రక్రియ సక్రమంగా సాగుతుందా అన్న సందేహాలు తలెత్తుతాయి. కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని ఈ తలకిందుల వ్యవస్థను నిటారుగా నిలబెట్టాలి. ప్రజాస్వామ్యంపై ప్రజలకుండే విశ్వసనీయతను కాపాడాలి.

మహోన్నత వ్యక్తిత్వం... మేరునగ ధీరత్వం!

అభిప్రాయం



డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి

'న నిశ్చితాత్ విరమంతి ధీరాః' అని భర్తృహరి చెప్పినట్లు... తలపెట్టిన కార్యాన్ని సాధించే వరకు ధీరులు తమ ప్రయత్నాలను ఎన్ని ఇబ్బందులెదురైనా నిలబడి సాధిస్తారు. వెనక్కు తగ్గరు. అందుకు ఉదాహరణ ఎన్టీఆర్. ఆశయం లేని అడుగులు బురద గుంటలో ప్రయాణం లాంటివనీ, గమ్యం చేరవనీ నమ్మి ఆచరించిన వ్యక్తుల్లో ఎన్టీఆర్ అగ్రస్థానంలో నిలుస్తారు. గొప్ప మనసున్న తండ్రి ఆయన. భార్యను ప్రేమించి గౌరవించే మహోన్నత సంస్కారం ఆయనది. పేద ప్రజల్ని కన్న బిడ్డల్లాగా పరిపాలించారు. అవినీతి రహితమైన సమాజాన్ని ఏర్పరచటానికి చిత్తశుద్ధితో పాటుపడ్డారు. అందుకే – మరణించిన తరువాత కూడా ఆ మహోన్నత వ్యక్తి నేటికీ జీవించే ఉన్నారు.

తెలుగు రాష్ట్రంలో కృష్ణా జిల్లా నిమ్మకూరు గ్రామంలో 1923 మే 28న జన్మించిన మహానేత ఎన్టీఆర్ గారికి నేటికి 101 సంవత్సరాలు. అయినా ఇప్పటికీ ఆయన దివ్య తేజస్సు తగ్గలేదు. మరణించి 28 సంవత్సరాలు అయినా ఎన్టీఆర్ పేరు అభిమానుల గుండెల్లో మారుమ్రోగుతూనే వుంది. ఆ రూపం అలరిస్తూనే ఉంది. ఆయన సినిమాలు, రాజకీయ జీవితంలో మాదిరిగానే ఆయన వ్యక్తిత్వంలోనూ అనేకానేక విశేషాంశాలు ఇమిడి ఉన్నాయి.

ఎన్టీఆర్ గారిలో మొదటి నుండి కూడా ఇచ్చిన మాటకు కట్టుబడటం, అనుకున్నది సాధించేవరకు వెనుకడుగు వేయకపోవటం అనేవి ప్రత్యేక గుణాలు. ఇవే ఆయనను సినీ, రాజకీయ రంగాల్లో విజయపథం వైపు నడిపించాయి.

'న నిశ్చితాత్ విరమంతి ధీరాః' అని భర్తృహరి చెప్పినట్లు... తలపెట్టిన కార్యాన్ని సాధించే వరకు ధీరులు తమ ప్రయత్నాలను ఎన్ని ఇబ్బందులెదురైనా నిలబడి సాధిస్తారు. వెనక్కు తగ్గరు. ఆ లక్షణం ఎన్టీఆర్ తర్వాత మళ్లీ ఇప్పుడు జగన్ మోహన్ రెడ్డిలో చూశాను. ముక్కుసూటిగా పోయే ఇలాంటి నాయకులకు శత్రువులు కూడా ఎక్కువే అనడటానికి వీరిద్దరూ ఎదుర్కొన్న సంఘటనలే సాక్ష్యం.

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా – ఆయన భార్యగా అత్యంత సన్నిహితంగా మెలిగిన వ్యక్తిని కనుక ఆయన వ్యక్తిత్వాన్ని తెలియచేసే ప్రధానమైన రెండు మూడు సంఘటనలు వివరిస్తాను. ఒక్క మా పెళ్లి విషయంలోనే తీసుకుంటే పెళ్లికి ముందు– తర్వాత ఎన్టీఆర్ ఎన్నో రకాల సమస్యల్ని ఎదుర్కొన్నారు.

తిరుపతిలో జరిగిన 'మేజర్ చంద్రకాంత్' సినిమా వేడుకల్లో ఎన్టీఆర్ మా వివాహ ప్రకటన చేయగానే చంద్రబాబు ఆ ప్రకటన ప్రజల్లోకి వెళ్లకూడదని మైకులాపించి, లైట్లు ఆర్పించారు. అయినా ఆయన మరుసటి రోజు ఇంట్లోనే మీడియా సమావేశం ఏర్పాటు చేసి మా పెళ్లిని ప్రకటించి మరీ వివాహం చేసుకున్నారు.

అక్కడ నుండి నన్ను ప్రజల్లోకి తీసుకెళ్లకుండా చేయటానికి చంద్రబాబు, కుటుంబ సభ్యులు కలిసి ఎన్నో పన్నాగాలు పన్నారు. ఎన్టీఆర్ ధైర్యంగా నన్ను అందరి ముందుకు తీసుకెళ్లి నా స్థానం ఏమిటో సగర్వంగా ప్రకటించారు. ప్రతి అవమానంలో అండగా నిలబడి మాకు కీడు చేస్తున్న వారందరినీ ఎదిరించారు. చీకటి రాజకీయాలకు అలవాటు పడ్డ చంద్రబాబు లాంటి వ్యక్తికి ఆయనొక సవాలుగా నిలబడ్డారు. పెద్ద వయస్సులో ఒంటరితనంతో బాధపడుతున్న ఎంతోమందికి మా వివాహం ఒక మార్గం చూపించింది. దాని మీద కొన్ని ఆర్గనైజేషన్స్ ఏర్పడటం కూడా ఒక విశేషమే!



నేడు ఎన్టీఆర్ 101వ జయంతి

మరో సంఘటన – 1994 ఎన్నికల ప్రచారంలో నన్ను ఇంట్లో ఉంచమని అనేకమంది ద్వారా చెప్పించారు. ఎస్.వి రమణ లాంటి అన్యాయవాదుల్ని ఇంటికి పంపి ఈ పెళ్లి చెల్లదని కూడా వాదించేటట్లు చేశారు. ఎన్టీఆర్ దేనికీ చలించలేదు. తన ఆలోచన మార్చుకోలేదు. నన్ను తీసుకునే ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. స్వయంగా 216 స్థానాలు, మిత్ర పక్షాలకు మరో 34 స్థానాలు సంపాదించి రాజకీయ రంగంలో ఒక రికార్డు సాధించారు. మళ్లీ ఆ స్థాయి రికార్డును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తిరగరాశారు.

ఎన్టీఆర్ ముఖ్యమంత్రి పదవిని తమ అధికార దాహంతో లాగేయాలని కుట్రలు పన్నిన రామోజీ, చంద్రబాబు అందుకు నన్నే కారకురాలిగా చూపించారు. ఒక రాజ్యాంగేతర శక్తిగా నా ప్రాతను చిత్రీకరించి, నన్ను విడిచి పెడితేనే తిరిగి పదవి ఇస్తామని ప్రలోభపెట్టారు. ఇక్కడే ఎన్టీఆర్ గొప్ప వ్యక్తిత్వం మేరు పర్వతం లాగా కనిపిస్తుంది. ముఖ్యమంత్రి పదవిని వదులుకోవటానికి సిద్ధపడ్డారు కానీ భార్యను మాత్రం వదులుకోలేదు. పైగా వారికో సవాల్ విసిరారు. ''నా పార్టీ, నేను సాధించుకున్న పదవి నాకు తిరిగి ఇవ్వటమేమిటి? ధర్మబద్ధంగా వివాహం చేసుకున్న స్త్రీని బయటకు పంపించటం ఏమిటి? మీ భార్యల్ని అలా వదిలేస్తారా? నా భార్య తప్పు చేసిందని నిరూపించండి. బహిరంగంగా ఆమెను శిక్షిస్తాను'' అన్నారు. ఈ మాటలు ఆయన ఆత్మవిశ్వాసాన్ని, తనపై నమ్మకాన్ని నిలబెట్టాయి. ఎప్పటికప్పుడు వారి నిందల నుండి నన్ను గుండెల్లో పొదువుకొని కాపాడుకున్నారు ఆయన.

ఒక సందర్భంలో ఎన్టీఆర్ విలేకర్లతో మాట్లాడుతూ– ''రాజ్యం కోసం ఆ రాముడు తన భార్యను అడవులకు పంపేశాడు. కానీ ఈ రాముడు తన భార్య గౌరవం కోసం అధికారాన్నే వదులుకున్నాడు'' అన్నారు. ఇలాంటి నిశ్చితాభిప్రాయాలు ఎంతమంది మగవాళ్లలో ఉంటాయి?! చాలా తక్కువ మంది మాత్రమే కనిపిస్తారు.

ఎన్టీఆర్ గారి సదభిప్రాయాలను, ఆశయాలను అర్థం చేసుకోకపోగా అపార్థం చేసుకుని కుటుంబ సభ్యులు ఎంతో బాధించారు– వేధించారు– అవమానాల పాలు చేశారు. అయినా చివరి క్షణం వరకు ఆయన తన కుటుంబాన్ని ప్రేమిస్తూనే ఉన్నారు. ప్రతిరోజూ వాళ్ల ఇంటికి స్వీట్లూ, ఫ్రూట్లూ పంపిస్తూనే వచ్చారు. వాళ్లు అప్పుడప్పుడూ వచ్చి డబ్బు పట్టుకుని పోతూ ఉండేవారు. మళ్లీ బయట మాత్రం వాళ్లంతా చంద్రబాబుతో చేతులు కలపడం! ఏది ఏమయినా గొప్ప మనసున్న తండ్రి ఎన్టీఆర్. భార్యను ప్రేమించి గౌరవించే మహోన్నత సంస్కారం ఆయనది. పేద ప్రజల్ని కన్న బిడ్డల్లాగా పాలించినవారు. అవినీతి రహితమైన సమాజాన్ని ఏర్పరచటానికి ప్రయత్నించి భంగపడ్డ ధీరుడు.

ఎన్ని రకాలుగా చంద్రబాబు, రామోజీలు కుట్రలు పన్ని అవమానించినా, పదవి లాగేసినా తల వంచకుండా తన చివరి క్షణం వరకు ఆయన తన పోరాటాన్ని కొనసాగించారే తప్ప ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. ''స్థిరత్వం, ధీరత్వం, ఉచితజ్ఞతా, ప్రియ వక్తృత్వం– చత్వారో సహజాగుణాః అభ్యాసే న లభ్యంతే'' అని పెద్దలు చెప్పినట్లు ఈ లక్షణాలు ఆయన పుట్టుకతోనే వచ్చాయి. చివరి వరకు ఆ గుణాలు నిలబెట్టుకున్న ధీర గంభీరుడు ఎన్టీఆర్.

నిబద్ధత లేని జీవితం ముళ్ల చెట్టు లాంటిది. ఎవరికీ ఉపయోగం ఉండదు. ఆశయం లేని అడుగులు బురద గుంటలో ప్రయాణం లాంటివి. గమ్యం చేరవు. ఇది నమ్మి ఆచరించిన వ్యక్తుల్లో ఎన్టీఆర్ అగ్రస్థానంలో నిలుస్తారు. అందుకే మరణించి కూడా నేటికీ మన మధ్య జీవించే ఉన్నారు.

వ్యాసకర్త ఎన్టీఆర్ సతీమణి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఉద్యోగ సంతృప్తి



7 నెలలు, ఇండియాకు 4 పర్యటనలు, 60కి పైగా ఇంటర్వ్యూలు! నరేంద్ర మోదీకి అత్యంత సన్నిహితులైన వ్యక్తులతో మాట్లాడాను. ఆయన దర్జీ, ఆయన వ్యక్తిగత కార్యదర్శి, ఆయన తరఫు వ్యాఖ్యాతలు, ఆర్థిక సలహా దారులు, ఇంకా చాలామందితో సంభాషించాను. ఈ 'లవ్ ఆఫ్ లేబర్' మరికొద్ది రోజుల్లో ధ్వనించబోతోంది. (తన 8 భాగాల పాడ్‌కాస్ట్ సిరీస్ 'ది మోదీ రాజ్' గురించి).

– అవంతికా చిల్కోటి, పాడ్‌కాస్ట్ హోస్ట్

సాకు మాత్రమే



పోలైన ఓట్ల కచ్చితమైన సంఖ్యను వెల్లడించే అధికారం తమకు చట్ట ప్రకారం లేదని ఎన్నికల సంఘం చెబుతోంది. అయితే ఇప్పటికే 5 రాష్ట్రాల్లోని ఎన్నికల సంఘం కార్యాలయాలు కచ్చితమైన సంఖ్యను వెల్లడించాయి. అంటే ఓటింగ్ శాతాన్ని బహిర్గతం చేయకుండా ఈసీని ఆపుతున్నది చట్టం కాదన్నమాట!

– ఆయుష్ తివారీ, రిపోర్టర్

అంత డబ్బు వస్తేనా..!



లక్ష కోట్లు ఒక్కసారిగా వచ్చిపడుతుంటే ఎలా ఖర్చు చేయాలి? వ్యక్తుల లాగే ప్రభుత్వం కూడా! మొదట : అవసరాలకు ఖర్చుపెట్టడం. రెండు : అప్పులు తీర్చడం. మూడు : పెట్టుబడి పెట్టడం. ఇదీ వరస. ఆర్బీఐ నుండి తనకు వస్తున్న లక్ష కోట్ల రూపాయలను ప్రభుత్వం ఇలానే చేయబోతోంది. నేనైతే మొదట నా అప్పులన్నీ తీర్చేసుకుంటాను. – మోనికా హలన్, మనీ అడ్వైజర్

స్వయంకృతాపరాధం



మెక్సికో గత రెండు వారాలుగా తన చరిత్ర లోనే అత్యంత దారుణమైన వేడి గాలులతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో 45 డిగ్రీల నుంచి పెరుగుతున్నాయి. వచ్చే వారం రోజుల్లో ఈ వేడి విజృంభించవచ్చు. భూతాప పర్యవసానాలు మొదలైనట్లేనా?!

– కాలిమ్ మెకార్తీ, వాతావరణ నిపుణుడు, క్యాలిఫోర్నియా

'నీటి' మేడలు!



ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే లోని కొన్ని సెక్టార్‌లు చిత్తడి నేలలు. అయితే డెవలపర్‌లు అక్కడ ఎత్తైన అపార్ట్‌మెంట్‌లు నిర్మించారు. సెక్టార్–107లోని ప్రాజెక్టు అయితే నీటిలో నిలబడి ఉంది. ఫిబ్రవరి 22న చింటెల్స్ ప్యారడిసో ప్రాజెక్టులో రెండు చోట్ల నేల కుంగిపోయిన ప్రాంతం ఇదే! – ఉదిత్ భండారి, సోషల్ కామెంటేటర్

ఇన్ బాక్స్

పేరుకే నిషేధం

ఆరోగ్యానికి హానికరంగా మారిన గుట్కా తయారీ, క్రయ విక్రయాల నిషేధాన్ని మరో ఏడాది పాటు పొడిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఫుడ్ సేఫ్టీ విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. 2025 మే 24 వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని పేర్కొంది. అయితే తెలంగాణతోపాటు మరికొన్ని రాష్ట్రాలు గుట్కా విక్రయాలను నిషేధించినప్పటికీ... ఇప్పటికీ క్రయవిక్రయాలు జరుగుతూనే ఉన్నాయి.

'ఆహార భద్రత, ప్రమాణాల చట్టం–2011' ప్రకారం పొగాకు ఉత్పత్తులపై 2012 నుంచి పలు రాష్ట్రాలు వాటిని నిషేధించడం మొదలుపెట్టాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఏపీ ప్రభుత్వం 2013 జనవరి 9న గుట్కా ఉత్పత్తులను నిషేధించింది. ఏటా నిషేధం కొనసాగించేలా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే గుట్కాను మాత్రమే నిషేధించడంతో పొగాకుతో తయారయ్యే పాన్‌మసాలా ఉత్పత్తులు మార్కెట్‌లో బాగా పెరిగాయి. దీంతో 2014 జనవరి 9న సమగ్రంగా ఆదేశాలు ఇచ్చింది ప్రభుత్వం. నికోటిన్, పొగాకు ఆనవాళ్లు ఉండే నోటి ద్వారా తీసుకునే అన్ని ఉత్పత్తులపైనా నిషేధం విధించింది. ప్రస్తుత తెలంగాణలోనూ ఇవే ఆదేశాలు అమలవుతున్నాయి.

గుట్కా, పాన్ మసాలాలపై నిషేధాన్ని సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో 160 పిటిషన్లు దాఖలు కాగా, 2021 నవంబర్‌లో వీటన్నింటిని న్యాయస్థానం కొట్టివేసింది. ఆ తర్వాత వ్యాపారులు సుప్రీం కోర్టును ఆశ్రయించి నిషేధంపై స్టే తెచ్చుకున్నారు. గుట్కా క్రయవిక్రయాలు జరిపే వారిపై పోలీసులు కేసులు పెట్టడాన్ని తెలంగాణ హైకోర్టులోనూ సవాల్ చేశారు. దీంతో సరుకులు సీజ్ చేయొద్దనీ, గుట్కా ఉత్పత్తుల తయారీ, సరఫరా, విక్రయదారులపై కేసులు పెట్టవద్దనీ హైకోర్టు పోలీసులకు సూచించింది. తమిళనాడు, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్‌లోనూ దాదాపు ఇదే పరిస్థితి.

– ఫిరోజ్ ఖాన్, జర్నలిస్ట్

రిఫరీ తొండి అయినా... సగటు ఓటరే విజేత!

విశ్లేషణ



పి. విజయబాబు

దేశంలో ప్రతిష్ఠాత్మక మూల స్తంభాలలో ఒకటైన ఎన్నికల కమిషన్ తన స్ఫూర్తిని కోల్పోతోందా? 'ఫ్రీ అండ్ ఫెయిర్ ఎలక్షన్స్' (స్వేచ్ఛగా, పారదర్శకంగా) ఎన్నికలు నిర్వహించటం భారత ఎన్నికల సంఘం కర్తవ్యం. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి అత్యంత అవశ్యం. కానీ ఆ కర్తవ్యం గాడి తప్పితే? ఆ స్ఫూర్తి మసకబారితే? ఫలితం ఏమవుతుంది?

ప్రస్తుత ఎన్నికల కమిషన్ పోకడలు చూస్తే చాలా ఆందోళనకరంగా ఉన్నాయని విమర్శకులు అంటున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ (ఈడీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) సంస్థల లాగే ఎన్నికల కమిషన్ కూడా అధికార పార్టీ చేతిలో కీలుబొమ్మగా మారిందని వినవస్తున్న విమర్శలకు అనేక సంఘటనలు ఊతమిస్తున్నాయి. ఎన్నికలు జరుగుతున్న వేళ విపక్షాల నుంచి కుప్పల కొద్దీ సాక్ష్యాధారాలతో సహా ఫిర్యాదులు అందుతున్నా ఈసీ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించటం ఆశ్చర్యం కలిగిస్తోంది. అప్పుడప్పుడు ఈసీ పేపర్ టైగర్‌లా గాండ్రించడమే తప్ప కఠిన చర్యలకు ఉపక్రమిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ఇందుకు తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సమయంలో పలుచోట్ల జరిగిన అల్లర్లను ఉదాహరణగా చెప్పవచ్చు. ఆశ్చర్యం ఏమిటంటే, అల్లర్లు జరిగిన అన్ని ప్రాంతాల్లోనూ కమిషన్ శుద్ధపూసలంటూ ప్రత్యేకంగా నియమించిన పోలీసు అధికారులు ఉన్న ప్రాంతాలే కావడం గమనార్హం!

కూటమి, అందులో భాగస్వామురాలైన బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ఇచ్చిన అధికార్ల చిట్టాను కించిత్తు వెరపు లేకుండా ఈసీ స్వీకరించి తదనుగుణంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య వాదులను దిగ్భ్రాంతికి గురిచేస్తోంది.

రౌడీ మూకలు రెచ్చిపోతుంటే పోలీసులే నిర్లిప్తంగా వ్యవహరించటం, సాక్షాత్తూ పోలీసులే ఎమ్మెల్యే ఇంటిలోకి చొరబడి సీసీ కెమెరాలు పగలగొట్టడం, అటు పోలీసు వ్యవస్థ ప్రతిష్ఠను, ఇటు ఈసీ వ్యవస్థను దిగజార్చిందని చెప్పాలి. ఈసీ నిష్పాక్షికంగా వ్యవహరించకపోవడం, పాక్షిక దృష్టితో కొంతమంది కేసుల్లో పది రోజులు దాటిన తర్వాత క్రొంగొత్త సెక్షన్లను పొందుపరచడం గమనార్హం. ఎవరి ఆదేశాల మేరకు ఈసీ ఈ పనిచేస్తుందో చెప్పాలని సామాజికవేత్తలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో టీఎన్ శేషన్ ఎన్నికల సంస్కరణలకు తెర తీసి తన నిక్కచ్చితత్వంతో చరిత్రలో మిగిలిపోయారు. 1977 పోస్ట్ ఎమర్జెన్సీ ఎన్నికల్లో ఈసీ వ్యవహరించిన తీరుకి యావత్ భారతదేశం జేజేలు పలికింది. వాజ్‌పేయి అనంతరం సరిగ్గా 25 ఏళ్ల తర్వాత 2014లో బీజేపీ మోదీ నేతృత్వంలో అధికారాన్ని కైవసం చేసుకున్నాక ఈసీ ప్రతిష్ఠ క్రమంగా మసకబారుతూ వచ్చిందని పరిశీలకులు అంటున్నారు.

గతంలో బ్యాలెట్ బాక్స్‌లు ఉపయోగంలో ఉన్నప్పుడు కొన్ని సున్నిత ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌ల స్వాధీనం, బ్యాలెట్ బాక్సుల్లో ఇంకు పోయడం, బాక్స్‌లు ఎత్తుకెళ్ళిపోవడం వంటి సంఘటనలు జరిగేవి. అయితే ఈవీఎంలు వచ్చిన తరువాత ఈ అక్రమాలకు తెరపడ్డాయని చెబుతున్నా... ఎన్నికలు సజావుగా



నిర్వహించవలసిన ఎన్నికల కమిషన్, సిబ్బంది, అందులో ప్రధానంగా పోలీసు వ్యవస్థ పక్షపాతంగా వ్యవహరిస్తే ఇక ఎన్నికలు సజావుగా ఎలా జరుగుతాయన్న ప్రశ్నలు ఇప్పుడు ప్రజాస్వామ్యవాదులను కలవరపెడుతున్నాయి. ఏకంగా బహిరంగంగా పోలీసులు, బాబు కూటమి కలిసి తెగబడి అల్లర్లు ఆందోళనలు సృష్టిస్తే ఈసీ నిష్పాక్షికంగా వ్యవహరించకపోవడం దారుణం. ఢిల్లీకి వెళ్లి ఈసీకి ఫిర్యాదు చేస్తే తప్ప కనీస మాత్రం స్పందన లేదంటే వీళ్ళ చిత్తశుద్ధి ఎలాంటిదో గమనించవచ్చు.

ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) సెక్షన్ 171 ప్రకారం ఓటర్లను ప్రలోభ పెట్టడం, భయపెట్టడం శిక్షార్హం. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950లోని సెక్షన్ 123 ప్రకారం భయపెట్టినా, ఓటర్లను ప్రలోభపెట్టినా కూడా శిక్షార్హమే! అయినా జాతీయస్థాయిలో అధికార పార్టీ అండ చూసుకొని అనేక చోట్ల ఈ శక్తులు పేట్రేగిపోతున్నాయి. అరాచకాలను గమనించిన భారత అత్యున్నత న్యాయస్థానం శాసన సభ, పార్లమెంటు సభ్యులపై నమోదయ్యే కేసులను సత్వరం విచారించి శిక్షించడానికి ప్రత్యేక కోర్టులు ఉండాలని ఆదేశించింది. ఫలితంగా తెలంగాణలో ఏర్పాటైన ప్రత్యేక కోర్టుకి 395 కేసులు బదిలీ అయ్యాయి. ఆశ్చర్యం ఏమిటంటే... ఇందులో కేవలం 14 కేసులకు మాత్రమే నామమాత్రపు శిక్ష పడింది. మిగతా వాటికి సాక్ష్యాధారాలు సరిగా లేవని కొట్టివేయడమైనది. అదీ పవర్ పాలిటిక్స్ అంటే! ఎన్నికల కమిషన్ ప్రకటనలు అయితే చాలా ఆర్భాటంగా ఉంటాయి. ఈసారి గతంలోలా కాదు చాలా కఠినంగా వ్యవహరిస్తాం... నిష్పాక్షికంగా వ్యవహరిస్తాం అంటూ ప్రకటనలు అయితే ఇస్తారు. అంతేనా? ఏకంగా ప్రజలను కూడా అంటే ఓటర్లను కూడా నిఘా వ్యవస్థలో భాగస్వాములను చేస్తాం అంటూ ఘనంగా 'సీ విజిల్ యాప్' రూపొందించారు. దీని ప్రకారం, ఎక్కడైనా అక్రమాలు జరుగుతున్నట్టు ఓటర్ ఫిర్యాదు చేస్తే ఫ్లయింగ్ స్క్వాడ్ 100 నిమిషాల్లో ఆ నియోజకవర్గ పరిధిలోని అధికారులకు సూచనలు ఇచ్చి తగు చర్యలు తీసుకుంటుంది. ఇది వినడానికి అయితే అద్భుతంగా ఉంది కానీ వాస్తవంలో జరిగిందేమిటి? అనేక చోట్ల ఎస్సీ, ఎస్టీ మహిళలు ఓట్ వేయడానికి వెళితే వాళ్ళని బెదిరించి, పరిగెత్తించడం పోలీసుల సమక్షంలో గూండాలు వ్యవహరించిన తీరు వీడియోల్లో రికార్డ్ అయింది. ఫిర్యాదులు చేసి రోజులు గడుస్తున్నా చర్యలు శూన్యం.

వాస్తవానికి ప్రజా ప్రాతినిధ్య చట్ట ప్రకారం పక్షపాతంగా వ్యవహరించే పోలీసులకు విధుల్లో కొనసాగే హక్కు లేదని, ఓటర్లను భయపెట్టే నేతలపై అనర్హత వేటు వేయాలన్న 'లా కమిషన్' సిఫార్సులు అమలు చేయాలి. కానీ కనుచూపు మేరలో అలాంటిదేమీ కనిపించడం లేదు. సుప్రీం కోర్టు త్రిసభ్య కమిటీ సూచించిన విధంగా మచ్చ లేనివారిని ఎన్నికల కమిషనర్లుగా నియమించాలి. కానీ ఇవన్నీ జరిగేదెప్పుడు? సగటు ఓటరుకు రక్షణ ఎప్పుడు? అయితే ఒకటి మాత్రం నిజం. భారత ప్రజాస్వామ్యంలో ఎన్నికల రణక్షేత్రంలో వీరులు సగటు ఓటరులే! వారి తీర్పుకు తిరుగులేదు. వారి పైన ఆంక్షలు తాత్కాలిక చంద్ర గ్రహణాల వంటివి. అంతిమంగా పున్నమి వెలుగులు జగన్మోహనంగా విస్తరించక మానవు.

రాజ్యాంగ న్యాయశాస్త్ర పట్టభద్రుడు

యశస్సే ప్రధానం!

'లోకం తనను గురించి ఏమనుకుంటున్నదో?' అనే ఆలోచనతో నిత్యం కలవరపడుతూ, లోకం దృష్టిలో మచ్చలేని మనిషిగా జీవితం గడపాలనుకునే వ్యక్తికి సుఖం ఉండదు. చేయని తప్పుకు నిందను భరించడం అంత సులువైన పని కాదు. నిప్పులా అంతరంగాన్ని అది అనుక్షణం దహించి వేస్తూ బాధకు గురిచేస్తూనే ఉంటుంది. పిల్లలమర్రి పినవీరన కవి తాను రచించిన 'జైమిని భారతము' కావ్యంలో అపవాదును పిడుగుపాటుతో సమానమైనదిగా పోల్చి చెప్పాడు. పిడుగుపాటు వంటి లోకాపవాద బాధ హృదయాన్ని తాకి గాయపరిచినపుడు, శ్రీరాముడంతటి అవతారపురుషుడు సైతం ఆ బాధకు తట్టుకోలేక విలవిల లాడాడు. 'పాపపంకిలమైన ఈ లోకంలో మళ్ళీ ఎక్కడ పుట్టవలసి వస్తుందో అన్న భయంతో ఒక యోగపురుషుడు మమకారాన్ని వదిలి ఒక్కడుగానే జీవితాన్ని గడపడానికి నిశ్చయించుకున్నట్లుగా, పిడుగుపాటు వంటిదైన లోకాపవాద భయం హృదయాన్ని ముక్కలు చేయగా, సాధ్వియైన సీతను దూరం చేసుకోవడానికి శ్రీరాముడు నిశ్చయించుకున్నాడు!' అని చెప్పాడు.



జ్యోతిర్మయం

మనిషిగా పుట్టి, గిట్టిన దానికి నిదర్శనంగా నిలిచి ఉండే యశస్సు, ఆ వ్యక్తి జీవితంలోని ఉన్నతమైన విలువలతో కూడిన సన్నివేశాలను, కరదీపికలు కాగలిగిన సందర్భాలను భావితరాలకు వెలిగించి చూపుతూ ఉంటుంది.

క. కావున యశోవిహీనులు
జీవన్మృతులగుటకేమి చెప్పగనిందల్
రావచ్చినచో దనువులె
పోవిడుతురు తొంటి భూమిభుజులట్లగుటన్.

'కనుక యశస్సే ప్రధానమైనది! యశస్సు లేని వారు జీవించి ఉండి కూడా మరణించినవారితో సమానమే! ఆ కారణం చేత, అపనింద పాలవడం అనే పరిస్థితి ఎదురైతే ప్రాణం పణంగా పెట్టి అయినా సరే దాని నుండి బయటపడడానికి భూమినేలిన పూర్వ ప్రభువులు ప్రయత్నించారు!' అని జైమిని భారతము, షష్ఠాశ్వాసం, 'శ్రీరామచరిత్రం' లోని పై పద్యంలో శ్రీరాముడి మాటలు, మనుషులు యశోకాములై జీవించడంలోని గొప్పదనాన్నీ, ఆవశ్యకతనూ తెలియజెప్పాయి.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: బ.పంచమి ప.3.09 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: ఉత్తరాషాఢ ఉ.9.43 వరకు, తదుపరి శ్రవణం, వర్జ్యం: ప.1.32 నుండి 3.04 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.05 నుండి 8.56 వరకు, తదుపరి, రా.10.49 నుండి 11.34 వరకు, అమృతఘడియలు: రా.10.44 నుండి 12.16 వరకు; రాహుకాలం : ప.3.00, నుండి 4.30 వరకు, యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు, సూర్యోదయం : 5.29, సూర్యాస్తమయం : 6.25.

క్లుప్తంగా...

అయోధ్యలో టీటీడీ తరహా ఏర్పాట్లకు సలహాలు కోరాం

రామ జన్మభూమి ట్రస్ట్ సభ్యుడు దినేష్ రామచంద్ర



తిరుమల: అయోధ్యలోని రామ జన్మభూమిలో నిర్మించిన రాముల వారి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం చేయవలసిన ఏర్పాట్లపై టీటీడీని సలహాలు కోరినట్లు రామ జన్మభూమి ట్రస్ట్ సభ్యుడు దినేష్ రామచంద్ర తెలిపారు. సోమవారం ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. కాగా, ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీ ఈవో ధర్మారెడ్డి టీటీడీలో అమలు చేస్తున్న నియమావళి గురించి లిఖితపూర్వకమైన సలహాలు, సూచనలు ఇచ్చారన్నారు. వాటిపై తాము చర్చించి అమలుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు. ప్రస్తుతం రామాలయానికి రోజుకు 1,50,000 మంది వరకు వస్తున్నట్లు తెలిపారు.

ప్రకాశం పంతులు మనవడు గోపాలకృష్ణ కన్నుమూత



గోపాలకృష్ణ (ఫైల్)

ఒంగోలు టౌన్: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు మనవడు టంగుటూరి గోపాలకృష్ణ (64) హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సోమవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. గోపాలకృష్ణకు భార్య విజయలలిత, ఇద్దరు కుమారులు సాయిక్రాంత్, ప్రకాశ్ ఉన్నారు. ఒంగోలులోని రాంనగర్ 8వ లైనులో నివాసం ఉండే గోపాలకృష్ణ గత ఏడాది నుంచి హైదరాబాద్‌లోని చిన్న కుమారుడు ప్రకాశ్ దగ్గర ఉంటున్నారు. 2020లో కిడ్నీ సమస్య తలెత్తడంతో డయాలసిస్ చేశారు. గోపాలకృష్ణ కమర్షియల్ ట్యాక్స్‌లో రికార్డ్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేసి 2016 డిసెంబరు 31న స్వచ్ఛందంగా పదవీ విరమణ చేశారు. గోపాలకృష్ణ మరణవార్త తెలియగానే మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. గోపాలకృష్ణ అంత్యక్రియలను హైదరాబాద్‌లోని అంబర్‌పేట శ్మశానవాటికలో సోమవారం నిర్వహించారు.

క్రికెట్ బెట్టింగులతో అప్పులపాలై విద్యార్థి ఆత్మహత్య



వంశీ(ఫైల్)

తాడేపల్లి రూరల్: బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఓ విద్యార్థి క్రికెట్ బెట్టింగ్‌లకు వెళ్లి చివరకు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. తాడేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియం కోటమ్మవారి వీధిలో నివాసముండే మురికింటి యేసురత్నం, సుభద్ర కూలిపనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. పెద్ద కుమారుడైన వంశీ(21) వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఇల్లు నిర్మించేందుకు అతి తక్కువ కాలంలో డబ్బులు ఎలా సంపాదించాలని ఆలోచించి క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటుపడ్డాడు. చివరకు అప్పుల పాలయ్యాడు. ఆ అప్పులు తల్లిదండ్రులకు భారం కాకూడదని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ నెల 25వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో ఇంట్లోంచి బైక్‌పై ప్రకాశం బ్యారేజ్ వద్దకు వచ్చి తన తల్లి అయిన సుభద్రకు మెసేజ్ చేశాడు. 'నన్ను చదివించడం కోసం కూలి పనులు, అప్పులు చేయడాన్ని చూసి తట్టుకోలేక.. ఎలాగైనా మిమ్మల్ని ఆదుకోవాలని క్రికెట్ బెట్టింగ్‌లు కాసి అప్పుల పాలయ్యాను. నేను బతికి ఉంటే ఈ అప్పులు కూడా మీ మీదే పడతాయి. అందుకే ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్నా' అని మెసేజ్‌లో పేర్కొన్నాడు. అనంతరం ఉండవల్లి అమరావతి కరకట్ట ప్రాంతంలోని కొండవీటి వాగు ఎక్స్‌క్లూయిస్ వద్దకు వచ్చి తల్లికి సెల్‌ఫోన్ ద్వారా లొకేషన్ పెట్టి కృష్ణానదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే తమ కుమారుడు ఆత్మహత్య చేసుకోదనుకుని ఫిర్యాదు చేయలేదని, సోమవారం ఉదయం ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ రమేష్ చెప్పారు. కృష్ణా నదిలో యువకుడి మృతదేహం ఉండటంతో వంశీ తల్లిదండ్రులను పిలిపించి చూపించగా తమ కుమారుడిగా నిర్ధారించారని చెప్పారు.

ఇంటర్‌లో ఇక ఆన్‌లైన్ మూల్యాంకనం

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నుంచి అమలు

- ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించిన ఇంటర్మీడియట్ బోర్డు
- స్కాన్ చేసిన జవాబు పత్రాలు ఆన్‌లైన్‌లో అధ్యాపకులకు పంపిణీ
- ఒక్కో అధ్యాపకుడికి రోజుకు 60 పేపర్లు మూల్యాంకనం చేసే అవకాశం
- పొరపాట్లకు ఆస్కారం లేకుండా పక్కాగా మార్కుల నమోదు
- ప్రతి జవాబుకు మార్కులు తప్పనిసరి
- నిర్దేశించిన ప్రశ్నలకంటే ఎక్కువ జవాబులు రాస్తే ఎక్కువ మార్కులే నమోదు
- అన్ని స్థాయిల్లో గట్టి నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసిన ఇంటర్ బోర్డు



ఆన్‌లైన్ మూల్యాంకనం ప్రాక్టీస్ చేస్తున్న అధ్యాపకురాలు



కంప్యూటర్ స్క్రీన్‌పై స్కానింగ్ చేసిన జవాబు పత్రం (మాదిరి)

సాక్షి, అమరావతి/నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియట్ పరీక్షల జవాబు పత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనం ప్రక్రియకు ఇంటర్మీడియట్ విద్యా మండలి శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు అధ్యాపకులు సెంటర్లలో మాన్యువల్‌గా చేస్తున్న ప్రక్రియను ఇకపై ఇంటి నుంచి లేదా కళాశాల నుంచి ఆన్‌లైన్‌లో చేయవచ్చు. ఇందుకోసం ఇంటర్ బోర్డు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. ప్రస్తుతం జరుగుతున్న సప్లిమెంటరీ పరీక్షల్లో ఈ విధానాన్ని అమలు చేయాలని బోర్డు నిర్ణయించింది. ఈ విధానం వల్ల మూల్యాంకనంలో పొరపాట్లు జరగవని, తద్వారా రీ వెరిఫికేషన్ లేదా రీ కౌంటింగ్‌కు ఆస్కారం ఉండదని అధికారులు చెబుతున్నారు. ఖర్చు, సమయం ఆదా అవడంతో పాటు విద్యార్థికి నూరు శాతం న్యాయం జరుగుతుంది. తక్కువ సమయంలోనే ఫలితాలు ఇవ్వవచ్చని చెబుతున్నారు.

డీఆర్‌డీసీల స్థానంలో స్కానింగ్ సెంటర్లు

జవాబు పత్రాల మూల్యాంకనం కోసం ఇప్పటి వరకు ప్రతి జిల్లా కేంద్రంలో జిల్లా రీ కలెక్షన్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ (డీఆర్‌డీసీ) లు ఉన్నాయి. ఆన్‌లైన్ మూల్యాంకనంలో డీఆర్‌డీసీ స్థానంలో రీజినల్ రిసెప్షన్ స్కానింగ్ సెంటర్లు (ఆర్ఆర్ఎస్‌సీ) ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ప్రతి జిల్లాలో సేకరించిన జవాబు పత్రాలను జంబ్లింగ్ విధానంలో ఇతర జిల్లాలకు పంపేవారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా గుంటూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, తిరుపతి, కర్నూలు, విశాఖపట్నంలలో స్కానింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆ రోజు జవాబు పత్రాలను ఈ కేంద్రాల్లో స్కాన్ చేస్తారు.

ప్రతి ప్రశ్నను పరిశీలించాల్సిందే



ఆన్‌లైన్ మూల్యాంకనంలో పొరపాట్లకు తావుండదు. ఆఫ్‌లైన్ విధానంలో జరిగే అనేక పొరపాట్లకు ఆన్‌లైన్ విధానంతో చెక్ పెట్టవచ్చు. విద్యార్థి రాసినా, రాయకపోయినా ప్రతి ప్రశ్నను అధ్యాపకుడు పరిశీలించాలి. జవాబుకు ఇచ్చిన గరిష్ఠ మార్కులకంటే ఎక్కువ వేసినా సిస్టం తీసుకోదు. **– ఎం.నీలావతిదేవి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారి, పల్నాడు జిల్లా**

తప్పులకు ఆస్కారం లేదు

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ, పలు విద్యా సంస్థలు ఆన్‌లైన్ మూల్యాంకనం అమలు చేస్తున్నాయి. ఈ విధానంలో తప్పులకు ఆస్కారం ఉండదు. ముందుగానే కొన్ని జవాబు పత్రాలను సబ్జెక్టు నిపుణులతో మూల్యాంకనం చేయిస్తాం. వాటిని అధ్యాపకులకూ పంపిస్తాం. నిపుణులు మూల్యాంకనం చేసిన విషయం అధ్యాపకుడికి తెలియదు. దీనివల్ల వారు పేపర్లు ఎలా మూల్యాంకనం చేస్తున్నారో తెలుస్తుంది. మాన్యువల్ విధానంలో పలు పొరపాట్లు జరిగేవి. ఆన్‌లైన్ విధానంలో ఒక్క తప్పు కూడా జరగదు. **– సౌరభ్ గౌర్, ఇంటర్ విద్యా మండలి కమిషనర్**

ఆన్‌లైన్ మూల్యాంకనం ఇలా..

స్కాన్ చేసిన జవాబు పత్రాలను మూల్యాంకనం చేసేందుకు అర్హతలుండి జ్ఞానభూమి పోర్టల్‌లో నమోదైన అధ్యాపకులకు పంపిస్తారు. వారు httpr://apbieeva.order.in/ వెబ్‌సైట్‌లో తమ టీచర్ యుఐడీ ద్వారా ఓటీపీ నమోదు చేసి లాగిన్ అవ్వాలి. సైట్‌లో ప్రతి రోజూ ఒక్కో అధ్యాపకునికి 60 జవాబు పత్రాలు ఉంటాయి.

- ఉదయం 7 నుంచి సాయంత్రం 8 గంటల్లోపు ఇల్లు లేదా కళాశాలలో సొంత ల్యాప్‌టాప్/ కంప్యూటర్ లేదా కాలేజీ సిస్టంలో మాత్రమే మూల్యాంకనం చేయాలి. ఇంటర్నెట్ కేంద్రాలు, బహిరంగ ప్రదేశాల్లోని కంప్యూటర్లను వినియోగించకూడదు.
- మొత్తం 25 పేజీల బుక్‌లెట్‌లో విద్యార్థి వివరాలు ఉన్న మొదటి పేజీ తప్ప, మిగిలిన 24 పేజీలు అధ్యాపకులకు ఇస్తారు. తద్వారా ఏ పేపర్ ఎవరిదో అధ్యాపకులకు తెలియదు. మొదటి పేజీలోని విద్యార్థి బార్‌కోడ్ నంబర్ డీ-కోడ్ అవడంతో కంప్యూటర్ తప్ప మరొకరు గుర్తించడం సాధ్యం కాదు.
- కంప్యూటర్‌కు ఉన్న కెమెరా ద్వారా ప్రతి 15 నిమిషాలకు అధ్యాపకుడి లైవ్ ఫొటో బోర్డుకు చేరుతుంది. తద్వారా మూల్యాంకనం ఎవరు చేస్తున్నారో ఉన్నతాధికారులకు తెలుస్తుంది.
- ఆన్‌లైన్‌లో కనిపించే జవాబు పత్రాలను ఫొటోలు తీసినా, ఇతరులకు పంపినా ఆ వివరాలు కూడా బోర్డుకు తెలిసేలా 'ఏఐ' టెక్నాలజీని వినియోగించారు.
- ఆన్‌లైన్ మూల్యాంకనంలో డాష్‌బోర్డుపై ఎడమ చేతి వైపు జవాబు పత్రం, కుడివైపు గ్రిడ్‌లో ప్రశ్నల నంబర్లు, వాటికి కేటాయించిన మార్కులు ఉంటాయి. పక్కనే ఎగ్జామినర్ ఇచ్చే మార్కుల నమోదుకు బాక్స్ ఉంటుంది. అధ్యాపకుడు అందులో మార్కులు వేయాలి.
- విద్యార్థి ఏదైనా ప్రశ్నకు జవాబు రాయకపోతే ఆ ప్రశ్న సంఖ్య ఆన్‌లైన్‌లో కనిపిస్తుంది.
- ఒక గ్రూప్‌లో 4 ప్రశ్నలకు జవాబులు రాయాల్సి ఉంటే కొందరు విద్యార్థులు 6 ప్రశ్నలకు జవాబులు రాస్తారు. ఇలాంటప్పుడు రాసిన అన్ని జవాబులకు మార్కులు వేయాలి. ఎక్కువ మార్కులు వచ్చిన 4 జవాబులనే సిస్టం తీసుకుంటుంది. దీనిద్వారా విద్యార్థికి న్యాయం జరుగుతుంది.
- మాన్యువల్ మూల్యాంకనంలో ఎగ్జామినర్లు కొన్ని ప్రశ్నలకు మార్కులు వేయడం, మరికొన్నింటిని మర్చిపోవడం, టోటల్ మార్కుల నమోదులో పొరపాట్లు జరుగుతుంటాయి. విద్యార్థులు రీ వెరిఫికేషన్, రీవాల్యుయేషన్ కోరినప్పుడు ఇవి బయటపడుతున్నాయి. ఆన్‌లైన్ విధానంలో ఏ జవాబుకైనా మార్కులు ఇవ్వకపోతే వెంటనే 'ఎర్రర్' చూపి ఎక్కడ మార్కులు వేయలేదో చూపుతుంది. దీంతో మార్కుల నమోదు మర్చిపోయేందుకు ఆస్కారం లేదు. ప్రతి జవాబుకు తప్పనిసరిగా మార్కులు ఇవ్వాల్సి ఉంటుంది.
- మూల్యాంకనం పూర్తయిన తర్వాత అధ్యాపకుడు ఇచ్చిన మార్కులను చీఫ్ ఎగ్జామినర్ మరోసారి పరిశీలిస్తారు. జవాబు పత్రాల్లో 10 శాతం పత్రాలను మరోసారి మూల్యాంకనం చేసి ఫైనల్ మార్కులను నమోదు చేస్తారు.

పవిత్ర హజ్‌యాత్ర ప్రారంభం

విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి 322 మందితో బయలుదేరిన తొలి విమానం

సాక్షి, అమరావతి/గన్నవరం: రాష్ట్రం నుంచి పవిత్ర హజ్ యాత్ర-2024 సోమవారం ప్రారంభమైంది. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం) నుంచి ఉదయం 9.51గంటలకు స్పైస్‌జెట్‌కు చెందిన ఎయిర్‌బస్ ఎ340 ప్రత్యేక విమానంలో 322మంది యాత్రికులు జెద్దాకు బయలుదేరి వెళ్లారు. తొలుత హజ్ క్యాంపుగా వినియోగించిన గన్నవరం ఈద్గా జామా మసీదు వద్ద తెల్లవారుజామున 3గంటలకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం)కు యాత్రికులను తీసుకువెళుతున్న బస్సులను జెండా ఊపి రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి, హజ్ ఆపరేషన్స్ చైర్మన్ కె.హర్షవర్ధన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజ్ యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం) నుంచి మొత్తం 692 మంది హజ్‌యాత్రకు వెళ్లనున్నట్లు తెలిపారు. తొలి విమానంలో 322మంది వెళుతున్నారని, మిగిలిన యాత్రికులు ఈ నెల 28, 29 తేదీల్లో రెండు ప్రత్యేక విమానాల్లో వెళతారని చెప్పారు. హజ్ యాత్రికులకు ప్రయాణ రాయితీ, సదుపాయాల కల్పన నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.15 కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో హజ్ యాత్రికులకు అన్ని సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ కార్యనిర్వహణ అధికారి ఎల్.అబ్దుల్ ఖాదర్, హజ్ కమిటీ సభ్యుడు, సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ అలీం బాషా, దూదేకుల కార్పొరేషన్ ఎండీ గౌస్ పీర్, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మస్తాన్ వలి, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత్‌రెడ్డి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తదితరులు పాల్గొని హజ్‌యాత్ర విజయవంతం కావాలని హాజీలకు అభినందనలు తెలిపారు.



జెద్దా వెళ్తున్న విమానానికి జెండా ఊపుతున్న హజ్ ఆపరేషన్స్ చైర్మన్ హర్షవర్ధన్, ఎస్పీ నయీం అస్మి

విజయవాడ ఎయిర్‌పోర్టుకు 'లెజెండ్'

- ఎయిర్‌పోర్టు చరిత్రలోనే అతిపెద్ద విమానంగా గుర్తింపు
- 324 మంది ప్రయాణికుల సామర్థ్యం
- ఏకధాటిగా 14,400 కిలో మీటర్ల ప్రయాణం
- 322 మంది హజ్ యాత్రికులతో సౌదీ అరేబియాకు పయనం

విమానాశ్రయం(గన్నవరం): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం) చరిత్రలోనే అతిపెద్ద విమానం సోమవారం రన్‌వేపై ల్యాండ్ అయ్యింది. హజ్ యాత్రికుల కోసం స్పైస్ జెట్ సంస్థ ప్రత్యేకంగా నడుపుతున్న లెజెండ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఎయిర్‌బస్ ఎ340-300 విమానం ఇక్కడ దిగింది. తొలిసారి విమానాశ్రయానికి వచ్చిన ఈ భారీ విమానానికి ఎయిర్‌పోర్ట్ అధికారులు వాటర్ కానన్ స్వాగతం పలికారు. సుమారు 324 మంది ప్రయాణికుల సామర్థ్యం కలిగిన ఈ విమానం ఏకధాటిగా 14,400 కిలో మీటర్లు ప్రయాణం చేయగలదు. అతి పొడవైన ఈ విమానాన్ని చూసేందుకు ఎయిర్ పోర్ట్ సిబ్బందితో పాటు పరిసర ప్రాంత ప్రజలు ఆసక్తి కనబరిచారు. గతంలో 7,500 అడుగుల ఉన్న రన్‌వేను నాలుగేళ్ల కిందట 11 వేల అడుగులు (3,360 మీటర్లు) పెంచడంతో పాటు బలోపేతం చేశారు. ప్రస్తుతం ఈ రన్‌వేపై బోయింగ్ 747, 777, 787, ఎయిర్‌బస్ ఎ330, ఎ340, ఎ350 వంటి వైడ్‌బాడీ ఎయిర్‌క్రాఫ్ట్ దిగేందుకు అనువుగా ఉంది. విస్తరించిన రన్‌వేపై తొలిసారిగా అతిపెద్ద ఎయిర్‌బస్ ఎ340 విమానం దిగడం సంతోషంగా ఉందని ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ ఎల్.లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. విజయవాడ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి చెందుతుందనడానికి ఇది నిదర్శనమన్నారు. అనంతరం ఈ విమానం 322 మంది హజ్ యాత్రికులతో సౌదీ అరేబియా దేశంలోని జెద్దాకు బయలుదేరి వెళ్లింది.

ఏటీఎంలో రూ.2.45 లక్షల చోరీ

నెల్లూరు(క్రైమ్): ఏటీఎంలోని సీసీ కెమెరాలను ధ్వంసం చేసిన దుండగులు గ్యాస్ కట్టర్‌తో లాకర్‌ను కట్ చేసి అందులోని రూ.2.45 లక్షలను దోచుకెళ్లిన ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులిచ్చిన సమాచారం మేరకు.. అర్ధరాత్రి 12.50 గంటల ప్రాంతంలో నలుగురు యువకులు తెలుపు రంగు స్కూటీపై పడారుపల్లి ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రం వద్దకు వచ్చారు. తొలుత కేంద్రంలోని సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అనంతరం గ్యాస్ కట్టర్‌తో లాకర్‌ను కట్ చేశారు. దీంతో ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలోని అలారం మోగడంతో బ్యాంక్ సిబ్బంది, స్థానికులు వేదాయపాళెం పోలీసులకు సమాచారం అందించారు. అయితే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే లోపే దుండగులు లాకర్‌ను పూర్తిస్థాయిలో కట్ చేసి అందులో ఉన్న రూ.2,45,500ను దోచుకుని పరారయ్యారు. నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి చోరీ జరిగిన తీరును పరిశీలించారు.

రెండు ప్రమాదాల్లో 8 మంది దుర్మరణం

- తిరుపతి జిల్లా చంద్రగిరి సమీపంలో డివైడర్‌ను ఢీకొన్న కారు.. నలుగురు మృతి
- కృష్ణా జిల్లాలో డివైడర్ మీదుగా దూసుకువెళ్లి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్న కారు..
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత



ఎం.కొంగరవారిపల్లి వద్ద డివైడర్‌ను ఢీకొన్న కారు



పద్మావతమ్మ, శేషయ్య, జయంతి మృతదేహాలు



సమీర్



రాధాప్రియ, రాకేష్ మృతదేహాలు



కోడూరుపాడు వద్ద లారీని ఢీకొన్న కారు

చంద్రగిరి/హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్రంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది దుర్మరణం చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం నరసాపురం గ్రామానికి చెందిన ఆడిగోపుల శ్రీనివాసులు తన భార్య నీరజకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో చికిత్స కోసం తమిళనాడులోని వేలూరు క్రిస్టియన్ మెడికల్ కళాశాల(సీఎంసీ)కు తీసుకువెళ్లేందుకు తమ గ్రామానికే చెందిన డ్రైవర్ సమీర్(26)తో కలిసి ఆదివారం రాత్రి కారులో బయలుదేరారు. వారితోపాటు శ్రీనివాసులు అన్న శేషయ్య(49), ఆయన భార్య జయంతి(43) కూడా ఉన్నారు. మార్గమధ్యంలో మనుబోలు వద్ద నీరజ తల్లి పద్మావతమ్మ(56)ను సైతం వీరు కారులో ఎక్కించుకున్నారు. సోమవారం తెల్లవారుజామున 5.40గంటల సమయంలో తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం, ఎం.కొంగరవారిపల్లి సమీపంలో పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై కారు డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవరు సమీర్, పద్మావతమ్మ, జయంతి, శేషయ్య అక్కడికక్కడే మృతిచెందారు. శ్రీనివాసులు, నీరజలకు తీవ్ర గాయాలపాలయ్యారు. చంద్రగిరి సీఐ రామయ్య తన సిబ్బందితో కలసి హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని వారిద్దరినీ 108 అంబులెన్స్‌లో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను క్రేన్ సాయంతో బయటకు తీశారు. ఘటనాస్థలంలోనే నలుగురి మృతదేహాలకు పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

కృష్ణా జిల్లా కోడూరుపాడు వద్ద...

కృష్ణా జిల్లా బాపులపాడు మండలం కోడూరుపాడు వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. తమిళనాడు రాష్ట్రంలోని దిండిగల్ జిల్లా వేదసంతూర్‌కు చెందిన స్వామినాథన్ తన కుటుంబంతో కలిసి పదేళ్లుగా తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులోని అడ్వొకేట్ కాలనీలో నివాసం ఉంటున్నారు. స్థానికంగా ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్న స్వామినాథన్ తమిళనాడులోని సొంతూరులో ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు కుటుంబంతో కలిసి కారులో బయలుదేరారు. ఆయన కారును మితిమీరిన వేగంతో నడపటంతో కోడూరుపాడు సమీపంలోని పెట్రోలు బంకు వద్ద అదుపు తప్పి రహదారి మధ్యలోని డివైడర్‌ను దాటుకుని అవతల వైపు రోడ్డులో ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కావడంతో డ్రైవింగ్ చేస్తున్న స్వామినాథన్(40), ఆయన కుమార్తె రాధాప్రియ(14), కుమారుడు రాకేష్(12), సోదరుడి కుమారుడు గోపి(23) అక్కడికక్కడే మృతిచెందారు. స్వామినాథన్ భార్య సత్య(38)కు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను స్థానికులు అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హనుమాన్‌జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహామూర్తి, వీరవల్లి ఎస్‌ఐ ఎం.చిరంజీవి ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం కోసం తరలించారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, గన్నవరం డీఎస్పీ ఆర్.జయసూర్య, ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

గుంటూరు జీజీహెచ్‌లో అరుదైన వ్యాధి గుర్తింపు

పల్నాడు వ్యక్తులకు పంజాబ్ హిమోగ్లోబిన్-డి వ్యాధి



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ అపర్ణ

గుంటూరు (మెడికల్): గుంటూరు జీజీహెచ్ పెథాలజీ వైద్య విభాగంలో అరుదైన పంజాబ్ హిమోగ్లోబిన్ డీ వ్యాధి నిర్ధారణ చేశారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చెప్పారు. సోమవారం ఆస్పత్రి సుశ్రుత హాలులో రోగ నిర్ధారణ పరీక్ష గురించి పెథాలజీ వైద్యులతో కలిసి ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం ఉప్పలపాడు గ్రామం శ్రీరాంపురం తండాకు చెందిన ఇద్దరు వ్యక్తులకు ఈ నెల 20న రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేశారు. ఈ పరీక్షల్లో అరుదైన పంజాబ్ హిమోగ్లోబిన్-డి వ్యాధి ఉన్నట్టు గుర్తించారు. సాధారణంగా పంజాబ్, ఇరాన్ పరిసర ప్రాంతాల్లో ఈ వ్యాధి బాధితులు ఉంటారు. తొలిసారిగా ఏపీలో ఇలాంటి రక్తహీనత సమస్య ఉన్నవారిని గుర్తించారు. పంజాబ్ హిమోగ్లోబిన్‌తో బాధపడే వారు రక్తహీనతకు గురవుతుంటారని వెల్లడించారు. ఈ వ్యాధికి బోన్ మ్యారో (ఎముకల్లో ఉండే మూలుగు), స్టెమ్ సెల్ థెరపీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇది చాలా ఖర్చుతో కూడుకున్నదని, రక్తహీనతకు సరైన వైద్యం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పెథాలజీ విభాగాధిపతి డాక్టర్ అపర్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ భరత్, డాక్టర్ మహేష్, డాక్టర్ లక్ష్మి పాల్గొన్నారు.

చిన్నారులపై అత్యాచారం కేసుల్లో జైలు

- విశాఖలో మనవరాలిపై లైంగికదాడి కేసులో వృద్ధుడికి 20 ఏళ్ల జైలు
- విజయవాడలో లైంగికదాడియత్నం కేసులో మేనమామకు అయిదేళ్ల జైలు
- జరిమానాలు విధింపు

విశాఖ లీగల్/విజయవాడ స్పోర్ట్స్: వావి వరసలు మరచి అభంశుభం తెలియని చిన్నారులపై అత్యాచారానికి పాల్పడిన ఇద్దరు నిందితులకు వేర్వేరు కేసుల్లో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ.. ఆయా న్యాయమూర్తులు సోమవారం తీర్పునిచ్చారు. సొంత మనవరాలిపై అత్యాచారానికి పాల్పడిన వృద్ధుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 లక్షల జరిమానా విధిస్తూ విశాఖ నగరంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది తీర్పు చెప్పారు. అలాగే 12 ఏళ్ల బాలికపై లైంగిక దాడి యత్నం చేసిన మేనమామకు ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ విజయవాడ పోక్సో కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి తిరుమల వెంకటేశ్వర్లు తీర్పు వెల్లడించారు. కేసుల పూర్తి వివరాల్లోకి వెళితే.. విశాఖ నగరంలోని మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కాపురం జాలరి వీధిలో ప్రభుత్వ ఉద్యోగిగా పదవీ విరమణ చేసిన వాడమొదుల శ్యాంసుందరరావు (70) నివాసం ఉంటున్నాడు. అతనికి ఇద్దరు కొడుకులు. బాధితురాలు (ప్రస్తుతం 19) పెద్దకొడుకు చంద్రశేఖర్ కూతురు. చంద్రశేఖర్ వృత్తిరీత్యా కారు డ్రైవరు. నిత్యం బయటకు వెళ్లేవాడు. బాధితురాలి తల్లి సత్యవతి, తన ఇద్దరు పిల్లలు, అత్తమామలతో కలిసి ఉంటుంది. ఆ ఇల్లు రెండంతస్తుల భవనం. గ్రౌండ్ ఫ్లోర్‌లో బాధితురాలు, వారి కుటుంబ సభ్యులు ఉంటున్నారు. రెండో అంతస్తులో నిందితుడు శ్యాంసుందరరావు, అతని భార్య ఉంటున్నారు. 2017 అక్టోబర్ ఒకటో తేదీకి ముందు నిందితుడు బాలికను భయపెట్టి లోబర్చుకుని ఆమెపై పలుమార్లు లైంగిక దాడి చేశాడు. ఈ విషయాన్ని ఎవరికైనా చెప్తే కుటుంబం మొత్తాన్ని చంపేస్తానని బెదిరించాడు. అక్టోబర్ ఒకటో తేదీన బాలిక పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన వెంటనే సుమారు మూడున్నర గంటల సమయంలో వృద్ధుడు బాలికపై మళ్లీ లైంగిక దాడికి యత్నిస్తుండగా ఆ బాలిక గట్టిగా అరిచింది. ఆ కేకలు విన్న ఆమె చెల్లెలు కింద ఫ్లోర్‌లో ఉన్న తల్లికి చెప్పింది. అది విన్న తల్లి మేడ మీద మొదటి అంతస్తుపైకి వెళ్లి చూడగా నిందితుడు చేస్తున్న అకృత్యాన్ని కళ్లారా చూసింది. వెంటనే మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. నేరం రుజువు కావడంతో వృద్ధుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఐదు లక్షల రూపాయలను బాధితురాలికి ఇవ్వాలని న్యాయమూర్తి తన తీర్పులో స్పష్టం చేశారు.

కసాయి మేనమామకు ఐదేళ్ల జైలు..

ఖమ్మం జిల్లాకు చెందిన బాలిక (12) తల్లితో కలిసి పండుగలకు విజయవాడ వన్‌టౌన్‌లోని అమ్మమ్మ ఇంటికి వస్తుంటుంది. 2017న దసరా పండుగకు వచ్చిన బాలిక పట్ల ఆమె మేనమామ లైంగికదాడికి యత్నించడమే కాకుండా ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. అప్పటినుంచి మానసికంగా కుంగిపోయిన బాలిక 2018 జనవరిలో మేనమామ తన పట్ల ప్రవర్తించిన తీరును తల్లికి వివరించింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు 2018 జనవరి 9న వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏడుగురు సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.15 వేలు జరిమానా విధిస్తూ విజయవాడ పోక్సో కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి తిరుమల వెంకటేశ్వర్లు తీర్పు చెప్పారు.

• తెలంగాణ

బాలరెడ్డికి 'శంకర రత్న' పురస్కారం ప్రదానం

సాక్షి, హైదరాబాద్: అమెరికాలో స్థిరపడిన తెలంగాణ ఇంజనీర్, సమాజ సేవకుడు ఇందుర్తి బాలరెడ్డిని 2003 సంవత్సరానికి ప్రతిష్టాత్మక శంకర రత్న అవార్డు వరించింది. సమాజానికి ఆయన సేవను గుర్తిస్తూ చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో.. తమిళనాడు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి గగన్‌దీప్ సింగ్ బేడీ శంకరరత్న అవార్డుతో బాలరెడ్డిని సత్కరించారు. మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, శంకర నేత్రాలయ చైర్మన్ టీఎస్ సురేంద్రన్, ఎంఆర్ఎఫ్ ప్రెసిడెంట్ గిరీశ్‌రావు, కార్యదర్శి జి.రామచంద్రన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. శంకర నేత్రాలయ యూఎస్ఏ అధ్యక్షునిగా బాలరెడ్డి.. ట్రస్టు సేవలను అమెరికా అంతటా విస్తరించారు. 'అడాప్ట్ ఏ విలేజ్' పేరుతో మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ శిబిరాలు నిర్వహించి ప్రజాదరణ పొందారు. నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలం డిండి చింతపల్లి గ్రామానికి చెందిన బాలరెడ్డి.. సొంత గ్రామంలో మే 20 నుంచి 29 వరకు ఉండి మొబైల్ ఐ సర్జికల్ శిబిరాలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ గణపతి రెడ్డికి బాలరెడ్డి తమ్ముడు కావడం విశేషం.

ఫైనల్ పంచ్ ఎవరిదో!

బిహార్లో 8 స్థానాలకు జూన్ 1న పోలింగ్

బిహార్‌లో లోక్‌సభ ఎన్నికలు తుది అంకానికి చేరుకున్నాయి. 40 సీట్లకు గాను ఆరు విడతల్లో 32 చోట్ల ఎన్నికలు ముగిశాయి. చివరిదైన ఏడో దశలో 8 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్‌కు రంగం సిద్ధమైంది. వీటిలో బీజేపీ 5 సిట్టింగ్ స్థానాలు. 2 జేడీ(యూ), 1 రాష్ట్రీయ లోక్ మోర్చా చేతిలో ఉన్నాయి. ఎన్డీఏకు ఈసారి రెబల్స్‌తో పాటు ఇండియా కూటమి నుంచి గట్టి సవాల్ ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో కీలక స్థానాలపై ఫోకస్...

- సాక్షి, నేషనల్ డెస్క్



నలంద... జేడీయూ కంచుకోట

అలనాటి విఖ్యాత నలంద విశ్వవిద్యాలయ చరిత్రకు సాక్ష్యంగా నిలిచే నియోజకవర్గం. సారవంతమైన గంగా పరీవాహక ప్రాంతంలో ఉంటుంది. ఇది జేడీయూ కంచుకోట. బీజేపీ ఇక్కడ ఖాతాయే తెరవలేదు. గత ఎన్నికల్లో కౌసలేంద్ర కుమార్ జేడీ(యూ) నుంచి హ్యాట్రిక్ విజయం నమోదు చేశారు. ఈసారీ ఆయనే బరిలో ఉన్నారు. ఇండియా కూటమి తరఫున సీపీఐ (ఎంఎల్) నుంచి సందీప్ సౌరవ్ పోటీ చేస్తున్నారు. కమ్యూనిస్టులు గతంలో ఇక్కడ మూడుసార్లు గెలిచారు.

ఆరా... రైట్ వర్సెస్ లెఫ్ట్

మొదట్లో దీని పేరు షాబాద్. 1977లో ఆరాగా మారింది. ఆర్కే సింగ్ 2014లో తొలిసారి ఇక్కడ కాషాయ జెండా ఎగరేశారు. 2019లోనూ నెగ్గిన ఆయన ఈసారి హ్యాట్రిక్ కోసం ఉవ్విళ్లూరుతున్నారు. ఇండియా కూటమి తరఫున సీపీఎం (ఎంఎల్) అభ్యర్థి సుధామా ప్రసాద్ బరిలో ఉన్నారు. గత ఎన్నికల్లో సీపీఐ (ఎంఎల్)కు ఇక్కడ 4 లక్షల పైగా ఓట్లొచ్చాయి! రైట్, లెఫ్ట్ పార్టీల వార్ ఇక్కడ ఉత్కంఠ రేపుతోంది.

పట్నా సాహిబ్... రవిశంకర్‌కు సవాల్

సిక్కుల మత గురువు గురు గోవింద్‌సింగ్ జన్మస్థలం. 2008లో ఏర్పాటైంది. 2009, 2014ల్లో బాలీవుడ్ షాట్‌గన్ శత్రుఘ్న సిన్హా బీజేపీ తరఫున గెలిచారు. 2019లో ఎన్నికల ముందు శత్రుఘ్న బీజేపీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగారు. దాంతో 20 ఏళ్లుగా రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్‌ను బీజేపీ బరిలో దించింది. శత్రుఘ్నను ఆయన 2.8 లక్షల పైగా ఓట్ల మెజారిటీతో ఓడించారు. ఈసారి కూడా బీజేపీ నుంచి ఆయనే బరిలో ఉన్నారు. ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్ తరఫున లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ తనయుడు అన్షుల్ అవిజిత్ పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్, ఆర్జేడీలకు మంచి ఓటు బ్యాంకు ఉండటంతో బీజేపీ గట్టి పోటీ ఎదుర్కొంటోంది.

కరాకట్.. బీజేపీకి పవన్ గండం

ఇక్కడ కుష్వాహా (కోయెరి) సామాజికవర్గానిదే ఆధిపత్యం. గత మూడు ఎన్నికల్లోనూ ఆ వర్గం నేతలే గెలుస్తున్నారు. కుష్వాహాలు, రాజ్‌పుత్‌లు, యాదవులు ఇక్కడ రెండేసి లక్షల చొప్పున ఉంటారు. గతేడాది బీజేపీలో చేరిన భోజ్‌పురి స్టార్ పవన్ సింగ్ ఇప్పుడు పార్టీకి కొరకరాని కొయ్యగా మారారు. ఇక్కడ టికెట్ ఆశించి భంగపడి ఇండిపెండెంట్‌గా బరిలో దిగారు. ఇండియా కూటమి తరఫున సీపీఐ (ఎంఎల్) నుంచి రాజారాం సింగ్ కుష్వాహా బరిలో ఉన్నారు. ఎన్డీయే నుంచి రాష్ట్రీయ లోక్ మోర్చా వ్యవస్థాపకుడు ఉపేంద్ర కుష్వాహా పోటీ చేస్తున్నారు. పవన్ సింగ్ నామినేషన్‌కు జనం భారీగా వచ్చారు. త్రిముఖ పోటీలో ఎన్డీఏ ఎదురీదుతోంది.

పాటలీపుత్ర... లాలుకు ప్రతిష్టాత్మకం

గత రెండు ఎన్నికల్లోనూ ఆర్జేడీ వ్యవస్థాపకుడు లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె మీసా భారతిని బీజేపీ నేత రామ్ కృపాల్ యాదవ్ ఓడించారు. 2009లో లాలు కూడా ఇక్కడ ఓటమి చవిచూశారు. లాలుకు ఒకప్పటి నమ్మినబంటు రాం కృపాల్ బీజేపీ అభ్యర్థిగా ఉన్నారు. బీజేపీ తరఫున రెండుసార్లు వరుసగా గెలిచిన ఆయన 2004లో ఇక్కడ ఆర్జేడీ అభ్యర్థిగా బీజేపీని ఓడించడం విశేషం. ఆర్జేడీ నుంచి మీసా భారతి మళ్లీ పోటీ చేస్తున్నారు. కుమార్తెను ఎలాగైనా లోక్‌సభకు పంపాలని కలలుగంటున్న లాలుకు ఈ ఎన్నిక ప్రతిష్టాత్మకంగా మారింది. కాంగ్రెస్ దన్ను ఆర్జేడీకి కలిసొచ్చే అంశం.

జహానాబాద్... జేడీయూ వర్సెస్ ఆర్జేడీ

'రెడ్ కారిడార్'లో అత్యంత సున్నితమైన నక్సల్స్ ప్రభావిత నియోజకవర్గం. కమ్యూనిస్టులకు కంచుకోట. 1998 నుంచీ ఆర్జేడీ, జేడీయూ మధ్య చేతులు మారుతోంది. 2014లో రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ నెగ్గింది. 2019లో జేడీ(యూ) నేత చందేశ్వర్ ప్రసాద్ కేవలం 1,751 ఓట్ల తేడాతో ఆర్జేడీ అభ్యర్థి సురేంద్ర ప్రసాద్ యాదవ్‌ను ఓడించారు. ఈసారి కూడా వారిద్దరే బరిలో ఉన్నారు.

మోదీని ఈడీ అడిగినా దేవుడు పంపాడని చెప్తారేమో



ర్యాలీ వేదిక కుంగడంతో కింద పడబోయి బ్యాలెన్స్ చేసుకుంటున్న రాహుల్

బఖ్తియార్‌పూర్/పాలీగంజ్/జగదీశ్‌పూర్(బిహార్): తాను సామాన్య వ్యక్తినికాదని, దేవుడు పంపించాడని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. సోమవారం బిహార్‌లో బఖ్తియార్‌పూర్, పాలీగంజ్, జగదీశ్‌పూర్‌ల్లో ఆయన ప్రచార ర్యాలీల్లో మాట్లాడారు. ''ఎన్నికల ఫలితాలొచ్చాక

రాహుల్ గాంధీ ఎద్దేవా

బీజేపీ హయాంలో జరిగిన అవినీతిపై మోదీని ఈడీ ప్రశ్నించొచ్చు. అప్పుడాయన 'నాకేమీ తెలీదు. దేవుడు పంపిస్తే వచ్చా. ఆయన చెప్పినట్లే చేశా'' అని చెబుతారేమో'' అంటూ ఎద్దేవా చేశారు. బిలియనీర్లకు సేవ చేయడానికే దేవుడు ఆయన్ను పంపాడా అంటూ మండిపడ్డారు. పాలీగంజ్‌లో రాహుల్, ఆర్జేడీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్ కుమార్తె, పాటలీపుత్ర అభ్యర్థి మీసా భారతి సహా డజనుకు పైగా నేతలు కార్యకర్తలకు అభివాదం చేస్తుండగా వేదిక ఒక్కసారిగా కుంగింది. దాంతో రాహుల్ కాస్త పక్కకు నడవగా అక్కడా కుంగింది. వారంతా కింద పడబోయి తమాయించుకున్నారు.

మోదీవి కూలదోసే కుట్రలు: ప్రియాంక

సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని ప్రియాంకా గాంధీ వద్రా ఆరోపించారు. కాంగ్రా సమీపంలోని చంబాలో ఆమె కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించారు.

'ఉగ్ర' సంబంధీకులకు ఉద్యోగాలు రావు

రాళ్లు రువ్వినా అంతే: అమిత్ షా

న్యూఢిల్లీ: కశ్మీర్‌పై కమ్ముకున్న 'ఉగ్ర' మబ్బులను చెల్లాచెదురు చేస్తున్నామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ''కశ్మీర్‌లో ఎవరైనా ఉగ్రవాద సంస్థల్లో చేరితే వారి కుటుంబసభ్యులు ఎన్నటికీ ప్రభుత్వోద్యోగాన్ని పొందలేరు. రాళ్లు రువ్వే ఘటనల్లో పాల్గొనే వ్యక్తుల కుటుంబాలకూ ఇదే వర్తిస్తుంది. అయితే అలాంటి వారి గురించి స్వచ్ఛందంగా ప్రభుత్వానికి వెల్లడించే కుటుంబానికి మినహాయింపు దక్కుతుంది. ఉగ్రవాదుల మృతదేహాన్ని వారి కుటుంబానికి అప్పగిస్తే అంతిమయాత్రకు అనవసర ప్రాధాన్యం లభిస్తోంది. అందుకే ఆ ట్రెండ్‌కు ఫుల్‌స్టాప్ పెట్టాం. కేవలం కుటుంబసభ్యులు, ఆప్తుల సమక్షంలో అంత్యక్రియలు జరుగుతాయి. ఉగ్రవాదులను భద్రతా బలగాలు చుట్టుముట్టినప్పుడు లొంగిపోవడానికి చాన్సిస్తాం. తల్లిదండ్రులు, భార్య, పిల్లలతో చెప్పిస్తాం. వింటే సరేసరి. లేదంటే ప్రాణాలు పోవడం ఖాయం. కేరళలో పురుడుపోసుకున్న పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియావంటి ముస్లిం అతివాద సంస్థలను నిషేధించి వేర్పాటువాద సిద్ధాంతాల వ్యాప్తిని అడ్డుకుంటున్నాం'' అని చెప్పారు.

కోర్టులో ఎంపీ కన్నీరు

విచారణ సందర్భంగా స్వాతి కంటతడి ● బిభవ్‌కు దక్కని బెయిల్

న్యూఢిల్లీ: కొద్ది రోజులుగా తనకు విపరీతంగా బెదిరింపులు వస్తున్నాయని ఆప్ రాజ్యసభ సభ్యురాలు స్వాతీ మలివాల్ వాపోయారు. ఆమెపై దాడి కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పీఏ బిభవ్ కుమార్ బెయిల్ పిటిషన్‌పై సోమవారం తీస్ హజారీ కోర్టులో విచారణ జరిగింది. ఈ ఉదంతంలో ఎంపీ కావాలనే సమస్యలు సృష్టించారని బిభవ్ న్యాయవాది వాదించారు. సీఎం నివాసంలో సీసీ కెమెరాలు లేనిచోట తనపై దాడి జరిగిందని ఆమె చెప్పడంలో దురుద్దేశం దాగుందన్నారు. దాంతో ఎంపీ కన్నీటి పర్యంతమయ్యారు. ఆప్ ట్రోల్ ఆర్మీ తనను తీవ్రంగా వేధిస్తోందని కోర్టుకు తెలిపారు. బిభవ్‌కు బెయిలిస్తే తనకు, తన కుటుంబానికి ప్రమాదమని వాదించారు. ఈ ఉదంతంలో నిబంధనలను ఉల్లంఘించింది బిభవ్ కుమారేనని ఢిల్లీ పోలీసుల తరఫు న్యాయవాది కూడా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కేజ్రీవాల్ నివాసంలో బిభవ్ ఈనెల 13న తనపై దాడి చేసి విచక్షణారహితంగా కొట్టాడని స్వాతి పోలీసులకు ఫిర్యాదు చేయడం తెలిసిందే. ఈ కేసులో బిభవ్ అరెస్టయ్యారు. ఫోన్‌ను ఫార్మాట్ చేసి, సీసీటీవీ ఫుటేజిని తొలగించిన బిభవ్ అమాయకుడు కాదని స్వాతి తరఫు లాయర్ వాదించారు. అనంతరం బిభవ్‌కు బెయిల్‌ను నిరాకరిస్తున్నట్టు అడిషనల్ సెషన్స్ జడ్జి సుశీల్ అనూజ్ త్యాగి పేర్కొన్నారు.



కోర్టు నుంచి బయటికొస్తున్న స్వాతి

ఎలక్షన్ బీట్

మేకిన్ ఇండియా ఏమైంది: ఖర్గే

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళసూత్రం, మటన్, చేపలు, మొఘల్, ముజ్రా వంటి అంశాలపై మాట్లాడే ప్రధాని మోదీ.. ఫెయిలైన మేక్ ఇన్ ఇండియా గురించి, దేశ ఆర్థిక వ్యవస్థ గురించి ఎందుకు మాట్లాడట్లేదని ఖర్గే ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యంలోనే మోదీ సమాధానం ఉందని సోమవారం 'ఎక్స్'వేదికగా విమర్శనాస్త్రాలు సంధించారు. ''మోదీ హయాంలో మేకిన్ ఇండియా విఫలమైంది. ఎగుమతులు పతనావస్థకు చేరుకున్నాయి. ఉత్పాదకత దారుణంగా పడిపోయింది. వాణిజ్య లోటు రూ.23.83 లక్షల కోట్లకు ఎగబాకింది''అని మండిపడ్డారు.

మేనిఫెస్టోలో ఆర్థికపరమైన హామీలు ఇవ్వడం అవినీతికి పాల్పడ్డట్టు కాదు: సుప్రీం

న్యూఢిల్లీ: ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్థిక లబ్ధి చేకూర్చే హామీలు ఇవ్వడం.. అవినీతి విధానాల కిందకు రాదని సుప్రీంకోర్టు సోమవారం తేల్చిచెప్పింది. కర్నాటకలో కాంగ్రెస్ ప్రకటించిన మేనిఫెస్టోలో ఐదు హామీలు ఇచ్చారని, ఇవి ఓటర్లకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆర్థిక లబ్ధి చేకూర్చేలా ఉన్నాయని, ఇలా చేయడం అవినీతికి పాల్పడటం కిందకు వస్తుందని.. చామరాజపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే బి.జె.జమీర్ అహ్మద్ ఖాన్‌ను అనర్హుడిగా ప్రకటించాలని ఇదే నియోజకవర్గానికి చెందిన శశాంక శ్రీధర సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనికి విచారించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం సోమవారం శశాంక పిటిషన్‌ను తోసిపుచ్చింది. 'రాజకీయ పార్టీ తమ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆర్థిక లబ్ధి చేకూరుస్తున్నాయి కాబట్టి ఎన్నికల నియామళి కింద ఇది ఉల్లంఘనేనని, సదరు రాజకీయ పార్టీ అభ్యర్థి కూడా అవినీతికరమైన మార్గాలను అనుసరించినట్లు పరిగణించాలని పిటిషనర్ కోరారు.. ఆయన వాదన ఒకింత వాస్తవదూరంగా ఉంది కాబట్టి ఆమోదించలేం' అని ధర్మాసనం పేర్కొంది. వాస్తవాలను, పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని చూస్తే పిటిషనర్ లేవనెత్తిన ప్రశ్నల లోతుల్లోకి వెళ్లాల్సిన అవసరం లేదని భావిస్తున్నామని, అందుకే పిటిషన్‌ను కొట్టేస్తున్నామని తెలిపింది. గతంలో శశాంక పిటిషన్‌ను విచారించిన కర్నాటక హైకోర్టు.. అధికారంలోకి వస్తే తాము తేబోయే పథకాలు, అనుసరించే విధానాలను ప్రకటించడం ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 123 ప్రకారం అవినీతి విధానం కాదని తేల్చి చెప్పింది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఐదు గ్యారంటీలను సంక్షేమ పథకాలుగా చూడాలని, వాటి అమలు సాధ్యమా? కాదా? అనేది వేరే విషయమని పేర్కొంది.

పంజాబ్ ఆప్ ప్రభుత్వాన్ని పడగొడతారట

అమిత్ షా బెదిరించారు: అరవింద్ కేజ్రీవాల్

చండీగఢ్: దేశం నియంతృత్వ పాలనలో ఉందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత పంజాబ్‌లోని భగవంత్ మాన్ (ఆప్) ప్రభుత్వాన్ని పడగొడతామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా బెదిరించారని ఆరోపించారు. సోమవారం అమృత్‌సర్‌లో ఆయన వ్యాపారులతో భేటీ అయ్యారు. ''అమిత్ షా తొలుత పంజాబీలను తిట్టారు. జూన్ 4 తర్వాత పంజాబ్ సర్కార్‌ను కూలదోస్తామని బెదిరించారు. మాన్ సీఎంగా ఉండరన్నారు'' అని ఆరోపించారు. పంజాబీలను బెదిరిస్తే రాష్ట్రంలో అడుగుపెట్టలేరని హెచ్చరించారు.

బెయిల్ వారం పొడిగించండి

న్యూఢిల్లీ: అనారోగ్య కారణాలరీత్యా తన బెయిల్‌ను వారం రోజులు పొడిగించాలని కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ''పెట్-సీటీ స్కాన్, వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి ఉంది. కనుక జూన్ 2న కాకుండా జూన్ 9న లొంగిపోతాను'' అని కోరారు.

దక్షిణాఫ్రికా దక్కేదెవరికో?

రేపే పార్లమెంటు ఎన్నికలు

- వరుసగా ఏడో విజయంపై ఏఎన్‌సీ కన్ను
- ఈసారి మెజారిటీ కష్టమంటున్న సర్వేలు
- మాజీ అధ్యక్షుడు జుమా పార్టీ గట్టి పోటీ

సియాంకొబా. దక్షిణాఫ్రికాలో అధికార ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ఊరూవాడా హోరెత్తించిన ఎన్నికల నినాదం. అంటే 'మాదే ఘనవిజయం' అని జులు భాషలో అర్థం. కానీ ఘనవిజయం దేవుడెరుగు, ఏఎన్‌సీ ఈసారి సాధారణ మెజారిటీ సాధించడం కూడా కష్టమేనని ఒపీనియన్ పోల్స్ అంటున్నాయి. వర్ణవివక్ష అంతమై తెల్లవారి పాలన ముగిశాక 1994లో ప్రజాస్వామిక పద్ధతిలో జరిగిన తొలి ఎన్నికల్లో గెలిచింది మొదలు 30 ఏళ్లుగా ఏఎన్‌సీయే అధికారంలో కొనసాగుతోంది. ఈ ఎన్నికల్లో దానికి తొలిసారి గట్టి పోటీ ఎదురవుతోంది...

దక్షిణాఫ్రికాలో ఎన్నికలకు వేళైంది. 400 మందితో కూడిన నేషనల్ అసెంబ్లీతో పాటు 9 ప్రావిన్షియల్ అసెంబ్లీలకు కూడా బుధవారం ఎన్నికలు జరగనున్నాయి. వరుసగా ఏడో విజయం కోసం ఏఎన్‌సీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. కానీ పెచ్చరిల్లుతున్న అవినీతి, నిరుద్యోగం, కరెంటు కోతలు, నీటి కొరత, మౌలిక సదుపాయాల లేమి వంటివి పార్టీకి బాగా ప్రతికూలంగా మారాయి. వీటిపై ప్రజాగ్రహం ప్రచారం పొడవునా స్పష్టంగా కన్పించింది. శనివారం అధ్యక్షుడు సిరిల్ రామఫోసా అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నిర్వహించిన చివరి ప్రచార సభ కూడా అనుకున్నంతగా విజయవంతం కాలేదు. సభకు వేదికైన చారిత్రక సొవెటో టౌన్‌షిప్‌లోని 90వేల మంది సామర్థ్యమున్న ఫుట్‌బాల్ స్టేడియం పూర్తిగా నిండక పోవడం ప్రజల్లో నెలకొన్న తీవ్ర అసంతృప్తికి అద్దం పడుతోందని పరిశీలకులు చెబుతున్నారు. 71 ఏళ్ల రామఫోసాపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలున్నాయి. విచ్చలవిడిగా మనీ లాండరింగ్‌కు పాల్పడినట్లు విపక్షాలు ఆరోపించాయి. ఆయనను అభిశంసించాలని పార్లమెంట్ నియమించిన న్యాయ నిపుణుల కమిటీ కూడా సూచించింది. అయితే పార్లమెంట్‌లో ఉన్న మెజారిటీ సాయంతో ఆ ప్రక్రియను ఏఎన్‌సీ అడ్డుకుంది. రామఫోసాపై జరిగిన పోలీసు దర్యాప్తు వివరాలు బయటకు రాలేదు. వీటన్నింటి నేపథ్యంలో ఈసారి ఏఎన్‌సీ తన చరిత్రలో తొలిసారిగా 50 శాతం కంటే తక్కువ ఓట్లకు పరిమితమయ్యేలా కన్పిస్తోంది. అదే జరిగితే అతి పెద్ద పార్టీగా నిలిచినా ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ దక్కదు. ఏఎన్‌సీ ఈసారి ఇతర పార్టీల మద్దతుపై ఆధారపడి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి వస్తుందని సర్వేలూ పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో అందరి దృష్టీ ఆదివారం వెల్లడయ్యే ఫలితాలపైనే నెలకొంది. - సాక్షి, నేషనల్ డెస్క్



రామఫోసా / జాకబ్ జుమా

జాకబ్ జుమా పంచ్...

మాజీ అధ్యక్షుడు జాకబ్ జుమా గతేడాది రామఫోసాతో విభేదించి సొంత పార్టీ పెట్టుకోవడం ఏఎన్‌సీకి పెద్ద దెబ్బ! 82 ఏళ్ల జుమా ఈ ఎన్నికల్లో హోరాహోరీ పోరాడుతున్నారు. ఆయన పార్టీ ఉంకొంతో వెసీజ్వె (ఎంకే) 13 శాతం దాకా ఓట్లు రాబట్టవచ్చని సర్వేల్లో వెల్లడయ్యింది. అధికారంలోకి రాకపోయినా ఏఎన్‌సీ అవకాశాలను బాగా దెబ్బ తీయడం ఖాయమని పరిశీలకులు కూడా చెబుతున్నారు. ముఖ్యంగా జుమా సొంత ప్రావిన్స్ క్వాజులూ నాటాల్‌లో ఏఎన్‌సీ ఆధిపత్యానికి ఎంకే పూర్తిగా గండికొట్టనుందని అంటున్నారు. క్వాజులూ ప్రావిన్స్‌లోని ఎంకే నేతల్లో తెలుగు మూలాలున్న విశ్విన్ గోపాల్‌రెడ్డి ప్రముఖ స్థానంలో ఉండటం విశేషం.

ఎన్నికల నేపథ్యంలో దక్షిణాఫ్రికావ్యాప్తంగా పెరుగుతున్న రాజకీయ హత్యలు కలకలం సృష్టిస్తున్నాయి. 2023 జనవరి నుంచి 40 మందికి పైగా విపక్ష నేతలు, నిజాయతీపరులైన అధికారులు, హక్కుల కార్యకర్తలు హత్యకు గురయ్యారు. ఇది అధ్యక్షుడు రామఫోసా పనేనంటూ విపక్షాలు మండిపడుతున్నాయి. ప్రచారంలో దీన్ని ప్రధానాంశంగా కూడా మార్చుకున్నాయి. వీటిపై ప్రజల్లో కూడా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి.


ప్రధాన సమస్యలివీ...

- తీవ్ర కరెంటు కోతలు
- పెచ్చరిల్లిన అవినీతి
- పేదరికం (50 శాతం దాటింది)
- 32 శాతం దాటిన నిరుద్యోగం (ప్రపంచంలోనే అత్యధికం)
- తీవ్ర నీటి కొరత
- మౌలిక సదుపాయాల లేమి
- మితిమీరిన నేరాలు, హింసాకాండ
- రాజకీయ హత్యలు

బరిలో 51 విపక్షాలు

దక్షిణాఫ్రికాలో ప్రధాన ప్రతిపక్షం డెమొక్రటిక్ అలయెన్స్ (డీఏ). ఈ కూటమికి 22 నుంచి 27 శాతం ఓట్లు రావచ్చని ఏప్రిల్లో ప్రజాభిప్రాయ సేకరణలో వెల్లడైంది. అయితే పలువురు నేతలు డీఏను వీడి సొంత పార్టీలు పెట్టుకున్నారు. ఇది విపక్ష కూటమికి ప్రతికూలంగా మారింది. ఈసారి 51 ప్రతిపక్షాలు పోటీలో ఉండటంతో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలి ఏఎన్‌సీకి కలిసొచ్చేలా కన్పిస్తోంది.

గత ఆరు ఎన్నికల్లో ఏఎన్‌సీ ఓట్ల శాతం



దక్షిణాఫ్రికా పార్లమెంటులో రెండు సభలుంటాయి. 90 మంది సభ్యులతో కూడిన నేషనల్ కౌన్సిల్, 400 మంది సభ్యులుండే నేషనల్ అసెంబ్లీ. ప్రతి ఐదేళ్లకోసారి జరిగే ఎన్నికల్లో దీని సభ్యులను ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. మెజారిటీ సాధించే పార్టీ సారథి అధ్యక్షుడవుతారు. దేశ జనాభా 6.2 కోట్లు కాగా ఓటర్లు 2.8 కోట్ల మంది. జనాభాలో 80 శాతానికి పైగా నల్లజాతీయులే. ఈ ఎన్నికల్లో తొలిసారిగా స్వతంత్రులకు కూడా పోటీ చేసే అవకాశం కల్పించారు.

నేషనల్ అసెంబ్లీలో బలాబలాలు

(మొత్తం స్థానాలు 400)

ఏఎన్‌సీ	230
డెమొక్రటిక్ అలయన్స్	84
ఎకనమిక్ ఫ్రీడం ఫైటర్స్	44
ఇతరులు	42

ముస్లిం ఓట్లపై వల...

జనాభాలో ముస్లింలు 2 శాతం కంటే తక్కువే ఉంటారు గానీ వారి ప్రతి ఓటూ విలువైనదే. అందుకే ముస్లింల ఓట్లపై పార్టీలు వల విసురుతున్నాయి. పాలస్తీనా ఉద్యమానికి పోటీలు పడి మరీ మద్దతు ప్రకటిస్తున్నాయి. గాజాలో దాడులు ఆపాలంటూ ఇజ్రాయెల్‌ను డిమాండ్ చేస్తున్నాయి.

రఫాపై దాడుల్లో 45 మంది మృతి

టెల్‌అవీవ్: గాజా ప్రాంత నగరం రఫాపై ఆదివారం రాత్రి ఇజ్రాయెల్ బలగాలు జరిపిన దాడుల్లో 45 మంది పాలస్తీనియన్ల ప్రాణాలు కోల్పోయారు. వీరిలో సగం మంది మహిళలు, చిన్నారులు, వృద్ధులేనని గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. తమ దాడుల్లో హమాస్ స్థావరం ధ్వంసం కాగా ఇద్దరు సీనియర్ మిలిటెంట్లు హతమయ్యారని ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. ఈ ఘటనను పొరపాటున జరిగిన విషాదంగా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అభివర్ణించారు. రాత్రి వేళ జరిగిన ఈ ఘటనపై దర్యాప్తు చేయిస్తామని పార్లమెంట్‌లో ప్రకటించారు.

31న సిట్ ముందుకు: ప్రజ్వల్

బనశంకరి: మహిళలపై లైంగిక దాడి, నగ్న వీడియోల లీకేజీ ఆరోపణలు ఎదుర్కొంటున్న హాసన్ జేడీ(ఎస్) ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ ఎట్టకేలకు స్పందించారు. ఈ వ్యవహారం బయటపడగానే ఏప్రిల్ 27వ ఆయన విదేశాలకు వెళ్లడం తెలిసిందే. సోమవారం ఆయన వీడియో విడుదల చేశారు. ''ముందుగా నిర్ణయించుకున్న విధంగానే విదేశాలకు వచ్చా. నాపై ఆరోపణలను కాంగ్రెస్ ప్రచారానికి వాడుకోవడంతో మనస్తాపంతో ఎవరికీ అందుబాటులోకి రాలేదు. ఈ నెల 31వ తేదీన సిట్ ముందు హాజరై పూర్తి సహకారం అందిస్తా'' అని చెప్పుకొచ్చారు. ప్రజ్వల్ ముందు జర్మనీ, తర్వాత ఇంగ్లండ్‌కు వెళ్లినట్లు తెలిసింది.

పపువా న్యూ గినియా విషాదం.. మృతుల సంఖ్య 2 వేలపైనే..

మెల్‌బోర్న్: దక్షిణ పసిఫిక్ ద్వీప దేశం పపువా న్యూ గినియా శుక్రవారం కొండచరియలు విరిగి పడిన ఘటనలో మృతుల సంఖ్య పెరుగుతోంది. ఎంగా ప్రావిన్స్‌లోని యంబాలి గ్రామంలో చోటుచేసుకున్న ఘటనలో 670 మంది వరకు చనిపోయి ఉంటారని మొదట ఐరాస విభాగం అంచనా వేసింది. అయితే, మట్టిదిబ్బల కింద రెండు వేలమందికి పైగానే గ్రామస్తులు సజీవ సమాధి అయి ఉంటారని పపువా న్యూ గినియా ప్రభుత్వం లెక్కగట్టింది. ఈ మేరకు ఐరాసకు సమాచారం పంపింది. ఈ విషాద సమయంలో తమను ఆదుకోవాలంటూ అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేసింది. అయితే, ఐరాస వలసల విభాగం మాత్రం నేలమట్టమైన 150 నివాసాలను పరిగణనలోకి తీసుకునే మృతుల సంఖ్య 670గా నిర్ణయించామని, ప్రభుత్వ గణాంకాలపై మాట్లాడబోమని తెలిపింది. మృతుల సంఖ్యను 2 వేలుగా ఏ ప్రాతిపదికన నిర్ణయించారని ప్రధాని జేమ్స్ మరాపేను మీడియా ప్రశ్నించగా ఆయన బదులివ్వలేదు. కాగా, దేశంలో దశాబ్దాలుగా జనగణన జరగలేదు.



శిథిలాలను తొలగిస్తున్న గ్రామస్తులు

సైన్యం కాపలా మధ్య..

గ్రామంలోని 200 మీటర్ల ప్రాంతంలో ఉన్న నివాసాలను 6 నుంచి 8 మీటర్ల మేర భారీ రాళ్లు, చెట్లు, మట్టి భూస్థాపితం చేశాయి. స్థానికులే తమ వ్యవసాయ పరికరాలైన పార, గొడ్డలి వంటి వాటితో వాటిని తొలగిస్తున్నారు. ఇప్పటి వరకు ఆరు మృతదేహాలను మాత్రమే వెలికి తీయగలిగారు. స్థానిక కాంట్రాక్టర్ పంపించిన బుల్డోజర్‌తో ఆదివారం నుంచి పని చేయిస్తున్నారు.

అమెరికాలో టోర్నడోల బీభత్సం 28 మంది మృతి

హూస్టన్: అమెరికాలో పలు ఓవైపు ఎండలు మండుతుంటే మరోవైపు టోర్నడోలు ప్రతాపం చూపుతున్నాయి. గాలుల తీవ్రతకు ఇళ్లు కూలడం, చెట్లు పడిపోవడం వంటి ఘటనల్లో 28 మందికి పైగా చనిపోయారు. వేలాదిగా ఇళ్లు నేల మట్టమయ్యాయి. టెక్సాస్, ఒక్లహోమా, అర్కన్సాస్ సహా 16 రాష్ట్రాల్లో 6 లక్షలకు పైగా ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మరోవైపు టెక్సాస్, ఆస్టిన్, డాలస్, న్యూ మెక్సికో, ఒక్లహోమా, అరిజోనా, కొలరాడో రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. ఇలినాయీ, మిస్సోరీ, కెంటకీ, టెన్నెస్సీల్లో తీవ్రమైన గాలి తుఫాన్లు వీస్తాయని చెబుతున్నారు.

రక్తం నమూనాలనే మార్చేశారు!

'పుణె ప్రమాదం' ఘటనలో డాక్టర్ల నిర్వాకం

పుణె: పుణెలో ఈ నెల 19న మద్యం మత్తులో కారు నడిపి ఇద్దరు మృతికి కారణమైన టీనేజర్(17) తాలూకు రక్తం శాంపిళ్లను కూడా అతని కుటుంబీకులు మార్చేసినట్టు వెలుగులోకి వచ్చింది. ససూన్ ప్రభుత్వ ఆస్పత్రి అధికారులను, వైద్య సిబ్బంది సాయంతో వాళ్లు ఈ నిర్వాకానికి పాల్పడ్డారు. రక్తం నమూనాను మార్చేసి ఆల్కహాల్ జాడలు లేవంటూ తప్పుడు నివేదిక సంపాదించారు. పోలీసులు నిందితుడి తాలూకు మరో శాంపిల్‌ను వేరే ల్యాబ్‌కు పంపి, రెండింటి డీఎన్‌ఏ ఫలితాలను సరిపోల్చడంతో మరోసారి ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శ్రీహరి హల్నోర్, ఫోరెన్సిక్ విభాగం అధిపతి డాక్టర్ అజయ్ తవాడే, ఉద్యోగి అతుల్ ఘట్‌కాంబ్లేను అదుపులోకి తీసుకున్నారు. వీరికి కోర్టు ఈ నెల 30వ తేదీ వరకు రిమాండ్ విధించింది. తవాడేకు నిందితుడి తండ్రి విశాల్ పలుమార్లు ఫోన్ చేసినట్లు ఆధారాలున్నాయని పోలీస్ కమిషనర్ అమితేశ్ కుమార్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన పోర్షె కారును సాంకేతికంగా పరిశీలించేందుకు సంబంధిత కంపెనీ నిపుణులను కూడా రప్పించామన్నారు. నిందితున్ని తప్పించేందుకు ప్రయత్నించిన అభియోగాల్లో అతని తండ్రి, తాత సురేంద్ర ఇప్పటికే పోలీసుల అదుపులో ఉన్న విషయం తెలిసిందే. నిందితుడు కారు నడుపుతూ ఇంటి నుంచి బయలుదేరింది మొదలు, ఎక్కడెక్కడికి అతడు వెళ్లిందీ తెలిపే సీసీ ఫుటేజీ తదితర ఆధారాలు పక్కాగా ఉన్నాయని సీపీ అన్నారు.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
మంగళవారం : 28 : మే : 2024

ఆంధ్రలో రోడ్డు ప్రమాదం.. దిండుగల్ వాసుల బలి

సాక్షి, చెన్నై : ఆంధ్రప్రదేశ్ కృష్ణా జిల్లా బాపులపాడు మండలం కోడూరుపాడు సమీపంలో సోమవారం ఉదయం జరిగిన ప్రమాదంలో తమిళనాడులోని దిండుగల్ జిల్లాకు చెందిన నలుగురు బలి అయ్యారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. లారీ, కారు ఢీ కొన్న ఈ ప్రమాదంలో దిండుగల్ జిల్లా నల్లమనాయకన్ పట్టి గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. ప్రమాద సమాచారంతో స్వగ్రామంలోని స్వామినాథన్ బంధువులు, ఇతర కుటుంబ సభ్యులు హుటాహుటిన విజయవాడకు బయలు దేరి వెళ్లారు. ఈ ప్రమాదంలో నల్లమనాయకన్ పట్టికి చెందిన స్వామినాథన్(40) రాకేష్(12), రాధాప్రియ(14), గోపి(23) మరణించారు. స్వామినాథన్ భార్యసత్య(28) ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

న్యూస్‌రీల్

అరుణాచలేశ్వరుని సేవలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



మొక్క నాటుతున్న జస్టిస్ ఆర్.మహాదేవన్ సతీమణి

వేలూరు: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరుని చెన్నై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.మహాదేవన్ ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు. చెన్నై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహించిన జస్టిస్ గంగాపుర్వాల ఈనెల 23వ తేదీన పదవీ విరమణ పొందారు. దీంతో ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఆర్.మహాదేవన్ గత రెండు రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆయన కుటుంబ సమేతంగా తిరువణ్ణామలైలోని అన్నామలైయార్ సన్నిధికి చేరుకుని ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. ఆ సమయంలో అన్నామలైయార్ ఆలయ మూడో ప్రకారంలోని సంబంధ వినాయకుడి సన్నిధి, అమ్మన్ సన్నిధి, స్వామి వారి సన్నిధిని సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రదాయం ప్రకారం నిర్వాహకులు ఆయనకు స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జస్టిస్ మహదేవన్ సతీమణి మొక్కను నాటారు. ముందుగా ఆలయానికి వచ్చిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కలెక్టర్ భాస్కర పాండియన్, జిల్లా న్యాయమూర్తి మధుసూదన్, ఆలయ జాయింట్ కమిషనర్ జ్యోతి, ట్రస్ట్ బోర్డు చైర్మన్ జీవానందం ఘన స్వాగతం పలికారు.

అరుణాచలేశ్వరునికి 1008 కలశాభిషేకం



వేలూరు: అగ్ని నక్షత్రాన్ని పురస్కరించుకుని తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో మూడు రోజులుగా 1008 కలశ పూజలు చేశారు. ముందుగా అమ్మన్ సన్నిధి వద్ద ఉన్న మండపంలో 1008 కలశాలను ఉంచి, శివాచార్యుల వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఎండ వేడిమి నుంచి ప్రజలను కాపాడాలని, వర్షాలు కురవాలని, రైతులు పంటలు పండించాలని, దేశం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం సాయంత్రం అగ్ని నక్షత్రం ముగియడంతో శివాచార్యులు అమ్మన్ సన్నిధి వద్ద ఉన్న కలశాలను ఊరేగింపుగా మేళతాళాల నడుమ అరుణాచలేశ్వరుని సన్నిధి వద్దకు తీసుకొచ్చారు. అనంతరం మూడు రోజుల పాటు కలశాలను ఉంచి, పూజలు చేసిన పునీత నీటితో స్వామివారికి అభిషేకం చేసి పుష్పాలంకరణ చేశారు. ఈ సందర్భంగా శివాచార్యులు ప్రత్యేక వేద మంత్రాలు చదివి వర్షాలు కురవాలని ప్రార్థనలు చేశారు. ఈ అగ్ని నక్షత్ర పూజా కార్యక్రమంలో ఆలయ జాయింట్ కమిషనర్ జ్యోతి, శివాచార్యులు, వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీవీ షణ్ముగం విల్లుపురం కోర్టులో హాజరు



తిరువొత్తియూరు: ముఖ్యమంత్రిపై తప్పుడు వ్యాఖ్యలు చేసిన కేసులో అన్నాడీఎంకే మాజీ మంత్రి సీవీ షణ్ముగం సోమవారం విల్లుపురం కోర్టులో హాజరయ్యారు. అన్నాడీఎంకే మాజీ మంత్రి జయకుమార్‌ను అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ 2022వ సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీ, అదే సంవత్సరం జూలై 25వ తేదీ విల్లుపురం పాత బస్టాండ్ వద్ద అన్నాడీఎంకే తరఫున ఆందోళన కార్యక్రమం, బహిరంగ సభ నిర్వహించారు. అందులో పాల్గొన్న అన్నాడీఎంకే మాజీ మంత్రి సీవీ షణ్ముగం తమిళ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి సీఎం స్టాలిన్‌కు కళంకం కలిగించే రీతిలో ప్రసంగించారు. ఈ వ్యవహారానికి సంబంధించి విల్లుపురం కోర్టులో దీనిపై విచారణ జరుగుతోంది. అలాగే 2022 సంవత్సరం సెప్టెంబర్ 18వ తేదీ వానూరు తాలూకా తిరుచ్చి తిరుచిట్రంబలం కూట్ రోడ్డ్‌పై అన్నా జన్మదిన వేడుకలు జరిగాయి. ఆ సమయంలో మంత్రి సీవీ షణ్ముగం వానూరు, అన్నాడీఎంకే ఎమ్మెల్యే చక్రపాణిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు విల్లుపురం కోర్టులో న్యాయమూర్తి రాధిక ఎదుట సోమవారం విచారణకు వచ్చింది. ఆ సమయంలో అన్నాడీఎంకే మాజీమంత్రి సీవీ షణ్ముగం కోర్టుకు హాజరయ్యారు. ఈ క్రమంలో సీవీ షణ్ముగం తరఫు న్యాయవాది ఈ కేసు సంబంధించి చెన్నై హైకోర్టులో స్టే విధించిన నకళ్లను న్యాయమూర్తి రాధికకు అందజేశారు. దీన్ని పరిశీలించిన న్యాయమూర్తి కేసును వచ్చే నెల 24వ తేదీకి వాయిదా వేశారు.

ఉన్నతంగా విద్య

ఉన్నత విద్యా రంగంలో దేశంలోనే తమిళనాడు అగ్రస్థానంలో ఉన్నట్టు సీఎం స్టాలిన్ నేతృత్వంలో ప్రభుత్వం ప్రకటించింది. వినూత్న కార్యక్రమాలతో ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థినుల చేరిక 34 శాతం పెరిగినట్టు వివరించింది. తొలి తరం విద్యార్థుల ట్యూషన్ ఫీజు రాయితీకి రూ. వెయ్యి కోట్లు, మరో రూ.1000 కోట్లతో కామరాజర్ కళాశాల అభివృద్ధి ప్రాజెక్టు, రూ.150 కోట్లతో ఉన్నత విద్యా సంస్థల్లో డిజిటల్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ తదితర కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నట్టు పేర్కొంది. ఉన్నత విద్యా రంగంలో పథకాలు, వివిధ కార్యక్రమాలపై ప్రభుత్వం నివేదికను సోమవారం ప్రకటించింది.

దేశంలో అగ్రస్థానం

- రాష్ట్రంలో 34 శాతంపెరిగిన విద్యార్థినుల సంఖ్య
- తొలి తరం విద్యార్థుల ట్యూషన్ ఫీజుకు రూ.1000 కోట్లు
- రూ.1000 కోట్లతో కామరాజర్ కళాశాల అభివృద్ధి
- రూ.150 కోట్లతో ఉన్నత విద్యా సంస్థలలో డిజిటల్ సిస్టం
- విద్యా రంగం కార్యక్రమాలపై ప్రభుత్వం నివేదిక



విద్యా రుణాలను అందజేస్తున్న సీఎం స్టాలిన్(ఫైల్)



పుదుమై పెన్ పథకం ప్రారంభోత్సవంలో సీఎం స్టాలిన్(ఫైల్)

సాక్షి,చెన్నై : ప్రపంచంలోనే అత్యధిక యువత ఉన్న దేశం భారత్ అని, ఇందులో ముఖ్యంగా తమిళనాడు యువతకు తాము అందిస్తున్న ఉన్నత విద్య కీలకమని ప్రభుత్వ అధికారులు పేర్కొన్నారు. ఉన్నతవిద్య యువత భవిష్యత్తును తీర్చిదిద్దే ఆయుధమని, ఇందులోనూ యువతకు వృత్తి నైపుణ్యాల పెంపునకు కట్టుబడి కార్యక్రమాలు విస్తృతం చేశామని తెలిపారు. విద్యార్థినులు తమ ఉన్నత చదువును కొనసాగించాలన్న ఆకాంక్షతో ప్రతి నెలా పుదుమై పెన్ పథకం ద్వారా రూ.1000 అందజేస్తున్నామని గుర్తు చేశారు. విద్యార్థుల విద్యా అవసరాలను తీర్చేందుకు పరిశోధక ప్రోత్సాహక పథకం, ఉన్నత విద్యతో సహా అనేక కార్యక్రమాలలో రాణించేందుకు మరెన్నో పథకాలను అమలు చేస్తూ అగ్రగామి రాష్ట్రంగా తమిళనాడును తీర్చిదిద్దామని ధీమా వ్యక్తం చేశారు.

గ్రామీణులకు పెద్దపీట

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చదివే పేద విద్యార్థులు ఉన్నత అభ్యసించేందుకు వీలుగా అడ్మిషన్లలో సీట్ల రిజర్వేషన్ అమలు చేశామని, తొలి తరం పట్టభద్రులకు ప్రోత్సాహకాలను, వెనుకబడిన సామాజిక వర్గం విద్యార్థులకు ఉచిత విద్య, ప్రోత్సహకాలను అందిస్తున్నామని వివరించారు. భారతదేశంలో 500 కంటే ఎక్కువ ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఉన్నాయని గుర్తు చేస్తూ, ఇందులో నాణ్యమైన ఇంజినీరింగ్, వైద్య కళాశాలల జాబితాలో వందలోపు స్థానాల్లో 31 తమిళనాడులోనే ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు. నాన్ మొదల్వన్ ప్రాజెక్టు వినూత్నమైనది, యువత భవిష్యత్తు కోసం దూరదృష్టితో ఈ పథకం ఉద్భవించినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యా పథకాల్లో ఉన్నత చదువుల అభ్యసించడంలో విద్యార్థినుల సంఖ్య 34 శాతం పెరిగినట్టు ప్రకటించారు. ఈ పథకం విద్యార్థులకు సైతం వర్తింప చేయబోతున్నామని ప్రకటించారు. తమిళనాడులో ఉన్నత విద్యలోకి విద్యార్థుల ప్రవేశాన్ని రానున్న మూడేళ్లలో 100 శాతానికి చేర్చడం లక్ష్యంగా మరిన్ని ప్రతిష్టాత్మక ప్రాజెక్టు అమలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు పేర్కొన్నారు. ఆధునిక, శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించడం ద్వారా వివిధ రంగాల్లో పురోగతి సాధించడం లక్ష్యంగా రూ.3014 కోట్లతో 45 ప్రభుత్వ సాంకేతిక కళాశాలల్లో సిస్టమ్స్ 4.ఓ అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులకు ఉన్నత విద్యలో 7.5 శాతం స్థానిక కోటా సీట్ల కేటాయింపుతో వీరికి అన్ని రకాల ప్రోత్సాహకాలు, రాయితీలను అందజేస్తున్నారు. తొలి తరం పట్టభద్రులకు ట్యూషన్ ఫీజు రాయితీ కోసం రూ.1000 కోట్లు కేటాయించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కినట్టు పేర్కొన్నారు. ఏటా 10,000 మంది విద్యార్థులు వృత్తి నైపుణ్యాల అభివృద్ధి, సాంకేతిక శిక్షణలను విస్తృతం చేశామన్నారు. గత విద్యాసంవత్సరం(2023–2024) ఉన్నత విద్యాసంస్థలకు ఏటా రూ.50 కోట్లు యూనివర్సిటీలకు గ్రాంట్లు అందజేస్తున్నామని, దీని ద్వారా కొత్త సాంకేతిక ఆవిష్కరణలు విస్తృతం అయ్యాయని తెలిపారు. దివంగత కామరాజర్ పేరిట విద్యా అభివృద్ధి ప్రాజెక్టుకు రూ.1,000 కోట్లు కేటాయించి అదనపు కళాశాలల భవనాలు, తదితర నిర్మాణాలు చేపట్టామని పేర్కొన్నారు. పరిశోధనల్లో రాణించే శాస్త్రవేత్తలు పది మందికి ఏటా రూ.25 లక్షలు బహుమతిని అందజేస్తున్నామన్నారు. అంతే కాకుండా రూ.150 కోట్లు ఉన్నత విద్యాసంస్థల్లో డిజిటల్ పరివర్తన, ఉన్నత విద్యారంగంలో ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్, ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమల్లోకి తెచ్చామన్నారు. డైరెక్టరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో డిజిటల్ పరివర్తనను అందించడమే కాకుండా 1,750 గౌరవ లెక్చరర్లను నియమించినట్టు ప్రకటించారు. చెన్నైలోని రాజధాని కళాశాలలో రూ.63 కోట్లతో బ్రహ్మాండ ఆడిటోరియం నిర్మాణం జరుగుతోందని, ముఖ్యమంత్రి పరిశోధక ప్రోత్సాహక పథకం కింద 120మంది విద్యార్థులకు నెలకు రూ.25 వేల చొప్పున మూడేళ్లపాటు ప్రోత్సాహకా లు అందించామన్నారు. ఉన్నత విద్యా శాఖ ద్వారా వివిధ అద్భుతమైన కార్యక్రమాలతో మంచి ఫలితాలను తమిళనాడు ప్రభుత్వం సాధిస్తున్నదని, ఇది ఇతర రాష్ట్రాలకే ఆదర్శంగా మారినట్టు ప్రకటించారు.

కొత్త విద్యతో ఉజ్వల భవిత

- గవర్నర్ ఆర్‌ఎన్ రవి వ్యాఖ్య
- ఊటీలో వీసీల మహానాడు ప్రారంభం



సాక్షి, చెన్నై: ఊటీలో విద్యా సంస్థల వైస్ చాన్సలర్ల(వీసీల) మహానాడు సోమవారం ప్రారంభమైంది. తొలిరోజు గవర్నర్ ఆర్‌ఎన్ రవి మహానాడును ప్రారంభించి, ప్రసంగించారు. కొత్త జాతీయ విద్యా విధానం ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని వ్యాఖ్యానించారు. ప్రతి ఏటా గవర్నర్ నేతృత్వంలో విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందుగా వీసీల మహానాడు జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ ఏడాది గాను ఊటీలోని రాజ్‌భవన్ బంగ్లాలో సమావేశం నిర్వహణకు చర్యలు తీసుకున్నారు. ఈ సమావేశం నిమిత్తం ఒక రోజు ముందుగానే గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఊటీ చేరుకున్నారు. సోమవారం ఉదయం ఈ మహానాడును ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలోని సుమారు 40కు పైగా వర్సిటీలకు చెందిన వీసీలు ఈ మహానాడుకు హాజరయ్యారు. రెండు రోజులపాటుగా జరిగే ఈ మహానాడులో విద్యా విధానాలు, పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలు తదితర అంశాలపై చర్చించి, నిర్ణయాలు తీసుకుంటారు. తొలి రోజు మహానాడులో గవర్నర్ ఆర్‌ఎన్ రవి ప్రసంగిస్తూ ఇటీవల కేంద్రం తీసుకొచ్చిన జాతీయ విద్యావిధానం విద్యార్థుల భవిష్యత్తును ఉజ్వలమయం చేస్తుందన్నారు. ఈ విధానం నవ భారతావనికి మార్గదర్శకం అన్నారు. అన్ని శాఖల్లో మార్పులు రావాలంటే విద్యలోనూ కీలక మార్పు అవశ్యమని వ్యాఖ్యానించారు. యూజీసీ చైర్మన్ జగదీశ్‌కుమార్ ప్రసంగిస్తూ, ఒక విద్యా సంవత్సరాన్ని రెండుగా విభజించి అమలు చేయవచ్చు అని, ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు త్వరలో వెలువడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం వివిధ వర్సిటీల వీసీలను గవర్నర్ ఆర్‌ఎన్ రవి సత్కరించారు.

పశువుల పెంపకానికి లైసెన్సులు

పశువులు, ఎద్దులు, బర్రెల పెంపకానికి చెన్నైలో లైసెన్సులు తప్పనిసరి చేయనున్నారు. వీటిని పెంచుకునేందుకు వాటి యజమానుల నేతృత్వంలో తప్పనిసరిగా పశువుల పాక ఏర్పాటు చేయాల్సిందే అన్న నిబంధనలతో మార్గదర్శకాల విడుదలకు అధికారులు కసరత్తు చేపట్టారు. జూన్ మొదటివారంలో కొత్త నిబంధనలు అమలులోకి రానున్నాయి.

- పశువుల పాక తప్పనిసరి
- జూన్‌లో చెన్నైలో అమల్లోకి..



చెన్నై రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్న పశువులు

సాక్షి, చెన్నై : రాజధాని నగరం చెన్నైలో జనాభా రోజు రోజుకు పెరుగుతున్న విషయం తెలిసిందే. ఇక్కడ జనాభా కోటి మందికి పైగా ఉన్నట్టు అంచనా. జనాభాకు తోడు వాహన రద్దీ సైతం పెరుగుతూ వస్తోంది. ఈ దృష్ట్యా, చెన్నై నగరంలో పెంపుడు జంతువులకు అవకాశం లేని పరిస్థితి. అయినా శునకాలు, పిల్లులను పెంచుకుంటున్న వాళ్లు ఎక్కువే. వీటిని బయటకు తీసుకు రాకుండా తమ ఇళ్లకే పరిమితం చేసి పెంచుకుంటున్నారు. అలాగే పశువులు, ఎద్దులు, బర్రెల పెంపకానికి వీలు లేదు. అయినా, వంశ పారంపర్యంగా పశువులు, బర్రెలను పెంచుకుంటూ వస్తున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. గ్రామాల్లో అయితే పశువులు, ఎద్దులు, బర్రెలను పెంచుకునేందుకు వీలుంటుంది. వీటికి కావాల్సిన పచ్చటి గడ్డి కూడా లభిస్తుంది. అయితే నగరాల్లో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంటుంది.

పెంపుడు జంతువులతో ప్రమాదాలు

పెంపుడు జంతువులను తమతో బయటకు తీసుకొచ్చే క్రమంలో వాటి రూపంలో యజమానులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల కాలంగా పెంపుడు శునకాలు జరుపుతున్న దాడులే ఇందుకు నిదర్శనం. దీంతో ఇళ్లలో అల్లారుముద్దుగా ఎవరైనా శునకాలు, పిల్లులు తదితర వాటిని పెంచుకోవాలంటే లైసెన్సులను ఇటీవల తప్పనిసరి చేశారు. అదే సమయంలో పశువులు, ఎద్దులు, బర్రెల రూపంలో జరుగుతున్న ప్రమాదాలపై చెన్నై కార్పొరేషన్ యంత్రాంగం దృష్టి పెట్టింది. చెన్నై నగరంలో వీటిని పెంచుకునేందుకు వీలు లేని పరిస్థితి నెలకొంది. పశువుల పాక ఏర్పాటు చేయడం కన్నా, ఆ స్థలంలో నాలుగైదు అంతస్తుల గృహాలను నిర్మించి అద్దెకు ఇచ్చుకునే విషయంగానే యజమానులు దృష్టి పెడుతున్నారు. దీంతో వీటిని పశువుల పాకల్లో కన్నా, రోడ్ల మీద వదలి పెట్టే యజమానులే అధికంగా ఉన్నారు. రాత్రిళ్లు రోడ్ల మీదకు వచ్చి ఎద్దులు, పశువులు, బర్రెలు పడుకోవడం కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ద్విచక్ర వాహన చోదకులు అధికంగా వీటి బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. అలాగే ప్రాణాలు కోల్పోయిన వాళ్లూ ఉన్నారు. కొన్ని సందర్భాల్లో జన సంచారంలోకి దూసుకొచ్చే మూగ జీవాలు దాడులు చేయడం పెరిగింది. సోమవారం కూడా ఉత్తర చెన్నై పరిధిలోని సెవెన్ వెల్స్ వద్ద ఎద్దు దాడిలో బషీర్ (65) అనే వ్యక్తి గాయపడ్డారు. ఏదేని సంఘటన జరిగినప్పుడు మాత్రమే అధికారులు ఉరుకులు పరుగులు తీయడం, వీటి యజమానులకు జరిమానా విధించడం పరిపాటిగా మారింది.

రోడ్ల మీద తిరిగే పశువులు, ఎద్దులు, బర్రెలను పట్టుకెళ్లి బంధించే ప్రయత్నం చేస్తే వాటి యజమానులు అధికారులపై తిరగ బడుతున్నారు. రాత్రంతా రోడ్ల మీద ఉండే ఈ జీవాలను పాలు పితికే సమయంలో ఇళ్లకు తీసుకెళ్లి, మళ్లీ వదిలి పెట్టడం యజమానులకు అలవాటుగా మారింది. ఇలాంటి ఘటనలను పరిగణనలోకి తీసుకున్న కార్పొరేషన్ యంత్రాంగం మూగ జీవాలకు లైసెన్సులు తప్పనిసరి చేయాలని నిర్ణయించింది. వీటిని పెంచుకునే వారు ముందుగా ఆయా కార్పొరేషన్ మండల కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకుని లైసెన్సులు పొందేలా చర్యలు చేపట్టారు. ఈ లైసెన్సులు పొందేందుకు ముందుగా అనేక మార్గదర్శకాలు, నిబంధనలను వాటి యజమానులు అనుసరించాల్సి ఉంటుంది. ఈ మార్గదర్శకాలకు కార్పొరేషన్ అధికారులు తుది మెరుగులు దిద్దుతున్నారు. పశువులు, ఎద్దులు, బర్రెలను పెంచుకునేందుకు సిద్ధమై లైసెన్సుల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు ముందుగా వీటి కోసం పాకలు తప్పని సరిగా నిర్మించుకోవాల్సి ఉంటుంది. వాటికి కావాల్సిన గడ్డి , పరిసరాల శుభ్రత తదితర అంశాలు ఈ మార్గదర్శకాలలో ఉండబోతున్నట్టు ఓ అధికారి పేర్కొన్నారు. లైసెన్సులు పొందిన అనంతరం విచ్చలవిడిగా ఎవరి మూగ జీవాలైనా రోడ్డు మీదకు వస్తే వాటిని గోశాలలకు తరలించే దిశగా ఓ కీలక నిబంధనను సైతం విధించేందుకు నిర్ణయించినట్టు ఆ అధికారి పేర్కొనడం గమనార్హం. జూన్ మొదటి వారంలో మార్గదర్శకాలతో పాటుగా లెసెన్సుల నిబంధనల అమలు కావడం తథ్యమని పేర్కొన్నారు.

38 వేల మందితో ఓట్ల లెక్కింపు



వీడియో కాన్ఫరెన్స్‌లో సత్యప్రద సాహూ

సాక్షి, చెన్నై : రాష్ట్రంలో ఓట్ల లెక్కింపునకు 38 వేల మంది సిబ్బందిని రంగంలోకి దించాలని నిర్ణయించారు. అన్ని కౌంటింగ్ కేంద్రాలను పూర్తిగా నిఘా వలయంలోకి తెచ్చేందుకు చర్యలు విస్తృతం చేశారు. ఈ మేరకు సోమవారం నుంచి రాష్ట్రంలో చేపట్టిన కౌంటింగ్ కసరత్తులపై కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్ కుమార్, ఇతర అధికారులు గయనేష్‌కుమార్, సుఖ్బీర్ సింగ్ తమిళనాడులోని అధికారులతో సమీక్షించారు. చెన్నై నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రద సాహూ, ఆయా లోక్‌సభ నియోజకవర్గాల్లోని జిల్లా ఎన్నికల అధికారి(కలెక్టర్), రిటర్నింగ్ అధికారులు ఈ సమీక్షకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. రాష్ట్రంలోని 39 లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించిన 39 కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపునకు చేపట్టిన ఏర్పాట్లు, అనుసరిస్తున్న విధానాలు, మార్గదర్శకాలు తదితర అంశాలను ఢిల్లీ నుంచి సమీక్షించారు. ఆ యా నియోజకవర్గాల వారీగా జిల్లా ఎన్నికల అధికారులు వివరాలను సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల పరిస్థితి, ఏర్పాట్లు సమగ్ర సమాచారాలను కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులకు సత్యప్రద సాహూ వివరించారు. ఓట్ల లెక్కింపు ఎలాంటి వివాదాలకు దారి తీయకుండా గట్టి భద్రత నడుమ చేపట్టాలని, ఎప్పటికప్పుడు ఫలితాలను సమగ్ర పరిశీలన ద్వారా వెలువరించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర కమిషన్ వర్గాలు ఆదేశించాయి. ఈ సందర్భంగా సాహూ మాట్లాడుతూ రాష్ట్రంలో 38 వేల మంది సిబ్బందితో ఓట్ల లెక్కింపునకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇందులో 1500 మంది ప్రత్యేక పర్యవేక్షణాధికారులు ఉన్నారన్నారు. ఓట్ల లెక్కింపునకు ఏర్పాటు చేసే ఒక్కో బెంచ్ ముందు వీడియో కెమెరాల ద్వారా అన్ని దృశ్యాలను చిత్రీకరించడమే కాకుండా, కౌంటింగ్ కేంద్రాలు, పరిసరాలను పూర్తిగా భద్రతతో కూడిన నిఘా నేత్రాల నీడలోకి తెచ్చేందుకు శరవేగంగా పనులు జరుగుతున్నాయన్నారు. జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు మొదలవుతుందని, తొలుత తపాలా ఓట్లు, ఆ తర్వాత ఈవీఎంలపై దృష్టి పెట్టడం జరుగుతుందన్నారు.

విజయోత్సవానికి సన్నద్ధం



సమావేశంలో ప్రసంగిస్తున్న సుధాకర్‌రెడ్డి, చిత్రంలో అన్నామలై, తమిళిసై, ఎల్ మురుగన్ తదితరులు

- రెండంకెల సీట్ల కైవసం తథ్యం
- బీజేపీ నేతల ధీమా
- జిల్లా, రాష్ట్ర నేతలతో అన్నామలై భేటీ

సాక్షి,చెన్నై : తమిళనాట రెండంకెల సీట్లతో విజయోత్సవానికి సన్నద్ధంగా ఉన్నామని బీజేపీ కూటమి నేతలు వ్యాఖానించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలో మెగా కూటమి రాష్ట్రంలో పోటీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో బీజేపీ చిహ్నంతో 24 మంది పోటీ చేశారు. మిత్రులందరూ వారి వారి చిహ్నలతో బరిలో దిగారు. ఎన్నికలు ముగిశా యి. మరో వారంలో ఫలితాలు వెలువడబోతున్నా యి. ఈ సమయంలో సోమవారం జిల్లా, రాష్ట్ర స్థా యి నేతలతో సమావేశానికి బీజేపీ రాష్ట్ర కమిటీ పి లుపునిచ్చింది. బీజేపీ రాష్ట్ర వ్యవహారాల కో-ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ అధ్యక్షుడు అన్నామలై అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కేంద్ర సహాయమంత్రి ఎల్.మురుగన్, సీనియర్ నేత హెచ్.రాజ తదితరులు హాజరయ్యారు. ఈ సా రి తమిళనాట లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకుని తీరడం ఖాయం అన్న ధీమాను నేతలందరూ ఈ స మావేశంలో వ్యక్తం చేయడం గమనార్హం. కొన్ని కీలక నియోజకవర్గాలలో స్వల్ప మెజారిటీ అభ్యర్థు లుగా ఉన్న ఆయా పార్టీల ముఖ్య నేతలు గెలవబోతున్నారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి సుధాకర్‌రెడ్డి తన ప్రసంగంలో అభ్యర్థుల గెలుపు లక్ష్యంగా శక్తివంచన లేకుండా కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్, డీఎంకేలు తమపై బురదజల్లినా గణనీయమైన సంఖ్యలో సీట్ల లో గెలుపుతో తమిళనాట బలాన్ని చాటబోతున్నామన్న ధీమాను వ్యక్తం చేశారు. కేంద్రంలో ప్రధాని మోదీ నాయకత్వంలో అఖండ మెజారిటీతో అధికా రం మళ్లీ చేజిక్కించుకోవడం ఖాయమన్నారు.

రెండంకెల గెలుపు గ్యారంటీ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై మీడియాతో మాట్లాడుతూ పార్టీ పరంగా ఎన్నికల ముందు, తదుపరి అంశాలపై చర్చించామన్నారు. ఈ ఎన్నికల్లో రెండంకెల సంఖ్యలో స్థానాల్లో బీజేపీ కూటమి గెలుపు బావుటా ఎగుర వేయబోతున్నట్టు ధీమా వ్యక్తం చేశారు. తేని, ధర్మపురి, రామనాథపురం, శివగంగై, పెరంబలూరు, వేలూరు తదితర నియోజకవర్గాల్లో కూటమిలోని ముఖ్య నేతలు పోటీ చేశారని గుర్తు చేస్తూ, అందర్నీ కలుపుకుని రెండంకెల సీట్లతో విజయోత్సవానికి రాష్ట్రంలో సన్నద్ధంగా ఉన్నామని వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా దివంగత సీఎం జయలలితను హిందూతత్వ వాదిగా పేర్కొంటూ తాను చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, ఆమె మైనారిటీలకు వ్యతిరేకమని తాను వ్యాఖ్యలు చేయలేదే అని సమాధానం ఇచ్చారు. సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ తనకు భద్రత కరువైనట్టుగా చేసిన వ్యాఖ్యలను గుర్తు చేయగా , డీఎంకే ప్రభుత్వంలా రాత్రికి రాత్రే ఎవర్నీ తాము అరెస్టు చేయబోమని, గూండా చట్టాలు నమోదు చేయమన్నారు.

ఆర్ట్స్, సైన్స్ కోర్సులకు ర్యాండం నంబర్ల విడుదల

- నేటి నుంచి కౌన్సెలింగ్



ప్రభుత్వ కళాశాల

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో ప్రభుత్వ కళాశాలల్లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి ర్యాండం నంబర్లను కేటాయించారు. ఈ జాబితాను సోమవారం ప్రకటించారు. మంగళవారం నుంచి సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్నది. రాష్ట్రంలో 164 ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలు ఉన్న విషయం తెలిసిందే. వీటిలో 1,07,299 సీట్లు ఉన్నాయి. 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఈ నెల 6వ తేదీ నుంచి సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా ఆహ్వానించారు. ఈ నెల 20వ తేదీతో తొలుత గడువు ముగిసినా, మరో నాలుగు రోజులు అదనంగా కేటాయించారు. ఈ మేరకు ఈ నెల 24వ తేదీతో దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది. బీకాం, బీఎస్సీ, కంప్యూటర్ సైన్స్ తదితర కోర్సులకు అధిక దరఖాస్తులు వచ్చిచేరాయి. 2,58,527 మంది దరఖాస్తు చేసుకోగా 2 లక్షల 11 వేల 10 మంది దరఖాస్తు ఫీజును చెల్లించారు. ఈ దరఖాస్తులను పరిశీలించి ర్యాండం నెంబర్లను కేటాయించారు. ఈ నెంబర్లను ఆయా కళాశాలలకు పంపించే పనిలో ఉన్నత విద్యా శాఖ అధికారులు సోమవారం నిమగ్నయ్యారు. విద్యార్థులకు ర్యాండం నంబర్లు, కౌన్సెలింగ్ తదితర వివరాలను వారు రిజిస్టర్ చేసుకున్న మొబైల్ నంబర్లకు ఎస్‌ఎంఎస్ రూపంలో పంపించేందుకు చర్యలు తీసుకున్నారు. మంగళవారం నుంచి కౌన్సెలింగ్ ద్వారా సీట్ల భర్తీకి చర్యలు చేపట్టారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు దివ్యాంగులు, క్రీడలు, మాజీ సైనికుల పిల్లల రిజర్వేషన్ సీట్లను భర్తీ చేయనున్నారు. జనరల్ కేటగిరి కౌన్సెలింగ్ తొలి విడతగా జూన్ 10 నుంచి 15 వరకు, రెండో విడతగా జూన్ 24 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నారు. తొలి సంవత్సరం విద్యార్థుల తరగతులు జూలై 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి.

మైలాపూర్‌లో ఉమ్మడి కుటుంబం

- ఒకే ఇంట్లో 20 మంది కలిసి జీవనం

తిరువొత్తియూరు: తమిళనాడులోనే అతిపెద్ద కుటుంబం చెన్నైలోని మైలాపూరులో 20 మంది సభ్యులతో నివసిస్తోంది. ఒక కుటుంబంలో ఎక్కువ మంది వ్యక్తులు నివసించడం నేడు చాలా అరుదు. ఈ స్థితిలో తమిళనాడులో 20 మంది సభ్యులున్న అతి పెద్ద కుటుంబం గురించి తమిళనాడు ఆహార సరఫరా శాఖ తాజాగా సమాచారం విడుదల చేసింది. చెన్నై మైలాపూర్‌లోని అప్పర్ స్వామి కోయిల్‌లో చెన్నై మున్సిపల్ కార్పొరేషన్ మాజీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏఆర్ వెంకటేశ్(89) కుటుంబం నివసిస్తోంది. ఈయనకు చెందిన ఇంట్లో సుమారు 30 మంది సభ్యులు నివాసం ఉంటున్నా రు. 20 ఏళ్ల క్రితం జారీ చేసిన రేషన్ కార్డులో 24 మంది పేర్లు ఉండగా, ఇటీవల జారీ చేసిన కార్డులో 20 మంది కుటుంబ సభ్యుల పేర్లను ముద్రించారు. దీనిని సిద్ధం చేసేందుకు కార్డ్ డిజైన్‌లో అధికారులు స్వల్ప మార్పులు చేశారు. ప్రస్తుతం 20 పేర్లు ఉన్న ఇంట్లో మరో 10 మంది సభ్యుల పేర్లను చేర్చడానికి నిర్ణయించుకున్నట్టు ఆర్. వెంకటేశ్ తెలిపారు. ఈ కుటుంబం ఆరు అపార్ట్‌మెంట్లు ఉన్న ఇంట్లో నివసిస్తోంది. కుటుంబ పెద్దది కావడంతో వెంకటేశ్ ఇంటిని అధికారులు గతేడాది తనిఖీ చేశారు.

క్లుప్తంగా

కదం తొక్కిన రైతన్న

సాక్షి, చెన్నై : కేరళ చర్యలను ఖండిస్తూ సోమవారం రైతు సంఘాలు కదంతొక్కాయి. తేని, తిరుప్పూర్‌లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. ముల్లైపెరియార్ జలాశయానికి ప్రత్యామ్నాయంగా కొత్త డ్యాం నిర్మాణానికి కేరళ ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. అలాగే, అమరావతి జలాశయంలోకి నీటిని అడ్డుకునేలా శివందీ నది తీరంలో చెక్ డ్యామ్‌ల నిర్మాణాలు వేగవంతం చేశారు. ముల్లైపెరియార్ డ్యామ్‌కు సంబంధించి కేరళ పంపించిన నివేదికపై మంగళవారం ఢిల్లీలో నిపుణుల కమిటీ చర్చించనున్నది. ఆ నివేదికను పరిగణనలోకి తీసుకోవద్దని, తిరస్కరించాలని, కేరళ చర్యలను అడ్డుకోవాలని కోరుతూ తేనిలో రైతు సంఘాలు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాయి. రెండు రాష్ట్రాల సరిహద్దుల్లోని ఆ డ్యామ్ నిర్మాత, ఇంజినీర్ బెన్నీ క్విక్ విగ్రహం వైపుగా నిరసన కారులు వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. ఇక, తిరుప్పూర్‌లో కేరళ తీరును ఖండిస్తూ రైతు సంఘాలు రాస్తారోకో నిర్వహించాయి.

పంటలపై ఏనుగుల దాడి


ఏనుగుల దాడిలో ధ్వంసమైన కొబ్బరి చెట్లు

వేలూరు: ఆంబూరు సమీపంలో ఆదివారం రాత్రి అటవీ ఏనుగుల గుంపు పంటలపై పడి అరటి, కొబ్బరి, మామిడి చెట్లను ధ్వంసం చేసింది. తిరుపత్తూరు జిల్లా ఆంబూరు చుట్టుపక్కలున్న తురగం, కారపట్టు వంటి అటవీ గ్రామాలున్నాయి. ఈ అటవీ ప్రాంతం తమిళనాడు, ఆంధ్ర సరిహద్దులో ఉండడంతో ఆంధ్రప్రదేశ్ అటవీ ప్రాంతాల్లో తిరుగుతున్న ఏనుగులు ఉన్నపళంగా తమిళనాడుకు వచ్చి, రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో తిరుగుతూ పంటలను నాశనం చేస్తున్నాయి. మిట్టాలం విభాగంలోని అరంగల్ దుర్గం గ్రామంలోని పార్థిబన్, మగిమనాథన్, పలువురు రైతులు పండించిన పంటలపై ఏనుగులు పడ్డాయి. ఆ సమయంలో కొబ్బరి, మామిడి చెట్లు, అరటి చెట్లు వంటి వాటిని ధ్వంసం చేసి వెళ్లింది. అనంతరం అటవీ ప్రాంతానికి వెళ్లిపోయింది. రాత్రి వేళల్లో అటవీ ఏనుగులు పంటలపై పడడం , పగటి వేళల్లో అటవీ ప్రాంతానికి వెళ్లడంతో రాత్రి వేళల్లో ఎవరూ బయటకు రాకుండా ఉండాలని అటవీ శాఖ సిబ్బంది గ్రామంలో దండోరా వేశారు. ఇదిలా ఉండగా అటవీ ఏనుగులు ఎప్పుడు వస్తాయో అనే భయంతో గ్రామస్తులు బిక్కుబిక్కుమంటూ నిద్రాహారాలు మాని బతుకు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

చెన్నై విమానాశ్రయంలో భద్రత కట్టుదిట్టం



విమానాశ్రయంలో బందో బస్తు నిర్వహిస్తున్న సాయుధ దళ సిబ్బంది, పోలీసు శునకంతో పహారా కాస్తున్న పోలీసు

• బాంబు బూచీతో మరింత అలర్ట్

సాక్షి, చెన్నై: నగరంలోని మీనంబాక్కం అంతర్జాతీయ విమానాశ్రయంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. వారం రోజుల్లో ఐదుచోట్ల విమానాశ్రయంలో బాంబులు పేలుతాయన్న బెదిరింపు ఈ మెయిల్‌తో అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. చెన్నై విమానాశ్రయం ఎల్లప్పుడు గట్టి భద్రతతో ఉంటుందన్న విషయం తెలిసిందే. విమానాశ్రయం పరిసరాల్లో స్థానిక పోలీసులు, అలాగే సీఆర్పీఎఫ్ నిఘా ఉంటుంది. అలాగే ఉన్నతాధికారులు సైతం అప్రమత్తంగా వ్యవహరిస్తుంటారు. ప్రతి ప్రయాణికుడిని క్షుణ్ణంగా తనిఖీలు చేసిన అనంతరం విమానాశ్రయంలోకి అనుమతిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆదివారం రాత్రి విమానాశ్రయ అధికారులకు రెండు ఈ మెయిల్స్ వచ్చాయి. ఇందులో ఒకటి పోలీసు ఉన్నతాధికారి తనయుడిగా పేర్కొంటూ సమాచారం ఇచ్చారు. విమానాశ్రయంలో బాంబులు ఉన్నాయని, వారం రోజులలో ఐదు చో ట్ల ఇవి పేలబోతున్నాయని అందులో హెచ్చరించా రు. దీంతో అధికారులు మరింత అప్రమత్తమ య్యారు. రాత్రంతా విమానాశ్రయం పరిసరాలలో క్షుణ్ణంగా సోదాలు చేశారు. ఇది బూటకమని తేల్చా రు. అయినా ముందు జాగ్రత్తగా భద్రతను మరింతగా కట్టుదిట్టం చేశారు. విమానాశ్రయంలోకి వచ్చే వాహనాలను తనిఖీల అనంతరం అనుమతించే లా చర్యలు తీసుకున్నారు. దీంతో జీఎస్టీ రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. అలాగే విమానాశ్రయంలోకి అడుగు పెట్టే ప్రతి ఒక్కరినీ మరింత క్షుణ్ణంగా తనిఖీలు చేయడమే కాకుండా, తమ వాళ్లకు వీడ్కోలు, రిసీవ్ చేసుకునేందుకు వచ్చే వారికి అనేక ఆంక్షలు విధించారు. ఈ బెదిరింపు మెయిల్ పంపించిన వారి కోసం సైబర్ క్రైం వర్గాలు గాలిస్తున్నాయి.

లక్ష్యాన్ని ఎంచుకుని పయనించాలి



స్టార్స్ పథకంలో విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న ప్రతినిధులు

• వీఐటీలో సినీ డైరెక్టర్ భారతిరాజా

వేలూరు: జీవితంలో లక్ష్యాన్ని ఎంచుకుని ప్రయాణం చేస్తే తప్పక విజయం సాధించగలమని సినీ డైరెక్టర్ భారతిరాజా అన్నారు. వేలూరు వీఐటీ యూనివర్సిటీ ఆవరణలోని చెన్నారెడ్డి ఆడిటోరియంలో వీఐటీ స్టార్స్ దినోత్సవ కార్యక్రమం వీఐటీ చాన్స్‌లర్ విశ్వనాథన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా భారతిరాజా మాట్లాడుతూ వీఐటీలో విద్యను అభ్యసించిన విద్యార్థులు నేడు ప్రపంచ వ్యాప్తంగా పని చేస్తున్నారన్నారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను ఎంపిక చేసి ఉన్నత విద్య కోసం వీఐటీ స్టార్స్ పథకం కింద సాయం చేయడం అభినందనీయమన్నారు. సినీ ప్రొడ్యూసర్ కలైపులి థాను మాట్లాడుతూ వీఐటీలోని విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను పూర్తి చేసి పంపడంతోనే చాన్స్‌లర్‌కు అమెరికా యూనివర్సిటీ అవార్డును అందజేసిందన్నారు. చాన్స్‌లర్ విశ్వనాథన్ మాట్లాడుతూ వీఐటీలో గత ఏడు సంవత్సరాలుగా స్టార్స్ దినోత్సవం జరుపుతున్నామన్నారు. ఈ పథకం ప్రస్తుతం 945 మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో చదివితే రానున్న రోజుల్లో జీవితం బాగుండదని పలువురు తలుచుకుంటారని, అయితే వీటిని వీఐటీలోని స్టార్స్ విద్యార్థులు మార్పు చేశారన్నారు. ఇందుకు కారణం వీఐటీలో స్టార్స్ పథకం కింద చదివిన విద్యార్థులు నేడు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పలు సంస్థల్లో పనిచేస్తున్నారన్నారు. విద్యకు, ఆరోగ్యానికి ప్రభుత్వం అధికంగా ఖర్చు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వీఐటీలోని స్టార్స్ పథకం తమిళనాడుతోపాటు ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోనూ అమలు చేస్తున్నామన్నారు. ఉన్నత విద్యలో ఇండియా వెనుకంజలో ఉందని, వైద్యం, విద్యారంగాల్లో మార్పు తీసుకొచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక నిధులు కేటాయించాలన్నారు. ప్రాథమిక విద్యను మాత్రం అందరికీ అందజేస్తున్నారని, అయితే ఉన్నత విద్యపై ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. అనంతరం స్టార్స్ పథకం కింద ఎంపికైన విద్యార్థులకు చెక్కులను అందజేశారు. వీఐటీ ఉపాధ్యక్షులు శంకర్, కాదంబరి విశ్వనాథన్, స్టార్స్ పథకం ఆర్గనైజర్ మీనాక్షి, రిజిస్ట్రార్ జయభారతి పాల్గొన్నారు.

మన జీవితానికి మనమే సాక్షులం


ఏడో రుతువు పుస్తకావిష్కరణలో ప్రముఖులు

కొరుక్కుపేట: మన జీవితానికి మనమే సాక్షులమని హైదరాబాద్‌కు చెందిన విశిష్ట కవి, డాక్టర్ వాసిలి వసంతకుమార్ అన్నారు. చెన్నై టీనగర్ ఆస్కా ప్రాంగణంలో ఆదివారం రాత్రి వేదవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత ఉపన్యాస దారా వాహిక 149వ ప్రసంగంగా తొలి తెలుగు యోగిక కావ్యం 'నేను.. వైవిధ్యత, వినూత్నత' అనే అంశంపై జరిగిన సభలో డాక్టర్ వాసిలి వసంత కుమార్ ప్రసంగించారు. ముందుగా విశ్వర్షి వాసిలి రచించిన వర్తమాన వచన కవితా సంపుటి 'ఏడో రుతువు' పుస్తకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. వేదవిజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరు మధు స్వాగతోపన్యాసం చేశారు. అరుణా శ్రీనాథ్ ప్రార్థనాగీతంతో ప్రారంభమైన కార్యక్రమంలో వేదిక అధ్యక్షుడు జేకే రెడ్డి వక్తను సభకు పరిచయం చేశారు. విశ్వర్షి వాసిలి బహుగ్రంథ కర్త అని, వైవిధ్యంతో కూడిన రచనలు చేశారన్నారు. యోగాలయ, అతీంద్రియ రహస్యాలైన యోగిక సాహిత్యం, జీవన యోగిక గీత, గీతా రహస్యాలు, నేను, జీవన సంహిత, ఏడో రుతువు తదితర రచనలు, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన అనేక పుస్తకాలు, ఎన్నో అనువాద రచనలు చేశారని తెలిపారు. ఏడో రుతువు పుస్తకావిష్కరణకు ముందుగా నిర్వాహకులు వక్త వాసిలి వసంతకుమార్‌ను సత్కరించారు. ఏడో రుతువు పుస్తకం గురించి జేకే రెడ్డి క్లుప్తంగా సమీక్షించారు. కార్యక్రమంలో మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడు వస్తాలి శంకర రావు, తెలుగు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమానికి హాజరైన సాహితీ ప్రియులు

ప్లస్ వన్ విద్యార్థినికి శిశువు జననం

తిరువొత్తియూరు: వేలూరు సమీపంలో ప్లస్ వన్ విద్యార్థినికి బిడ్డ జన్మించింది. దీని సంబంధించి ఇద్దరు కుమార్తెలు కలిగిన తండ్రిని పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. వేలూరు జిల్లా కేవీ కుప్పం సమీపంలోని పెరియార్ నగరకు చెందిన స్వామినాథన్(45) తాగునీటి ట్యాంకు ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి 16 సంవత్సరాల ప్లస్ వన్ చదువుతున్న విద్యార్థినితో గత ఒకటిన్నర సంవత్సరాల క్రితం పరిచయమైంది. దీంతో విద్యార్థినికి మాయమాటలు చెప్పి విద్యార్థినితో స్వామినాథన్ పలుసార్లు ఉల్లాసంగా గడిపినట్లు తెలిసింది. ఈ క్రమంలో విద్యార్థినికి గత కొన్ని రోజుల క్రితం కడుపునొప్పి రావడంతో తల్లిదండ్రులు విద్యార్థినిని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిశోధనలో విద్యార్థిని గర్భంగా ఉన్నట్టు తెలిసింది. దీంతో గత రెండు రోజులకు క్రితం విద్యార్థినికి బిడ్డ జన్మించింది. దీనికి సంబంధించి విద్యార్థిని వద్ద తల్లిదండ్రులు విచారణ చేయగా స్వామినాథన్ పలుసార్లు తనను మోసగించి ఉల్లాసంగా గడిపినట్లు తెలిపింది. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు గుడియాత్తం మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి స్వామినాథన్‌ను సోమవారం ఉదయం అరెస్టు చేశారు. స్వామినాథన్‌కు వివాహమై భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు తెలిసింది.

స్టీల్ వినియోగం ప్రోత్సాహంపై సాంకేతిక చర్చ


సదస్సుకు హాజరైన నిపుణులు

సాక్షి, చెన్నై: స్టీల్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు సాంకేతిక పరమైన చర్చా కార్యక్రమం సోమవారం చెన్నైలో జరిగింది. ఇండియన్ కాంక్రీట్ ఇనిస్టిట్యూట్ – చెన్నై సెంటర్, వికీ ఇండస్ట్రీస్ భాగస్వామ్యంతో ఐస్టీల్ తయారీదారుల నేతృత్వంలో గాల్వనైజ్డ్ రీ ఇన్ ఫోర్స్‌మెంట్ స్టీల్ వినియోగం . సాంకేతిక అంశాలపై స్థానికంగా జరిగిన చర్చా కార్యక్రమానికి పరిశోధకులు, నిపుణులు, ఆర్కిటెక్ట్‌లు, ఇంజినీర్లు, నిర్మాణ రంగంలోని ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు. ఇందులో కాంక్రీట్ నిర్మాణాలు, సవాళ్లు, ఉక్కు ప్రభావం, పరిశోధకులు, నిపుణులు పరిష్కార మార్గాలు, తదితర అంశాలను గురించి చర్చించారు. ఇందులో ఐఐటీ మద్రాసు మాజీ ప్రొఫెసర్ ఏఆర్ శాంతకుమార్ తన ప్రసంగంలో ఖరీదైన స్టీల్ బార్‌ల ఉపయోగించడంతో పోల్చితే గాల్వనైజ్డ్ కోటింగ్ ఉపయోగంలోని అదనపు ప్రయోజనాలను వివరించారు. ప్రముఖ మెటలర్జిస్ట్ డాక్టర్ వేణుగోపాల్ తన ప్రసంగంలో రీబార్స్ మెటలర్జిక్ అంశాలను, కాంక్రీట్ నిర్మాణాల జీవిత కాలాన్ని గురించి చర్చించారు. ఇండియా లీడ్ జింక్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పుగలేంది, ఐస్టీల్ సీఈఓ గౌతంరెడ్డి, ఇండియన్ కాంక్రీట్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ మురళీధరన్ తమ ప్రసంగాల్లో గాల్వనైజ్డ్ రీ బార్‌ల అవసరం, సాంకేతికత, బాధ్యతాయుత నిర్మాణ సామగ్రి గురించి వివరించారు.

కోలీవుడ్ టాక్స్

31న తెరపైకి బుజ్జీ ఎట్ అనుపట్టి


పూజాహెగ్డే



బుజ్జీ ఎట్ అనుపట్టి చిత్ర యూనిట్

తమిళ సినిమా : కోలీవుడ్‌లో బాలల ఇతివృత్తంతో చిత్రాలు వచ్చి చాలా కాలమే అయ్యిందని చెప్పవచ్చు. తాజాగా రూపొందిన బుజ్జీ అనుపట్టి చిత్రం ఈ కోవకు చెందినదే. కవిలయా క్రియేషన్స్ పతాకంపై రామ్ కందసామి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం ఇది. కార్తీక్‌రాజా సంగీతం అందించిన ఈ చిత్రంలో కమల్‌కుమార్, నక్సలైట్ వైదీశ్వరి, కార్తీక్ విజయ్‌తో పాటు బాలతారలు ప్రణితీ శివశంకరన్, లావణ్య కణ్మణి, నక్సలైట్స్ రామ్‌కుమార్, నక్సలైట్స్ మీనా, వరదరాజన్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. గ్రామీణ ప్రాంతంలో రూపొందించిన కథా చిత్రం ఇది. దీన్ని కోయంబత్తూరు పరిసర ప్రాంతాల్లో 18 రోజులలో చిత్రీకరించినట్లు సోమవారం మధ్యాహ్నం చెన్నైలోని ప్రసాద్‌ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన చిత్ర ప్రీరిలీజ్ వేడుకలో మీడియాకు దర్శక, నిర్మాత రామ్ కందసామి తెలిపారు. ఇది ముఖ్యంగా అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానుబంధాలను ఆవిష్కరించే కథా చిత్రంగా ఉంటుందన్నారు. అలాగే ఒక మేకపిల్ల ముఖ్యపాత్రగా ఉంటుందని చెప్పారు. ఆ మేకపిల్ల అన్నాచెలెళ్లు అయిన చిన్నారులకు ఎలా చేరువైందీ, ఆ తరువా త అది దూరం అయితే ఆ చిన్నారులు ఏం చేశారు తదితర పలు ఆసక్తికరమైన అంశాలతో బుజ్జీ ఎట్ అనుపట్టి చిత్రం ఉంటుందన్నారు. యూనిట్ సభ్యులందరి సహకారంతోనే ఈ చిత్రాన్ని పూర్తి చేయగలిగానని చెప్పారు. ముఖ్యంగా సంగీత దర్శకుడు కార్తీక్‌రాజా సహకారం మరచిపోలేనన్నారు. ఆర్థిక సమస్య గురించి ఆయనకు చెప్పగా తన పారితోషికం గురించి ఆలోచించవద్దనీ, ఇతర సంగీత కళాకారులకు వేతనాలు చెల్లించమనీ, బుజ్జీ ఎట్ అనపట్టి చిత్రం తనకు ఎంతగానో నచ్చిందనీ, తాను సంగీతాన్ని అందిస్తానని చెప్పారన్నారు. ఆయన సంగీతం ఈ చిత్రానికి జీవం పోసిందని పేర్కొన్నారు. చిత్రం నాలుగు అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో అవార్డులను గెలుచుకోవడం సంతోషంగా ఉందన్నారు. చిత్రాన్ని ఈ నెల 31వ తేదీన విడుదల చేస్తున్నట్లు చెప్పారు. దీని తమిళనాడు విడుదల హక్కులను 9వీ స్టూడియోస్ అధినేతలు రమేశ్ సుబ్రమణియన్, అంజలైమురుగన్ పొందినట్లు చెప్పారు.

మడోనా కూడా..

మారిపోయింది


మడోనా సెబాస్టియన్

తమిళ సినిమా : సినిమాకు గ్లామర్ ముఖ్యమే. అయితే హీరోయిన్లకు గ్లామరే ప్రధానంగా మారిపోతోంది. ఇంతకు ముందు పక్కింటి అమ్మాయి ఇమేజ్‌ను తెచ్చుకున్న నటీమణులు కూడా ఇప్పుడు గ్లామర్ పాత్రలపై ఆసక్తి చూపుతున్నారు. ఈ కోవలో ఇప్పుడు నటి మడోనా సెబాస్టియన్ కూడా చేరింది. 32 ఏళ్ల ఈ మాలీవుడ్ భామ మొదట సంగీతంపై ఆసక్తి చూపింది. అలా పలు వేదికలపై పాటలు పాడిన మడోనా ఆ తరువాత ప్రేమమ్ చిత్రం ద్వారా కథానాయకిగా ఎంట్రీ ఇచ్చింది. అందులో నలుగురు హీరోయిన్లలో ఒకరిగా నటించి గుర్తింపు పొందింది. కాగా 2016లో విజయ్‌సేతుపతికి జంటగా కాదలుమ్ కడందు పోగుమ్ చిత్రం ద్వారా కోలీవుడ్‌కు దిగమతి అయ్యింది. ఆ చిత్రం మంచి విజయాన్ని సాధించడంతో మడోనాకు మరింత పాపులారిటీ వచ్చింది. దీంతో మలయాళం, తమిళంతోపాటు తెలుగు, కన్నడ భాషల్లోనూ అవకాశాలు రావడం మొదలెట్టాయి. అయితే ఎందుకనో ఈమెకు పెద్దగా స్టార్ ఇమేజ్ రాలేదు. ఆ మధ్య విజయ్ హీరోగా నటించిన లియో చిత్రంలో ఈయనకు చెల్లెలిగా చిన్న పాత్రలో మెరిసింది. కాగా ప్రస్తుతం తమిళంలో జాలీయో జింఖానా, అదృష్టశాలి చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాలు త్వరలో తెరపైకి రావడానికి సిద్ధం అవుతున్నాయి. అయితే ఇప్పటి వరకూ గ్లామర్‌కు దూరంగా ఉంటూ వచ్చిన మడోనా ఇంకా మడి కట్టుకుని కూర్చుంటే లాభం లేదని భావించిందో ఏమో.. తాజాగా సముద్ర తీరంలో అందాలు ఆరబోస్తూ తీసుకున్న ఫొటోలను సామాజిక మాధ్యమాలకు విడుదల చేసింది. అవి ఇప్పుడు నెట్టింట్లో హల్‌చల్ చేస్తున్నాయి.దీంతో మడోనా సెబాస్టియన్‌కు ఏమైందీ ఇలా ఒక్కసారిగా గ్లామర్‌కు మారిపోయింది అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి అలాంటి ఫొటోలు మడోనా కెరీర్‌కు ఏమాత్రం ఉపయోగపడతాయో చూడాలి.

44వ చిత్రంలోనూ

ద్విపాత్రాభినయం?

తమిళ సినిమా : నటుడు సూర్య కథలను ఎంపిక చేసుకోవడంలో చాలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారనే చెప్పాలి. ఈయన సమీప కాలంలో నటించిన చిత్రాలన్నీ మంచి విజయాన్ని సాధించాయి. సూర్య కథానాయకుడిగా నటించిన జై భీమ్ సక్సెస్‌తోపాటు ప్రశంసలు అందుకుంది. ఇక సూరరైపోటు చిత్రం జాతీయ అవార్డులను సైతం కొల్లగొట్టింది. ప్రస్తుతం కంగువ చిత్రంలో నటించి, తన పాత్ర పూర్తి చేశారు. సోషియో పీరియడ్ కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రంలో పలు ప్రత్యేకతలు ఉన్నాయి. ముఖ్యంగా ఇందులో నటుడు సూర్య ద్విపాత్రాభినయం చేసినట్లు సమాచారం. పది భాషల్లో త్రీడీ ఫార్మాట్‌లో రూపొందుతున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్, టీజర్ వంటివి ఇప్పటికే విడుదలై ప్రేక్షకుల్లో భారీ అంచనాలను నెలకొల్పాయి. శివ దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ సంస్థతో కలిసి స్టూడియో గ్రీన్ సంస్థ అధినేత కేఈ. జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్న ఈ చిత్రంలో గ్రాఫిక్స్ సన్నివేశాలకు ప్రాముఖ్యత ఉంటుందని నిర్మాతలు పేర్కొన్నారు. నటుడు సూర్య ప్రస్తుతం తన 44వ చిత్రంలో నటిస్తున్నారు. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సూర్యకు చెందిన 2డీ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ, కార్తీక్ సుబ్బరాజ్‌కు చెందిన స్టోన్ బెంచ్ సంస్థ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇందులో నటి పూజాహెగ్డే నాయకిగా నటిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇంకా అధికారికంగా ప్రకటించలేదన్నది గమనార్హం. విజయ్ సరసన నటించిన బీస్ట్ చిత్రం తరువాత ఈమె తమిళంలో నటించే చిత్రం ఇదే అవుతుంది. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్‌ను వచ్చే నెల నుంచి ప్రారంభించనున్నట్లు సమాచారం. అయితే ఇటీవల నాలుగు రోజులపాటు సూర్యతో కొన్ని సన్నివేశాలు చిత్రీకరించినట్లు తెలిసింది. ఇందులో కూడా సూర్య ద్విపాత్రాభినయం చేస్తున్నట్లు తాజా సమాచారం. ఈ చిత్రం టైటిల్‌ను, టీజర్‌ను త్వరలోనే విడుదల చేయనున్నట్లు యూనిట్ వర్గాల సమాచారం. దీనికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం తరువాత సూర్య వాడివాసల్ చిత్ర షూటింగ్‌లో పాల్గొంటారని సమాచారం. దీనికి వెట్రిమారన్ దర్శకత్వం వహించనున్నారు.

పడయప్పతో కట్టప్ప


రజనీకాంత్‌తో సత్యరాజ్

తమిళ సినిమా : రజనీకాంత్, దర్శకుడు లోకేశ్ కనకరాజ్ కాంబినేషన్‌లో కూలీ అనే భారీ చిత్రం రూపొందనున్న విషయం తెలిసిందే. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో చాలా గ్యాప్ తరువాత నటి శోభన రజనీకాంత్‌తో కలిసి నటించనున్నారనే ప్రచారం జరుగుతోంది. అలాగే ఇందులో సంచలన నటి శృతిహాసన్ రజనీకాంత్‌కు కూతురిగా నటించనున్నట్లు టాక్ వైరల్ అవుతోంది. కాగా అనిరుధ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం షూటింగ్ త్వరలోనే సెట్స్ పైకి వెళ్లనుంది. కాగా ఈ చిత్రం టైటిల్, టీజర్లను విడుదల చేయగా విశేష స్పందనను తెచ్చుకున్నాయి. ముఖ్యంగా ఇది గోల్డ్ స్మగ్లింగ్ నేపథ్యంలో సాగే కథా చిత్రం అని సమాచారం. దీంతో రజనీకాంత్ గెటప్ ఆయన అభిమానులు అదుర్స్ అనేలా ఉంది. ఇకపోతే ఇందులో నటుడు సత్యరాజ్ ముఖ్య పాత్ర పోషించనున్నట్లు తాజా సమాచారం. వీరిద్దరూ 38 ఏళ్ల తరువాత మళ్లీ ఈ చిత్రంలో కలిసి నటించనున్నారన్నమాట. ఇంతకు ముందు రజనీకాంత్, సత్యరాజ్ కలిసి తంబిక్కు ఎంద ఊరు, మూండ్రు ముగం, పాయుం పులి, నాన్ సిగప్పు మణిదన్, మిస్టర్ భరత్ చిత్రాల్లో నటించారు. ఈ చిత్రాలన్నింటిలోనూ సత్యరాజ్ విలన్‌గానే నటించారు. మిస్టర్ భరత్ చిత్రంలో రజనీకాంత్‌కు తండ్రిగా నటించారు. అందులో ఎన్నమ్మా కన్ను సౌఖ్యమా అనే పాట సూపర్‌హిట్ అయ్యింది. తొలిసారిగా కూలీ చిత్రంలో రజనీకాంత్‌కు మిత్రుడిగా పాజిటివ్ పాత్రలో నటించనున్నట్లు తెలిసింది. దీంతో పడయప్పతో కట్టప్ప అంటూ అభిమానులు ఖుషీ అవుతున్నారు. కూలీ చిత్రానికి అనిరుధ్ సంగీతం, గిరీశ్ గంగాధరన్ ఛాయాగ్రహణం అందిస్తున్నారు.

భర్తతో విడాకులా?


భర్త వీరేంద్ర చౌదరితో నమిత

తమిళ సినిమా : ఇటీవల సినీరంగంలో విడాకుల వార్తలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆ మధ్య నటుడు ధనుష్, ఐశ్వర్య రజనీకాంత్‌లు విడిపోవడం, ఇటీవల సంగీత దర్శకుడు, నటుడు జీవీ.ప్రకాశ్‌కుమార్ భార్యతో విడిపోవడం వంటి సంఘటనలు కోలీవుడ్‌ను కుదిపేశాయనే చెప్పాలి. ఇప్పటికీ ఈ జంటలు మళ్లీ కలిస్తే బాగుండు అని కోరుకునేవారి శాతం ఎక్కువగానే ఉంది. ఇకపోతే తాజాగా నటి నమిత తన భర్త నుంచి విడిపోయారనే వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. గుజరాత్‌కు చెందిన నమిత తమిళంలో విజయకాంత్‌కు జంటగా ఎంగళ్ అన్నా చిత్రం ద్వారా కథానాయకిగా పరిచయం అయ్యారు. ఆ తరువాత ఇంగ్లీష్‌క్కారన్, బంపర కన్నాలే, కోవై బ్రదర్స్, నాన్ అవనిల్‌లై, బిల్లా వంటి పలు చిత్రాల్లో నటించి పాపులర్ అయ్యారు. పలు తెలుగు చిత్రాల్లోనూ నటించిన నమిత అభిమానుల కలల రాణిగా రాణించారు. అయితే ఆ తరువాత అవకాశాలు తగ్గుముఖం పట్టడంతో 2017లో వీరేంద్ర చౌదరి అనే వ్యక్తిని ప్రేమించి పెళ్లాడారు. కాగా 2022లో నమిత కవల పిల్లలకు జన్మనిచ్చారు. సమీప కాలంలో రాజకీయాల్లో పాల్గొంటున్న నమిత తన భర్త నుంచి విడిపోయారనే వార్త వైరల్ అవుతోంది. దీనిపై స్పందించిన నమిత ఇటీవలే తాను తన భర్త కలిసి తీయించుకున్న ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశామన్నారు. అయినప్పటికీ ఎలాంటి ఆధారాలతో తాము విడిపోయామని ప్రచారం చేస్తున్నారో అర్థం కావడం లేదని వాపోయారు. అయితే నటిగా తాను ఈ రంగంలో చాలా వదంతులను ఎదుర్కొన్నానని, ఇప్పుడిలాంటి వదంతి దొర్లడంతో తానూ, తన భర్త బాధ పడలేదని, పైగా నవ్వుకున్నామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి

తిరువొత్తియూరు: సేలం జిల్లా ఎడపాడి సమీపంలో తాగునీరు కోసం మోటార్ వేసిన సమయంలో విద్యుత్ షాక్ తగిలి ప్లస్ వన్ విద్యార్థి మృతి చెందాడు. సేలం జిల్లా ఎడపాడికి చెందిన కుమార్ కుమారుడు అరుణ్ కుమార్(15). జలకంతాపురం ప్రభుత్వ బాలుర మహోన్నత పాఠశాలలో 11వ తరగతి చదువుతున్నాడు. కుమార్‌కు రెండు ఎకరాల వ్యవసాయ భూమి, ఒక బావి ఉంది. ఇంటిలో తాగునీరు లేకపోవడంతో మోటారు స్విచ్ వేయడానికి అరుణ్ కుమార్ వెళ్లాడు. అయితే చాలా సమయం అయినప్పటికీ తిరిగి రాలేదు. సాయంత్రం పని ముగించుకుని ఇంటికి వచ్చిన కుమార్ నీళ్ల తీసుకు రావడానికి మోటారు గదికి వెళ్లిన సమయంలో అక్కడ అరుణ్ కుమార్ స్పృహ తప్పిన స్థితిలో పడి ఉండడం చూసి దిగ్భ్రాంతి చెందాడు. కుమారుడిని లేపడానికి ప్రయత్నించిన సమయంలో అతనికి విద్యుత్ షాక్ తగిలింది. దీంతో కుమార్ కేకలు వేశాడు. పొరుగువారు విద్యుత్ కనెక్షన్ నిలుపుదల చేసి ఇద్దరినీ ఆసుపత్రిలో చికిత్సకు తరలించారు. అక్కడ అరుణ్ కుమార్ పరిశోధించిన డాక్టర్లు అతను అప్పటికే మృతి చెంది ఉన్నట్టు తెలిపారు. కుమార్‌కు చికిత్స చేయడంతో స్పృహలోకి వచ్చాడు. దీంతో దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

వంతెన అడ్డుగోడను ఢీకొన్న బైక్

- సైనికుడి సహా ఇద్దరు దుర్మరణం

తిరువొత్తియూరు: నెల్లై సమీపంలో సోమవారం తెల్లవారుజామున వంతెన అడ్డుగోడను బైకు ఢీకొన్న ప్రమాదంలో సైనికుడి సహా ఇద్దరు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళితే.. తెన్‌కాశి జిల్లా సంగారంకోయిల్‌కు చెందిన సతీష్ (22) కాశ్మీర్‌లో సైనికుడిగా పనిచేస్తున్నాడు. ఇతను ఒక నెల సెలవుపై గత వారం సొంతూరికి వచ్చాడు. ఈ క్రమంలో ఇతని స్నేహితుడు కమలేష్ (22)తో కలసి నాగర్ కోయిల్‌లో ఉన్న స్నేహితుడిని చూడడానికి వెళ్లాలనుకున్నారు. దీంతో సోమవారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో శంకరం కోయల్ నుంచి బైక్‌లో సతీష్, కమలేష్ నాగర్ కోయిల్‌కు బయలుదేరారు. వారు పాలయం కోటలో పొన్నకుడి సమీపంలో వెళుతుండగా అకస్మాత్తుగా బైకు అదుపుతప్పి వంతెన అడ్డుగోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయపడిన సతీష్, కమలేష్ సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. పల్లం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుటే యువకుడి మృతి

కొరుక్కుపేట: నైవేలిలో పోలీసుస్టేషన్ ఎదుటే యువకుడు కారు ఢీకొని మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన చెన్నై డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కడలూరు జిల్లా నైవేలి సమీపంలోని కీళకొల్లాయ్ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్(36) తమిళనాడు జీవిత హక్కుల పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. గత 25వ తేదీ రాత్రి మద్యం తాగి బైక్‌పై రావడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పత్రాలు అడగడంతో ఇరువర్గాలు వాగ్వాదానికి దిగాయి. అనంతరం పోలీసులు అతడిని పోలీస్ స్టేషన్‌కు తరలించి అక్కడి నుంచి పంపించారు. ఇంతలో అర్ధరాత్రి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్డులో ఉన్న కెమెరాలను పరిశీలించగా.. అర్ధరాత్రి 1 గంటల సమయంలో రాజ్‌కుమార్‌ను ఓ కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై మృతి చెందినట్లు గుర్తించారు. ఆ తర్వాత కారు రిజిస్ట్రేషన్ నెంబర్ ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు. దీని ప్రకారం వడలూరులో జరిగిన వివాహ వేడుకకు చెన్నై నుంచి నలుగురు వ్యక్తులు ఒకే కారులో వచ్చారు. ఈ క్రమంలో ఆ నలుగురిలో హరిహరన్(23) అర్ధరాత్రి కారు తీసుకుని నైవేలి టౌన్‌షిప్‌కు వెళ్లాడు. తిరిగి వడలూరు వైపు వస్తుండగా నైవేలి సిటీ పోలీస్ స్టేషన్ ఎదుట రాజ్ కుమార్ ను కారు ఢీకొనడంతో మృతి చెందినట్లు తేలింది. దీంతో హరిహరన్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు, కారును సీజ్ చేసి, విచారణ జరుపుతున్నారు.

చెన్నైలో బంగ్లాదేశ్ యువకుడి అరెస్టు

- నకిలీ పాస్‌పోర్టుతో మలేషియాకు పయనం

తిరువొత్తియూరు: నకిలీ పాస్‌పోర్టుతో మలేషియాకు వెళ్లడానికి వచ్చిన బంగ్లాదేశ్ యువకుడిని చెన్నై విమానాశ్రయంలో అరెస్టు చేశారు. చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కౌలాలంపూర్‌కు ఎయిర్‌లైన్స్ ప్రైవేటు విమానం బయలుదేరడానికి సిద్ధంగా ఉంది. ఆ విమానంలో ప్రయాణించడానికి వచ్చిన ప్రయాణికుల పాస్‌పోర్టు, ముఖ్య ఆధారాలను మైగ్రేషన్ అధికారులు తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో కోల్‌కత్తా చిరునామాలో ప్లాస్టలీ (31) పేరుతో భారత పాస్‌పోర్ట్‌తో ఒక యువకుడు వచ్చాడు. అతనిపై సందేహం కలిగి పాస్‌పోర్ట్ ప్రత్యేక అధికారులు తనిఖీ చేశారు. అది నకిలీ పాస్‌పోర్ట్ అని తెలిసింది. దీంతో అతని ప్రయాణం రద్దు చేసి, అతడిని విచారణ జరిపారు. అతను బంగ్లాదేశ్‌కు చెందిన వ్యక్తి అని, బంగ్లాదేశ్ నుంచి భారత సరిహద్దుల్లోకి రహస్య ప్రవేశించి, పశ్చిమ బెంగాల్లో కొన్ని నెలలుగా ఉంటున్నట్లు తెలిసింది. భారత చిరునామాతో నకిలీ పాస్‌పోర్ట్ తయారు చేసుకుని కోల్‌కత్తా నుంచి రైలు ద్వారా చెన్నై వచ్చినట్లు తెలిసింది. దీంతో పోలీసులు అతన్ని అరెస్టు చేసి, విచారణ జరుపుతున్నారు.

స్తంభించిన జాతీయరహదారి

- మృతదేహంతో హల్‌చల్
- 3 గంటలు పది కిలోమీటర్ల దూరం యాతన


దీపక్ రాజ మద్దతుదారుల హల్‌చల్

సాక్షి,చెన్నై : తిరునల్వేలి – కన్యాకుమారి జాతీయ రహదారి సోమవారం మధ్యాహ్నం స్తంభించింది. దీపక్ రాజ మృతదేహంతో అతడి సామాజిక వర్గం జాతీయ రహదారిపై హల్‌చల్ చేసింది. వీరి వీరంగాల పుణ్యమాని జాతీయరహదారిలో కిలోమీటర్ల కొద్ది వాహనాలు ఓ వైపు బారులు తీరాయి. మరో వైపు పూర్తిగా వాహన సేవలను ఆపివేశారు. తిరునల్వేలిలో గత వారం ఓ హోటల్ వద్ద ఓ సామాజిక వర్గానికి చెందిన దీపక్ రాజ దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ మృత దేహాన్ని ఏడురోజుల పాటు మార్చురీకే పరిమితం చేశారు. నిందితులను అరెస్టు చేసే వరకు మృత దేహాన్ని తీసుకోబోమని అతడి కుటుంబసభ్యులు, ఆ సామాజిక వర్గ నేతలు స్పష్టం చేశారు. ఎట్టకేలకు తిరునల్వేలి పోలీసు ఉన్నతాధికారులు జరిపిన చర్చలతో సోమవారం మధ్యాహ్నం మృతదేహాన్ని తీసుకునేందుకు అంగీకరించారు. ప్రత్యేక అంబులెన్స్‌లో అతడి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. ఈ సమయంలో హఠాత్తుగా వందలాదిగా ద్విచక్ర వాహనాలు, పదుల సంఖ్యలో నాలుగుచక్రాల వాహనాల్లో ఆ సామాజిక వర్గం అంబులెన్స్‌ను వెంబడిస్తూ ముందుకు సాగింది. వీరి హంగామా, హల్‌చల్‌తో జాతీయ రహదారిలో హై టెన్షన్ వాతావరణం నెలకొంది. ఆగమేఘాలపై జాతీయరహదారిలో బలగాలను మొహరింపజేశారు. తిరునల్వేలి – కన్యాకుమారి జాతీయ రహదారిలో ఓ వైపు పూర్తిగా కొన్ని గంటల పాటు వాహన సేవలు ఆపివేశారు. మరో మార్గంలో ఎక్కడికక్కడ వాహనాలు బారులు తీరాయి. ఏదేని అల్లర్లు బయలుదేరవచ్చన్న ఆందోళనతో ముందు జాగ్రత్తగా జాతీయ రహదారిలో వాహనాలను పోలీసులు ఆపివేశారు. 10 కిలోమీటర్ల దూరం అంబులెన్స్ వెళ్లేందుకు 3 గంటల సమయం పట్టింది. అంత సమయం ఇతర వాహనచోదకులు, ప్రైవేటు, ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణించే వారికి నరకయాతన తప్పలేదు. అదే సమయంలో పొన్నార్ కుడి అనే గ్రామం వద్ద పెద్ద ఎత్తున బలగాలు మోహరించి ఆ సామాజిక వర్గానికి చెందిన వారి వాహనాలను అడ్డుకున్నారు. ఆ తరువాత జాతీయ రహదారిలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు చర్యలు తీసుకున్నారు.

ప్రేమ వ్యవహారంలో యువకుడి హత్య


ఆందోళన చేపట్టిన కుటుంబీకులు, గ్రామస్తులు

- కుటుంబసభ్యులు, గ్రామస్తుల ఆందోళన


హరీష్(ఫైల్)

సేలం: ప్రేమ వ్యవహారంలో ఓ యువకుడిని కత్తితో పొడిచి హత్యచేసిన ఘటన చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితులను అరెస్టు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీస్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మృతుడి కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. ఈరోడ్ జిల్లా సొలంగపాళయం సమీపంలోని క్లాంపాడి మునియప్పంపాళయం ప్రాంతానికి చెందిన హరీష్ (21) తన బంధువుల్లో ఒకరి భవనంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మద్యం సేవించాలని పథకం వేసిన హరీష్ తన స్నేహితుడు గౌతమ్‌తో కలిసి మద్యం కొనుగోలు చేసేందుకు ద్విచక్రవాహనంపై చానర్మేడు రోడ్డుకు వెళ్లాడు. రోడ్డు పక్కన నిలబడిన అదే ప్రాంతానికి చెందిన వెల్లియంగిరి అనే వ్యక్తి హరీష్ వాహనాన్ని ఆపి వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. ఆ సమయంలో అకస్మాత్తుగా వెల్లియంగిరి తాను దాచుకున్న కత్తితో హరీష్ మెడపై పొడిచి పారిపోయినట్లు తెలుస్తోంది. దీంతో రక్తపుమడుగులో ప్రాణాలతో పోరాడుతున్న హరీష్‌ను రక్షించి ఈరోడ్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న మలయంపాలెం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హరీష్ కుటుంబ సభ్యులు, బంధువులు ప్రభుత్వాస్పత్రి వద్దకు చేరుకున్నారు. ఆ సమయంలో అనాటమీ లేబొరేటరీ ఎదుట ధర్నాకు చేపట్టారు. తర్వాత రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఆ సమయంలో హరీష్, వెల్లియంగిరి మధ్య ప్రేమ వ్యవహారంపై శత్రుత్వం నెలకొందని, మారియమ్మన్ ఆలయ ఉత్సవాల్లో ఇప్పటికే ఈ విషయమై గొడవ జరిగిందని, ఇప్పుడు హత్య జరిగిందని హరీష్ కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో తప్పించుకున్న వెల్లియంగిరిని మాత్రమే కాకుండా అతడికి సహకరించిన వారిని కూడా అరెస్టు చేయాలని, ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా తగు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన మలయంపాలెం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ తిరుజ్ఞనసంపంత్‌ను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈరోడ్ రెవెన్యూ కమిషనర్ సతీష్, ఏడీఎస్పీ రాజా రణ్‌వీర్‌లు జరిపిన చర్చల్లో డిమాండ్‌పై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

జడ్జి జీఆర్ స్వామినాథన్ డిస్మిస్ చేయాలి

- పెరియార్ ద్రావిడర్ కళగం డిమాండ్

కొరుక్కుపేట: హిందుత్వ ఆధారిత నేరగాళ్లకు ప్రత్యేకాధికారాలు కల్పిస్తున్న న్యాయమూర్తి జీఆర్ సామినాథన్‌ను డిస్మిస్ చేయాలని పెరియార్ ద్రావిడర్ కళగం డిమాండ్ చేసింది. కోయంబత్తూరులోని గాంధీపురంలోని ఫాదర్ పెరియార్ ద్రవిడర్ కళగం కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణన్ అధ్యక్షతన రాష్ట్ర జనరల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీనియర్ న్యాయవాది ఎన్జీ దురైసామి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆరుస్వామితోపాటు పలువురు రాష్ట్ర, జిల్లా ఇన్‌చార్జిలు పాల్గొన్నారు. ఈ సర్వసభ్య సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. ఇందులో గణతంత్ర, శత జయంతి, ఆత్మగౌరవ ఉద్యమ శతాబ్ది ఉత్సవాలతోపాటు ఈరోడ్, కడలూరు, మదురై, చెన్నై, తిరుచ్చిలో బహిరంగ సభగా ర్యాలీ నిర్వహించనున్నారు. మొదటి ఈవెంట్‌గా జూలై 14న ఈరోడ్‌లో జరగనుంది. మదురై హైకోర్టులోని మదురై శాఖలో ఆర్‌ఎస్‌ఎస్ అనుకూల కార్యక్రమాల్లో పాల్గొనడం, హిందుత్వ నేరగాళ్లకు నేరుగా రాయితీలు ఇవ్వడం వంటి పలు కార్యకలాపాలు చేస్తున్న జడ్జి జీఆర్ స్వామినాథన్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ముల్‌లై పెరియార్ కొత్త డ్యామ్ కట్టాలన్న కేరళ ప్రభుత్వ యోచనకు తమిళనాడు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలన్నారు. తిరుపూర్ జిల్లా ఉడ్‌హిల్ సర్కిల్‌లో అమరావతి డ్యామ్‌కు వచ్చే సిలంది నదికి అడ్డంగా బ్యారేజీ నిర్మించాలని కేరళ ప్రభుత్వం ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, అలాగే తిరువళ్లువర్ ఫెస్టివల్ పేరుతో తమిళనాడు ప్రభుత్వం ఆమోదించి విడుదల చేసిన తిరువల్లువర్ చిత్రాన్ని విస్మరించి, మత చిహ్నంతో కూడిన కాషాయ దుస్తులు ధరించిన చిత్రాన్ని ఉపయోగించి తిరువల్లువర్, తిరుక్కురల్ పరువు తీశారని ఈ మహాసభలో కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా ఖండిస్తూ తీర్మానాలు చేశారు.

కోలుకుంటున్న పెరమానళ్లూరు ప్రజలు

పళ్లిపట్టు: పెరుమానళ్లూరులో అస్వస్థతకు గురైన వారు క్రమంగా కోలుకుంటున్నారు. పెరుమానళ్లూరులో తాగునీటిలో మురుగునీరు కలిసి 34 మందికి వాంతులు విరేచనాలై అస్వస్థతకు గురైన విషయం తెలిసింది. దీంతో తిరుత్తణి ప్రభుత్వాస్పత్రి వైద్య బృందం బాధితులకు చికిత్స అందించడంతో వారు కోలుకుంటున్నారు. అదే సమయంలో అధికారుల బృందం పారిశుద్ధ్యం, పైపులైన్లు మార్పే ఏర్పాట్లు శరవేగంగా చేపట్టారు. అలాగే మండల వైద్యాధికారి డాక్టర్ ధనంజెయన్ ఆధ్వర్యంలో వైద్య బృందం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య పరీక్షలతో పాటు మందులు మాత్రలు పంపిణీ చేశారు. పంచాయతీరాజ్ శాఖ జిల్లా సహాయ డైరెక్టర్ భరణి, రాజ్‌కుమార్, బీడీఓలు సాయి శివకుమార్, అరుల్ బృందం గ్రామంలో కొత్తగా తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేశారు. అంతకు ముందు తాగునీరు క్లోరినేషన్ చేసి ట్యాంకుల ద్వారా గ్రామస్తులకు నీటిని సరఫరా చేశారు. పరిస్థితి అదుపులోకి వచ్చిందని, కొత్తగా ఆరోగ్య సమస్యలు తలెత్తలేదని వైద్యాధికారులు తెలిపారు.


పెరమానళ్లూరు దళితవాడలో తాగునీటి సరఫరా పనులు పరిశీలిస్తున్న అధికారుల బృందం

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

పళ్లిపట్టు: అమ్మయార్‌కుప్పంలో ఆదివారం రాత్రి ద్రౌపదీదేవి ఆలయ ఆవరణలో వెయ్యి మందికి పైగా భక్తులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఆర్కే పేట యూనియన్ అమ్మయార్‌కుప్పంలోని ద్రౌపదీదేవి ఆలయంలో మే 9న అగ్నిగుండ వేడుకలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. 18 రోజుల పాటు నిర్వహించిన వేడుకలు సందర్భంగా అమ్మవారికి అభిషేక పూజలు చేసి, ఊరేగించారు. ఆదివారం సాయంత్రం అగ్నిగుండ మహోత్సవం సందర్భంగా వెయ్యికి పైబగా భక్తులు కంకణాలు ధరించి రాత్రి 7 గంటల సమయంలో స్థానిక బస్టాండ్ నుంచి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అగ్నిగుండం ఎదురుగా ద్రౌపదీదేవి కొలువుదీరగా, అగ్నిగుండానికి పూజలు చేసి, గోవింద నామస్మరణల నడుమ భక్తులు అగ్నిగుండం ప్రవేశం చేసి, తమ మొక్కులు చెల్లించారు. అగ్నిగుండ వేడుకల్లో అమ్మయార్‌కుప్పం చుట్టు పక్కల గ్రామస్తులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం ధర్మరాజు పట్టాభిషేకంతో వేడుకలు ముగిశాయి.


అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

పోలీసు స్టిక్కర్ ఉన్న కారు సీజ్


కారు స్వాధీనం చేసుకున్న మోటారు వాహన సీఐ సుమేష్

తిరుత్తణి: పోలీస్ స్టిక్కర్‌తో పయనించిన కారును మోటారు వాహన సీఐ సోమవారం సీజ్ చేశారు. తిరుత్తణి పరిసర ప్రాంతాల్లో నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులను నియంత్రించేందుకు పోలీసులు అంతర్ రాష్ట్ర సరిహద్దులో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం చెన్నై తిరుపతి జాతీయ రహదారి మార్గంలోని పొన్పాడి చెక్‌పోస్టు వద్ద మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ సుమేష్ వాహనాల తనిఖీ చేపట్టగా ఆంధ్రప్రదేశ్ నుంచి పోలీస్ స్టిక్కర్‌తో తమిళనాడు వైపు వచ్చిన కారును ఆపి తనిఖీ చేశారు. అనుమతి లేకుండా పోలీస్ స్టిక్కర్‌తో టూరిస్ట్ కారును వైట్ బోర్డుతో నడిపినట్లు, రాష్ట్రంలో ప్రవేశానికి సంబంధించి పన్ను చెల్లించకపోవడం గుర్తించి, ఆ కారును సీజ్ చేసి, ఆర్టీఓ కార్యాలయానికి తరలించారు.

విద్యుదాఘాతంతో వైద్యురాలి మృతి


మృతి చెందిన శరణిత, చేతికి తగిలిన గాయం

కొరుక్కుపేట: ల్యాప్‌టాప్‌ను చార్జింగ్ చేస్తుండగా విద్యుదాఘాతంతో వైద్యురాలు మృతి చెందిన సంఘటన విషాదం నింపింది. నామక్కల్ జిల్లా కిల్ వెల్లూరు ప్రాంతానికి చెందిన శరణిత (32) ఎంబీబీఎస్ చదివిన తర్వాత ఉన్నత చదువుల కోసం చెన్నైలోని అయనావరంలోని సైకియాట్రిక్ హాస్పిటల్‌లో ట్రైనీ డాక్టర్‌గా పనిచేశారు. ఈ క్రమంలో శరణిత అయనావరం కున్నూర్ హైవేలోని బాలికల హాస్టల్‌లో ఉంటున్నారు. ఆమె భర్త ఉదయకుమార్ కోయంబత్తూరులోని ఈఎస్ఐ హాస్పిటల్‌లో డాక్టర్‌గా పని చేస్తున్నారు. ఆదివారం తన భార్య సెల్‌ఫోన్ ఉదయ్ కుమార్ ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫోన్ లిఫ్ట్ చేయక పోవడంతో ఉదయకుమార్ ఉద్వేగానికి లోనయ్యాడు. దీంతో ఆయన హాస్టల్‌లోని కార్యాలయానికి ఫోన్ చేసి, తన భార్యతో మాట్లాడాలని చెప్పాడు. ఈ క్రమంలో హాస్టల్ సిబ్బంది కమల, క్లీనింగ్ సిబ్బంది వెళ్లి చూడగా శరణిత నోటిపై రక్తంతో అపస్మారక స్థితిలో ఉన్నట్టు చూసి షాక్ అయ్యారు. దీనిపై సమాచారం అందుకున్న అయనావరం ఇన్‌స్పెక్టర్ భరణినాథన్ నేతృత్వంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం ఆమె బంధువు నటరాజన్‌ను పిలిపించి విచారించారు. శరణిత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కీల్పాక్కం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డాక్టర్ చేతి నుంచి రక్తం కారుతున్న సంకేతాలున్నాయి. ల్యాప్‌టాప్‌ను చార్జింగ్ చేస్తుండగా ఛార్జింగ్ వైర్ కాస్త దెబ్బతినిందని, దీంతో విద్యుత్ ప్రవహించడం వల్లే శరణిత మృతి చెందినట్లు పోలీసుల విచారణలో తేలింది. కేసు నమోదు చేసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

రూ.32 లక్షలు విలువైన ఈ-సిగరెట్లు స్వాధీనం

తిరువొత్తియూరు: తిరుచ్చి విమానాశ్రయంలో మలేషియా నుంచి అక్రమంగా తరలించిన రూ.32 లక్షల విలువ కలిగిన ఈ-సిగరెట్లును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మలేషియా రాజధాని కౌలాలంపూర్ నుంచి తిరుచ్చి విమానాశ్రాయానికి పాటిక్ ఎయిర్ లైన్స్ విమానం ఆదివారం రాత్రి వచ్చింది. ఇందులో వచ్చిన ప్రయాణికులు వారి పాస్‌పోర్ట్‌లను ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు తనిఖీ చేశారు. ఆ సమయంలో ఒక ప్రయాణికుడి వద్ద తనిఖీ చేయగా అతని బ్యాగులో గుర్తు తెలియని ఏదో వస్తువు ఉన్నట్లు తెలిసింది. దీంతో బ్యాగ్‌ను తెరిచి చూడగా అందులో 1,285 ఇ-సిగరెట్ ప్యాకెట్లు ఉన్నాయి. వాటి విలువ రూ.32.12 లక్షలు ఉంటుంది. దీంతో ఈ-సిగరెట్ల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న అధికారులు ఆ వ్యక్తి వద్ద విచారణ చేస్తున్నారు.

హాస్టల్ భోజనం తిన్న విద్యార్థినులకు అస్వస్థత


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శిస్తున్న కలెక్టర్

- సేలంలో ప్రైవేటు నర్సింగ్ కాలేజీలో కలకలం

సేలం: హాస్టల్‌లో భోజనం చేసిన విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటన సేలంలోని ప్రైవేటు నర్సింగ్ కాలేజీలో సోమవారం కలకలం రేపింది. సేలం సమీపంలోని కుప్పనూరు ప్రాంతంలో నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ నర్సింగ్ కాలేజీలో 100 మందికి పైగా విద్యార్థులు కాలేజీ క్యాంపస్‌లోని హాస్టల్లో ఉంటూ చదువుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం విద్యార్థులకు యథావిధిగా భోజనం అందించారు. అయితే ఆ తర్వాత కొంతసేపటికే విద్యార్థినులు ఒకరి తర్వాత ఒకరు అకస్మాత్తుగా వాంతులు, విరేచనాలు చేసుకుంటూ స్పృహ కోల్పోయారు. బాలికల పరిస్థితి విషమించడంతో వెంటనే సేలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అపస్మారక స్థితిలో సేలం ప్రభుత్వాసుపత్రికి వచ్చిన విద్యార్థులను ప్రభుత్వ వైద్యులు చికిత్స అందిస్తున్నారు. 60 మందికి పైగా విద్యార్థినులను ప్రత్యేక యూనిట్లలో చేర్చి తీవ్ర చికిత్స అందిస్తున్నారు. ఆహారం తిని విద్యార్థినులు వాంతులు చేసుకున్నారని తెలుసుకున్న వారి తల్లిదండ్రులు, బంధువులు ఆస్పత్రికి రావడంతో అక్కడ తోపులాట చోటుచేసుకుంది. అనంతరం జిల్లా కలెక్టర్ బృందాదేవి సేలం ప్రభుత్వాసుపత్రికి వెళ్లి విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారంపై ప్రైవేట్ మెడికల్ నర్సింగ్ కాలేజీ యాజమాన్యాన్ని వివరణ కోరాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయమై సేలం జిల్లా ఆహార భద్రతా విభాగం అధికారి కదిరవన్ ముఖ్య అధికారులు కళాశాల క్యాంటీన్‌లో వివిధ రకాల లోపాలు గుర్తించి ఆహారం, తాగునీటి నమూనాలను సేకరించి, జరిపిన విచారణలో సరైన అనుమతి లేకుండా క్యాంటీన్ నిర్వహిస్తున్నట్లు తేలింది. క్యాంటీన్‌కు సీల్ వేసి, తగు అనుమతులు పొందిన తర్వాతే నిర్వహించాలని ఆదేశించారు.

ప్రతిభావంతులకు ‘టైం’ ఘన సత్కారం



సత్కారాలు అందుకున్న ప్రతిభావంతులు

సాక్షి, చెన్నై: టైం సంస్థ నేతృత్వంలో జరిగిన క్యాట్, ఇతర మేనేజ్ మెంట్ పరీక్షలలో ప్రతిభ కనబరిచి, వివిధ విద్యా సంస్థలలో చేరిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. చెన్నై చెట్‌పేట్‌లోని చిన్మయ హెరిటేజ్ సెంటర్‌లో సోమవారం వార్షిక అచీవర్స్ మీట్–2024 కార్యక్రమం జరిగింది. ఇందులో అచీవర్స్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా టైం చెన్నై సెంటర్ డైరెక్టర్ అరవింద్‌కుమార్ మాట్లాడుతూ ఐఐఎం, ఎఫ్ఎంఎస్, ఎన్ఐఎంఐఎంఎస్, ఎస్ఐబీఎం తదితర అగ్రశ్రేణి విద్యాసంస్థలలో చేరిన వారికే కాదు, చేరబోయేందుకు సిద్ధమవుతున్న వారిని ప్రోత్సహించే విధంగా తాము ముందుకెళ్తున్నామన్నారు. రాబోయే రోజులలో వివిధ పరీక్షల కోసం సన్నద్ధమవుతున్న వారికి మరింత తోడ్పాటు ఇవ్వనున్నామన్నారు. టైం క్యాట్ కోర్సు హెడ్ సత్యనారాయణన్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యార్థులు, పూర్వ విద్యార్థులు సాధించిన విజయాలు తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు. విద్యార్థుల విజయగాథలే తమ నాణ్యత, విద్యాపరంగా మద్దతు, అంకిత భావానికి నిదర్శనంగా పేర్కొన్నారు. సీనియర్ అధ్యాపకులు శశిధర్ ఉన్ని, బెంగళూరు ఐఐఎంకు చెందిన నందిని, ఐఐఎం కోలికోడ్ గ్రాడ్యుయేట్ నిత్య రత్న, ఐఐఎం శివబాల తదితరులు ప్రసంగించారు.

భార్యను కాపురానికి పంపలేదని..

మామను కొట్టి చంపిన అల్లుడు

కొరుక్కుపేట: భార్యను కాపురానికి పంపించ లేదని మామను అల్లుడు కొట్టి చంపాడు. తూత్తుకుడి జిల్లా పుదుకోట్టై సమీపంలోని తిరివాయపురం తూర్పు వీధికి చెందిన కరియాడ మణి(55) కుమార్తె వీణతో తూత్తుకుడి చిన్నకణ్ణుపురానికి చెందిన ఆనంద్(26)కు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వివాదాల కారణంగా అల్లుడు ఆనంద్, అతని భార్య వీణ ఏడాది కాలంగా విడివిడిగా నివశిస్తున్నారు. ఈ క్రమంలో భార్యను కాపురానికి పపించాలని మణిని అడగడానికి ఆనంద్ వెళ్లాడు. అయితే తన కుమార్తెను పంపడానికి మణి నిరాకరించాడు. దీంతో తీవ్ర ఆవేశంతో ఉన్న ఆనంద్ ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో మామ ఇంటికి వెళ్లాడు. అక్కడ మామతో తన భార్యను కాపురానకి ఎందుకు పంపించవు అంటూ గొడవ పడ్డాడు. ఆ సమయంలో తీవ్ర ఆవేశానికి గురైన ఆనంద్ అక్కడే ఉన్న చెక్క కర్రతో కొట్టాడు. మణి రక్తపు మడుగులో గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని పరారీలో ఉన్న ఆనంద్ కోసం గాలిస్తున్నారు.

కౌంటింగ్ సెంటర్‌లో స్పృహతప్పి ఎస్ఐ మృతి


ఎస్ఐ రవిచంద్రన్

కొరుక్కుపేట: ఎన్నికల కౌంటింగ్ సెంటర్‌లో బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్ఐ స్పృహ తప్పి పడిపోయి మృతి చెందడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. రామనాథపురం జిల్లా సాయల్‌గుడికి చెందిన రవిచంద్రన్ (59) పరమక్కుడి తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్నారు. ఆయనకు అన్నా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రామనాథపురం ఓట్ల లెక్కింపు కేంద్రంలో సెక్యూరిటీ డ్యూటీ కేటాయించారు. రొటేషన్ పద్ధతిలో ఇక్కడ పనిచేస్తున్నారు. రవిచంద్రన్ ఆదివారం రాత్రి విధుల్లో ఉన్నాడు. రాత్రి భోజనం చేశాక రవిచంద్రన్ స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే రెస్క్యూ డ్యూటీలో ఉన్న తోటి పోలీసులు ఆయన్ని అంబులెన్స్‌లో రామనాథపురం ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. అక్కడ రవిచంద్రన్‌ను పరీక్షించారు. ఆయన అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామనాథపురం మెడికల్ కాలేజీ మార్చురీలో ఉంచారు. పోస్టుమార్టం అనంతరం రవిచంద్రన్ మృతదేహాన్ని స్వగ్రామం సాయల్ గుడికి తీసుకొచ్చి పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. వచ్చే ఏడాది ఉద్యోగ విరమణ చేయాల్సిన ఎస్ఐ కౌంటింగ్ కేంద్రంలో అకస్మాత్తుగా స్పృహ తప్పి మృతి చెందడం స్వగ్రామంలో తీవ్ర విషాదం నింపింది.

అవినీతి ఆరోపణలతో ఎస్ఐ, పోలీస్ బదిలీ

కొరుక్కుపేట: వానూరు సమీపంలోని మోరతాండి టోల్‌గేట్ వద్ద భారీ వాహన డ్రైవర్ల నుంచి లంచం తీసుకున్న సబ్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్‌ను సాయుధ దళాల విభాగానికి బదిలీ చేశారు. విల్లుపురం జిల్లా పట్టనూర్ సమీపంలోని మోరతాండి టోల్‌గేట్ సమీపంలో ఎస్ఐ భూమినాథన్, కానిస్టేబుల్ అబ్దుల్ రషీద్ విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా ఆదివారం రాత్రి టోల్‌గేట్ వద్ద విధులు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో ప్రయాణిస్తున్న భారీ వాహనదారుల నుంచి లంచం తీసుకుంటున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియో విడుదలైన తర్వాత, జిల్లా ఎస్పీ దీపక్ శివన్ సంబంధిత అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ భూమినాథన్, కానిస్టేబుల్ అబ్దుల్ రషీద్‌లను సాయుధ దళాల విభాగానికి బదిలీ చేస్తూ ఆదేశించారు. లంచాలకు సంబంధించి శాఖాపరమైన విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. విచారణ అనంతరం ఇద్దరు పోలీసు అధికారులను సస్పెండ్ చేయనున్నట్లు తెలుస్తోంది.

రైలు పట్టాలపై దూకి విద్యార్థి ఆత్మహత్యాయత్నం

తిరువొత్తియూరు: తిరుచ్చి జంక్షన్ వంతెన పైనుంచి రైలు పట్టాలపైకి దూకి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించిన విద్యార్థి గాయపడ్డాడు. తిరుచ్చి జంక్షన్ రైల్వే వంతెనపై సోమవారం ఉదయం 23 సంవత్సరాల వయసు కలిగిన యువకుడు ఒకరు నిలబడి ఉన్నాడు. హఠాత్తుగా అతను వంతెన పైనుంచి 50 అడుగుల ఎత్తు నుంచి రైలు పట్టాల పైకి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఆ సమయంలో రైలు పట్టాల ట్రాక్ పైన ఉన్న విద్యుత్ తీగపై పడ్డాడు. ఇందులో హై వోల్టేజీ విద్యుత్తు షాక్ కొట్టడంతో రైలు పట్టాలపైకి దూరంగా విసిరి వేయబడ్డాడు. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు విచారణ చేపట్టారు. తర్వాత అతన్ని అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అతనికి చికిత్స చేస్తున్నారు. పోలీసులు విచారణలో అతను కరూర్ జిల్లా తోగైమలై తెలుంగుపట్టికి చెందిన పరుగు పందెం క్రీడాకారుడు అజయ్ అని తెలిసింది. డిప్లమా చివరి సంవత్సరం పరీక్షలు రాసి ఫలితాల కోసం వేచి ఉన్నాడు. గత కొన్ని రోజులుగా మానసిక ఒత్తిడికి గురైన అతను పత్రిలో చికిత్స పొందుతూ ఉన్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం బయటికి వచ్చిన అతను తిరిగి ఇంటికి వెళ్లలేదు. పలుచోట్ల బంధువులు అతని కోసం గాలించారు. ఈ క్రమంలో తిరుచ్చికి వచ్చిన అతను సోమవారం ఉదయం రైలు పట్టాలపైకి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు తెలిసింది. దీని గురించి అతని బంధువులకు పోలీసులు సమాచారం అందించారు. దీనిపై పోలీసులు నమోదు చేసి విచారణ చేస్తూ ఉన్నారు.

ఎన్నికల ఎఫెక్ట్... టూ వీలర్లు, ఫ్రిజ్ సేల్స్ రయ్!

సింగిల్ డోర్ ఫ్రిజ్‌లు, చిన్న బైక్‌లకు డిమాండ్

సార్వత్రిక ఎన్నికల కారణంగా ఆటోమొబైల్, గృహోపకరణాల మార్కెట్లో సందడి నెలకొంది. ముఖ్యంగా ఎంట్రీ లెవెల్ టూ వీలర్లు, గృహోపకరణాలకు ఒక్కసారిగా డిమాండ్ పుంజుకుంది. ఇదంతా ఎన్నికల చలవేనంటున్నాయి పరిశ్రమ వర్గాలు. నిజానికి వీటి కొనుగోళ్లు కొద్ది నెలలుగా తీవ్రంగా మందగించాయి. ఎన్నికల హడావుడి మొదలయ్యాక ఏప్రిల్, మే నెలల్లో వీటి అమ్మకాలు భారీగా పెరిగాయి. 125 సీసీ వరకు ఇంజిన్ సామర్థ్యం, రూ.లక్ష వరకు ధర ఉన్న చిన్న టూ వీలర్ల విక్రయాల్లో 33 శాతం వృద్ధి నమోదైందని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఫాడా) ప్రెసిడెంట్ మనీశ్ రాజ్ సింఘానియా వెల్లడించారు. కరోనా విలయం తర్వాత ప్రీమియం టూ వీలర్లకు డిమాండ్ పుంజుకుంటున్నా ఎంట్రీ లెవెల్ విభాగంలో మాత్రం అమ్మకాలు నత్తనడకన వచ్చాయి. ''కానీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వాలిచ్చే ప్రోత్సాహకాలకు తోడు పార్టీలు సైతం భారీగా ఖర్చుకు తెరతీయడంతో అల్పాదాయ కుటుంబాల చేతిలో డబ్బులు ఆడుతున్నాయి. దాంతో చిన్న టూ వీలర్లు, ఫ్రిజ్‌ల వంటివాటిని భారీగా కొంటున్నారు' అని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. మండుటెండల దెబ్బకు రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, కూలర్ల కొనుగోళ్లు పెరిగాయి. ఎంట్రీ లెవెల్ సింగిల్ డోర్ ఫ్రిజ్‌లు శరవేగంగా అమ్ముడవుతున్నాయని గోద్రెజ్ అప్లయెన్సెస్ బిజినెస్ హెడ్ కమల్ నంది పేర్కొన్నారు. ''చాలాకాలంగా ఈ విభాగంలో అమ్మకాల వృద్ధి సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. ఇప్పుడు మాత్రం ప్రీమియం సెగ్మెంట్‌తో సమానంగా వీటి సేల్స్ నమోదవుతున్నాయి'' అని వివరించారు.

ఎన్నికల ఖర్చు రికార్డ్...


రాజకీయ విశ్లేషకుల అంచనా ప్రకారం 2024లో సార్వత్రిక ఎన్నికలు, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో వ్యయం గత రికార్డులన్నింటినీ బద్దలు కొట్టనుంది. ఈ ఏడాది ఎన్నికల సీజన్‌లో పార్టీలు, అభ్యర్థుల ఖర్చు రూ.1.35 లక్షల కోట్లు దాటొచ్చని స్వచ్ఛంద సంస్థ సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ (సీఎంఎస్)కు చెందిన ఎన్. భాస్కరరావు అంచనా వేశారు.

కింగ్ వర్సెస్ క్వీన్

- మండి లోక్‌సభ స్థానంలో ఆసక్తికర పోరు
- కంగనా, విక్రమాదిత్య సింగ్ హోరాహోరీ

హిమాచల్‌ప్రదేశ్‌లో రాజవంశీయుల కంచుకోట అయిన మండి లోక్‌సభ స్థానంలో 'కింగ్', 'క్వీన్' మధ్య ఆసక్తికర పోరు సాగుతోంది. క్వీన్ తదితర సినిమాలతో అలరించిన బాలీవుడ్ నటి కంగనా రనౌత్ బీజేపీ తరఫున ఎన్నికల అరంగేట్రం చేస్తున్నారు. రాంపూర్ బుషహర్ రాజ సంస్థాన వారసుడు విక్రమాదిత్యసింగ్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆమెతో తలపడుతున్నారు. దాంతో ఇక్కడ విజయం రెండు పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారింది...

\- సాక్షి, నేషనల్ డెస్క్



తొలి నుంచీ రాజులే...

పార్టీలేవైనా మండిలో రాజకుటుంబీకుల హవాయే కొనసాగుతూ వస్తోంది. రెండు ఉప ఎన్నికలతో సహా 19సార్లు లోక్‌సభ ఎన్నికలు జరిగితే 13సార్లు రాజ కుటుంబీకులే గెలిచారు. కాంగ్రెస్‌కు ఇక్కడ బలమైన ఓటు బ్యాంకు ఉంది. పీసీసీ చీఫ్, సిట్టింగ్ ఎంపీ ప్రతిభా సింగ్ ఈసారి పోటీ చేయబోనని ప్రకటించారు. బీజేపీ నుంచి కంగనా బరిలో దిగడంతో తనయుడు విక్రమాదిత్య సింగ్‌ను బరిలో దించారు. ఆయన సిమ్లా (రూరల్) నుంచి రెండుసార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. రాష్ట్ర మంత్రిగా ఉన్నారు. ఆయన తండ్రి వీరభద్రసింగ్ ఏకంగా ఆరుసార్లు రాష్ట్ర సీఎంగా చేశారు. తల్లిదండ్రులిద్దరూ మండి లోక్‌సభ స్థానం నుంచి మూడేసిసార్లు నెగ్గారు. 2021 మండి ఉపఎన్నికలో తల్లి కోసం విక్రమాదిత్య విస్తృతంగా ప్రచారం చేశారు.

కంగనాకు ఆదరణ...

కంగనాకు ఊహించని వర్గాల నుంచి మద్దతు లభిస్తోంది. మాజీ సీఎం, బీజేపీ సీనియర్ నాయకుడు జైరాం ఠాకూర్ మద్దతుతో పాటు మండి లోక్‌సభ స్థానం పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లన్నీ బీజేపీ చేతిలోనే ఉండటం ఆమెకు కలిసొచ్చే అంశాలు. తొలుత ఆమె అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించిన సీనియర్ నేత మహేశ్వర్ సింగ్ తర్వాత మనసు మార్చుకున్నారు. కార్గిల్ యుద్ధ వీరునిగా స్థానికంగా బాగా ఆదరణ ఉన్న బ్రిగేడియర్ (రిటైర్డ్) ఖుషాల్ ఠాకూర్, కేంద్ర మాజీ మంత్రి సుఖ్‌రామ్ మనవడు ఆశ్రయ్ శర్మ తదితరులు కంగనాకు మొదటినుంచి మద్దతిస్తున్నారు.

పరస్పర విమర్శలు...

పరస్పర విమర్శల్లో కంగనా, విక్రమాదిత్య ఇద్దరూ హద్దులు దాటిపోయారు. ఎన్నడూ లేనంతగా వ్యక్తిగత దాడులకు దిగుతున్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై కంగనాకు ఎలాంటి విజన్ లేదని, ఆమె కేవలం పొలిటికల్ టూరిజం చేస్తున్నారని విక్రమాదిత్య ఎద్దేవా చేస్తుంటే, ఆయనను 'చోటా పప్పు' అంటూ కంగనా ఎగతాళి చేస్తున్నారు. రైతులపై కంగనా అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో సంయుక్త కిసాన్ మంచ్ విక్రమాదిత్యకు మద్దతిస్తోంది. హిమాచల్‌లో విపత్తు వేళ బాధితుల పట్ల కంగనా సానుభూతి చూపలేదని, మండిని కనీసం సందర్శించలేదని విమర్శలున్నాయి. ఒక్కసారి చాన్సిస్తే నియోజకవర్గ ప్రజల కోసం పనిచేస్తానని కంగనా అంటున్నారు. గిరిజన ప్రాంతాలకు కనెక్టివిటీ మెరుగుపరచడం, ఆగిన ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు స్థానిక సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ పర్యాటకాన్నీ ప్రోత్సహిస్తానని హామీ ఇస్తున్నారు. మండీని స్మార్ట్ సిటీగా మారుస్తానని విక్రమాదిత్య వాగ్దానం చేస్తున్నారు.



'మండి' ప్రస్థానం..

మండిని ఒకప్పుడు మండి మహాసు నియోజకవర్గంగా పిలిచేవారు. ఆరు జిల్లాల్లో విస్తరించిన ఈ నియోజకవర్గంలో 13,77,173 మంది ఓటర్లున్నారు. దీని పరిధిలో ఏకంగా 17 అసెంబ్లీ సెగ్మెంట్లుండటం విశేషం. వీరభద్రసింగ్ 1971లో తొలిసారి ఇక్కడి నుంచి గెలిచారు. 1977లో ఎమర్జెన్సీ వ్యతిరేక వెల్లువలో ఓటమి చవిచూసినా 1980లో మళ్లీ విజయం సాధించారు. 1989లో బీజేపీ, 1991, 1996ల్లో కాంగ్రెస్, 1998, 1999 ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించాయి. 2004లో ప్రతిభా సింగ్ తొలిసారి గెలిచారు. 2009లో మళ్లీ వీరభద్ర సింగ్ విజయం సాధించారు. ఆయన సీఎంగా కావడంతో 2013లో జరిగిన ఉప ఎన్నికలో ప్రతిభాసింగ్ నెగ్గారు. 2014, 2019ల్లో బీజేపీకి చెందిన రామ్ స్వరూప్ శర్మ గెలుపొందారు. 2021లో ఆయన మరణంతో జరిగిన ఉప ఎన్నికలో మళ్లీ ప్రతిభా సింగ్ గెలిచారు.

ఎవరిని ఎన్నుకుందాం?!

హిమాచల్‌లో తొలి ఓటర్ల డైలమా • విద్య, ఉద్యోగావకాశాలు, భద్రతే ప్రాథమ్యాలు



400కు పైగా అని ఒక కూటమి. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని మరో కూటమి. హోరాహోరీగా సాగిన సార్వత్రిక ఎన్నికల పోరు తుది అంకానికి చేరుతోంది. జూన్ 1న చివరిదైన ఏడో విడతతో దేశవ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియ ముగియనుంది. చివరి విడతలో పోలింగ్ జరుగుతున్న రాష్ట్రాల్లో హిమాచల్‌ప్రదేశ్ ఒకటి. అక్కడి తొలి ఓటర్లు పలు అంశాలపై చురుగ్గా స్పందిస్తున్నారు. నాణ్యమైన విద్య, ఉద్యోగావకాశాలు, మహిళా భద్రత తదితరాలకే తమ ప్రాధాన్యత అని చెబుతున్నారు. అయితే అధికార ఎన్డీఏ, విపక్ష ఇండియా కూటముల్లో ఎవరికి ఓటేయాలో తేల్చుకోలేని డైలమాలో ఉన్నామని ఈ యంగ్ ఓటర్స్‌లో పలువురు అంటున్నారు. నోటాకే తమ ఓటని పలువురు చెబుతుండటం విశేషం. రాష్ట్రంలో 4 లోక్‌సభ సీట్లతో పాటు ఉప ఎన్నికలు జరుగుతున్న 6 అసెంబ్లీ స్థానాలకు జూన్ 1న పోలింగ్ జరగనుంది.

ఉచితాలు అనుచితాలే...!

కొన్నేళ్లుగా పార్టీలన్నీ పోటాపోటీగా ప్రకటిస్తున్న పలు ఉచిత హామీలపై, అమలు చేస్తున్న ఉచిత పథకాలపై యువ ఓటర్లలో మిశ్రమ స్పందన వ్యక్తమవుతుండటం విశేషం. ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉచిత పథకాల భారమంతా అంతిమంగా పన్నులు చెల్లిస్తున్న మధ్యతరగతి ప్రజానీకంపైనే పడుతోందని వారంటున్నారు. అధికారంలోకి వచ్చే పార్టీ ఏదైనా హిమాచల్‌లో ఉచితాలను నిలిపివేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. ''అభివృద్ధి పనులకు ఉపయోగించాల్సిన నిధులు ఉచితాల కారణంగా పక్కదారి పడుతున్నాయన్నది నిస్సందేహం'' అంటున్నారు సోలన్‌కు చెందిన రియా. ఆమె ఈ ఎన్నికల్లో తొలిసారి ఓటేస్తున్నారు. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపైనా యువత నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. పదేళ్ల బీజేపీ పాలనను కొందరు విమర్శిస్తుంటే మరికొందరు ప్రశంసిస్తున్నారు. ''బీజేపీ సారథ్యంలోని నియంతృత్వమా? విపక్ష ఇండియా కూటమి సంకీర్ణమా? కేంద్రంలో ఎవరికి మద్దతివ్వాలో తేల్చుకోలేకపోతున్నా. ఏమైనా రాజకీయాల్లో సానుకూల మార్పు మాత్రం కోరుకుంటున్నా'' అంటున్నాడు మరో ఓటరు నితీశ్. బీజేపీ సర్కారు అహంకారపూరితంగా వ్యవహరిస్తోందని, రాజ్యాంగ సంస్థలన్నింటినీ దుర్వినియోగం చేస్తోందని డిగ్రీ ఫస్టియర్ విద్యార్థి రోహిత్ విమర్శిస్తున్నారు. ''మోదీకి ఓటేయడమంటే నియంతృత్వాన్ని సమర్థించడమే. అయితే సంకీర్ణ ప్రభుత్వాలు కూడా దేశానికి మంచివి కావు. కనుక ఇండియా కూటమికి ఓటేయడం కూడా సరికాదు'' అంటున్నాడతను!

\- సాక్షి, నేషనల్ డెస్క్

ఔత్సాహిక జర్నలిస్టు...

సంజౌలీ ప్రభుత్వ పీజీ కాలేజీలో జర్నలిజం చదువుతున్న అన్షుల్ ఠాకూర్ ఈసారి ఓటేయాలని ఉత్సాహంతో ఉన్నాడు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు కల్పించి, మహిళలకు భద్రతను పెంచేవారికే తన ఓటని స్పష్టంగా చెబుతున్నాడు. పారిశ్రామికవేత్త కావాలన్నది తన కల అని మరో పీజీ విద్యార్థి పరీక్షిత్ అంటున్నాడు. ఆధునిక సాంకేతికతను, స్టార్టప్ సంస్కృతిని, యువతను ప్రోత్సహించే వారికే తన ఓటని చెబుతున్నాడు. ''ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఉమ్మడి పౌరస్మృతి, నూతన విద్యా విధానాలను సమర్థంగా అమలు చేయాలి. ఈశాన్య ప్రాంతాలతోపాటు లద్దాఖ్ వంటి ప్రదేశాలపై దృష్టి పెట్టాలి. భారత సంస్కృతిని పరిరక్షించాలి. తొలిసారి ఓటరుగా ఇది నా ఆకాంక్ష'' అని సంజౌలీ పీజీ కాలేజీకి చెందిన మరో విద్యార్థి వశిష్ట్ శర్మ చెప్పాడు. అభ్యర్థులెవరూ నా అంచనాలకు తగ్గట్టుగా లేరు. అందుకే నా తొలి ఓటు నోటాకే'' అని మంచీకి చెందిన అదితి ఠాకూర్ చెప్పుకొచ్చింది.

ఆన్‌లైన్‌లో పాఠ్య పుస్తకాలు

▶ మొదటి పేజీ తరువాయి

జగనన్న విద్యా కానుక (జేవీకే) కిట్లను అందిస్తోంది. వచ్చే నెల 12న ప్రారంభమయ్యే నూతన విద్యా సంవత్సరానికి కూడా ఈ కిట్లు సిద్ధమవుతున్నాయి. పాఠ్య పుస్తకాలు మండల స్టాక్ పాయింట్లకు చేరుతున్నాయి. మరోపక్క 1 నుంచి 10 తరగతుల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్‌లోనూ పాఠ్య పుస్తకాలను అందుబాటులోకి తెచ్చింది. తెలుగు–ఇంగ్లిష్ మీడియంలో వర్క్‌బుక్స్‌తో కలిపి మొత్తం 391 టైటిళ్లను పీడీఎఫ్ రూపంలో పాఠశాల విద్యా శాఖ వెబ్‌సైట్‌లో ఉంచింది. గతేడాది ఆన్‌లైన్‌లో ఉంచిన పుస్తకాలను దాదాపు 18 లక్షల మందికి పైగా డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ ఏడాది ఇప్పటికే 1,72,482 పాఠ్యపుస్తకాలు డౌన్‌లోడ్ అవడం విశేషం. ఈ విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి విద్యార్థులకు కొత్తగా ఎన్సీఈఆర్టీ సిలబస్ అమల్లోకి రానుంది. ఈ నేపథ్యంలో కొత్త సిలబస్ పుస్తకాలను కూడా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. త్వరలో ఉర్దూ, తమిళం, ఒడియా, కన్నడ వంటి మైనర్ మీడియం బైలింగ్వువల్ పాఠ్య పుస్తకాలను సైతం వెబ్‌సైట్‌లో ఉంచనున్నారు. పాఠాలను విద్యార్థులు విశ్లేషణాత్మకంగా అర్థం చేసుకొని, సామర్థ్యాలను మెరుగుపరుచుకొనేందుకు ఆన్‌లైన్ పీడీఎఫ్‌లోని ప్రతి పాఠానికి ఎస్సీఈఆర్టీ 'క్యూఆర్' కోడ్‌ను జత చేసింది. ఆ కోడ్‌ను స్మార్ట్ ఫోన్‌తో స్కాన్ చేస్తే పుస్తకంలోని పాఠాన్ని 'దీక్ష' పోర్టల్‌లో వీడియో రూపంలో చూసే అవకాశం కూడా కల్పించారు. పీడీఎఫ్ పాఠ్య పుస్తకాలను **https://cse.ap.gov.in** వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

పట్టణ యువతలో 61శాతం మందికి
కంప్యూటర్ నైపుణ్యం

గ్రామీణ యువతలో అది 34 శాతమే

- 36.38 శాతం మందికి జోడించిన ఫైల్‌తో ఈ-మెయిల్ పంపగల సామర్థ్యం
- 45.56 శాతం మందికి ఫైల్ లేదా ఫోల్డర్‌ను కాపీ చేయగల లేదా తరలించగల సామర్థ్యం
- ఇండియా ఎంప్లాయిమెంట్ రిపోర్ట్-2024 వెల్లడి



సాక్షి, అమరావతి : దేశంలో కంప్యూటర్ నైపుణ్యం పట్టణ యువతలో 61 శాతం ఉండగా అదే గ్రామీణ యువతలో కేవలం 34 శాతమే ఉందని ఇండియా ఎంప్లాయిమెంట్ రిపోర్ట్–24 వెల్లడించింది. కంప్యూటర్ నైపుణ్యాల సామర్థ్యం రాష్ట్రాల మధ్య వైవిధ్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆ నివేదిక తెలిపింది. కెమెరా, మోడమ్, ప్రింటర్ వంటి పరికరాలు ఇన్‌స్టాల్ చేసే సామర్థ్యం పట్టణ యువతలో ఉందని.. అయితే గ్రామీణ యువతలో అది ఎనిమిది శాతమేనని పేర్కొంది. ఇలా వివిధ రకాల కంప్యూటర్ నైపుణ్యాల్లో దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు ఇతర రాష్ట్రాల కంటే మెరుగ్గా ఉన్నాయని వివరించింది. ఇక ఫైళ్లను బదిలీచేసే సామర్థ్యం మినహా చాలా నైపుణ్యాల్లో కర్ణాటక ఇతర రాష్ట్రాల కంటే మెరుగ్గా ఉంది. ఫైల్ లేదా ఫోల్డర్‌ను కాపీ చేయగల లేదా తరలించగల సామర్థ్యం ఆంధ్రప్రదేశ్ యువతలో 45.56 శాతం ఉంటే కేరళ యువతలో 90.28 శాతం.. తమిళనాడు యువతలో 72.28 శాతం, కర్ణాటక యువతలో 64.36 శాతం, తెలంగాణలో 53.83 శాతం ఉన్నట్లు రిపోర్ట్ తెలిపింది. అలాగే, డూప్లికేట్ లేదా టూల్స్‌ను కాపీచేసి పేస్ట్ చేయగల సామర్థ్యంతో పాటు సమాచారాన్ని ట్రాన్స్‌ఫర్ చేయగల నైపుణ్యం ఆంధ్రప్రదేశ్ యువతలో 43.30 శాతం ఉందని ఆ నివేదిక తెలిపింది. ఇది కేరళ యువతలో 89.30 శాతం, తమిళనాడు యువతలో 70.45 శాతం, కర్ణాటక యువతలో 60.24 శాతం, తెలంగాణలో 50.40 శాతం ఉంది.

ప్రెజెంటేషన్ల సామర్థ్యం కేరళలో ఎక్కువ..

ఇక జోడించిన ఫైల్‌తో ఈ–మెయిల్ పంపగల సామర్థ్యం ఆంధ్రప్రదేశ్ యువతలో 36.38 శాతం ఉంటే కేరళ యువతలో అత్యధికంగా 73.34 శాతం, తమిళనాడులో 55.33 శాతం, కర్ణాటకలో 45.04 శాతం, తెలంగాణలో 45.46 శాతం సామర్థ్యం ఉంది. ప్రెజెంటేషన్ సాఫ్ట్‌వేర్‌తో ఎలక్ట్రానిక్ ప్రెజెంటేషన్లను సృష్టించగల సామర్థ్యం ఆంధ్రప్రదేశ్ యువతలో 10.18 శాతం ఉండగా కేరళ యువతలో 40.33 శాతం, తమిళనాడులో 26.10 శాతం, కర్ణాటకలో 22.33 శాతం, తెలంగాణలో 14.27 శాతం ఉందని రిపోర్ట్ వెల్లడించింది.

గ్రామీణంలో 'నెట్' వినియోగం 25 శాతమే..

అలాగే, దేశంలో 15 ఏళ్ల వయస్సు నుంచి 29 ఏళ్లలోపు యువత ఇంటర్నెట్ వినియోగం గ్రామీణ ప్రాంతాల్లో 25.30 శాతం ఉండగా పట్టణ ప్రాంతాల్లో 57.53 శాతం ఉందని తెలిపింది. వర్గాల వారీగా ఇంటర్నెట్ వినియోగాన్ని పరిశీలిస్తే.. ఎస్టీ వర్గాల్లో 20.39 శాతం, ఎస్సీల్లో 24.96 శాతం, వెనుకబడిన వర్గాల్లో 34.28 శాతం, సాధారణ వర్గాల్లో 50.15 శాతం ఇంటర్నెట్ ఉందని రిపోర్ట్ తెలిపింది. మెజారిటీ యువత మాధ్యమిక లేదా ఉన్నతస్థాయి విద్యను అభ్యసిస్తున్నారని, దీంతో పాటు కంప్యూటర్లు, ఇంటర్నెట్, డిజిటల్ నైపుణ్యాల యాక్సెస్ యువత జనాభాలో కూడా పెరిగిందని.. అయితే సాంకేతిక నైపుణ్యాలను, సామర్థ్యాన్ని పెంచేందుకు యువతకు తగిన శిక్షణ ఇవ్వాల్సి ఉందని ఆ నివేదిక అభిప్రాయపడింది.

31కల్లా కేరళకు 'నైరుతి'

2, 3 తేదీల్లో ఏపీలోకి ప్రవేశం • ఈ సీజన్‌లో సాధారణం కంటే అధిక వర్షాలు

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం/న్యూఢిల్లీ : నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరిస్తున్నాయి. ఈనెల 31 నాటికల్లా ఇవి కేరళలోకి ప్రవేశిస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సోమవారం తెలిపింది. నిర్ణీత సమయానికి మూడ్రోజులు ముందుగా అంటే ఈనెల 19న అండమాన్ సముద్రంలోకి ఈ రుతుపవనాలు ప్రవేశించిన విషయం తెలిసిందే. ఇవి చురుగ్గా కదులుతుండగా సోమవారం నాటికి బంగాళాఖాతం, శ్రీలంకలోని పలు ప్రాంతాలకు విస్తరించాయి. అలాగే, దక్షిణ అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాలు, మాల్దీవులు, కొమోరిన్ ప్రాంతాల్లోకి విస్తరించే అవకాశాలు మెరుగుపడ్డాయి. ఇదే పరిస్థితి కొనసాగితే అనుకున్న దానికంటే ముందుగానే వచ్చేనెల 1, 2 తేదీల్లో ఏపీలోకి రుతుపవనాలు ప్రవేశిస్తాయని అంచనా వేస్తున్నారు. వాతావరణ పరిస్థితులు ఏమైనా మారితే ఒకట్రెండు రోజులు ఆలస్యమై 3, 4 తేదీల నాటికి రాష్ట్రంలో ప్రవేశించే అవకాశముంది. మొత్తంగా ఐదో తేదీలోపే రుతుపవనాలు ఏపీలోకి ప్రవేశిస్తాయని అంచనా వేస్తున్నారు. ఇక రుతు పవనాలు చురుగ్గా ఉండడంతో వచ్చేనెల మొదటి వారంలో రాయలసీమలోని పలుచోట్ల విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు.. రెమాల్ తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర, తూర్పు గోదావరి జిల్లాలతోపాటు రాష్ట్రంలోని పలుచోట్ల వర్షాలు పడ్డాయి. ఈ తుపాను బంగ్లాదేశ్ వైపు కదిలి ఆ పరిసరాల్లోనే తీరం దాటడంతో రుతు పవనాలకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. రెండ్రోజుల్లో అవి చురుగ్గా కదిలాయి.

రైతులకు ఎంతో ఊరట..

జూన్‌లో రాష్ట్రంలో సాధారణానికి మించి వర్షాలు కురవనున్నాయని సోమవారం విడుదల చేసిన రెండో దశ దీర్ఘకాలిక నెలవారీ అంచనా నివేదికలో ఐఎండీ పేర్కొంది. ఈ సమాచారం రైతాంగానికి ఎంతగానో ఊరటనిస్తోంది. గత ఏడాది వారం రోజులు ఆలస్యంగా అంటే జూన్ 8న నైరుతి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించాయి. అనంతరం వర్షాలు అరకొరగానే కురిశాయి. పైగా రాష్ట్రంలో జూన్ అంతా మే నెలను తలపించేలా వడగాడ్పులు కొనసాగాయి. ఫలితంగా జూన్‌లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో ఖరీఫ్ పనులు ముందుకు సాగలేదు. ఆపై జూలై, ఆగస్టుల్లో సకాలంలో వర్షాలు కురవలేదు. దీంతో గతేడాది రైతులకు నైరుతి రుతుపవనాలు నిరాశను, నష్టాలను మిగిల్చాయి. కానీ, ఈ ఏడాది పరిస్థితులు అందుకు భిన్నంగా, అనుకూలంగా మారుతున్నాయి. ఎల్‌నినో బలహీనపడుతూ జూన్ మధ్య నుంచే లానినా పరిస్థితులేర్పడుతున్నాయి. దీంతో వర్షాలు పుష్కలంగా కురవడానికి దోహద పడుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

మూడ్రోజులు వడగాడ్పులు..

ఇదిలా ఉంటే.. రెమాల్ తీవ్ర తుపాను ఫలితంగా గాలిలో తేమను తుపాను ప్రాంతం వైపు లాక్కుపోయింది. దీంతో.. రాష్ట్రంలో పొడి వాతావరణం నెలకొంది. దీనికి తోడు రోహిణి కార్తె కూడా రెండ్రోజుల క్రితమే మొదలైంది. వీటివల్ల రానున్న మూడ్రోజులు సాధారణంకంటే 4–8 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. గరిష్టంగా కొన్నిచోట్ల 49 డిగ్రీల వరకు రికార్డయ్యే అవకాశాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పలుచోట్ల మళ్లీ వడగాడ్పులు, తీవ్ర వడగాడ్పులు వీయనున్నాయి.

- ▲ కాగా, మంగళవారం 149 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 160 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయి. శ్రీకాకుళం జిల్లాలో 22, విజయనగరం 27, పార్వతీపురం మన్యం 15, అల్లూరి సీతారామరాజు 2, విశాఖపట్నం 6, అనకాపల్లి 20, కాకినాడ 18, కోనసీమ 7, తూర్పు గోదావరి 18, పశ్చిమ గోదావరి 4, ఏలూరు 7, బాపట్ల 1, కృష్ణా 2 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.
- ▲ అలాగే, వడగాడ్పులు శ్రీకాకుళం జిల్లాలో 8, అల్లూరి 8, విశాఖపట్నం 2, అనకాపల్లి 2, కాకినాడ 3, కోనసీమ 8, తూర్పుగోదావరి 1, పశ్చిమ గోదావరి 13, ఏలూరు 21, కృష్ణా 19, ఎన్టీఆర్ 17, గుంటూరు 17, పల్నాడు 15, బాపట్ల 20, ప్రకాశం 6 మండలాల్లోను వీయనున్నాయని వివరించింది.
- ▲ ఇక బుధవారం 195 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 147 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని పేర్కొంది.
- ▲ సోమవారం తిరుపతి జిల్లా సత్యవేడులో 41.9, మనుబోలు (నెల్లూరు) 41.5, వేమూరు (బాపట్ల), పెడన (కృష్ణా) 40.9, చింతూరు (అల్లూరి) 40.8, డెంకాడ (విజయనగరం) 40.7, రావికమతం (అనకాపల్లి) 40.4 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

ఈ సీజన్‌లో వర్షాలే వర్షాలు..

ఈ సీజన్‌లో వర్షాలు విస్తారంగా కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగా వర్షపాతాలు నమోదవుతాయని తెలిపింది. రుతు పవనాలు వేగంగా విస్తరిస్తుండడంతో మంచి వర్షాలకు అవకాశమున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఐఎండీ ప్రత్యేక బులిటెన్ విడుదల చేసింది. అలాగే, ఈశాన్య భారతంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం, వాయవ్య భారతంలో సాధారణ వర్షపాతం, మధ్య, దక్షిణ భారతదేశాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదుకావచ్చని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర సోమవారం ఢిల్లీలో జరిగిన వర్చువల్ మీడియా సమావేశంలో అంచనా వేశారు. జూన్–సెప్టెంబర్ కాలంలో దీర్ఘకాల సగటు 87 సెం.మీ. వర్షపాతంలో 106 శాతం మేర వర్షపాతం నమోదుకావచ్చన్నారు.

మాజీ మంత్రి యెర్నేని సీతాదేవి కన్నుమూత

ముదినేపల్లి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా రెండు పర్యాయాలు ఎన్నిక



కైకలూరు: మాజీ మంత్రి యెర్నేని సీతాదేవి (74) సోమవారం కన్నుమూశారు. హైదరాబాద్‌లో ఉంటున్న ఆమె సోమవారం గుండెపోటుకు గురై ప్రాణాలు విడిచారు. ఏలూరు జిల్లా కలిదిండి మండలం కొండూరు ఆమె స్వగ్రామం. ముదినేపల్లి నియోజకవర్గం నుంచి 1983లో టీడీపీ తరఫున పోటీ చేశారు. కాంగ్రెస్ పార్టీలో రాజకీయ ఉద్దండుడిగా పేరొందిన పిన్నమనేని కోటేశ్వరరావుపై పోటీ చేసి ఓటమి చెందారు. తిరిగి ముదినేపల్లి నుంచి 1985లో కోనేరు రంగారావుపై విజయం సాధించారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 1989లో ప్రాథమిక, ఉన్నత, సాంకేతిక విద్యా శాఖ మంత్రిగా ఆమెకు అవకాశం కల్పించారు. ఆ సమయంలో పరీక్ష పేపర్ లీక్ అంశం వివాదాస్పదమైంది. యెర్నేని సీతాదేవి మంత్రిగా ఉన్నప్పుడే మొదటిసారి ఇన్‌స్టెంట్, బెటర్‌మెంట్ పరీక్షలు ప్రవేశపెట్టారు. 1994లో పిన్నమనేని కోటేశ్వరరావు కుమారుడు వెంకటేశ్వరరావుపై పోటీ చేసి విజయం సాధించారు. 1999, 2004 ఎన్నికల్లో పోటీ చేసినా ఓటమి పాలయ్యారు. 2004 తర్వాత జిల్లాల పునర్విభజనలో భాగంగా ముదినేపల్లి నియోజకవర్గం రద్దయి.. కైకలూరు నియోజకవర్గంలో కలిసింది. సీతాదేవి టీటీడీ బోర్డు సభ్యురాలుగా పనిచేశారు. 2013లో బీజేపీలో చేరారు. బీజేపీలో మహిళా మోర్చా నేషనల్ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం విజయ మిల్క్ డెయిరీ డైరెక్టర్‌గా సేవలు అందిస్తున్నారు. సీతాదేవి భర్త యెర్నేని నాగేంద్రనాథ్ (చిట్టిబాబు) రైతాంగ సమాఖ్య, కొల్లేరు పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన గతేడాది అనారోగ్యంతో మరణించారు. సీతాదేవి పార్థివదేహాన్ని సొంతూరు కొండూరుకు తీసుకొచ్చారు.పలువురు నేతలు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఉప్పాడలో 'అల'జడి

ఎగసి పడుతున్న అలలు.. కోతకు గురవుతున్న తీరం



అల్లకల్లోలంగా మారిన సముద్రం

కొత్తపల్లి : రెమాల్ తుపాను తీరం దాటినప్పటికీ దాని ప్రభావంతో కాకినాడ జిల్లా ఉప్పాడ వద్ద కడలి కల్లోలంగా మారింది. అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. తీరం కోతకు గురవుతోంది. కెరటాల తాకిడికి యు.కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ, కోనపాపపేట గ్రామాల్లో పదుల సంఖ్యలో ఇళ్లు కడలిలో కలిసిపోతుండడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. అలల తాకిడికి జియోట్యూబ్ రక్షణ గోడ రాళ్లు సైతం గ్రామంలోకి వచ్చి పడ్డాయి. ఉప్పాడ–కాకినాడ బీచ్ రోడ్డు కోతకు గురైంది.



ఉప్పాడలో ఇళ్లు కోతకు గురవడంతో ఆందోళన చెందుతున్న మత్స్యకారులు

సాక్షి ఫ్యామిలీ
చెన్నై
మంగళవారం ॥ 28-5-2024

* ఇంటర్నేషనల్ డే ఆఫ్ యాక్షన్ ఫర్ ఉమెన్ హెల్త్ డే!

ఆరోగ్యంగా ఉండడం,
ఆరోగ్యంగా ఉండాలనుకోవడం కూడా ఒక హక్కే.
ఈ విషయాన్ని ప్రపంచంలోని
ప్రతి మహిళా గుర్తించాలని
ప్రపంచవ్యాప్తంగా ప్రతియేటా మే 28న
'ఇంటర్నేషనల్ డే ఆఫ్ యాక్షన్ ఫర్ ఉమెన్ హెల్త్'ను
జరుపుకుంటున్నారు.
ఈ సందర్భంగా మహిళ తన ఆరోగ్య సంరక్షణ కోసం
అవగాహన పెంచుకోవడంతో పాటు హక్కుగా
ఎలా భావించాలో తెలుసుకోవాలి.
మహిళల ఆరోగ్య సంరక్షణలో కొనసాగుతున్న
ఇబ్బందులు, అవకాశాలను హైలైట్ చేసే
ఒక ముఖ్యమైన వేడుకగా ఈ రోజును భావించాలి.



ఆరోగ్యం ఆమె హక్కు!

మహిళల ఆరోగ్య సంరక్షణలో అసమానతలను తొలగించడానికి లాటిన్ అమెరికన్, కరీబియన్ ఉమెన్ హెల్త్ నెట్‌వర్క్ 1987లో గ్లోబల్ నెట్‌వర్క్ (డబ్ల్యూజీఎన్ఆర్ఆర్)ను ఏర్పాటు చేశారు. ఆరోగ్య సంరక్షణలో మహిళల తక్షణ అవసరాలను గుర్తించడానికి ఈ నెట్‌వర్క్ ఆవిర్భవించింది. మహిళల ఆరోగ్య సేవలు, హక్కులలో నిరంతరంగా వచ్చే అవాంతరాలను పరిష్కరించాలి. మరింత పటిష్టమైన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను సాధించాలనేది ఈ నెట్‌వర్క్ ఉద్దేశ్యం.

మొదటిది ప్రసూతి ఆరోగ్యం

మొదట పునరుత్పత్తి, ప్రసూతి సమయాలలో సురక్షితమైన ఆరోగ్య సేవలను పొందడంపై దృష్టి సారించడానికి ఈ రోజును కేటాయించారు. ప్రపంచంలో ముప్పై ఏళ్ల క్రితం ప్రసూతి మరణాలు అధికంగా ఉండటంతో తొలుత వాటిపైన దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది. ఆ తర్వాత స్త్రీల మానసిక ఆరోగ్యం, హెచ్ఐవి, గర్భనిరోధక సాధనాలు, నాన్–కమ్యూనికబుల్ వ్యాధులు, ఆర్థిక–సామాజిక కారకాల ప్రభావం... వంటి విస్తృత శ్రేణి అంశాలను చేర్చే దిశగా క్రమంగా విస్తరణ జరిగింది. ఒక విధంగా చెప్పాలంటే ఈ అవగాహన అంతర్జాతీయ స్థాయిలో మహిళల ఆరోగ్య ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ సంస్థలు ఆరోగ్య సేవలను మెరుగుపరచడానికి సెమినార్‌లు, శిక్షణ, పరిశోధన కార్యక్రమాలను స్పాన్సర్ చేశాయి. నిధుల పెట్టుబడిని ప్రోత్సహిస్తూ 'సురక్షిత మాతృత్వం' అనే థీమ్‌తో సమస్యను చేపట్టాయి. 1987 మే, 28 నుంచి ఈ రోజుకు ఓ ప్రాధాన్యాన్ని కల్పిస్తూ అనేక ప్రభుత్వాలు, వివిధ అంతర్జాతీయ సంస్థలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న బహుళ పౌర సమాజ సంస్థలు మహిళల ఆరోగ్యం కోసం తమ చేయూతను అందిస్తున్నాయి.



అవగాహనే కీలకంగా!

ఎవరూ ఏ మాత్రం పట్టించుకోని, హాని కలిగించే వ్యాధులతో సహా ప్రపంచవ్యాప్తంగా మహిళలను ప్రభావితం చేసే క్లిష్టమైన ఆరోగ్య సమస్యలను ఈ రోజు చర్చకు తెస్తూ, వాటిని హైలైట్ చేస్తుంది. బహిరంగ సమావేశాల ఏర్పాటు ద్వారా ఈ సమస్యలను వెలుగులోకి తీసుకు వస్తూ, మహిళల ఆరోగ్య సంబంధిత విద్యలను ప్రోత్సహిస్తుంది. .

ఆరోగ్య హక్కుల కోసం న్యాయవాదిగా!

మహిళల ఆరోగ్య హక్కుల కోసం వాదించడానికి, ఆరోగ్య సంరక్షణలో జెండర్ సమానత్వాన్ని ప్రోత్సహించే విధానాల అమలుకు అవసరమైన కార్యక్రమాల ఆవశ్యకతను నొక్కి చెప్పడానికి ఇదొక వేదికగా ఉపయోగపడుతుంది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళల ఆరోగ్య న్యాయవాదులు, సంస్థలు, కమ్యూనిటీలను ఒకచోట చేర్చి, వారిలో సంఘీభావాన్ని పెంపొందిస్తుంది. ఈ సమష్టి చర్య మహిళల ఆరోగ్య హక్కుల కోసం చేసే ఉద్యమాలను బలపరుస్తుంది.

మహిళా సాధికారత

మహిళల ఆరోగ్యంపై దృష్టి సారించడం ద్వారా ఆరోగ్యం, శ్రేయస్సుపై బాధ్యత వహించడానికి ఈ ప్రత్యేకమైన రోజు మహిళలకు ఓ శక్తినిస్తుంది. ఆరోగ్య సమాచారాన్ని వెతకడానికి, సేవలను పొందడానికి తామే నిర్ణయాత్మక శక్తిలా మారే కార్యక్రమాలలో పాల్గొనేలా మహిళలను ప్రోత్సహిస్తుంది.

మహిళల ఆరోగ్య కార్యక్రమాలకు ప్రభుత్వాలు మద్దతునివ్వాలి. స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయులలో మహిళల ఆరోగ్యం, హక్కులను ప్రోత్సహించే కార్యక్రమాలలో పాల్గొనేలా చేయాలి. ఆరోగ్య నిపుణులు, విధాన రూపకర్తలు, కమ్యూనిటీ నాయకులతో సహా వివిధ సంస్థలు కూడా ఇందులో భాగం కావాలన్నది డబ్ల్యూజీఎన్ఆర్ఆర్ నెట్‌వర్క్ ప్రధాన లక్ష్యం.

స్ఫూర్తి

ఛాయాచిత్రం

● స్ట్రగుల్ టు సక్సెస్



ఛాయా కదమ్

హైస్కూల్, కాలేజీ రోజుల్లో నాటకాల్లో ఛాయా కదమ్ నటప్రతిభను మెచ్చుతూ 'నువ్వు సినిమాల్లోకి వెళితే ఇక తిరుగు లేదు' అన్నారు చాలామంది. కట్ చేస్తే... 'అసలు నీకు నటన వచ్చా' అని తిట్టాడు ఒక డైరెక్టర్. ఒక డైరెక్టర్ అయితే అసహనంతో కుర్చీని నేలకేసి కొట్టాడు. ఇలా ఎన్నో అవమానాలు ఎదుర్కొంది. అయితే ఏరోజూ వెనకడుగు వేయలేదు. కట్ చేస్తే... 'ఒక్క సీన్ అయినా ఫరవాలేదు' అనుకునే స్థాయి నుంచి అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించిన 'ఆల్ వి ఇమేజిన్ యాజ్ లైట్'లో నటించే స్థాయికి చేరింది. ఈ చిత్రం కాన్స్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో 'గ్రాండ్ ప్రి' అవార్డ్ గెలుచుకొని చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. ఈ చిత్రంలో 'పార్వతి' పాత్రలో నటనకు ప్రశంసలే కాదు అంతర్జాతీయ వేదికపై స్టాండింగ్ వొవేషన్ స్వీకరించింది ఛాయా కదమ్.

ముంబై శివారులోని కలీనాలో మధ్యతరగతి కుటుంబంలో పుట్టింది ఛాయ. తండ్రి ఓ మిల్లులో కార్మికుడు. స్కూలు రోజుల్లో కబడ్డీ బాగా ఆడేది. స్టేట్, నేషనల్ లెవెల్లో కూడా ఆడింది. ఆటలతో పాటు నటించడం అంటే కూడా ఇష్టం. హైస్కూల్, కాలేజీలో ఎన్నో నాటకాల్లో నటించింది. ఇంటర్మీడియెట్ ఫెయిల్ కావడంతో 'ఫెయిల్యూర్' అనేది తొలిసారిగా పరిచయం అయింది. 'జయాపజయాలు జీవితంలో భాగం. ఫెయిల్యూర్ ఎదురైనా కుంగిపోనక్కర్లేదు. నిన్ను నువ్వు నిరూపించుకోవడానికి సెకండ్ ఛాన్స్ ఉంటుంది అనే విషయం ఎప్పుడూ మరచిపోవద్దు' అనే మాట ఛాయను ముందుకు నడిపించింది.

'టెక్స్‌టైల్ డిజైన్' గ్రాడ్యుయేషన్ చేసినప్పటికీ సినిమాల్లో నటించడానికి ఆసక్తి చూపింది. అయితే సినిమాల్లో అవకాశం రావడం నాటకాల్లో నటించినంత వీజీ కాదనే విషయాన్ని ఆమె త్వరగానే అర్థం చేసుకుంది. స్ట్రగుల్స్ తర్వాత... రాక రాక ఒక సినిమాలో అవకాశం వచ్చింది. అయితే ఆ సినిమా ఇప్పటికీ రిలీజ్ కాలేదు! 'సినిమాల్లో నటించాలనుకునేవారికి నటప్రతిభతో పాటు బోలెడు ఓపిక ఉండాలి' అనే మాటను మాత్రం ఎప్పుడూ మరచిపోలేదు ఛాయ.

తొలి రోజుల్లో 'వన్ సీన్' పాత్రలలోనూ నటించింది. ఆ ఒక్క సీన్ కోసం లొకేషన్‌లో గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. అయితే ఎప్పుడూ ఓపిక కోల్పోలేదు. 'ఒక్క సీన్ ఉంది. ఫలానా చోట షూటింగ్' అని చెప్పేవారు. పొద్దున్నే లేచి ఆ ప్రాంతం చేరడానికి ప్రాణం మీదికి వచ్చేది. తీరా అక్కడికి వెళ్లాక...

'ఈ రోజు షూటింగ్ క్యాన్సిల్' అనే మాటను కూడా ఎన్నో సార్లు విన్నది. కొన్ని సినిమాల్లో మంచి పాత్రలు వచ్చినప్పటికీ డైరెక్టర్‌ల అహం భరించలేని స్థాయిలో ఉండేది. దుఃఖం ఆగేది కాదు. దుఃఖంలోనే ఉంటే ఆ సాగరంలో 'నటన' కొట్టుకుపోతుంది. అందుకని ఎంత బాధ అనిపించినా అప్పటికప్పుడు ఆ బాధ నుంచి బయట పడి డైరెక్టర్‌కు నచ్చేంత వరకూ నటిస్తూనే ఉండేది. ఆమె ఓపిక, కష్టం వృథా పోలేదు. మరాఠీ, హిందీ సినిమాల్లో నటిగా మంచి పేరు తెచ్చుకుంది. కాన్స్ రూపంలో అంతర్జాతీయ వేదికపై ప్రపంచ దృష్టిని ఆకర్షించింది.

శ్రామిక వర్గ బలం

శ్రామిక వర్గ నేపథ్యం నుంచి వచ్చాను. నాన్న మిల్లు కార్మికుడు. అలా అని నేను ఎప్పుడూ ఎవరి నుంచి సానుభూతి ఆశించలేదు. అయితే నా నేపథ్యం నేను చేసిన అట్టడుగు, శ్రామిక వర్గ పాత్రలకు బలాన్ని ఇచ్చింది. నా పాత్రలకు అవసరమైన మెటీరియల్‌ను ఇచ్చింది.

– ఛాయా కదమ్

బ్యూటిప్



చుండ్రు తగ్గాలంటే...

తలస్నానం చేయడానికి రెండుగంటల ముందు గోరువెచ్చటి కొబ్బరినూనెలో కొద్దిగా నిమ్మరసం కలిపి, ఆ మిశ్రమాన్ని చేతి వేళ్లతో సున్నితంగా తలకు పట్టించి మర్దన చేయాలి.



కొర్ర చేనులో రైతు కొమ్మూరి విజయకుమార్

కలుపు నిర్మూలన ఎలా?

ఈ ఏడు ముందస్తు వానలు కురుస్తున్నాయి. ప్రకృతి శుభ సూచనలు చేసింది. ప్రకృతిలో కానుగ చెట్లు ఇగురు పూత విరివిగాను, నేరేడు చెట్లు గుబురుగాను ఉన్నాయి. మే నెలలోనే తొలకరి వానలకు ప్రకృతి నాంది పలికింది. వానకు పొలంలో ఉన్న కలుపు విత్తనాలు మొలుస్తాయి. ఆరుద్ర కార్తె నుంచి పంటలు సాగు చేయటానికి అనుకూలంగా ఉండాలంటే భూమిని వారం, పది రోజుల వ్యవధిలో ఒకటికి రెండుసార్లు తేలికపాటి సేద్యం చేయాలి (దుక్కి దున్నాలి). ఇలా చేస్తే మట్టిలోని గడ్డి గింజలన్నీ మొలిచి ఆరుద్ర నాటికి 80 శాతం కలుపు మొక్కలు చనిపోతాయి. ఆ తర్వాత పంట వేసుకుంటే కలుపు సమస్య పెద్దగా వేధించదు.

అయితే, చాలా మంది రైతులు ఒకేసారి ఇరుసాలు సేద్యం (దుక్కి) చేస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. మొదటి దుక్కికి భూమి పైన ఉన్న గడ్డి విత్తనాలు మట్టి కిందకు వెళ్తాయి. వానలు పడిన వెంటనే కలుపు మొలుస్తుంది. అయినా, ఇంకా కలుపు విత్తనాలు కొన్ని మట్టిలో మిగిలే ఉంటాయి. మొదటి దుక్కి నుంచి రెండోసారి దుక్కి చేయటానికి కనీసం ఒక వారం, పది రోజుల సమయం ఇవ్వాలి. లేకపోతే మన పంటకు కలుపు ఎక్కువ వస్తుంది. పంట దిగుబడి తగ్గుతుంది. ఈ విధంగా కలుపు నివారణ కోసం రెండు సార్లు సేద్యం (రెండు దుక్కులు) చేయకపోతే కూలీల ఖర్చు ఎక్కువగా ఉంటుంది. చాలా మంది రైతులు కొర్ర చేనులో కూడా కలుపు మందులు పిచికారీ చేస్తున్నారు. దీని వల్ల దిగుబడి బాగా తగ్గుతుందని గుర్తించండి. చిరుధాన్యాలు సాగు చేసే రైతులు వారం, పది రోజుల వ్యవధిలో రెండు సార్లు తేలిక పాటి సేద్యం (దుక్కి) చేసి కలుపు నిర్మూలన చేసుకుంటే మంచి దిగుబడి వస్తుంది.

5 రకాలను అంతటా పండించాలి

చిరుధాన్యాల సాగు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అన్ని జిల్లాల్లో పెరుగుదల బాగానే ఉంటుందనిపిస్తోంది. ఈ మధ్యన చిరుధాన్యాల ధర విపరీతంగా పెరిగింది. ఉదాహరణకు.. బరిగె ధాన్యం టన్నుకు రూ. 65 వేలు పలుకుతోంది. బరిగె బియ్యం కిలో రూ. 90–100 పలుకుతోంది. కోస్తా ఆంధ్ర జిల్లాలో పెద్ద సామ విరివిగా సాగు చేస్తున్నారు. రాయలసీమ జిల్లాల్లో కొర్ర పంట మాత్రమే సాగు చేస్తున్నారు. కర్ణాటక జిల్లాల్లో అరిక కొంత మేర సామ, ఊద సాగు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే అండుకొర్రలు సాగవుతున్నాయి. ఐదు రకాల సిరిధాన్యాల బియ్యం కావాలంటే అన్నీ ఒక చోటకు చేర్చాలంటే రవాణా ఖర్చు ఎక్కువ అవుతున్నది. ఈ రోజు మార్కెట్‌లో చిరుధాన్యాల బియ్యం ధరలు పేదలు తినేటట్టు లేవు. అందుకే కొర్ర, అరిక, సామ, ఊద, అండుకొర్ర ఈ ఐదు రకాల సిరిధాన్యాలను అన్ని ప్రాంతాల్లోనూ సాగులోకి తేవాలి.

అరెకరానికి ఉచితంగా విత్తనాలు

కొర్రలు, అండుకొర్రలు, అరికెలు, ఊదలు, సామల సాగును పెంపొందించే లక్ష్యంతో కొత్తగా సిరిధాన్యాలు సాగు చేయదలచిన కొందరు రైతులకు అరెకరానికి సరిపోయే (5 రకాలు ఒక్కో రకం అర కేజీ చొప్పున) 2.5 కిలోల విత్తనాలను ఉచితంగా ఇస్తాను. ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు వారే భరించాలి (గమనిక: సిరిధాన్యాల సేంద్రియ సాగుపై సందేహాల నివృత్తి కోసం, విత్తనాల కోసం ఏపీ వారు ఉ. 5–30 గం. నుంచి సా. 7.30 గం. వరకు.. తెలంగాణ వారు సా. 7 గం. నుంచి రాత్రి 8.30 వరకు ఫోన్ చేయొచ్చు). విజయకుమార్: 98496 48498

ఆరుద్రలో అరిక విత్తాలి

పెద్ద రైతులు ఒకసారి ఆలోచన చేయండి. చిరుధాన్యాలు సాగు చేస్తే రసాయన ఎరువులు, పురుగుమందుల ఖర్చులు తగ్గి భూసారం పెరుగుతుంది. అరిక పంట ఆరుద్ర కార్తెలో మిశ్రమ పంటగా సాగు చేసుకుంటే బాగుంటుంది. 6 సాళ్లు అరిక ఒక సాలు కంది.. 6 సాళ్లు అరిక, ఒక సాలు ఆముదాలు విత్తుకోవాలి. ఇందులో అలసందలు, అనుములు, నల్లపెసలు, గోగులు, సీతమ్మ జొన్న సాగు చేస్తే చాలా బాగుంటుంది.

ఊద పంట 110–120 రోజులు, అండుకొర్ర పంట 105–115 రోజులు, సామ పంట 110 రోజులు, కొర్ర పంట 75–80 రోజుల వరకు ఉంటుంది. వానలు బాగా పడుతున్నందు వలన అన్ని రకాలు సాగు చేయవచ్చు. నీటి ఆధారం కింద రెండు లేదా మూడు పంటలు సాగు చేయవచ్చు. చిరుధాన్యాల సాగులో తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడి రావాలంటే.. రసాయనిక ఎరువులు వేయటం మానివేసి.. పశువుల ఎరువు, చెరువు మట్టి వేయటంతో పాటు గొర్రెలను మళ్లించటం (మంద కట్టటం), అలాగే ఏగిలి మార్చటం (పంట మార్పిడి) వంటి పనులు చేయాలి.

– కొమ్మూరి విజయకుమార్
సృష్టి సమ్మాన్ పురస్కార గ్రహీత, వేంపల్లె మం., టి.వెలమవారిపల్లె, వైఎస్సార్ కడప జిల్లా.

సాగుబడి
రోహిణి కార్తె : మే 26 నుంచి

- అరుదైన సజ్జ కంకి బారెడు పొడవు పెరుగుతుంది.
- కరువును తట్టుకొని హెక్టారుకు 20-25 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది.
- 300 ఏళ్లుగా ఈ వంగడాన్ని ఓ రాజస్థానీ రైతు కుటుంబం సంరక్షిస్తోంది.
- నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ రైతును పురస్కారంతో గౌరవించింది.

అతి పొడవైన సజ్జ!




తన పొలంలోని పొడవైన సజ్జ కంకులతో రాజస్థాన్ రైతు హనుమాన్‌రామ్

సజ్జ కంకి పొడవు మహా అయితే మూర పొడవుంటుందని మనకు తెలుసు. అయితే, రాజస్థాన్‌కు చెందిన ఓ రైతు దగ్గర ఏకంగా కంకి బారెడు పొడవు పెరిగే సజ్జ రకం ఉందంటే ఆశ్చర్యం కలగక మానదు. ఈ అపురూపమైన పురాతన సజ్జ వంగడాన్ని ఆ రైతు కుటుంబం గత 300 ఏళ్లుగా సాగు చేస్తూ, పరిరక్షిస్తూ ఉంటటం మరో విశేషం. కరువును దీటుగా తట్టుకొని వర్షాధారంగా హెక్టారుకు 20–25 క్వింటాళ్ల దిగుబడిని ఇవ్వగలిగిన గొప్ప వారసత్వ సంపదైన ఈ వంగడం పేరు 'సుల్కానియా బజ్రా'. రాజస్థాన్‌లోని చురు జిల్లా సుల్కానియా గ్రామానికి చెందిన హనుమాన్‌రామ్ ఝురియా అనే 69 ఏళ్ల రైతు 45 ఏళ్లుగా దీన్ని కంటికి రెప్పలా కాపాడుతున్నారు. ప్రతి ఏటా సాగు చేస్తూ రైతులకు విత్తనాలు అందుస్తున్నారు. సంప్రదాయ విత్తనాన్ని సంరక్షిస్తున్న ఈ రైతు కృషిని ప్రశంసిస్తూ కేంద్ర ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖకు అనుబంధమైన స్వతంత్ర సంస్థ నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్‌కు) ఔట్‌స్టాండింగ్ ట్రెడిషనల్ నాలెడ్జ్ పురస్కారాన్ని 2017లోనే ప్రదానం చేసింది. ఈ అద్భుత వంగడానికి సంబంధించిన ఇంకొన్ని వివరాలు.

- పొడవైన కంకులు, రుచికరమైన గింజలు, అధిక దిగుబడి నివ్వటం, కరువు పరిస్థితులను తట్టుకోవటం, ఎక్కువ పశుగ్రాసం ఇవ్వటం ఈ సుల్కానియా సజ్జ ప్రత్యేకతలు.
- హనుమాన్‌రాం కుటుంబం తాత ముత్తాతల కాలం నుంచే ఈ సజ్జలను పండిస్తున్నారు. బికనీర్ నుంచి వచ్చిన ఒక ఆధ్యాత్మిక గురువు 300 సంవత్సరాల క్రితం వీరి ముత్తాతకి ఈ విత్తనం ఇచ్చారట! అప్పటి నుంచి అదే రకాన్ని వీరి కుటుంబం పండిస్తున్నది.
- ప్రతి సంవత్సరం పంట వచ్చిన తర్వాత బాగున్న గింజలను ఏరి, ఎండిన వేపాకులతో కలిపి నిల్వచేస్తాడు. ఈ విధంగా 5 సంవత్సరాల వరకు ఈ విత్తనాన్ని నిల్వ చేసుకోవచ్చు అంటారు హనుమాన్‌రామ్ ఝురియా.
- 'సుల్కానియా' సజ్జ తొలకరి వర్షాలకు విత్తుకునే రకం. ఇది ఇసుకతో కూడిన నేలలు, నీటి ఎద్దడి ప్రాంతాల్లో సాగుకు అనువైన రకం.
- కరువు వాతావరణాన్ని తట్టుకుంటుంది. విత్తిన తర్వాత కొంత కాలం వర్షం లేకపోయినా బాగా మొలకెత్తి ఎదగగలగటం దీని మరో ప్రత్యేకత.
- సజ్జతో హెక్టారుకు 20 నుంచి 25 క్వింటాళ్ళ వరకు దిగుబడి సాధించవచ్చు. 20 నుంచి 30 అంగుళాల పొడవాటి కంకులు వుండటం ప్రత్యేకత.
- ప్రతి మొక్కకు అనేక పిలకలతో పాటు 6 నుంచి 10 కంకులు వస్తాయి. ప్రతి కంకిలో 90 శాతానికి పైగాబలమైన విత్తనాలే వుంటాయి. విత్తిన 90 రోజులకు పంట కోతకు వస్తుంది. అధిక మొత్తంలో గడ్డి లభిస్తుంది.
- వర్షాధారంగా ఈ రకంతో ఎక్కువ ఉత్పత్తి సాధించవచ్చని, చీడపీడలను తట్టుకునే శక్తి కలిగి వుందని అక్కడి కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు, సెంటర్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్మెంట్ సంస్థ శాస్త్రవేత్తలు అభిప్రాయ పడ్డారు.
- సుల్కానియా ప్రాంత రైతులతో పాటు, నిపుణులు ప్రశంసిస్తూ.. తాము కూడా 30 ఏళ్లుగా ఈ వంగడాన్ని సాగు చేస్తున్నామన్నారు.
- సికింద్రాబాద్‌లోని పల్లె సృజన స్వచ్ఛంద సంస్థ సుల్కానియా సజ్జ రకం విత్తనాలను తెప్పించి తెలుగు రాష్ట్రాల రైతులకు అందిస్తోంది. ఇతర వివరాలకు 'పల్లెసృజన' ప్రతినిధి వీరరాఘవరెడ్డిని 81257 99904, 79890 38186 ఈ నంబర్లలో సంప్రదించవచ్చు.

విత్తనాలు కావాలా?

చిరుధాన్యాలను రోజువారీ ఆహారంలో ఎంతో కొంతైనా భాగం చేసుకోవాలని భారతీయ వైద్యపరిశోధనా మండలికి అనుబంధంగా ఉన్న జాతీయ పోషకాహార సంస్థ ఇటీవల విడుదల చేసిన ఆహార మార్గదర్శకాలలో భారతీయులకు స్పష్టమైన సూచన చేసింది. గత ఏడాది అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవం జరుపుకున్న నేపథ్యంలో ఇప్పటికే చిరుధాన్యాలను అన్నంగానో, అంబలిగానో స్నాక్స్‌గానో తీసుకునే వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. చిరుధాన్యాలకు గిట్టుబాటు ధర లభిస్తుండటంతో తెలుగు రాష్ట్రాల్లో చిరుధాన్యాల సాగుపై రైతులు మక్కువ చూపుతున్న ఈ నేపథ్యంలో చిరుధాన్యాల విత్తనాల సమాచారం పొందుపరుస్తున్నాం..



హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో... జొన్న, సజ్జ, కొర్ర, అండుకొర్ర, సామ, ఊద విత్తనాలు హైదరాబాద్ శివారు రాజేంద్రనగర్‌లోని భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఐఎంఆర్)లో రైతులకు అందుబాటులో ఉన్నాయి. రకాన్ని బట్టి కిలో విత్తనాల ధర రూ. 100 నుంచి 200 వరకు ఉంటుంది. రైతులు స్వయంగా వెళ్లి ఐఐఎంఆర్ కార్యాలయంలో కొనుక్కోవాలి. వివరాలకు.. 040–24599305 నంబరులో సంప్రదించవచ్చు.

పాలెంలో... నాగర్‌కర్నూల్ జిల్లా పాలెంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో అనేక ఇతర పంటల విత్తనాలతో పాటు చిరుధాన్యాల విత్తనాలు కూడా రైతులకు విక్రయిస్తున్నారు. పాలెం పచ్చజొన్న-1 (3 కేజీలు-రూ.450), తెలంగాణ తెల్ల జొన్న (3 కేజీలు-రూ.270), రాగి (3కేజీలు- రూ.150), సజ్జ (2 కేజీలు-రూ.200), కొర్ర (2 కేజీలు-రూ.130) విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. వివరాలకు మురళిని 94904 09163 నంబరులో సంప్రదించవచ్చు.

ఆంధ్రప్రదేశ్‌లో... నంద్యాలలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో జొన్న, రాగి విత్తనాలు ఉన్నాయి. డాక్టర్ నర్సింహులును 79810 85507 నంబరులో సంప్రదించవచ్చు. అనంతపురంలోని వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో సజ్జ విత్తనాలు ఉన్నాయి. డాక్టర్ మాధవీలతను 79819 29538 నంబరులో సంప్రదించవచ్చు. పెరుమాళ్లపల్లె వ్యవసాయ పరిశోధనా స్థానంలో రాగి విత్తనాలు ఉన్నాయి. ఎం. శ్రీవల్లిని 93987 95089 నంబరులో సంప్రదించవచ్చు. విజయనగరం వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో రాగి విత్తనాలు ఉన్నాయి. డా. ఎస్. అనూరాధను 85002 04565 నంబరులో సంప్రదించవచ్చు. ఇదిలా ఉండగా, ఏపీ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఈ ఖరీఫ్‌కు ఇతరత్రా పంట విత్తనాతో పాటు 721 క్వింటాళ్ల రాగి, 146 క్వింటాళ్ల కొర్ర, 6 క్వింటాళ్ల సామ, ఒక క్వింటా ఊద విత్తనాలను 26 జిల్లాల్లో రైతులకు సబ్సిడీపై పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

బోరు చుట్టూ ఇంకుడుగుంత నిర్మించడం ఎలా?

ఈ ఏడాది అధిక వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో వాన నీటి సంరక్షణకు ఉపక్రమిద్దాం. పొలాల్లో, గేటెడ్ కమ్యూనిటీల్లో, అపార్ట్‌మెంట్లు / ఇళ్ల దగ్గర ఉన్న బోర్ల చుట్టూతా ఇంకుడు గుంతలు తీయించుకుందాం. బోరు రీచార్జ్ గుంతను నిర్మించుకుంటే.. వర్షపు నీటిలో 40–50% వరకు భూమి లోపలికి ఇంకింపజేసుకోవచ్చని భూగర్భ జల నిపుణులు, సికింద్రాబాద్‌లోని వాటర్ అండ్ లైవ్‌లీహుడ్స్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.వి. రామమోహన్ (94401 94866) సూచిస్తున్నారు. మరింత సమాచారం కోసం, సంబంధిత వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయండి.



నాలుగో ర్యాంక్‌లో జ్యోతి సురేఖ

ఆర్చరీ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ నాలుగో స్థానంలో నిలిచింది. గత ర్యాంకింగ్స్‌లో రెండో ర్యాంక్‌లో ఉన్న జ్యోతి సురేఖ కొరియాలో జరిగిన ప్రపంచకప్ స్టేజ్-2 టోర్నీలో క్వార్టర్ ఫైనల్లో ఓడిపోవడంతో ఆమె ర్యాంక్‌లో మార్పు వచ్చింది. భారత్‌కే చెందిన అదితి 10వ ర్యాంక్‌లో, పర్ణీత్ కౌర్ 12వ ర్యాంక్‌లో కొనసాగుతున్నారు. టీమ్ విభాగంలో సురేఖ, అదితి, పర్ణీత్ బృందం నంబర్‌వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకుంది.



ఉజ్బెకిస్తాన్‌తో ఫుట్‌బాల్ మ్యాచ్‌లకు సౌమ్య

తెలంగాణ అమ్మాయి సౌమ్య గుగులోత్ భారత మహిళల ఫుట్‌బాల్ జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకుంది. తాష్కెంట్ నగరంలో ఉజ్బెకిస్తాన్ జట్టుతో మే 31, జూన్ 4వ తేదీల్లో జరిగే రెండు అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్‌ల్లో పోటీపడే భారత జట్టులో ఆమె ఎంపికైంది. 30 మంది ప్రాబబుల్స్‌కు ఇటీవల రెండు వారాలపాటు హైదరాబాద్‌లోని శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ మైదానంలో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ ఏడాది ఆరంభంలో జరిగిన టర్కిష్ కప్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన భారత జట్టులోనూ సౌమ్య సభ్యురాలిగా ఉంది.

నాదల్‌కు షాక్

ఫ్రెంచ్ ఓపెన్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయిన స్పెయిన్ దిగ్గజం
● జర్మనీ స్టార్ జ్వెరెవ్ సంచలనం


నాదల్

పారిస్: తరచూ గాయాలబారిన పడటం... పూర్తి స్థాయి ఫిట్‌నెస్ లేకపోవడం... వెరసి మట్టికోర్టులపై మకుటంలేని మహరాజుగా వెలుగొందిన స్పెయిన్ దిగ్గజం రాఫెల్ నాదల్‌కు ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఊహించని పరాజయం ఎదురైంది. 2005 నుంచి ఈ టోర్నీలో ఆడుతూ ఏకంగా 14 సార్లు విజేతగా నిలిచిన 37 ఏళ్ల నాదల్ మొదటి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ప్రపంచ నాలుగో ర్యాంకర్, గత మూడేళ్లుగా ఫ్రెంచ్ ఓపెన్‌లో సెమీఫైనల్ చేరిన జర్మనీ స్టార్ అలెగ్జాండర్ జ్వెరెవ్ పక్కా ప్రణాళికతో ఆడి నాదల్ ఆట కట్టించాడు. 3 గంటల 5 నిమిషాలపాటు సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో జ్వెరెవ్ 6-3, 7-6 (7/5), 6-3తో నాదల్‌ను ఓడించి రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. ఈ మ్యాచ్‌లో జ్వెరెవ్ ఎనిమిది ఏస్‌లు సంధించడంతోపాటు నాదల్ సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు. జ్వెరెవ్ సర్వీస్‌ను కేవలం రెండుసార్లు బ్రేక్ చేసిన నాదల్ 30 అనవసర తప్పిదాలు కూడా చేశాడు. గాయం కారణంగా గత ఏడాది ఈ టోర్నీకి దూరంగా ఉన్న నాదల్ తాజా ఓటమితో చివరిసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆడినట్లు భావించాలి.

3 ఫ్రెంచ్ ఓపెన్ చరిత్రలో నాదల్‌ను ఓడించిన మూడో ప్లేయర్‌గా జ్వెరెవ్ నిలిచాడు. గతంలో సోడెర్లింగ్ (స్వీడన్; 2009లో ప్రిక్వార్టర్స్‌లో) ఒకసారి... జొకోవిచ్ (సెర్బియా; 2015 క్వార్టర్ ఫైనల్లో, 2021 సెమీఫైనల్లో) రెండుసార్లు ఈ టోర్నీలో నాదల్‌ను ఓడించారు. 2016లో గాయం కారణంగా నాదల్ మూడో రౌండ్ నుంచి వైదొలిగాడు.

3 గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో నాదల్ తొలి రౌండ్‌లో ఓడిపోవడం ఓవరాల్‌గా ఇది మూడోసారి మాత్రమే. ఇంతకుముందు నాదల్ 2016 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో, 2013 వింబుల్డన్ టోర్నీలో తొలి రౌండ్‌లో ఓటమి పాలయ్యాడు.

సుమిత్ నగాల్ ఓటమి

ఫ్రెంచ్ ఓపెన్‌లో తొలిసారి ఆడుతున్న భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ పోరాటం మొదటి రౌండ్‌లోనే ముగిసింది. ప్రపంచ 18వ ర్యాంకర్ ఖచనోవ్ (రష్యా)తో జరిగిన మ్యాచ్‌లో సుమిత్ 2-6, 0-6, 6-7 (5/7)తో ఓడిపోయాడు. మరోవైపు ప్రపంచ రెండో ర్యాంకర్ యానిక్ సినెర్ (ఇటలీ) శుభారంభం చేశాడు. తొలి రౌండ్‌లో సినెర్ 6-3, 6-3, 6-4తో యుబ్యాంక్స్ (అమెరికా)పై గెలిచాడు.


జ్వెరెవ్


స్వియాటెక్

స్వియాటెక్ ముందంజ

మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో స్వియాటెక్ 6-1, 6-2తో లియోలియా జీన్‌జీన్ (ఫ్రాన్స్)పై గెలిచింది. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 6-1, 6-1తో జూలియా అవ్‌దీవా (రష్యా)పై, ఎనిమిదో సీడ్ ఆన్స్ జబర్ (ట్యునీషియా) 6-3, 6-2తో సాచియా వికెరీ (అమెరికా)పై, ఐదో సీడ్ వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్) 6-1, 6-3తో మసరోవా (స్పెయిన్)పై విజయం సాధించారు.

హర్మన్‌ప్రీత్ హ్యాట్రిక్

అర్జెంటీనాపై భారత్ విజయం



ఆంట్‌వర్ప్ (బెల్జియం): అంతర్జాతీయ హాకీ సమాఖ్య పురుషుల ప్రొ లీగ్ టోర్నీలో భారత జట్టు ఏడో విజయం నమోదు చేసింది. యూరోపియన్ అంచెలో భాగంగా ఒలింపిక్ మాజీ చాంపియన్ అర్జెంటీనాతో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు 5-4 గోల్స్ తేడాతో గెలిచింది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ 'హ్యాట్రిక్' సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. టీమిండియా తరఫున హర్మన్‌ప్రీత్ (29వ, 50వ, 52వ ని.లో) మూడు గోల్స్ చేయగా... అరిజీత్ సింగ్ హుండల్ (7వ ని.లో, గుర్జంత్ సింగ్ (18వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. అర్జెంటీనా తరఫున ఫెడెరికో మోంజా (3వ ని.లో), నికోలస్ కీనన్ (24వ ని.లో), టడియో మరూసి (54వ ని.లో), లుకాస్ మార్టినెజ్ (57వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. మొత్తం తొమ్మిది జట్లు పోటీ పడుతున్న ప్రొ లీగ్‌లో భారత జట్టు 12 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. ఏడు మ్యాచ్‌ల్లో నెగ్గి, ఐదు మ్యాచ్‌ల్లో ఓడిపోయి 21 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. యూరోపియన్ అంచెలో భాగంగా లండన్‌లో జూన్ 1 నుంచి 9 వరకు లండన్‌లో జరిగే మ్యాచ్‌ల్లో భారత జట్టు జర్మనీ, బ్రిటన్‌లతో రెండు సార్లు చొప్పున తలపడుతుంది.

అంకుశిత బోణీ



బ్యాంకాక్: వరల్డ్ ఒలింపిక్ చివరి క్వాలిఫయింగ్ బాక్సింగ్ టోర్నీలో సోమవారం భారత బాక్సర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల 60 కేజీల విభాగంలో అంకుశిత బోరో శుభారంభం చేయగా... పురుషుల 80 కేజీల విభాగంలో అభిమన్యు రెండో రౌండ్‌లో ఓడిపోయాడు. మోన్‌ఖోర్ (మంగోలియా)తో జరిగిన బౌట్‌లో అంకుశిత 4-1తో గెలుపొందింది. కెలిన్ కాసిడీ (ఐర్లాండ్)తో జరిగిన బౌట్‌లో అభిమన్యు 0-5తో ఓటమి పాలయ్యాడు. నేడు జరిగే రెండో రౌండ్ బౌట్‌లలో భారత బాక్సర్లు సచిన్ (57 కేజీలు), అభినాశ్ జమ్వాల్ (63.5 కేజీలు), నిశాంత్ (71 కేజీలు) పోటీపడతారు.

విండీస్ క్లీన్‌స్వీప్

కింగ్‌స్టౌన్: దక్షిణాఫ్రికాతో జరిగిన టి20 సిరీస్‌ను వెస్టిండీస్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. చివరిదైన మూడో టి20లో వెస్టిండీస్ ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచింది. ముందుగా దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 163 పరుగులు చేసింది. డసెన్ (51; 1 ఫోర్, 5 సిక్స్‌లు) రాణించాడు. విండీస్ బౌలర్లలో మెకాయ్ (3/39), మోతీ (2/21) ఆకట్టుకున్నారు. అనంతరం 164 పరుగుల లక్ష్యాన్ని వెస్టిండీస్ కేవలం 13.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్లు జాన్సన్ చార్లెస్ (26 బంతుల్లో 69; 9 ఫోర్లు, 5 సిక్స్‌లు), బ్రాండన్ కింగ్ (28 బంతుల్లో 44; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 6.4 ఓవర్లలో 92 పరుగులు జోడించారు. వీరిద్దరు అవుటయ్యాక మేయర్స్ (23 బంతుల్లో 36 నాటౌట్; 4 సిక్స్‌లు), అథనాజ్ (6 నాటౌట్) విండీస్ విజయాన్ని ఖరారు చేశారు. మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను వెస్టిండీస్ క్లీన్‌స్వీప్ చేయడం ఇది రెండోసారి. 2017లో అఫ్గానిస్తాన్‌పై విండీస్ తొలిసారి 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది.


చార్లెస్

పిచ్ క్యురేటర్లకు, గ్రౌండ్స్‌మెన్‌కు బీసీసీఐ నజరానా

ఐపీఎల్ 10 వేదికలకు రూ. 25 లక్షల చొప్పున నగదు పురస్కారం

న్యూఢిల్లీ: పరుగు వీరులకు, వికెట్ల ధీరులకు క్యాప్‌లు (ఆరెంజ్, పర్పుల్), చెక్‌లు షరామామూలుగా అందజేసిన భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈసారి మరో అడుగు ముందుకు వేసింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్‌లో అన్ని మ్యాచ్‌లు సజావుగా జరిగేందుకు రోజుల తరబడి పిచ్‌లు, వేదికల్ని సిద్ధం చేసిన క్యురేటర్లు, మైదానం సహాయక సిబ్బందికి భారీ నజరానాను ప్రకటించింది. వీరిని 'తెరవెనుక హీరో'లుగా అభివర్ణించిన బోర్డు కార్యదర్శి జై షా ఒక్కో వేదికలో భాగమైన క్యురేటర్-సిబ్బందికి కలిపి రూ. 25 లక్షలు నజరానా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఐపీఎల్ విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన వీరిని సోషల్ మీడియా వేదికగా జై షా అభినందించారు. 10 రెగ్యులర్ వేదికలు హైదరాబాద్, ముంబై, చెన్నై, కోల్‌కతా, ఢిల్లీ, బెంగళూరు, జైపూర్, ముల్లాన్‌పూర్, లక్నో, అహ్మదాబాద్‌లకు రూ. 25 లక్షల చొప్పున రివార్డు అందజేస్తారు. ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్తాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్‌లకు రెండో హోం గ్రౌండ్‌లు అయిన విశాఖపట్నం, గువాహటి, ధర్మశాల వేదికల సిబ్బందికి రూ. 10 లక్షల చొప్పున నజరానా ప్రకటించారు. మొత్తం 13 వేదికల్లో ఉత్తమ వేదికగా ఎంపికైన హైదరాబాద్ ఉప్పల్ స్టేడియానికి రూ. 50 లక్షల చెక్‌ను ఐపీఎల్ పాలక మండలి సభ్యుడు చాముండేశ్వరనాథ్... హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్ మోహన్ రావుకు అందజేశారు.



ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వరనాథ్ నుంచి 'ఉత్తమ పిచ్, ఉత్తమ మైదానం' అవార్డు కింద రూ. 50 లక్షల చెక్ అందుకుంటున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు

సినిమా

సర్‌ప్రైజ్ చూపించేద్దామా..!


● ప్రభాస్

ప్రభాస్ హీరోగా నటించిన సైన్స్ ఫిక్షన్ అండ్ ఫ్యూచరిస్టిక్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొనె, దిశా పటానీ ఇతర పాత్రల్లో నటించారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో అశ్వినీదత్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 27న విడుదల కానుంది. ఈ చిత్రంలో భైరవ పాత్రలో ప్రభాస్ నటిస్తున్నారు. ఈ మూవీలో ఆయన వాడిన కారు పేరు బుజ్జి. ఈ బుజ్జికి కీర్తీ సురేష్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. కాగా ఈ సినిమాకు సంబంధించిన 'బుజ్జి అండ్ భైరవ' యానిమేషన్ ప్రిల్యూడ్ వీడియోను ఈ నెల 31న విడుదల చేయనున్నట్లు వెల్లడించి, టీజర్‌ను విడుదల చేశారు. ''ఒకే బుజ్జి.. వీళ్లకి సర్‌ప్రైజ్ చూపించేద్దామా?' (ప్రభాస్), 'ఒకే భైరవ..' (వాయిస్ ఓవర్‌తో బుజ్జి) వంటి డైలాగ్స్ ఈ టీజర్‌లో ఉన్నాయి. అమేజాన్ ప్రైమ్ ఓటీటీలో ఈ వీడియో స్ట్రీమింగ్ కానుంది. 'కల్కి 2898 ఏడీ' సినిమాలోని వివిధ పాత్రల పరిచయంతో ఈ వీడియో ఉంటుందని సమాచారం. ఈ సినిమాకు సంగీతం: సంతోష్ నారాయణన్.


● శ్రీలీల

సికందర్‌కు విలన్‌గా...


● సల్మాన్ ఖాన్


● సత్యరాజ్

సల్మాన్‌ఖాన్‌కు విలన్‌గా నటుడు సత్యరాజ్ నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. సల్మాన్‌ఖాన్ హీరోగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో 'సికందర్' అనే ఓ యాక్షన్ థ్రిల్లర్ తెరకెక్కనుంది. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించనున్నారు. జూన్ నుంచి ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ జరిగేలా యూనిట్ సన్నాహాలు చేస్తోందని బాలీవుడ్ సమాచారం. ఈ సినిమాలో పవర్‌ఫుల్ విలన్ రోల్‌కు సత్యరాజ్‌ను తీసుకున్నారట మురుగదాస్. ఈ విషయంపై త్వరలోనే అధికారిక ప్రకటన రానుందని బాలీవుడ్ టాక్. సాజిద్ నడియాడ్‌వాలా నిర్మించనున్న 'సికందర్' వచ్చే ఏడాది రంజాన్‌కి విడుదల కానుంది.

రజనీకాంత్ స్నేహితుడిగా.. రజనీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో సన్‌పిక్చర్స్ 'కూలీ' అనే సినిమా నిర్మించనుంది. ఈ మూవీలో రజనీకాంత్ స్నేహితుడి పాత్రలో సత్యరాజ్ నటించనున్నారని కోలీవుడ్ టాక్. 1986లో వచ్చిన 'మిస్టర్ భరత్' సినిమాలో రజనీకాంత్, సత్యరాజ్ స్క్రీన్ షేర్ చేసుకున్నారు. మళ్లీ 38 సంవత్సరాల తర్వాత 'కూలీ' సినిమా కోసం స్క్రీన్ షేర్ చేసుకుంటారా? వేచి చూడాలి.

అలాంటి పాత్రలంటే ఇష్టం
- ఐశ్వర్యా మీనన్



''భజే వాయు వేగం' సినిమాలో యాక్షన్, ఎమోషన్‌తో పాటు లవ్, రొమాన్స్ కూడా ఉంటాయి. ఇదొక రా కంటెంట్ మూవీ. ఇందులో ఇందు అనే ట్రెడిషనల్ క్యారెక్టర్‌లో కనిపిస్తా. నాకు ఇలాంటి పాత్రలు చేయడం ఇష్టం. ఎందుకంటే నిజ జీవితంలోనూ నేను సంప్రదాయకమైన దుస్తులు ధరించేందుకు ఇష్టపడతాను'' అని హీరోయిన్ ఐశ్వర్యా మీనన్ అన్నారు. కార్తికేయ గుమ్మకొండ హీరోగా ప్రశాంత్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'భజే వాయు వేగం'. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 31న విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ఐశ్వర్యా మీనన్ మాట్లాడుతూ–''స్పై' సినిమాకి ముందే 'భజే వాయు వేగం' ఒప్పుకున్నాను. అయితే 'స్పై' ముందుగా వచ్చింది. అయినప్పటికీ నన్ను తెలుగుకి పరిచయం చేసింది దర్శకుడు ప్రశాంత్ రెడ్డి అనుకోవాలి. 'భజే వాయు వేగం'లో ఇందు అనే బ్యూటీషియన్ పాత్ర చేశాను. కార్తికేయతో నటించడం హ్యాపీగా ఉంది. యూవీ క్రియేషన్స్ లాంటి పేరున్న సంస్థలో సినిమా చేయడం గర్వంగా ఉంది. రథన్ చక్కని మ్యూజిక్ ఇచ్చాడు. నా ప్రతి సినిమా సూపర్ హిట్ కావాలని కోరుకుంటా. కానీ ఫలితం ప్రేక్షకుల చేతుల్లో ఉంటుంది. 'హైవే' సినిమాలో ఆలియా భట్‌గారిలా నటనకు ఆస్కారం ఉండే పాత్ర చేయాలని ఉంది. ప్రస్తుతం తెలుగులో ఒక సినిమా ఒప్పుకున్నా.. అలాగే మరో రెండు చర్చల్లో ఉన్నాయి. తమిళంలో కూడా ఓ సినిమా చేస్తున్నా'' అన్నారు.

జోడీ రిపీట్?


● రవితేజ

'ధమాకా!' (2022) సినిమాలో తొలిసారి జంటగా నటించి ఆడియన్స్‌ను మెప్పించారు రవితేజ, శ్రీలీల. తాజాగా ఈ జోడీ రిపీట్ కానున్నట్లుగా తెలిసింది. రవితేజ హీరోగా భాను భోగవరపు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమా నిర్మించనున్నారు. ఇది రవితేజ కెరీర్‌లో 75వ చిత్రం కావడం విశేషం. ఇందులో లక్ష్మణ్ భేరి అనే పాత్రలో కనిపించనున్నారు రవితేజ. ఈ సినిమా చిత్రీకరణ జూన్ నెలాఖరులో ప్రారంభం కానుందని తెలిసింది. అయితే ఈ సినిమాలో రవితేజకు జోడీగా శ్రీలీల నటించనున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. మరి.. ఈ 'ధమాకా!' జోడీ రిపీట్ అవుతుందా? వేచి చూడాలి. కాగా ఈ సినిమాను 2025 సంక్రాంతికి రిలీజ్ చేస్తామని ఇప్పటికే చిత్రయూనిట్ ప్రకటించిన విషయం తెలిసిందే.

షారుక్ బాద్‌షా.. నేను రాధిక
- నేహా శెట్టి



''మనం పోషించిన పాత్రల పేరుతో ప్రేక్షకులు మనల్ని పిలవడం ఏ నటులకైనా గొప్ప ప్రశంస. పోలిక అని కాదు కానీ.. షారుఖ్ ఖాన్‌గారిని బాద్‌షా అని పిలుస్తారు. 'డీజే టిల్లు' చిత్రంలో నేను పోషించిన రాధిక పాత్ర ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. నా కెరీర్ ప్రారంభంలోనే రాధిక అని పేరు తెచ్చుకోవడం సంతోషంగా ఉంది.. దాన్ని గౌరవంగా భావిస్తున్నాను'' అని హీరోయిన్ నేహా శెట్టి అన్నారు. విశ్వక్ సేన్ హీరోగా కృష్ణ చైతన్య దర్శకత్వం వహించిన చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. నేహా శెట్టి, అంజలి కథానాయికలు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నేహా శెట్టి మాట్లాడుతూ–''గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' మూవీ ఒక కుటుంబ ప్రయాణంలా ఉంటుంది. రత్న, రత్నమాల, బుజ్జి పాత్రల చుట్టూ కథ తిరుగుతుంది. ఈ మూవీలో 90లలో ధనవంతుల కుటుంబానికి చెందిన పల్లెటూరి అమ్మాయి బుజ్జి పాత్ర చేశా. 90లలో సాగే ఈ క్యారెక్టర్ కోసం డైరెక్టర్‌గారు నటి శోభనగారిని రిఫరెన్స్‌గా చూపించారు. బుజ్జి పాత్ర నాకు ఎంతగానో పేరు తెచ్చి పెడుతుంది. అప్పట్లో వాన పాట అంటే శ్రీదేవిగారు గుర్తుకొచ్చే వారు. అంత గొప్ప నటిలాగా ఇప్పుడు నాకు ఎక్కువ వాన పాటల్లో కనిపించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. విశ్వక్ సేన్ ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డాడు. అనుభవం గల నటిగా అంజలిగారి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. కృష్ణ చైతన్యగారు ఈ మూవీని తెరకెక్కించిన విధానం అద్భుతం. సితార సంస్థలో సినిమా చేయడం సంతోషంగా ఉంది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌కి జోడీగా ఓ సినిమా చేయబోతున్నా'' అన్నారు.

జూన్‌లో నమో

'మనమంతా', 'జెర్సీ', 'ఓ పిట్టకథ' వంటి సినిమాల్లో నటించిన విశ్వంత్ దుద్దంపూడి హీరోగా నటించిన చిత్రం 'నమో'. అనురూప్ కటారి, విస్మయ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. కందూరు ఆదిత్యా రెడ్డి దర్శకత్వంలో ఎ.ప్రశాంత్ నిర్మించిన ఈ సినిమాను జూన్ 7న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ వెల్లడించింది. ''సర్వైవల్ కామెడీ జానర్ ఫిల్మ్ 'నమో'. తండ్రి కోసం అడవికి వెళ్లిన హీరో, అతని స్నేహితుడు అనుకోకుండా ఓ డెన్‌లో చిక్కుకుపోతారు. ఆ తర్వాత వారు ఎలా బయటపడ్డారు? అన్నదే ఈ సినిమా కథాంశం'' అన్నారు మేకర్స్. ఈ సినిమాకు సంగీతం: క్రాంతి ఆచార్య వడ్లూరి.


● విస్మయ, విశ్వంత్, అనురూప్

ప్రేక్షకుల్ని బాగా నవ్విస్తుంది
- నిర్మాత వంశీ కారుమంచి



''క్రైమ్, కామెడీ, యాక్షన్‌గా 'గం..గం..గణేశా' సినిమా రూపొందింది. మరీ ముఖ్యంగా ఇందులోని వినోదం ఆకట్టుకుంటుంది. మన స్నేహితుల్లో ఎవరో ఒకరు మనల్ని సమస్యల్లో ఇరికిస్తుంటారు. అలాంటి సందర్భాల్లో వచ్చే వినోదం ప్రేక్షకుల్ని బాగా నవ్విస్తుంది'' అని నిర్మాత వంశీ కారుమంచి అన్నారు. ఆనంద్ దేవరకొండ హీరోగా, ప్రగతి శ్రీవాస్తవ, కరిష్మా హీరోయిన్లుగా నటించిన చిత్రం 'గం..గం.. గణేశా'. ఉదయ్ శెట్టి దర్శకుడు. హైలైఫ్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై వంశీ కారుమంచి, కేదార్ సెలగంశెట్టి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా వంశీ కారుమంచి మాట్లాడుతూ–''నాది గుంటూరు. చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఇష్టం. అమెరికాలో ఉద్యోగం, వ్యాపారం చేశా. కొన్ని సినిమాలు డిస్ట్రిబ్యూట్ చేశాను. ఇండియాలోనే స్థిరపడాలనుకున్నప్పుడు సినిమాలు నిర్మించాలనే ఆలోచన ఉండేది. ఉదయ్ కథ చెప్పగానే ఆనంద్‌కి సరిపోతుందనిపించింది. కొంత ఆకతాయిగా, జులాయిగా ఉండే పాత్ర తనది. గణేష్ విగ్రహం, డబ్బుతో ముడిపడిన యాక్షన్ కామెడీ సినిమా 'గం గం గణేశా'. ఇద్దరి హీరోయిన్ల పాత్రకి మంచి ప్రాధాన్యం ఉంది. సినిమా ఇండస్ట్రీ చూసేందుకు చిన్నదిగా కనిపించినా లక్షల మంది దీని మీద ఆధారపడి జీవిస్తున్నారు. ప్రస్తుతం రెండు కథలు ఫైనలైజ్ చేస్తున్నాం'' అన్నారు.

క్రైమ్ థ్రిల్లర్


● పాయల్

'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' వంటి చిత్రాలతో ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'రక్షణ'. రోషన్, మానస్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. హరిప్రియ క్రియేషన్స్‌పై ప్రణదీప్ ఠాకోర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమాని జూన్ 7న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రణదీప్ ఠాకోర్ మాట్లాడుతూ–''ఇదొక క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ మిస్టరీ డ్రామా. ఒక పోలీస్ ఆఫీసర్ జీవితంలో జరిగిన ఘటన స్ఫూర్తితో రాసిన కథతో ఈ సినిమా తీశా. పాయల్ రాజ్‌పుత్ ఇప్పటి వరకు చేసిన పాత్రలకు భిన్నంగా ఇందులో పవర్‌ఫుల్ ఇన్వెస్టిగేటివ్ పోలీస్ ఆఫీసర్‌గా నటించారు. క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ మూవీని ఎక్కడా రాజీ పడకుండా ఉన్నత నిర్మాణ విలువలతో రూపొందించాను. 'రక్షణ' ప్రేక్షకులను మెప్పిస్తుంది'' అన్నారు.

డైరెక్టర్ సూర్యప్రకాశ్ కన్నుమూత



చెన్నై: డైరెక్టర్ సూర్యప్రకాశ్ (56) సోమవారం గుండెపోటుతో చెన్నైలో కన్నుమూశారు. రాజ్‌కిరణ్ కథానాయకుడిగా నటించిన 'మాణిక్యం'(1996) చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమయ్యారాయన. ఆ తర్వాత శరత్‌కుమార్ హీరోగా 'మాయి, దివాన్', జీవన్ కథానాయకుడిగా 'అధిపర్' అనే తమిళ చిత్రాలు తీశారు. తెలుగులో రాజశేఖర్ హీరోగా 'భరత సింహారెడ్డి' సినిమా తెరకెక్కించారు సూర్యప్రకాశ్. ఆయన దర్శకత్వం వహించిన 'వరుసనాడు' చిత్రం విడుదల కావాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆయన హఠాన్మరణం సినీ పరిశ్రమను దిగ్భ్రాంతికి గురిచేసింది. సూర్య ప్రకాశ్ మృతికి నటుడు శరత్‌కుమార్‌తో పాటు పలువురు సినీరంగ ప్రముఖులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
28-5-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
20	25
75,390	22,932

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,921	▲	185
డోజోన్స్	39,070	▲	4
ఎఫ్‌టీఎస్‌ఈ 100 (శుక్రవారం ముగింపు)	8,318	▽	22
డాక్స్	18,775	▲	81
షాంఘై	3,124	▲	35
నికాయ్	38,900	▲	254

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	72,191
బంగారం (99.5 స్వచ్ఛత)	71,902
వెండి (కిలో)	90,811

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.69	83.71
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.72	107.28
€	యూరో	ఎస్‌బీఐ	89.09	91.47
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.50	53.66
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.22	56.18
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.30	63.99
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.27	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.75	23.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.36	12.43

ఎస్‌ఎంఎస్ స్కామర్లపై డాట్ కొరడా

ఎనిమిది సంస్థల బ్లాక్‌లిస్ట్

న్యూఢిల్లీ: మోసపూరిత మెసేజీలు పంపిస్తున్న ఎస్ఎంఎస్ స్కామర్లపై టెలికం శాఖ (డాట్) కొరడా ఝుళిపించింది. గత మూడు నెలలుగా 10,000 పైచిలుకు మెసేజీలు పంపిన ఎనిమిది 'ప్రిన్సిపల్ ఎంటిటీ'లను (ఎస్ఎంఎస్ ద్వారా టెలికం యూజర్లకు వాణిజ్యపరమైన మెసేజీలు పంపే సంస్థలు) బ్లాక్‌లిస్ట్ చేసింది. అలాగే వాటిని పంపేందుకు ఉపయోగించిన 73 ఎస్ఎంఎస్ హెడర్స్, 1,522 కంటెంట్ టెంప్లేట్స్‌ను కూడా బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. కేంద్ర హోం వ్యవహారాల శాఖ సమాచారం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు డాట్ తెలిపింది. సందేహాస్పద కమ్యూనికేషన్స్ గురించి ప్రజలు సంచార్ సాథి పోర్టల్‌లోని చక్షు ద్వారా ఫిర్యాదు చేయొచ్చని పేర్కొంది. స్పామ్‌పై ఫిర్యాదు చేసేందుకు 1909కి డయల్ చేయొచ్చని లేదా డీఎన్‌డీ (డు నాట్ డిస్టర్బ్) సర్వీసును ఉపయోగించాలని సూచించింది.

అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ నిధుల సమీకరణ

న్యూఢిల్లీ: అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ రూ. 12,500 కోట్ల నిధులను సమీకరించే యత్నాల్లో ఉంది. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ విధానంలో ఈ మొత్తాన్ని సమీకరించే ప్రతిపాదనకు కంపెనీ బోర్డు ఆమోదముద్ర వేసింది. జూన్ 25న జరిగే వార్షిక సర్వసభ్య సమావేశంలో షేర్‌హోల్డర్ల అనుమతిని కోరనుంది. ఈ ప్రతిపాదన ప్రకారం ఒక్కోటి రూ. 10 ముఖ విలువ చేసే ఈక్విటీ షేర్లను అలాగే ఇతరత్రా సెక్యూరిటీలను జారీ చేయడం ద్వారా ఈ మొత్తాన్ని సమీకరించే అవకాశం ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-5-2024 ఫామ్ ధర...

విశాఖ	500-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485-00
విజయవాడ	485-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

సంస్కరణలు కొనసాగుతాయ్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: బడ్జెట్ అంటే ఏదో ఖర్చుల పద్దుగా పరిమితం కాకుండా అందరికీ ప్రయోజనాలను సమానంగా అందించేందుకు ఉపయోగపడే బ్లూప్రింట్‌గా గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం మార్చేసిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. భారత్‌ను సంపన్న దేశంగా తీర్చిదిద్దే దిశగా సంస్కరణల అమలు ఇకపైనా వేగవంతంగా కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు. బడ్జెట్ విధానాల్లో మోదీ ప్రభుత్వం పారదర్శకతకు పెద్ద పీట వేసిందని మంత్రి వివరించారు. ఇలాంటి పారదర్శక బడ్జెట్‌లు ఉండే దేశాల విషయంలో అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంక్ మొదలైనవి సానుకూలంగా ఉంటాయని పేర్కొన్నారు. తద్వారా దేశానికి అంతర్జాతీయంగా విశ్వసనీయత పెరుగుతుందని నిర్మలా సీతారామన్ మైక్రో బ్లాగింగ్ సైట్ ఎక్స్‌లో (గతంలో ట్విటర్) చెప్పారు. ట్యాక్స్‌పేయర్లు తమ కష్టార్జితం నుంచి కట్టే ప్రతి రూపాయిని సమర్ధవంతంగా ఉపయోగించేందుకు, ప్రజా ధనం విషయంలో పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

కొత్త రికార్డు స్థాయిని తాకి, వెనక్కి..

- తొలిసారి 76 వేల స్థాయిని అందుకున్న సెన్సెక్స్
- ఆఖర్లో అమ్మకాలతో స్వల్ప నష్టాల ముగింపు



ముంబై: ట్రేడింగ్‌లో జీవితకాల గరిష్ట స్థాయిలను నమోదు చేసిన సెన్సెక్స్, నిఫ్టీలు లాభాల స్వీకరణతో వెనక్కి వచ్చాయి. ఉదయం ఆసియా మార్కెట్ నుంచి సానుకూల సంకేతాలతో లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. ఇంట్రాడేలో భారీ లాభాలు ఆర్జించాయి. బ్యాంకులు, ఫైనాన్స్, ఐటీ షేర్లు రాణించడంతో సెన్సెక్స్ 600 పాయింట్లు ఎగసి తొలిసారి 76 వేల స్థాయిపై 76,010 వద్ద కొత్త రికార్డును నమోదు చేసింది. నిఫ్టీ 154 పాయింట్లు బలపడి 23,111 వద్ద ఆల్‌టైం అందుకుంది. అయితే ఆఖరి గంటలో సరికొత్త రికార్డుల స్థాయిల వద్ద ఇంధన, మెటల్, ఎఫ్ఎంసీజీ, ఆటో షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 20 పాయింట్లు నష్టపోయి 75,390 వద్ద ముగిసింది. నిఫ్టీ 25 పాయింట్లు పతనమై 22,932 వద్ద స్థిరపడింది. చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు వరుసగా 0.63%, 0.10% చొప్పున రాణించాయి.

ఎల్ఐసీ లాభం ఫ్లాట్

- క్యూ4లో రూ. 13,763 కోట్లు
- షేరుకి రూ. 6 డివిడెండ్



ముంబై: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ) గత ఆర్థిక సంవత్సరం (2023–24) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 2% మెరుగుపడి రూ. 13,763 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2022–23) ఇదే కాలంలో రూ. 13,428 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 2,00,185 కోట్ల నుంచి రూ. 2,50,923 కోట్లకు చేరింది. తొలి ఏడాది ప్రీమియం రూ. 12,811 కోట్ల నుంచి రూ. 13,810 కోట్లకు బలపడింది. రెన్యువల్ ప్రీమియం ఆదాయం రూ. 76,009 కోట్ల నుంచి రూ. 77,368 కోట్లకు ఎగసింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 6 తుది డివిడెండ్ ప్రకటించింది. ఇక పూర్తి ఏడాదికి రూ. 40,676 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం ప్రీమియం ఆదాయం రూ. 4,75,070 కోట్లకు పుంజుకుంది. వ్యక్తిగత విభాగంలో ఎల్ఐసీ గతేడాది 2,03,92,973 పాలసీలను విక్రయించింది.

వీఎన్‌బీ ఓకే: ఐఆర్‌డీఏఐ వివరాల ప్రకారం తొలి ఏడాది ప్రీమియం ఆదాయంలో ఎల్ఐసీ 58.87 శాతం వాటాతో మార్కెట్ లీడర్‌గా నిలుస్తున్నట్లు సంస్థ చైర్మన్ సిద్ధార్థ మొహంతి పేర్కొన్నారు. కొత్త బిజినెస్ విలువ(వీఎన్‌బీ) 5 శాతం పుంజుకుని రూ. 9,583 కోట్లకు చేరింది. నికర వీఎన్‌బీ మార్జిన్లు సైతం 0.6 శాతం బలపడి 16.8 శాతాన్ని తాకాయి. సాల్వెన్సీ నిష్పత్తి సైతం 1.87 శాతం నుంచి 1.98 శాతానికి మెరుగుపడింది. ఎల్ఐసీ నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) 16.5 % బలపడి రూ. 51.21 లక్షల కోట్లను అధిగమించాయి. పాలసీదారులకు రూ. 52,956 కోట్లను బోనస్‌గా కేటాయించింది.

షేరు బీఎస్ఈలో 0.6% పెరిగి రూ.1,036 వద్ద ముగిసింది.

నాట్కో లాభం రూ.386 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ రంగ సంస్థ నాట్కో ఫార్మా మార్చి త్రైమాసికం గతే ఏడాదితో పోలిస్తే నికరలాభం 40% ఎగసి రూ.386 కోట్లు సాధించింది. టర్నోవర్ రూ.927 కోట్ల నుంచి రూ.1,110 కోట్లకు చేరింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో నికరలాభం 94 శాతం అధికమై రూ.1,388 కోట్లు నమోదైంది. టర్నోవర్ 47 శాతం పెరిగి రూ.4,127 కోట్లకు ఎగసింది. షేరు ధర బీఎస్ఈలో 0.85% దూసుకెళ్లి రూ.1,029 వద్ద స్థిరపడింది.

డిష్ టీవీకి పెరిగిన నష్టాలు



న్యూఢిల్లీ: డీటీహెచ్ ప్రసారాల కంపెనీ డిష్ టీవీ గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర నష్టం పెరిగి రూ. 1,990 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2022–23) ఇదే కాలంలో రూ. 1,711 కోట్ల నికర నష్టం నమోదైంది.

షేరు బీఎస్ఈలో 3.2% పతనమై రూ. 16 వద్ద ముగిసింది.

శామ్‌సంగ్ గెలాక్సీ ఎఫ్55



న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్స్ తయారీ దిగ్గజం శామ్‌సంగ్.. 5జీ స్మార్ట్‌ఫోన్స్ విభాగంలో మేడిన్ ఇండియా గెలాక్సీ ఎఫ్55 ప్రవేశపెట్టింది. ధర రూ.26,999 నుంచి ప్రారంభం. క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 7 జెన్ 1 ఎస్‌వోసీ, ఆన్‌డ్రాయిడ్ 14 ఓఎస్, 6.55 అంగుళాల ఫుల్ హెచ్‌డీ ప్లస్ సూపర్ అమోలెడ్ ప్లస్ డిస్‌ప్లే, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, 50 ఎంపీ ట్రిపుల్ కెమెరా, 50 ఎంపీ ఫ్రంట్ కెమెరా, ఇన్–డిస్‌ప్లే ఫింగర్‌ప్రింట్ సెన్సార్, 1 టీబీ వరకు ఎక్స్‌పాండబుల్ మెమరీ వంటి హంగులు ఉన్నాయి.

శ్రీటీఎంటీ స్టీల్ బ్రాండ్ అంబాసిడర్‌గా బుమ్రా



ముంబై: శ్రీటీఎంటీ స్టీల్ ఉత్పత్తుల తయారీ సంస్థ దేవశ్రీ ఇస్పాత్ తాజాగా భారతీయ క్రికెటర్, ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రాను తమ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. గత 50 ఏళ్లుగా ఉక్కు రంగంలో కార్యకలాపాలు సాగిస్తున్నామని కంపెనీ ఎండీ ప్రకాశ్ గోయెంకా తెలిపారు. నాణ్యత, విశ్వసనీయతకు అత్యంత ప్రాధాన్యమిచ్చే తమ బ్రాండ్‌కి బుమ్రా సముచిత ప్రచారకర్త కాగలరని ఆయన పేర్కొన్నారు. శ్రీటీఎంటీతో జట్టు కట్టడంపై బుమ్రా సంతోషం వ్యక్తం చేశారు.

ఫోస్‌రాక్ ఇండియా కొత్త ప్లాంటు ప్రారంభం

హైదరాబాద్: ఫోస్‌రాక్ ఇండియా హైదరాబాద్‌లో కొత్త ఇంటిగ్రేటెడ్ కన్‌స్ట్రక్షన్ కెమికల్ ప్లాంటు ప్రారంభించింది. జేఎంహెచ్ గ్రూప్‌నకు చెందిన డాక్టర్ జేమ్స్ ఎం.హే, ఫిట్రియాని హే, జేఎంహెచ్ గ్రూప్ సీఈవో రాబ్ బోన్నిసిలు కొత్త ప్లాంటును లాంఛనంగా ప్రారంభించారు. నిర్మాణ రంగంలో నిర్మాణాత్మక పరిష్కార సేవలు అందించే ఈ సంస్థ ఇప్పటికే కర్ణాటక, గుజరాత్, పశ్చిమ బెంగాల్, రాజస్తాన్‌లల్లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అంతర్జాతీయంగా 70 ఏళ్ల అనుభవం కలిగిన జేఎంహెచ్ గ్రూప్‌లో భాగమైన ఫోస్‌రాక్ ఇంటర్నేషనల్ యూకేకు పూర్తి అనుబంధ సంస్థ ఇది.

నాల్కో లాభం హైజంప్

క్యూ4లో రూ. 997 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ మెటల్ దిగ్గజం నేషనల్ అల్యూమినియం కంపెనీ(నాల్కో) గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం రెట్టింపై రూ. 997 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 495 కోట్లు ఆర్జించింది. అయితే నవరత్న కంపెనీ మొత్తం ఆదాయం రూ. 3,727 కోట్ల నుంచి రూ. 3,663 కోట్లకు క్షీణించింది. మొత్తం వ్యయాలు సైతం రూ. 3,161 కోట్ల నుంచి రూ. 2,720 కోట్లకు తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో నాల్కో షేరు బీఎస్ఈలో 0.6 శాతం బలపడి రూ. 194 వద్ద ముగిసింది.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

పీజీకి మార్గం..సీపీగేట్

తెలంగాణ రాష్ట్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్(పీజీ) కోర్సుల్లో ప్రవేశాలు కోరుకునే వారి కోసం కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్ (సీపీగేట్)-2024 ప్రకటన వెలువడింది. ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే ఈ పరీక్షద్వారా.. తెలంగాణలోని ఎనిమిది విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలల్లో పీజీ, పీజీ డిప్లొమా, ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.



యూనివర్సిటీలు ఇవే

ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, మహాత్మా గాంధీ, పాలమూరు, శాతవాహన, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీలు, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయాలు.

ప్రవేశాలు కల్పించే కోర్సులు

- **పీజీ కోర్సులు:** ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంహెచ్ఆర్ఎం, ఎంటీఎం, ఎంకాం, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంఎస్సీ, ఎంబీఏ, ఎంఎల్ఐబీఎస్సీ, బీఎల్ఐబీఎస్సీ.
- **అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులు:** బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ/ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఎకనామిక్స్, ఎంబీఏ.
- **పీజీ డిప్లొమా కోర్సులు:** చైల్డ్ సైకాలజీ, ఫ్యామిలీ మ్యారేజ్ కౌన్సిలింగ్, ఫోరెన్సిక్ సైన్స్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్.

అర్హతలు

పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందాలనుకునే వారు సంబంధిత డిగ్రీలో కనీసం 40 శాతం మార్కులు, బీఎడ్/బీపీఎడ్ కోర్సులకు డిగ్రీలో 55 శాతం మార్కులు, ఇంటిగ్రేటెడ్ కోర్సులకు 10+2/ఇంటర్మీడియట్‌లో 50 శాతం మార్కులు తప్పనిసరి.

పరీక్ష విధానం

ఈ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం వంద ప్రశ్నలు–వంద మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్షకు కేటాయించిన సమయం 90 నిమిషాలు. ప్రతి సబ్జెక్టుకూ సిలబస్‌ను నిర్దేశించారు. కోర్సులను అనుసరించి ప్రశ్నపత్రంలో మార్పు ఉంటుంది.

సీట్ల కేటాయింపు

విద్యార్థికి సీటు కేటాయింపు అనేది ఎంపిక చేసుకున్న సబ్జెక్టు, ఆ సబ్జెక్ట్‌లో పరీక్ష రాసిన వారి సంఖ్య, అభ్యర్థికి వచ్చిన ర్యాంకు, కేటగిరి, ఉన్న సీట్ల సంఖ్య తదితర అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఎక్కువ మంది విద్యార్థులు యూనివర్సిటీ క్యాంపస్‌లో చదవాలని కోరుకుంటారు. కానీ సీట్ల సంఖ్య పరిమితం. పోటీ ఎక్కువగా ఉంటుంది. అర్హత పరీక్షలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు క్యాంపస్ సీట్లు పొందడానికి అవకాశం ఉంటుంది.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 17.06.2024
- రూ.500 ఆలస్య రుసుముతో: 2024 జూన్18–25 తేదీ వరకు;
- రూ.2 వేలు లేట్ ఫీజుతో: 2024 జూన్ 26–30 తేదీ వరకు;
- ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభ తేదీ: 05.07.2024
- వెబ్‌సైట్: https://cpget.tsche.ac.in

ప్రిపరేషన్ ఇలా

- అభ్యర్థి ఎంపిక చేసుకునే సబ్జెక్టుకు సంబంధించిన సిలబస్‌పై పూర్తి అవగాహన పెంచుకోవాలి.
- సిలబస్‌లో పేర్కొన్న టాపిక్స్ బాగా చదువుకుంటే సరిపోతుంది. మంచి ర్యాంకు రావాలంటే సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రిపరేషన్ ప్లాన్ తయారు చేసుకోవాలి.
- డిగ్రీ సబ్జెక్ట్ కాకుండా వేరే సబ్జెక్ట్‌లో పీజీ చేయాలనుకునే వారు సన్నద్ధత విషయంలో ఎక్కువ సమయాన్ని కేటాయించాల్సి ఉంటుంది. డిగ్రీ అనుబంధ కోర్సు అయితే పాత నోట్సు అంశాలనే మళ్లీ చదవడం మంచిది. ప్రశ్నపత్రంపై అవగాహన రావడానికి, సన్నద్ధత స్థాయిలను అంచనా వేసుకోవడానికి పాత ప్రశ్న పత్రాలు, మాక్ టెస్టులు రాయడం మేలు చేస్తుంది.

పీహెచ్‌డీ @ ఐఐఎం, ఐఐటీ

» ఐఐఎంలు, ఐఐటీల్లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్
» క్యాట్, గేట్, నెట్, జేఆర్ఎఫ్ స్కోర్‌లతో ప్రవేశం
» ఎంపికైతే ఆకర్షణీయ ప్రోత్సాహకాలు

డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ.. సంక్షిప్తంగా పీహెచ్‌డీ! పరిశోధనలకు, నూతన ఆవిష్కరణలకు ఊతమిచ్చే కోర్సు! పరిశోధనలపై ఆసక్తి ఉన్న యువతకు దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థలైన ఐఐటీలు, ఐఐఎంలు చక్కటి వేదికలు. ఈ ఇన్‌స్టిట్యూట్స్ ప్రతిభావంతులకు పీహెచ్‌డీలో ప్రవేశం కల్పించడమేకాకుండా.. ప్రోత్సాహకాలు సైతం అందిస్తున్నాయి. ఐఐటీలు, ఐఐఎంల్లో పీహెచ్‌డీ పూర్తి చేసుకుంటే.. బోధన, పరిశోధన రంగాల్లో ఉజ్వల కెరీర్ ఖాయం!! ఈ నేపథ్యంలో.. ఐఐఎంలు, ఐఐటీల్లో పీహెచ్‌డీ, ప్రవేశ ప్రక్రియ, కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం..

ఐఐఎంలు.. దేశంలో మేనేజ్‌మెంట్ కోర్సులను అందించడంలో అంతర్జాతీయ గుర్తింపు ఉన్న విద్యాసంస్థలు! అదేవిధంగా ఇంజనీరింగ్ విద్యలో ప్రమాణాలకు పెట్టింది పేరు.. ఐఐటీలు!! ఈ ఇన్‌స్టిట్యూట్స్ యూజీ, పీజీలే కాకుండా.. పీహెచ్‌డీ కోర్సులను అందిస్తున్నాయి. ప్రవేశం పొందిన విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తూ పరిశోధనలు, ఆవిష్కరణలకు ఊతమిస్తున్నాయి.

ఐఐఎంల్లో పీహెచ్‌డీకి మార్గం

ఐఐఎం క్యాంపస్‌లు మేనేజ్‌మెంట్ విభాగానికి సంబంధించిన పలు సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశం కల్పిస్తున్నాయి. క్యాట్, జీమ్యాట్, జీఆర్ఈ,యూజీసీ–జేఆర్ఎఫ్ వంటి పరీక్షల స్కోర్లను ప్రవేశాలకు ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. పలు ఐఐఎంలు ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, క్వాంటిటేటివ్ మెథడ్స్ వంటి ఇంజనీరింగ్ సంబంధిత స్పెషలైజేషన్లలోనూ పీహెచ్‌డీలో ప్రవేశాలు కల్పిస్తున్నాయి. వీటిలో ప్రవేశానికి గేట్, జీఆర్ఈ వంటి పరీక్షల స్కోర్లను పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఐఐఎం–బెంగళూరు ఈ స్కోర్లు లేకున్నా.. సొంతంగా ప్రవేశ పరీక్ష నిర్వహించి అడ్మిషన్ కల్పిస్తోంది.

అర్హతలు

ఐఐఎంల్లో పీహెచ్‌డీకి సమానమైన ఎఫ్‌పీఎం (ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్)కు దరఖాస్తు చేసుకునేందుకు నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీ ఉండాలి. బ్యాచిలర్ డిగ్రీలో కనీసం 60 శాతం మార్కులు సాధించాలి. దీంతోపాటు నిర్దేశిత ప్రామాణిక టెస్టుల (క్యాట్, జీమ్యాట్, జీఆర్ఈ తదితర) స్కోర్ తప్పనిసరి. అకడమిక్ ట్రాక్ రికార్డ్ బాగుండాలి. పీజీ ఉత్తీర్ణత ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలనుకుంటే.. పీజీలో 55 శాతం మార్కులు, బ్యాచిలర్ డిగ్రీలో 50 శాతం మార్కులు ఉండాలి.

కోర్సు వ్యవధి నాలుగేళ్లు

ఐఐఎంల్లో పీహెచ్‌డీ కోర్సు వ్యవధి కనిష్టంగా నాలుగేళ్లు, గరిష్టంగా ఏడేళ్లుగా ఉంది. ఈ ప్రోగ్రామ్స్‌లో తొలి రెండేళ్లు క్లాస్‌రూం ఆధారిత కోర్స్ వర్క్ ఉంటుంది. ఆ తర్వాత కాంప్రెహెన్సివ్ క్వాలిఫయింగ్ ఎగ్జామ్, కాంప్రహెన్సివ్ ఎగ్జామినేషన్‌ల పేరుతో ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తారు. వాటిని థీసిస్ అడ్వయిజరీ కమిటీలు లేదా ఎఫ్‌పీఎం రివ్యూ కమిటీలు మూల్యాంకన చేసి.. అభ్యర్థికున్న అవగాహన మేరకు తదుపరి దశ పీహెచ్‌డీ కోర్స్ వర్క్‌కు అనుమతి మంజూరు చేస్తాయి.



ఆర్థిక చేయూత

- ఐఐఎంల్లో పీహెచ్‌డీలో చేరిన విద్యార్థులకు ఆర్థిక చేయూత లభిస్తుంది. ఐఐఎం–బెంగళూరు, అహ్మదాబాద్‌లలో ట్యూషన్ ఫీజు నుంచి మినహాయింపుతోపాటు నెలకు రూ.42 వేల ఫెలోషిప్ అందిస్తారు. అదే విధంగా స్టార్టప్ గ్రాంట్ కింద మొదటి ఏడాదిలోనే రూ.75 వేలు; కాంటింజెన్సీ గ్రాంట్ కింద రెండో ఏడాది నుంచి అయిదో ఏడాది వరకు ప్రతి ఏటా రూ.25 వేలు అందిస్తారు.
- ఐఐఎం–ఉదయ్‌పూర్ ఫీజు మినహాయింపుతోపాటు మొదటి రెండేళ్లు నెలకు రూ.37 వేలు; ఆ తర్వాత కాంప్రహెన్సివ్ ఎగ్జామ్ పూర్తి చేసుకుంటే.. నెలకు రూ.40 వేలు చొప్పున ఫెలోషిప్ అందిస్తోంది. ఇతర ఐఐఎంలు కూడా ట్యూషన్ ఫీజు నుంచి మినహాయింపు ఇవ్వడంతోపాటు స్టడీ టూర్ ఖర్చులు, కాంటింజెన్సీ గ్రాంట్, ఆన్–క్యాంపస్ వసతి సదుపాయం వంటివి కల్పిస్తున్నాయి.

ప్రవేశం క్లిష్టంగా

ఐఐఎంల్లో పీహెచ్‌డీలో ప్రవేశానికి పోటీ తీవ్రంగా ఉంటుంది. దీంతో అప్లికేషన్ దశ నుంచే రివ్యూ కమిటీ క్షుణ్నంగా పరిశీలిస్తుంది. అకడమిక్ ట్రాక్ రికార్డ్, స్టాండర్డ్ టెస్ట్ స్కోర్స్‌తోపాటు రిఫరెన్స్ లెటర్స్‌ను పరిశీలిస్తుంది. అప్లికేషన్ దశలో అన్ని అంచెల్లో విజయం సాధిస్తే.. తదుపరి దశలో ఇంటర్వ్యూ ఉంటుంది. ఇందులో అప్లికేషన్‌లో పేర్కొన్న స్పెషలైజేషన్‌లో అభ్యర్థికున్న వాస్తవ ఆసక్తిని పరిశీలిస్తారు.

ఐఐటీ, ఐఐఎంల్లో పీహెచ్‌డీ.. ముఖ్యాంశాలు

- దేశ వ్యాప్తంగా పలు ఐఐఎంలు, ఐఐటీల్లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్.
- క్యాట్, గేట్, జీఆర్ఈ, జీమ్యాట్, యూజీసీ నెట్ స్కోర్లతో దరఖాస్తు అవకాశం.
- 2024–25 సంవత్సరానికి పలు క్యాంపస్‌లలో మొదలైన దరఖాస్తు ప్రక్రియ.
- ఎంపికైన వారికి ట్యూషన్ ఫీజు మినహాయింపు.
- నెలకు కనిష్టంగా రూ.30 వేలు.. గరిష్టంగా రూ.50 వేల వరకు ఫెలోషిప్.
- బోధన, పరిశోధన రంగాల్లో ఉజ్వల కెరీర్ అవకాశాలు.

ఐఐటీల్లో పీహెచ్‌డీ ఇలా

నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యకు కేరాఫ్‌గా నిలుస్తున్న ఐఐటీలు.. కోర్ బ్రాంచ్‌లు మొదలు తాజా ట్రెండ్‌గా మారిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐఓటీ.. ఇలా పలు విభిన్న విభాగాల్లో పీహెచ్‌డీలో ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

అర్హతలు

ఐఐటీల్లో పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకునేందుకు బీటెక్, ఎంటెక్, నిర్దిష్ట స్పెషలైజేషన్లలో ఎమ్మెస్సీ తదితర అర్హతలుండాలి. అకడమిక్ రికార్డ్ 60 శాతం తగ్గకుండా ఉండాలి. వీటితోపాటు గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) స్కోరు, సీఎస్ఐఆర్–యూజీసీ, ఎన్‌బీహెచ్ఎం, డీబీటీ, డీఎస్‌టీ జేఆర్ఎఫ్‌ల్లో ఏదో ఒక పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి.

ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ

బీటెక్ విద్యార్థులకు పీహెచ్‌డీలో అవకాశం కల్పించేందుకు ఐఐటీలు ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ(ఎంటెక్+పీహెచ్‌డీ) విధానాన్ని అనుసరిస్తున్నాయి. ఈ విధానంలో ప్రవేశం పొందిన వారు రెండేళ్లు క్లాస్ రూం స్టడీ తర్వాత గైడ్/ప్రొఫెసర్ పర్యవేక్షణలో పరిశోధన చేయాల్సి ఉంటుంది. ఐఐటీలు పీహెచ్‌డీ విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు నిట్‌లు, ట్రిపుల్ ఐటీ, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో బీటెక్ ఉత్తీర్ణులకు గేట్ స్కోర్‌తో నిమిత్తం లేకుండా నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నాయి. వీరికి అకడమిక్ ట్రాక్ రికార్డ్ 7 సీజీపీఏ ఉండాలి. దీంతోపాటు మలిదశలో ఇంటర్వ్యూ, రాత పరీక్షల్లో విజయం సాధించాలి.

ఎంపిక

సంబంధిత అర్హతలున్న అభ్యర్థులు ఆయా ఇన్‌స్టిట్యూట్‌లకు నిర్దేశిత నమూనాలో దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తుతోపాటు తమకు రీసెర్చ్ ఆసక్తి ఉన్న స్పెషలైజేషన్ అంశాలను పేర్కొనాలి. గరిష్టంగా మూడు స్పెషలైజేషన్ అంశాలను పేర్కొనొచ్చు. వీటితోపాటు తాము పేర్కొన్న స్పెషలైజేషన్‌లలో ప్రతి దానికి స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్‌ను దరఖాస్తుతోపాటు జత చేయాలి. ఈ దరఖాస్తులను ఐఐటీల్లోని డిపార్ట్‌మెంట్‌లవారీగా ఉండే రీసెర్చ్ అడ్మిషన్స్ రివ్యూ కమిటీలు పరిశీలిస్తాయి. అందుబాటులో ఉన్న సీట్లు, అప్లికేషన్ల ఆధారంగా అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేస్తాయి.

రాత పరీక్ష.. ఇంటర్వ్యూ

షార్ట్ లిస్ట్‌లో నిలిచిన అభ్యర్థులకు మలిదశలో రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. వీటి ద్వారా అభ్యర్థులకు పరిశోధనల పట్ల ఉన్న ఆసక్తిని పరిశీలిస్తారు. ఇందులోనూ విజయం సాధిస్తే.. పీహెచ్‌డీలో సీటుతోపాటు ఆర్థిక ప్రోత్సాహకాలకు మార్గం సుగమం అవుతుంది. ఐఐటీలు నిర్వహించే జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ ఎమ్మెస్సీ (జామ్) ర్యాంకు ద్వారా కూడా పీహెచ్‌డీలో చేరే వీలుంది.

ఆర్థిక ప్రోత్సాహకాలు

పీహెచ్‌డీ దిశగా యువతను ఆకర్షించేందుకు ఐఐటీలు ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. అయిదేళ్ల వ్యవధిలో ఉండే పీహెచ్‌డీ కోర్స్ వర్క్‌లో అసిస్టెన్స్‌షిప్ పేరుతో తొలి రెండేళ్లు నెలకు రూ.25 వేలు; తర్వాత నుంచి నెలకు రూ.28 వేలు చొప్పున అందిస్తారు. అదే విధంగా ఎంటెక్/ఎంఈ అర్హతతో పీహెచ్‌డీలో చేరిన అభ్యర్థులకు రీసెర్చ్ అసిస్టెన్స్ షిప్ సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. వీరిని రీసెర్చ్ ప్రాజెక్టులలో రీసెర్చ్ అసిస్టెంట్స్‌గా నియమిస్తారు. ఇలా నియమితులైన అభ్యర్థులకు తొలి రెండేళ్లు రూ.28 వేలు; తర్వాత మూడేళ్లు రూ.31,500 అందిస్తారు. వీటితోపాటు పరిశోధనకు అవసరమైన బుక్స్, జర్నల్స్, ఇతర మౌలిక పరికరాలు (కంప్యూటర్, లేబొరేటరీ పరికరాలు తదితర) కొనుగోలుకు ఏటా రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు కాంటింజెన్సీ అలవెన్స్, ప్రతి ఏటా గరిష్టంగా రెండు నేషనల్, ఇంటర్నేషనల్ సెమినార్లకు హాజరయ్యేందుకు అవసరమైన ట్రావెల్ అలవెన్స్, హెచ్ఆర్ఏలు వంటివి కూడా ఉంటాయి.

ఉన్నత శిఖరాలు

ఐఐటీల్లో పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి సీఎస్ఐఆర్, ఇక్రిశాట్, ఐఐసీటీ, ఐసీఏఆర్, ఎన్‌జీఐఆర్ఐ, తదితర కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థల్లో జూనియర్ సైంటిస్ట్‌లుగా అవకాశం లభిస్తుంది. ప్రైవేటు సంస్థల ఆర్ అండ్ డీ విభాగాల్లో సైంటిస్ట్‌లుగా చేరితే ప్రారంభంలోనే నెలకు రూ.2 లక్షల వరకూ వేతనం అందుతుంది.

‘పాలిటెక్నిక్’లో నవోదయం

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు బ్రాండ్ ఇమేజ్

- గతేడాదితో పోలిస్తే రెట్టింపైన క్యాంపస్ ఎంపికలు
- ఐఐటీ, ఎన్ఐటీ విద్యార్థులను మాత్రమే ఎంపిక చేసే సంస్థలు తొలిసారిగా ఏపీ పాలిటెక్నిక్స్‌లో రిక్రూట్‌మెంట్లు
- మూరుమూల ప్రాంతాల్లోని పాలిటెక్నిక్ కళాశాలల్లోనూ జాబ్ డ్రైవ్‌లు
- 18 ఏళ్లకే రూ.8.60 లక్షల వేతనం.. సగటున రూ.3 లక్షల జీతం
- ఉద్యోగం చేస్తూనే ఉన్నత చదువులకు అవకాశం కల్పిస్తున్న కంపెనీలు
- విద్యార్థులను మార్కెట్‌లోకి రెడీటూ వర్క్‌గా తీర్చిదిద్దేందుకు సాంకేతిక విద్యాశాఖ కృషి
- క్యాంపస్ రిక్రూట్‌మెంట్ కోసం ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలు
- వర్చువల్ డిజిటల్ క్లాస్‌రూమ్‌లతో సమూలంగా మారిన విద్యాబోధన


క్యాంపస్ రిక్రూట్మెంట్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పాలిటెక్నిక్ విద్య సరికొత్త బ్రాండ్ ఇమేజ్‌ను సృష్టిస్తోంది. పదో తరగతి ఉత్తీర్ణులై.. మూడేళ్ల డిప్లొమా కోర్సు పూర్తి చేసేలోగా బహుళజాతి సంస్థల్లో లక్షల రూపాయల జీతాలతో ఉద్యోగాలు కల్పిస్తోంది. గడచిన ఐదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలతో వివిధ కంపెనీల్లో దక్కుతున్న ఉద్యోగాలకు సంబంధించిన ప్లేస్‌మెంట్లు క్రమేణా పెరుగుతున్నాయి. 2023–24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ఏకంగా 12 వేల మందికి ఉద్యోగాలు దక్కడం విశేషం. గతేడాది అత్యధిక వార్షిక వేతనం రూ.6.25 లక్షలుగా ఉంటే.. ఈ ఏడాది రూ.8.60 లక్షలకు పెరిగింది. ప్రతి విద్యార్థి సగటున రూ.3 లక్షల ప్యాకేజీలతో ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఒకప్పుడు 2019కి ముందు 400 కూడా దాటని ఉద్యోగ అవకాశాలు.. ఇప్పుడు వేల మందికి చేరు వ అవుతున్నాయి.2019–20లో 575 ఉద్యోగాలు, 2020–21లో 652 పోస్టులు, 2021–22లో 780 కొలువులు మాత్రమే వచ్చాయి. 2022–23లో 6వేల మంది క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఎంపికైతే.. ఈ ఏడాది రెట్టింపైంది. ఇంటర్మీడియెట్, ఇంజనీరింగ్ కోర్సులను ఆరేళ్లు చదివి పూర్తి చేసిన తర్వాత అందుకునే వేతనాలను మూడేళ్ల డిప్లొమాతో 18 ఏళ్ల వయసులోనే దక్కించుకోవడం మార్కెట్‌లో పాలిటెక్నిక్ విద్య డిమాండ్‌కు అద్దం పడుతోంది.

ఒకవైపు ఉద్యోగం.. మరోవైపు ఉన్నత చదువులు

రాష్ట్రవ్యాప్తంగా 88 ప్రభుత్వ, 179 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో 35,533 మంది డిప్లొమా ఫైనలియర్ చదువుతుంటే.. వీరిలో 12వేల మందికి ఉద్యోగాలు దక్కాయి. ఇందులో 50 శాతం ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఉన్నారు. ముఖ్యంగా రాష్ట్ర పాలిటెక్నిక్ విద్యా చరిత్రలో తొలిసారిగా బహుళజాతి సంస్థ టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ రూ.8.60 లక్షల వార్షిక వేతనంతో విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసింది. ఈ సంస్థ సాధారణంగా జాతీయ స్థాయిలో పేరొందిన ఐఐటీలు, ఎన్ఐటీలు నుంచి బీటెక్ గ్రాడ్యుయేట్లను మాత్రమే తమ సంస్థలో ఉద్యోగాలకు ఎంపిక చేసేది. కానీ.. ఏపీలో నైపుణ్యాలతో కూడిన విద్యను అభ్యసిస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులకు అరుదైన అవకాశం కల్పించింది. ఇక్కడ అత్యధిక ప్యాకేజీలతో రూ.8.60 వార్షిక వేతనానికి 9 మంది ఎలక్ట్రానిక్స్ విద్యార్థులకు టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ల్యాబ్ ఇంటర్న్‌లుగా, రూ.8 లక్షల వార్షిక వేతనంతో థాట్‌వర్క్‌ల కోసం సాఫ్ట్‌వేర్ డెవలపర్లుగా 35 మంది కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించాయి. ఈ రెండు సంస్థలతో పాటు మెగా ఇంజనీరింగ్, జీఈ ఏరోస్పేస్, మోస్ చిప్, సుజ్లాన్, అమరరాజా, ఆర్సెలర్ మిట్టల్ అండ్ నిప్పన్ స్టీల్, ఎఫ్‌ట్రానిక్స్, మేధా సర్వో, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, షాపూర్జీ పల్లోంజీ, ఆల్ఫా లావాల్, మారుతీ సుజుకి రాయల్ ఎన్‌ఫీల్డ్, వీల్స్ ఇండియా, స్మార్ట్‌డివి టెక్నాలజీస్, నాగార్జున ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్, హెచ్ఎల్ మాండో ఆనంద్ ఇండియా వంటి ప్రధాన సంస్థల్లో డిప్లొమా విద్యార్థులు కొలువుదీరారు. డిప్లొమా స్థాయిలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను సైతం ఉన్నత చదువుల వైపు ప్రోత్సహించేలా సాంకేతిక విద్యాశాఖ కృషి చేస్తోంది. ఈ క్రమంలోనే ఆయా సంస్థలు రెండేళ్లు అనుభవం గడించిన తర్వాత ఉద్యోగులందరికీ బీటెక్ విద్యను అభ్యసించేలా తోడ్పాటును అందించనున్నాయి. ఇక్కడ ఉన్నత చదువులకయ్యే మొత్తం ఫీజును కూడా కంపెనీలే భరించనున్నాయి.

ప్రత్యేక క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణ

సాంకేతిక విద్యాశాఖ విద్యార్థులను మార్కెట్‌లోకి రెడీ టు వర్క్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కరిక్యులమ్ అమలు చేస్తోంది. అకడమిక్ లెర్నింగ్, ఇండస్ట్రీ అవసరాల మధ్య అంతరాన్ని తగ్గించడానికి వర్క్‌షాపులను నిర్వహిస్తోంది. పారిశ్రామికవేత్తలు, ఐటీ తదితర కంపెనీల ప్రతినిధుల నుంచి వచ్చిన సూచనలతో పరిశ్రమ ఆధారిత కోర్సులను ప్రారంభించింది. అన్ని పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రభుత్వం వర్చువల్ డిజిటల్ క్లాస్‌రూమ్‌లను ఏర్పాటు చేసినందున విద్యార్థులకు లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా థియరీ, ప్రాక్టికల్ సబ్జెక్టుల బోధన పకడ్బందీగా అందుబాటులోకి వచ్చింది. పారిశ్రామిక రంగంలో వస్తున్న మార్పులకనుగుణంగా సిలబస్‌ను మార్పు చేయడంతో పాటు వాటి బోధనకు వీలుగా సిబ్బంది కోసం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను అమలు చేయిస్తున్నారు. పారిశ్రామిక శిక్షణ కార్యక్రమాల కోసం విద్యాసంస్థలను పరిశ్రమలతో అనుసంధానిస్తున్నారు. వీటితో పాటు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు ఇంటర్వ్యూల్లో చక్కగా రాణించేలా సంసిద్ధం చేసింది. కళాశాల స్థాయి, క్లస్టర్ల వారీగా, కమిషనరేట్ స్థాయి వరకు మల్టీ లెవల్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లు చేపట్టింది. తద్వారా మహిళా పాలిటెక్నిక్‌లు, మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్,మైనారిటీ పాలిటెక్నిక్‌ల విద్యార్థులు గణనీయంగా ఉద్యోగాలు పొందారు. పాడేరు, చీపురుపల్లి, శ్రీకాకుళం, అద్దంకి, శ్రీశైలం, చోడవరం వంటి మారుమూల ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులు ప్రఖ్యాత కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విజయం సాధించింది.

రూ.8.60 లక్షల వేతనంతో..



మాది అనంతపురం జిల్లా పామిడి గ్రామం. నాన్న డ్రైవర్. అమ్మ గృహిణి. వాళ్లిద్దరూ కష్టపడి చదివించడంతో నేను డిప్లొమాలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ (ఈఈఈ) పూర్తి చేశాను. చివరి ఏడాది చదువుతుండగానే బెంగళూరులోని టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ కంపెనీలో రూ.8.60 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం వచ్చింది. ఇది మల్టీ నేషనల్ కంపెనీ. నాకు రాయల్ ఎన్‌ఫీల్డ్‌లోనూ ఉద్యోగం వచ్చినప్పటికీ చిన్న ప్యాకేజీ కావడంతో చేరలేదు. మా కాలేజీలో చదువుతో పాటు ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలను ముందుగానే నేర్పించారు. ల్యాబ్స్, కరిక్యులమ్, క్యాంపస్ ఇంటర్వ్యూల్లో రాణించేలా ఇచ్చిన ప్రత్యేక శిక్షణ మాకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఉద్యోగం చేస్తూనే ఉన్నత చదువులు కొనసాగించాలని ఉంది.

– ఎస్.గౌతమి, ప్రభుత్వ పాలిటెక్నిక్, అనంతపురం

‘రెడీ టూ వర్క్’ లక్ష్యంతో..



మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పాలిటెక్నిక్ విద్యను అందించడంలో ఏపీ విజయం సాధించింది. ఏటా పెరుగుతున్న క్యాంపస్ ఎంపికలే ఇందుకు నిదర్శనం. టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, థాట్‌వర్క్స్, మేధా సర్వో, జీఈ ఏరో స్పేస్ వంటి ప్రముఖ సంస్థల ప్రతినిధులు సాంకేతిక విద్యలోని విప్లవాత్మక మార్పులను చూసి ఎంతో ప్రశంసించారు. దేశవ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యలో ఇంతటి స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ ఒకటే. మారుతున్న సాంకేతిక, అవసరాలకు తగ్గట్టు బోధన ఉండేలా లెక్చరర్లకు పరిశ్రమల్లో నైపుణ్య శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థులను రెడీటూ వర్క్‌గా తీర్చిదిద్దుతున్నాం. అందుకే రాష్ట్రానికి అంతర్జాతీయ, జాతీయ బహుళజాతి కంపెనీలు వస్తున్నాయి. డిప్లొమాతో ఉద్యోగం పొందిన విద్యార్థులకు ఆయా సంస్థలే ఉన్నత చదువులకు ప్రోత్సహించేలా కంపెనీలు సైతం అంగీకరించాయి. చివరి సంవత్సరంలో ఉండగానే క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌పై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకున్నాం. అందుకే ప్లేస్‌మెంట్లు రెట్టింపయ్యాయి.

– చదలవాడ నాగరాణి, కమిషనర్, సాంకేతిక విద్యాశాఖ

క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఉద్యోగాల కల్పన ఇలా..

సంస్థ	జాబ్ రోల్	వార్షిక వేతనం (రూ.లక్షల్లో)
టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్	ల్యాబ్ ఇంటర్న్	8.60
థాట్ వర్క్స్	సాఫ్ట్‌వేర్ డెవలపర్	8.00
ఎఫ్‌ట్రానిక్స్ సిస్టమ్స్ లిమిటెడ్	సొల్యూషన్ సపోర్ట్ ఇంజనీర్	3.20
మేధా సర్వో డ్రైవ్స్	టెక్నికల్ అసిస్టెంట్	2.92
మెగా ఇంజనీరింగ్	డిప్లొమా ఇంజనీర్	2.80
మోస్ చిప్ టెక్నాలజీస్	ఎనలాగ్ లేఅవుట్ ఇంజనీర్	2.80
స్మార్ట్‌డీవీ టెక్నాలజీస్	వెరిఫికేషన్ ఇంజనీర్	2.70
అమరరాజా	టెక్నీషియన్	2.63
జీఈ ఏరోస్పేస్	డిప్లొమా ఇంజనీర్	2.54
ఆర్సెలర్ మిట్టల్ అండ్ నిప్పన్ స్టీల్	డిప్లొమా ఇంజనీర్	2.52
రెడ్డీస్ లేబొరేటరీస్	డిప్లొమా అప్రెంటీస్	2.50
హెచ్ఎల్ మాండో ఆనంద్ ఇండియా	టెక్నీషియన్	2.40

పోలింగ్ నిర్వహణలో ఈసీ విఫలం

- నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు
- ఓట్ల లెక్కింపు నాడు పటిష్ట భద్రత కల్పించాలి



సాక్షి, అమరావతి: పోలింగ్ నిర్వహణలో ఎలక్షన్ కమిషన్ పూర్తిగా విఫలమైందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఐఏఎస్ అధికారులను ఉద్దేశపూర్వకంగా బదిలీలు చేసి సస్పెండ్ చేశారని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు ఆరోపించారు. ఈ మేరకు నేషనల్ దళిత జేఏసీ సోమవారం ఈసీకి లేఖ రాసింది. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల అనంతరం జరిగిన హింస గురించి ఎన్నికల కమిషన్ ఎలాంటి దర్యాప్తు జరపకుండా కేవలం చీఫ్ సెక్రటరీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఐఏఎస్‌లపై చర్యలు తీసుకోవడాన్ని దళిత జేఏసీ తప్పుబడుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నికలకు ముందు.. ఎన్నికల తర్వాత.. హింస జరగడం చాలా సందర్భాల్లో మనం గమనిస్తూనే ఉన్నామని, అయితే ముందస్తు చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ తప్పును కప్పిపుచ్చుకొనేందుకు నలుగురు ఐఏఎస్ అధికారులపై చర్యలు తీసుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. వారిలో ముగ్గురు బలహీన వర్గాలకు చెందిన వారేనన్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్‌గా శివశంకర్‌ను తిరిగి కొనసాగించాలని, కృష్ణా జిల్లా కలెక్టర్ రాజబాబుకు తిరిగి పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 4న జరిగే ఓట్ల లెక్కింపునకు పటిష్ట భద్రత కల్పించాలని వరప్రసాదరావు ఈసీని కోరారు.

‘సంక్షేమ పథకాలే సీఎం జగన్‌ను గెలిపిస్తాయి’



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా అందించిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని గిరిజన ప్రజా సమాఖ్య (జీపీఎస్) వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్‌నాయక్ ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ సీఎం వైఎస్ జగన్‌కు జై కొట్టారని, వైఎస్సార్‌సీపీకి మళ్లీ అధికారం కట్టబెట్టి చరిత్ర సృష్టించబోతున్నారని తెలిపారు. ఐదేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్ మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా సంక్షేమ పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు. పేదరిక నిర్మూలనతో పాటు విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని తెలిపారు.

కాంబోడియాలో తెలుగు యువకుడికి చిత్రహింసలు

బయ్యారం: బతుకుదెరువు నిమిత్తం కాంబోడియా దేశానికి వెళ్లిన తెలుగు యువకుడిని అక్కడి వారు చిత్రహింసలకు గురి చేస్తున్నారని సోమవారం సోషల్ మీడియాలో వైరల్ కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లికి చెందిన మున్సిఫ్ ప్రకాశ్ విదేశాలకు వెళ్లి ఆర్థికంగా స్థిరపడాలని భావించాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా మూడు నెలలక్రితం ఆస్ట్రేలియా వెళ్లేందుకు ప్రయత్నించగా, ఏజెన్సీ నిర్వాహకులు ప్రకాశ్‌ను ఆస్ట్రేలియా అని చెప్పి కాంబోడియాకు పంపించారు. రెండు నెలలు సవ్యంగానే గడిచినప్పటికీ ఆ తరువాత నెలరోజులుగా అక్కడ తనకు మత్తు ఇంజక్షన్లు ఇస్తూ మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రకాశ్ తన సోదరుడికి వాట్సాప్ కాల్‌లో చెప్పాడు. తిరిగి మూడు రోజుల క్రితం తనను పోలీసులు అరెస్ట్ చేశారని.. స్వదేశానికి తీసుకువెళ్లాలని ఫోన్ చేసి చెప్పాడు. అప్పటి నుంచి ప్రకాశ్ ఫోన్ పనిచేయకపోవటంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. కాగా, ప్రకాశ్ చిత్రహింసలకు గురవుతున్నట్టు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న విషయంపై జిల్లా పోలీసు అధికారులు ఆరా తీశారు. ఎస్పీ సుధీర్ రాంనాథ్ కైకన్, డీఎస్పీ తిరుపతిరావు ఆదేశాల మేరకు గార్ల–బయ్యారం సీఐ రవికుమార్ కాంబోడియాలో ఉన్న ప్రకాశ్ ఆచూకీ కోసం ఆ దేశంలోని ఎంబసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడగా, ప్రకాశ్ క్షేమంగా తమ ఆధీనంలో ఉన్నారని చెప్పి అతడితో మాట్లాడించారు. త్వరలో భారత్‌కు తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని సీఐ విలేకరులకు తెలిపారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22,Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.